గురువారం 3-4-2025

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 11

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

భారత్‌పై 26 శాతం

సుంకాల మోత మోగించిన డొనాల్డ్ ట్రంప్

వియత్నాంపై 46%, చైనాపై 34%, యూకేపై 10% టారిఫ్

అన్ని దేశాల ఆటోమొబైల్స్‌పై 25 శాతం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలు వడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్(ఈయూ)పై 20 శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ప్రకటించిన ట్రంప్ బుధవారం వాషింగ్టన్‌లో మీడియాతో మాట్లాడారు.



హద్దు మీరిన పాక్ సైన్యం..

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ భారత భూభాగంపై పాక్ కాల్పులు జరిపింది. భారత సైన్యం గట్టిగా బదులిచ్చింది. - వివరాలు 6లో



మృత్యువుతో 108 గంటల పోరాటం

మయన్మార్‌లో భూకంప శిథిలాల్లో చిక్కుకున్న ఓ హోటల్ కార్మికుడు 108 గంటలపాటు మృత్యువుతో పోరాడి ప్రాణాలతో బయటపడ్డాడు. - వివరాలు 6లో

వక్ఫ్ బిల్లు పాస్..

వాడీవేడి చర్చ అనంతరం సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అనుకూలం **288**

వ్యతిరేకం **232**



మోదీ సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వక్ఫ్ (సవరణ) బిల్లు-2025ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 288, వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. అంతకు ముందు బిల్లుపై 12 గంటల పాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్ష ఇండియా కూటమి ఆరోపించగా పారదర్శకత కోసమేనని ప్రభుత్వం సమర్థించుకుంది.

బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే తదితర విపక్షాలు

బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసిన వైఎస్సార్‌సీపీ

ప్రతిని చించేసిన ఒవైసీ..

నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వ వాదన..

- ✔ వక్ఫ్ ఆస్తుల వినియోగంలో అవినీతిని రూపుమాపి పూర్తి పారదర్శకత తీసుకురావొచ్చు.
- ✔ వక్ఫ్ ఆస్తులపై ఆగాఖానీలు, బోరాలు, పస్మాందా ముస్లింలు, ముస్లిం మహిళలకూ భాగస్వామ్యం దక్కుతుంది.
- ✔ ఆస్తుల నమోదును తప్పనిసరి చేయడం వల్ల వాటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయొచ్చు.
- ✔ వక్ఫ్ బోర్డుల్లో మహిళలకు కూడా విధిగా స్థానం కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యపడుతుంది.
- ✔ ముస్లిం దేశాల్లో కూడా వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణే ఉంటుంది.

బిల్లును వ్యతిరేకించిన విపక్షాల వాదన..

- ✘ వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం కల్పించడమంటే.. ఆర్టికల్ 26 ద్వారా రాజ్యాంగం కల్పించిన మతపరమైన హక్కుకు వ్యతిరేకం.. ఇదే తరహాలో ఇతర మతాలకు చెందిన బోర్డుల్లో ముస్లింలను నియమిస్తారా?
- ✘ వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ డేటాబేస్‌లో విధిగా నమోదు చేయని పక్షంలో వాటికి సంబంధించిన వివాదాల్లో కోర్టులను ఆశ్రయించే వీలుండదనడం చాలా క్రూరమైన నిబంధన
- ✘ పేద ముస్లింలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు. అందుకే బిల్లులో వక్ఫ్ బోర్డులను సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- ✘ ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుదా.. ప్రభుత్వానిదా అన్న వివాదం తలెత్తితే ఇకపై రాష్ట్రం నియమించే ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమం. ఆ తీర్పు ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుంది.
- ✘ వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను కోర్టుల్లో సవాలు చేసే అవకాశం ఇప్పుడు కూడా ఉంది. అయినా కొత్తగా ప్రతిపాదన చేయడం వెనుక దురుద్దేశం ఉంది.

6లో



బీసీ పోరు గర్జన ధర్నాలో కల్లుకుండ, మొకుతో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క, జాజుల శ్రీనివాస్‌గౌడ్, పొన్నం ప్రభాకర్

కుదిరితే సయోధ్య.. లేకుంటే ధర్మయుద్ధం

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచితే మోదీకి ఏం నొప్పి?

ఢిల్లీలో బీసీ పోరు గర్జన ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

రిజర్వేషన్లు పెంచకుంటే గద్దె దిగాలి.. లేదంటే గద్దెలు కూలాలి

ఇకపై ఢిల్లీకి విజ్ఞప్తులతో రాం.. మీరు గల్లీల్లోకి ఎలా వస్తారో చూస్తాం

బీజేపీ కమండల్ యాత్ర ప్రతినిధే మోదీ

బీసీల్లారా యుద్ధం చేయండి.. మీకు దన్నుగా నేనుంటా

రాహుల్‌గాంధీ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కులగణన నిర్వహించామన్న సీఎం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సయోధ్య కుదుర్చుకునేందుకే ఢిల్లీకి వచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వేషన్లు పెంచని పక్షంలో కేంద్రంతో ధర్మయుద్ధం తప్పదని స్పష్టంచేశారు. రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం జాప్యం చేస్తే 'గద్దె దిగాల్సిందే.. లేకుంటే గ్రామాల్లో గద్దెలు కూలాల్సిందే'అని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన బీసీ పోరు గర్జన ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం జాప్యం చేస్తోందని విమర్శించారు. 'కురుక్షేత్ర యుద్ధానికి ముందు అయిననూ పోయి రావలె హస్తినకు అన్నారు. ధర్మ యుద్ధం కోసం ఢిల్లీకి వచ్చాం. సంధిలో భాగంగానే ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశాం. సయోధ్య కుదుర్చుకుందాం.. ఐదు గ్రామాలు ఇవ్వమన్నా నాడు దుర్యోధనుడు ఇవ్వలేదు. తర్వాత కురుక్షేత్రంలో ఏం జరిగిందో చూశాం. ఇప్పుడు రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు మేము ఇచ్చుకుంటాం మిగతా 12వ పేజీలో ▶

శాంతి చర్చలకు మేం సిద్ధం..

- కగార్ పేరుతో కేంద్రం నరసంహారం చేస్తోంది.. ఆపరేషన్ కగార్ నిలిపివేస్తే కాల్పుల విరమణకు ఓకే
- ప్రజాప్రయోజనాలే మాకు ముఖ్యం
- మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కొనసాగుతున్న తీవ్ర నిర్బంధం నేపథ్యంలో శాంతిచర్చలకు తాము సిద్ధమని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రకటించింది. అయితే, శాంతిచర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఇదే సమయంలో చర్చల ప్రక్రియ సజావుగా సాగేలా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజాపక్ష మేధావులు, రచయితలు, హక్కుల సంఘాలు, దళిత, గిరిజన, విద్యార్థి, యువజన సంఘాలు, మిగతా 5వ పేజీలో ▶

కొంచెం సులభమే!

జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ప్రారంభం

తొలి సెషన్‌తో పోల్చితే ఈసారి సులభ ప్రశ్నలు..

కెమిస్ట్రీ కఠినం... ఫిజిక్స్ ఓ మాదిరి

గణితంలో సాగదీత ప్రశ్నలు తగ్గుదల.. ఎన్సీఈఆర్టీ సిలబస్‌కే ప్రాధాన్యం

పాత పేపర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు

తొలిరోజు పరీక్ష ప్రశాంతం



సాక్షి, ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ - 2025 రెండో దశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈసారి అడిగిన ప్రశ్నల్లో భిన్నత్వం కనిపించిందని నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు. మొదటి సెషన్‌లో రసాయనశాస్త్ర ప్రశ్నలు తేలికగా ఉంటే, ఈసారి కఠినమైన ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. న్యూమరికల్ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సమయం సరిపోలేదని కొందరు విద్యార్థులు చెప్పారు. ఎన్సీఈఆర్టీ సిలబస్‌లోంచి ప్రశ్నలను ట్విస్ట్ చేస్తూ ఇచ్చినట్టు నిపుణులు వెల్లడించారు. సాధారణంగా ఫిజిక్స్‌లో మధ్యస్తంగా స్కోర్ చేసేందుకు అవకాశం ఉండేది. ఈసారి కెమిస్ట్రీతో పోలిస్తే ఫిజిక్స్ విభాగంలో కొంత సులభమైన ప్రశ్నలున్నట్టు సబ్జెక్ట్ నిపుణులు తెలిపారు. గణితంలో ఈసారి సుదీర్ఘ ప్రశ్నలు కొంత తగ్గినట్లు నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ విభాగంలో లాగరిథమ్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, మిగతా 16వ పేజీలో ▶

స్పీకర్ చర్యలు తీసుకోకున్నా చేతులు కట్టుకొని చూస్తుండాలా?

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

స్పీకర్‌ను కోర్టులు ఆదేశించజాలవన్న న్యాయవాది రోహత్గీ వ్యాఖ్యలపై అభ్యంతరం

మేము జోక్యం చేసుకోకపోతే స్పీకర్ నాలుగేళ్లు కాలయాపన చేసి ఉండేవారేమో..

ఆర్టికల్ 142 కింద తమకు అన్ని అధికారాలు ఉన్నాయన్న సర్వోన్నత న్యాయస్థానం

ఉపఎన్నికలు రావంటూ సభలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం

స్పీకర్ సమక్షంలో సీఎం వ్యాఖ్యలు 10వ షెడ్యూల్‌ను అపహాస్యం చేసినట్లేనన్న ధర్మాసనం

పునరావృతం కానివ్వొద్దని సీఎంను హెచ్చరించాలని న్యాయవాదికి సూచన



సాక్షి, న్యూఢిల్లీ: 'ఓ పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిన స్పీకర్ చర్యలు తీసుకోకపోతే మేం (కోర్టులు) చేతులు కట్టుకొని కూర్చోవాలా?' అంటూ సుప్రీం కోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ కేసు తమ ముందుకు వచ్చే దాకా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ ఎందుకు నోటీసులు జారీ చేయలేదని ప్రశ్నించింది. తొలి నోటీసు ఇచ్చేందుకు స్పీకర్‌కు 11 నెలలు ఎందుకు పట్టిందని నిలదీసింది. 'ఒకవేళ కేసు మా ముందుకు రాకపోయి ఉండి ఉంటే మీరు (స్పీకర్) నాలుగేళ్ల కాలయాపన చేసేవాళ్లేమో?' అంటూ చురకలు అంటించింది. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్పీ)తోపాటు మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీలపై దాఖలైన రిట్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మసీలతో మిగతా 12వ పేజీలో ▶

మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి



బందిపోట్లలా కాంగ్రెస్ సర్కారు తీరు!

జేబులు నింపుకొనేందుకు సీఎం, మంత్రుల పోటీ: కేసీఆర్ ఫైర్

సీఎం మనస్తత్వానికి అద్దం పడుతున్న హెచ్‌సీయూ భూముల వ్యవహారం

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదు.. దాన్ని ఎవరూ రక్షించలేరు

పదవి కోసం ప్రధాని మోదీ ఆర్‌ఎస్‌ఎస్‌ను దేబిరించే పరిస్థితిలో ఉన్నారు

ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లా ముఖ్య నేతలతో ఎర్రవల్లిలో భేటీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు బందిపోట్లను తలపిస్తోందని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. వందలాది బుల్డోజర్లను రంగంలోకి దించి యూనివర్సిటీ భూమిలో విధ్వంసానికి పాల్పడటం రేవంత్ మనస్తత్వానికి అద్దంపడుతోందని విమర్శించారు. ఇతర అంశాల్లోనూ రేవంత్ దూకుడు ఇదే తరహాలో ఉండటాన్ని ప్రజలు తప్పు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం దిశగా వేగంగా మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



'పథకం' ప్రకారం ప్రతినెలా కేవలం ఒక ఇంటిని సందర్శించి వస్తున్నాం సార్! 10 నెలలుగా మనం ఒక్క సూపర్ సిక్స్ హామీని అమలు చేయట్లేదు కాబట్టి..

చెట్ల నరికివేత ఆపండి

400 ఎకరాల్లో భూమి చదునుతో జీవవైవిధ్యం, పర్యావరణం దెబ్బతింటోందన్న పిటిషనర్లు

భవిష్యత్ తరాలు ఆక్సిజన్‌కూ అవస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన

నిపుణుల కమిటీ, వాల్టా అనుమతి లేకుండానే చెట్ల నరికివేత కొనసాగుతోంది..

ముమ్మాటికీ అది ఇండస్ట్రియల్ భూమే.. అటవీ భూమి కాదన్న సర్కారు

2003లో చంద్రబాబు సర్కార్ ఓ 'దొంగ'కు కేటాయించిందన్న ఏజీ


రూ. వేల కోట్ల విలువైన భూములను వైఎస్సార్ రక్షించారని వెల్లడి

ఆయన నిర్ణయాన్ని న్యాయస్థానాలూ సమర్థించాయని స్పష్టీకరణ

అవే భూములను ప్రస్తుతం పరిశ్రమలకు కేటాయిస్తున్నామని వివరణ

కంచ గచ్చిబౌలి భూములపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం..

తదుపరి విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లు నరకడాన్ని వెంటనే ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు బుధవారం ఆదేశించింది. దీనిపై గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే వరకు అక్కడ ఎలాంటి పనులు చేయొద్దని ఏసీజే జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం తేల్చిచెప్పింది. సుదీర్ఘ వాదప్రతివాదనల వల్ల సమయం ముగియడంతో తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ)కి బదిలీ చేసి చదును చేయడాన్ని వెంటనే ఆపాలని కోరుతూ హైకోర్టులో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్) దాఖలయ్యాయి. 'ఐటీ, ఇతర అవసరాల కోసం ఎకరం రూ. 75 కోట్ల మేర సంస్థలకు కేటాయించేలా కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల అటవీ భూమిని టీజీఐఐసీకి సర్కార్ కేటాయించింది. ఈ మేరకు గతేడాది జూన్ 26న రెవెన్యూ శాఖ తీసుకొచ్చిన జీవో 54ను కొట్టేయాలి. అక్కడ 40 జేసీబీ తవ్వకాలతో సర్కార్ చెట్లను తొలగిస్తూ వృక్ష, జంతుజాలాన్ని మిగతా 2వ పేజీలో ▶

'బిల్లీ' కబంధ హస్తాల్లోంచి.. భూముల చెర విడిపించాం

- ఆ 400 ఎకరాలు ప్రభుత్వానివే.. అందులో అనుమానాలు అక్కర్లేదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క -3లో

నైతికంగా ఆ భూములు హెచ్‌సీయూవే.. 2లో

- హెచ్‌సీయూ భూముల వివాదానికి 2003లో నాంది పలికిన చంద్రబాబు
- హెచ్‌సీయూ మాజీ డీన్, టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్

చట్టప్రకారమే కాదు.. నైతికంగానూ ఆలోచించాలి 2లో

- హెచ్‌సీయూ మాజీ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి
- ప్రభుత్వ భూమి అంటే అది ప్రజల భూమే..
- పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి

20 ఏళ్లు పడావు పెడితే చెట్లు పెరగవా?

- ఫామ్‌హౌస్‌లో కూర్చొని మొసలికన్నీరు కారిస్తే ప్రజలు హర్షించరు: మంత్రి జూపల్లి
- అటవీభూమిని నాశనం చేసిన బీజేపీ నేతలూ మాట్లాడతారా? -2లో

వర్సిటీ భూముల్ని తొలుత ప్రైవేటుకు అప్పగించింది బాబే

- ఆపద్ధర్మ సీఎంగా ఉంటూ 850 ఎకరాలను బిల్లీ రావు కంపెనీకి అప్పగించిన వైనం
- అందులో 400 ఎకరాలు వర్సిటీ భూములు.. మరో 450 ఎకరాలు మామిడిపల్లిలో...
- అప్పనంగా అప్పగించిన ఆ భూములను రద్దు చేసిన నాటి వై.ఎస్. ప్రభుత్వం
- కేటాయింపుల రద్దుకు వ్యతిరేకంగా బిల్లీరావు కోర్టుకెక్కినా తప్పని భంగపాటు -3లో

నైతికంగా ఆ భూములు హెచ్‌సీయూవే

సెలవుల్లో పదుల సంఖ్యలో జేసీబీలతో వృక్షాలను కూల్చేశారు

- విద్యార్థులపై కేసులు ఎత్తివేసి.. పోలీసు బలగాలను వెనక్కి పంపాలి
- హెచ్‌సీయూ భూముల వివాదానికి 2003లో నాంది పలికిన చంద్రబాబు
- ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆ భూముల్ని స్వాధీనం చేసుకున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- హెచ్‌సీయూ మాజీ డీన్, టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రకృతి విధ్వంసాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆ వర్సిటీ మాజీ డీన్, టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి జీవవైవిధ్యాన్ని పూర్తిగా రక్షించాలని, వర్సిటీకి చట్టపరమైన హక్కును అప్పగించాలని కోరారు. కోర్టులు ఆ 400 ఎకరాలు ప్రభుత్వానిదే అని తీర్పుఇచ్చినా, ఆ భూములు నైతికంగా వర్సిటీకి చెందినవే అని చెప్పారు. అది విశిష్టమైన విశ్వవిద్యాలయమని, దానికి ఒక అద్భుత చరిత్ర ఉందని హరగోపాల్ చెప్పారు. సెలవురోజుల్లో పదుల సంఖ్యలో జేసీబీలను పెట్టి అక్కడ వృక్ష సంపద, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇప్పటికే 300 ఎకరాలను చదును చేశారని ఆరోపించారు. కంచ గచ్చిబౌలి అడవిని నాశనం చేయడం పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్న 14 మంది సభ్యుల పౌర సమాజ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమావేశమై సమస్యలను వివరించినట్టు హరగోపాల్ తెలిపారు. పర్యావరణాన్ని కాపాడాలని, వృక్ష సంపదను నాశనం చేయొద్దని కోరినా..ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకుండా, అది ప్రభుత్వ భూమి అనే వాదన చేస్తూ.. అభివృద్ధి పర్చడం ద్వారా ఉద్యోగాలు, సంపద సృష్టిస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను పాటిస్తుందని చెప్పారని, కానీ చర్చల సందర్భంగా వ్యక్తమైన అభిప్రాయాలన్నీ పరిగణనలోకి తీసుకోనప్పుడు అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుందని ప్రశ్నించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కంచ గచ్చిబౌలి జీవవైవిధ్యంపై అరుణ్ వాసిరెడ్డి రూపొందించిన నివేదికను విడుదల చేసిన అనంతరం హెచ్‌సీయూ మాజీ డీన్ ప్రొఫెసర్ నరసింహారెడ్డి, సామాజికవేత్త విస్సా కిరణ్, శివానిలతో కలిసి హరగోపాల్ మీడియాతో మాట్లాడారు.

హెచ్‌సీయూ మాత్రమే భారత రాజ్యాంగంలో...

తొలిదశ తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేశారని, రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పి కంచ గచ్చిబౌలిలోని సర్వేనంబర్ 25లోని 2,300 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించేలా చేశారన్నారు. దేశంలో 700 విశ్వవిద్యాలయాలు ఉన్నా, హెచ్‌సీయూ మాత్రమే భారత రాజ్యాంగంలో ప్రస్తావించబడిందన్నారు. విశ్వవిద్యాలయానికి విశాల ప్రదేశం ఉండాలన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీకి 5 వేల ఎకరాలు, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి 8 వేల ఎకరాలు, ఉస్మానియా యూనివర్సిటీకి 2,600 ఎకరాలు ఉన్నాయన్నారు. 1970లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జోక్యంతో 6 పాయింట్ల ఫార్ములా ఒప్పందం ద్వారా హెచ్‌సీయూ స్థాపించారని చెప్పారు. దీనికి 32వ సవరణ ద్వారా రాజ్యాంగ హోదా కల్పించారన్నారు. అప్పటి వీసీ 2,300 ఎకరాలకు ప్రహరీ నిర్మించారని, కానీ ఆ భూములను యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ప్రస్తుత ఉపద్రవం వచ్చేది కాదన్నారు.

ఎన్నోరకాల అరుదైన పక్షి జాతులు

హెచ్‌సీయూ అడవి ఎంతో సుసంపన్నమైన ప్రకృతి అని.. చూస్తే కానీ అర్థం కాదన్నారు. ఇందులో ఎన్నోరకాల అరుదైన పక్షి జాతులు ఉన్నాయని హరగోపాల్ చెప్పారు. ఒకసారి ప్రకృతిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి వందల ఏళ్లు పడుతుందన్నారు. ఇదే చివరి తరం కాదని, ప్రభుత్వానికి దూరదృష్టి, భవిష్యత్ తరాల పట్ల బాధ్యత ఉండాలని తెలిపారు.



హెచ్‌సీయూ జీవవైవిధ్యంపై అరుణ్ వాసిరెడ్డి రూపొందించిన నివేదికను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు హరగోపాల్, డి.నర్సింహారెడ్డి, కిరణ్‌కుమార్, శివాని, జాన్‌మైఖేల్

హెచ్‌సీయూ భూముల వివాదానికి 2003లో చంద్రబాబు నాంది పలికాడని, 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ భూమిని వెనక్కి తీసుకున్నారన్నారు. ఆందోళన చేస్తున్న వారికి ఈ భూమితో పనిలేదని, అడవిని ధ్వంసం చేయకుండా ప్రభుత్వం ఫారెస్ట్ ఏరియాగా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులు ప్రతిపక్షాల మాయలో పడి నిరసన కార్యక్రమాలు చేపట్టుతున్నట్టు ప్రభుత్వం భావిస్తుందని, కానీ అక్కడ ప్రకృతి విధ్వంసం పట్ల మాత్రమే విద్యార్థులు నిరసన చేపడుతున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు జరపాలని, విద్యార్థులపై కేసులు ఎత్తివేసి, క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు.

- బుల్డోజర్లతో విలువైన అడవిని కూల్చివేసే ప్రక్రియను వెంటనే ఆపాలని, బుల్డోజర్లు తమ విధ్వంసం కొనసాగిస్తే పర్యావరణ సమస్యలు వస్తాయని సామాజికవేత్త కిరణ్‌కుమార్ విస్సా అన్నారు. వాల్టా చట్టం ప్రకారం, సొంత భూమిలో చెట్లను నరికివేయడానికి ముందు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అనుమతి పొందాలని, అలాంటి ఏమీ లేకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు.
- పర్యావరణ నిపుణుడు అరుణ్ వాసిరెడ్డి మాట్లాడుతూ కంచ గచ్చిబౌలి విలువైన సహజ అడవి అని, ఇది కేబీఆర్ నేషనల్ పార్క్ లేదా మృగవాణి నేషనల్ పార్క్ కంటే ఎక్కువ జీవవైవిధ్యం కలిగి ఉందన్నారు.
- సేవ్ సిటీ ఫారెస్ట్ గ్రూప్'ను ప్రారంభించి ఆన్‌లైన్ పిటిషన్‌లో ఇప్పటికే 1,42,000 సంతకాలు చేశారని శివాని తెలిపారు. ఎన్‌ఏపీఎం అర్బన్ స్ట్రగల్స్ ఫోరం ప్రతినిధి జాన్ మైఖేల్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపే చర్యలను పదే పదే తీసుకుంటోందన్నారు.

క్లుప్తంగా...

మైహోంపైకి బుల్డోజర్లు పంపే దమ్ముందా?

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: మైహోం గ్రూప్‌నకు బీఆర్ఎస్ హయాంలో సెంట్రల్ యూనివర్సిటీ భూములు అప్పగించారనే ఆరోపణ మిలీనియం జోక్ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. కాంగ్రెస్ నేతలు చేస్తోన్న ఆరోపణలు నిజమే అనుకుంటే మైహోం గ్రూప్‌పైకి బుల్డోజర్లు పంపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. మైహోం గ్రూప్ చైర్మన్ బీజేపీతో ఉన్నారని.. ఆయన ప్రధాని పక్కన కూర్చుంటారని, అలాంటి పెద్ద వ్యక్తి మీదికి హైడ్రా బుల్డోజర్లు పంపాలని చాలెంజ్ చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారని కవిత గుర్తు చేశారు.

హెచ్‌సీయూ భూ సమస్యపై జోక్యం చేసుకోవాలి

కేంద్ర విద్యాశాఖమంత్రికి ఏబీవీపీ ప్రతినిధుల బృందం వినతి

రాయదుర్గం: హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమి విషయమై వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఏబీవీపీ ప్రతినిధుల బృందం కోరింది. బుధవారం న్యూఢిల్లీలో ఏబీవీపీ జాతీయ కార్యదర్శులు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి శ్రావణ్ బిరాజ్, శివాంగీ ఖర్వాల్ మంత్రిని కలిశారు. అనంతరం రెండు వారాలుగా సాగుతున్న పరిణామాలను వివరించారు. క్యాంపస్‌లో ఏబీవీపీ కార్య కర్తలపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జీ చేసిన అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జోక్యం చేసుకొని భూ సమస్యను పరిష్కరించి, హెచ్‌సీయూ భూములను తిరిగి హెచ్‌సీయూకే కేటాయించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా శ్రావణ్ బిరాజ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి ఏబీవీపీ వివరించిన అంశాలను పరిశీలించి తగిన విధంగా స్పందించి న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్ కుమార్, ఏబీవీపీ జాతీయ నాయకులు పాల్గొన్నారు.

చట్టాల ఉల్లంఘనను అడ్డుకోవాలి: ఆర్ఎస్‌పీ



ఏలూసింగ్‌తో మాట్లాడుతున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల్లో జరుగుతున్న అటవీ, పర్యావరణ చట్టాల ఉల్లంఘనను అడ్డుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు పార్టీ నేతలు డాక్టర్ చిరుమల్ల రాకేశ్, కురువ విజయ్‌కుమార్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్దన్‌రెడ్డి తదితరులతో కలిసి బుధవారం తెలంగాణ అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి ఏలూసింగ్ మెరూకు వినతిపత్రం అందజేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ వ్యవస్థకు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) కోలుకోలేని నష్టం చేసిందన్నారు. అటవీ సంరక్షణ చట్టం, వన్యప్రాణుల రక్షణ చట్టాలను ఉల్లంఘించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ పాలనలో 24 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విధ్వంసాన్ని అడ్డుకుని పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.

చెట్ల నరికివేత ఆపండి..

▶ మొదటి పేజీ తరువాయి

నాశనం చేస్తోంది' అని పిటిషనర్లు ఆరోపించారు.

పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలి..

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎల్.రవిచందర్ వాదిస్తూ 'ఆ 400 ఎకరాలు అటవీభూమి. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీం కోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పనిచేయాలి. 40కిపైగా జేసీబీలతో చెట్లు కొట్టేసి భూమిని చదును చేస్తున్నారు. సుప్రీం తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని చదును చేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో నెలపాటు అధ్యయనం చేయాలి. ఈ అడవిలో బఫెలో, పీకాక్, ఎస్ఆర్ ప్రధాన సరస్సులు, 'పుట్టగొడుగుల శిల' వంటి ప్రత్యేకమైన భౌగోళిక నిర్మాణాలున్నాయి. ఇది 237 జాతుల పక్షులు, నెమళ్లు, చుక్కల జింకలు, అడవి పందులు, నక్షత్ర తాబేళ్లు, ఇండియన్ రాక్ పైథాన్, బోయాస్ వంటి వివిధ పాము జాతులకు పర్యావరణ నివాసం. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. 'అడవి' అనే పదాన్ని ప్రభుత్వ రికార్డులు, చట్టపరమైన నోటిఫికేషన్లకే పరిమితం చేయకూడదని సుప్రీంకోర్టు గతంలో చెప్పింది. దీనికి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. పర్యావరణ సమతౌల్యతను దెబ్బతీసే విధ్వంసాన్ని నిరోధించాలి' అని నివేదించారు.

ఆదాయం కోసం ఆరాటమే తప్ప..

'150 ఎకరాలకు మించి అటవీ ప్రాంతాన్ని చదును చేసేందుకు పర్యావరణ అధ్యయనం అవసరం. మీటర్ కంటే ఎక్కువ ఎత్తు కాండం పెరిగిన చెట్లను కొట్టాలంటే వాల్టా చట్ట ప్రకారం అనుమతి పొందాలి. లేకుంటే చట్టప్రకారం శిక్షార్హం. కానీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్ట ప్రకారం చర్యలు తీసుకోలేదు. ఆదాయం కోసం ఆరాటమే తప్ప పర్యావరణ విధ్వంసం గురించి పట్టించుకోలేదు. హైదరాబాద్ నడిబొడ్డున 400 ఎకరాల్లో దశాబ్దాలకుపైగా ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తే పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటుంది. పక్కనే కాంక్రీట్ జంగిల్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ఊపిరి కూడా అందడం కష్టమవుతుంది. భవిష్యత్ తరాలు ఆక్సిజన్‌కు అవస్థ పడాల్సి వస్తుంది. ఒకపక్క కేసు హైకోర్టులో విచారణ సాగుతుండగానే అధికారులు రాత్రీపగలు చెట్ల నరికివేత చేపడుతున్నారు. ఈ పనులను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయండి' అని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు.

క్రీడల పేరిట రూ. వేల కోట్ల భూములకు చంద్రబాబు..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ '2003 ఆగస్టు 5న ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్) ఏర్పాటైంది. ఆగస్టు 9న ఐఎంజీ భారతతో నాటి చంద్రబాబు ప్రభుత్వం (తాత్కాలిక ప్రభుత్వం) క్రీడల్లో ఇక్కడి యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దే పేరుతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. స్పోర్ట్స్ అకాడమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసమంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాలను ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలను అప్పగిస్తామని ఒప్పందం చేసుకుంది. అంతేకాదు.. ఐఎంజీ భారత అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయం నిర్మించుకోవడానికి బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. 2004 ఫిబ్రవరిలో రూ. వేల కోట్ల విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే రూ. 2 కోట్లకు ఐఎంజీ భారతకు సేల్‌డీడ్ చేసింది. ఏమాత్రం అర్హతలేని, భూములు కొట్టేయడం కోసమే ఏర్పడిన కంపెనీ నుంచి ప్రభుత్వ ఆస్తులను కాపాడటం కోసం 2006లో నాటి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ఐఎంజీ భారత్‌కు చంద్రబాబు ప్రభుత్వం చేసిన సేల్‌డీడ్‌తోపాటు ఎంఓయూ కూడా రద్దయ్యింది. హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా రాజశేఖర్‌రెడ్డి నిర్ణయాన్ని సమర్థించాయి. నాడు వైఎస్సార్ రక్షించిన ఆ 400 ఎకరాలు ఇండస్ట్రియల్ భూములే. నాడు పిల్ దాఖలు చేసిన వారు అర్హతలేని కంపెనీ, తక్కువ ధరనే సవాల్ చేశారు. హెచ్‌సీయూ భూములనిగానీ, పర్యావరణం దెబ్బతింటుందని కానీ ఎక్కడా పేర్కొనలేదు. నాడు ఒక దొంగ నుంచి మేము ఈ భూములను రక్షించినప్పుడు ఈ పిల్ దాఖలు చేసిన వారెవరూ కలసి రాలేదు. ఇప్పుడు పిల్‌లు దాఖలు చేసి ప్రశ్నిస్తున్నారు' అని ఏజీ పేర్కొన్నారు.

గూగుల్ ఫొటోలే ఆధారమా?

'గూగుల్ ఫొటోల ఆధారంగా అక్కడ ఫారెస్ట్ ఉందని పిటిషనర్లు వాదిస్తున్నారు. రెవెన్యూ, ఇతర ఏ రికార్డుల్లోనూ అది అటవీ భూమిగా లేదు. గూగుల్ చిత్రాలు వానాకాలం ఒకలా, ఎండాకాలంలో మరోలా ఉంటాయి. గూగుల్ చిత్రాలు ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు గతంలో పేర్కొంది. నా స్నేహితుడొకరు సభ్యుడిగా ఉన్న ఓ గోల్ఫ్ క్లబ్‌లోనూ నెమళ్లు, జింకలు, పాములు ఉన్నాయి. దాన్ని కూడా అటవీ ప్రాంతంగా డిక్లేర్ చేస్తారా? ఈ లెక్కన హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు. గత పదేళ్లలో నాటి ప్రభుత్వం వేలాది ఎకరాలు విక్రయించినా నోరుమెదపని వారు ఇప్పుడు రూ.75 కోట్లకు ఎకరం విక్రయిస్తుంటే ప్రశ్నిస్తున్నారు. ఈ పిల్‌లు ప్రజాప్రయోజనం ఆశించి వేసినవి కావు. నిజాం కాలం నుంచి ఈ 400 ఎకరాలు గడ్డి భూములు. ఈ భూములకు ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ స్థలంలో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలిప్యాడ్‌లు కూడా ఉన్నాయి' అని ఏజీ చెప్పారు. కాగా, ఇది ఇండస్ట్రియల్ ల్యాండ్ అని సర్కార్ వద్ద రికార్డులున్నాయా? అని ధర్మాసనం ఏజీని ప్రశ్నించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. సమయం ముగియడంతో తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది.

చట్టప్రకారమే కాదు.. నైతికంగానూ ఆలోచించాలి

హెచ్‌సీయూ మాజీ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేవలం చట్ట ప్రకారమే చూడకుండా... సహజ సిద్ధంగా ఏర్పడిన అటవీ, పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నైతికంగానూ ఆలోచించి ఓ మంచి నిర్ణయం తీసుకోవాలని హెచ్‌సీయూ సోషల్ సైన్సెస్ మాజీ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి సూచించారు. 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ తొలి వీసీ ప్రొఫెసర్ గురుభక్ష్‌సింగ్ ఆధ్వర్యంలో 8 కి.మీ మేర నిర్మించిన రక్షణగోడ కారణంగా గత 40, 50 ఏళ్లలో ఆ ప్రాంతంలో చెట్లు, జంతువులతో అరుదైన జీవావరణ ప్రాంతంగా ఆవిర్భవించిందని తెలిపారు. భూహక్కుల బదలాయింపు తదితరాలేవీ జరగకపోయినా దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత, నైతికత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఇది ఒకరకంగా పెద్దమనుషుల ఒప్పందం వంటిదైనందున, హెచ్‌సీయూలోని భూమి విద్యావసరాలతోపాటు పర్యావరణ, జీవవైవిధ్యానికి ఉపయోగపడుతున్నందున, దానిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. 2,300 ఎకరాల భూమి అంతా హెచ్‌సీయూకే ఇచ్చినందున, అదంతా వర్సిటీదే అవుతుందన్నారు. ఈ ప్రాంతమంతా జీవ వైవిధ్య కేంద్రంగా మారిందని, ఈ భూమిని చదును చేసి వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే భావితరాలకు నష్టం జరుగుతుందనేదే తమ ఆందోళన అని నర్సింహారెడ్డి తెలిపారు.

ప్రభుత్వభూమి అంటే ప్రజల భూమే: పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి



ప్రభుత్వ భూమి అంటే అది ప్రజల భూమేనని, దాని పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి సూచించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ హెచ్‌సీయూకి కేటాయించిన భూమిపై అధికారిక పత్రాలు వంటివి లేకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వపరంగా ఓపెన్‌సర్వే చేసి హద్దులు నిర్ణయించి హెచ్‌సీయూ ల్యాండ్‌గా ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఈ 400 ఎకరాల భూమి యూనివర్సిటీ సరిహద్దు గోడలోనే ఉందని, మొత్తం హెచ్‌సీయూ అంతా పర్యావరణహితంగా మారిందని చెప్పారు. పర్యావరణపరంగా చూస్తే. ఈ మొత్తం ప్రాంతమంతా కూడా జంతువులు, వన్యప్రాణుల ఆవాసం, జీవావరణంగానే (హాబిటాట్)గానే చూడాల్సి ఉంటుందన్నారు. ఈ 400 ఎకరాలను విభజించి విడిగా వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తే ఈ హాబిటాట్ అనేది డిస్టర్బ్ అవుతుందని, బలవంతంగా కుచించుకుపోయేలా చేయడం వల్ల బయోడైవర్సిటీకి నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ భూములను చదును చేయడానికి ముందే ఆయా సంస్థలు 'ఎన్విరాన్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్' స్టడీ జరపలేదని, ఎలాంటి పబ్లిక్ హియరింగ్ కూడా చేపట్టకపోవడం సరికాదన్నారు.

20 ఏళ్లు పడావు పెడితే చెట్లు పెరగవా?

చెట్లు పెరిగితే అడవి అయిపోతుందా?

- ఫామ్‌హౌస్‌లో కూర్చొని మొసలికన్నీరు కారిస్తే ప్రజలు హర్షించరు
- పదేళ్లలో 16 లక్షల ఎకరాల అటవీభూమిని నాశనం చేసిన బీజేపీ నేతలూ మాట్లాడతారా?
- బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఫైర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో బీఆర్ఎస్, బీజేపీల వ్యవహారశైలిపై రాష్ట్ర ఎక్సైజ్, టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఆ పార్టీల గగ్గోలు కేవలం రాజకీయపబ్బం గడుపుకునేందుకు మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీజీఐఐసీకి ఇచ్చిన భూమి యూనివర్సిటీది కాదని, హెచ్‌సీయూకి చెందిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని, అలా తీసుకునే అవసరం కూడా ప్రభుత్వానికి లేదని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్‌యాదవ్, కేశ నాగరాజుగౌడ్‌లతో కలిసి మాట్లాడారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆ భూములను కొట్టేసే కుట్ర....

ఐఎంజీ కేసును గత ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోలేదని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఆ కేసును పరిష్కరించాలనే ఆలోచన కూడా చేయలేదని, దీని వెనుక ఆ భూములను కొట్టేయాలనే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కేసును త్వరితగతిన పరిష్కరించేందుకు పూనుకుందని, అటు సుప్రీంకోర్టు, ఇటు హైకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చేలా కొట్లాడిందని చెప్పారు. ఈ కేసులో సెంట్రల్ వర్సిటీ వర్గాలు కూడా ఇంప్లీడ్ కాలేదని చెప్పారు. ప్రతి విషయంలో అడ్డుపడితే నాడు నగరం నడిబొడ్డున హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడేవా అని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని మొసలి కన్నీరు కారిస్తే ప్రజలు హర్షించబోరని, కేసీఆర్ బజార్లోకి వచ్చి నిలబడి మాట్లాడితే ప్రజలే దుమ్ము దులుపుతారని వ్యాఖ్యానించారు. పదేళ్ల కాలంలో 16 లక్షల ఎకరాల అటవీభూములను నాశనం చేసిన బీజేపీ నేతలు, ఇప్పుడు 400 ఎకరాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

అక్కడి జింకలు ఇక్కడికి రావా?

హెచ్‌సీయూ భూముల్లోని జీవ వైవిధ్యం గురించి మంత్రి జూపల్లి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 20 ఏళ్ల పాటు కేసును పరిష్కరించకుండా భూమి పడావు పెడితే అక్కడ చెట్లు పెరగవా అని ప్రశ్నించారు. చెట్లు పెరిగితే అడవి అయిపోతుందా అని వ్యాఖ్యానించారు. అక్కడ జింకలు ఉన్నాయని చెబుతున్నారని, ఆ 400 ఎకరాల్లో ఉండే జింకలు ఇంకా యూనివర్సిటీ చేతిలోనే ఉన్న 1,500 ఎకరాల్లోకి రావా అని ప్రశ్నించారు. ఆ భూముల్లో ఉన్న చెరువులు, మష్‌రూమ్ రాక్స్ జోలికి ప్రభుత్వం వెళ్లబోదని చెప్పారు. దశాబ్దాలుగా అన్యాక్రాంతమవుతున్న చెరువులను రక్షించే ఉద్దేశంతో ముందుకెళుతున్న ప్రభుత్వం ఈ భూమిలోని చెరువులను కూడా కాపాడుతుందని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకోండి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తి



ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం ఇస్తున్న వద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, బడుగుల లింగయ్య, సురేశ్‌రెడ్డి, దామోదర్‌రావు, శ్రవణ్, గెల్లు శ్రీనివాస్

సాక్షి, న్యూఢిల్లీ: హెచ్‌సీయూ భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నా లను వెంటనే నిలువరించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. బుధవారం వద్దిరాజు నేతృత్వంలో పార్టీ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్ రావులు కేంద్ర మంత్రిని కలిశారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూముల లో 400 ఎకరాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని ఎంపీల బృందం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఆ భూములలో చెరు వులు, కుంటలతో పాటు అరుదైన వృక్ష జాతులు, జింకలు, నెమళ్లు ఉన్నాయన్నారు. ఈ భూములను వేలం వేయకుండా నిలువరించాలని కోరుతూ విద్యార్థులు, మేధావులు ఆందోళన బాట పట్టిన విషయాన్ని కేంద్ర మంత్రికి చెప్పారు. ఇదిలా ఉండగా, హెచ్‌సీయూ భూముల అంశాన్ని ఎంపీ సురేశ్‌రెడ్డి రాజ్యసభలో ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు.

పశుపక్షాదుల ఆర్తనాదాలు వినండి

జింకలు, నెమళ్లు, పక్షులు అరుపులతో పరుగులు

- హైదరాబాద్ భవిష్యత్ కోసం సంఘీభావం ప్రకటించాం
- హెచ్‌సీయూ ప్రొఫెసర్ బాంగ్యా భూక్యా ఆవేదన

గచ్చిబౌలి: ప్రభుత్వ చర్యతో హెచ్‌సీయూలో పక్షులు, జింకలు ఏడుస్తున్నాయని, వాటి అరుపులు వినాలని, చెరువులను కోల్పోతున్నామని హెచ్‌సీయూ ప్రొఫెసర్ బాంగ్యా భూక్యా ఆవేదన వ్యక్తం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూముల నుంచే ఎన్నో విద్యావసరాలకు ఐఎస్‌బీ, నవోదయ, టీఐఎఫ్ఆర్, ఇతర సంస్థలు, ప్రజల అవసరాలకు డిపో వంటి వాటికి ఇచ్చారని గుర్తు చేశారు. మేము 50 ఏళ్లుగా అకడమిక్ కోసం కాకుండా, ఎక్కడా ఇతర అవసరాలకు భూములను వినియోగించలేదన్నారు. ప్రభుత్వమే 400 ఎకరాలకు రియల్ ఎస్టేట్ చేయడానికి వినియోగించాలని, రెండు వారాలుగా అటవీ ప్రాంతాన్ని చదును చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని సూచించారు. హైదరాబాద్ భవిష్యత్ కోసం విద్యార్థుల పోరాటానికి మద్దతుగా వచ్చామని గుర్తు చేశారు. రెవెన్యూ సర్వే ఎక్కడా జరగలేదని, అన్నీ ఇల్లీగల్‌గా వ్యవహరించడం తగదన్నారు. కేసు కోర్టులో ఉందని, అయినా భూమిని చదును చేయడం ఏమిటని ప్రశ్నించారు. యూనివర్సిటీ పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై వైస్‌చాన్స్‌లర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.


ఇందిరమ్మ ఆశయాలకు తూట్లు: ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు

ఆరు సూత్రాల కార్యక్రమం కింద అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏర్పాటు చేసిన హెచ్‌సీయూకు కంచ గచ్చిబౌలిలోని 2,300 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని హెచ్‌సీయూ తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ పిల్లమర్రి రాములు స్పష్టం చేశారు. ఈ మేరకు అప్పటి విద్యాశాఖాధికారి పి.రాంచంద్రారెడ్డి, ఇతర అధికారులు ప్రత్యేక జీఓను విడుదల చేశారని, ఈ భూమిలో అకడమిక్ కార్యకలాపాలు నిర్వహించాలన్నారని, 50 ఏళ్లుగా మేము చేస్తున్నది అదేనన్నారు. ప్రస్తుతం 400 ఎకరాల అటవీ ప్రాంతం, జంతువులు, పక్షులు మూగజీవాలున్న చోటును తొలగించి రియల్ ఎస్టేట్ చేయాలని తలపెట్టడం ఇందిరమ్మ ఆశయాలకు తూట్లు పొడవడం, రాజీవ్ గాంధీ ఆశయాలను తుంగలో తొక్కడమేనని నేటి పాలకులు గుర్తించాలన్నారు. రెండు వారాలుగా నెమళ్లు, జింకలు ఏడుస్తున్నాయని, పక్షులు స్థావరాలు కోల్పోతున్నాయని చెప్పారు.

భూములను కాపాడుకుంటాం: విశాల్

హైదరాబాద్ భవిష్యత్ కోసం విద్యార్థులు చేసే పోరాటం ద్వారా భూములను కాపాడుకుంటామని స్టూడెంట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ చెప్పారు. ఈ పోరాటం కేవలం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాలేదని, దేశాన్ని కూడా ఆకర్షించిందని, న్యాయం కోసమే విద్యార్థులు పోరాడుతున్నారని స్పష్టమైందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా పోరాటం చేస్తుంటే వందలాది మంది పోలీసులను క్యాంపస్‌కు పంపడమేమిటని ప్రశ్నించారు. వెంటనే పోలీసులను ఉపసంహరించి, జేసీబీలను క్యాంపస్ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హెచ్‌సీయూలో ఇలాంటి పరిస్థితులు నెలకొల్పడం ద్వారా ప్రభుత్వం ఏమి సాధిస్తుందని ప్రశ్నించారు.

మౌన మునుల్లా మేధావులు: దేశపతి శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరంతర ప్రతిపక్షంగా ఉంటామని ప్రకటించిన మేధావులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశంలో ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కోదండరాం, ఆకునూరు మురళి వంటి మేధావులు ఎందుకు మౌన మునుల్లా వ్యవహరిస్తూ చరిత్రలో దోషులుగా నిలబడే ప్రయత్నం చేస్తున్నారో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ పట్ల ప్రేమ లేదని, ఆయన పక్కన నిలబడుతున్న మేధావులు గోడకట్టి గొడుగు ఎందుకు పడుతున్నారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- చంద్రబాబు హయాంలో కంచ గచ్చిబౌలి భూములు అప్పనంగా బిల్లీరావుకు ధారాదత్తం
- ఐఎంజీ భారత్‌కు ఇచ్చిన భూములను రద్దు చేయడంతో పాటు కోర్టులో పోరాడినది వైఎస్సార్
- వైఎస్సార్ పోరాటానికి రేవంత్ ప్రభుత్వం అద్భుత ముగింపును ఇచ్చింది...
- ఆ 400 ఎకరాల భూమి కచ్చితంగా ప్రభుత్వానిదే.. అందులో అనుమానాలు అక్కర్లేదు
- ఆ భూముల్లో ఐటీ హబ్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్స్ సిటీ వంటి సంస్థలను ఏర్పాటు చేస్తాం
- లక్షల కోట్ల పెట్టుబడులు.. నిరుద్యోగ యువతకు లక్షల్లో ఉద్యోగాలు ఖాయం
- కుట్రదారులతో చేతులు కలిపినందునే భూముల విషయంలో బీఆర్ఎస్ మౌనం

‘బిల్లీ’ కబంధ హస్తాల్లోంచి..

భూముల చెర విడిపించాం

‘సాక్షి’ ఇంటర్వ్యూలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



కుట్రదారులే అశాంతి రేపుతున్నారు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లీరావుకే భూములు చెందాలన్న లక్ష్యంతో మౌనంగా ఉంది. పంచుకుని తిందామని చూసింది. అప్పుడు కోర్టులో కొట్లాడకుండా మౌనంగా ఉండి.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీ దానికి వంత పాడుతోంది. యువతలో అశాంతిని నెలకొల్పి ప్రభుత్వంపై ఉసిగొల్పాలన్నదే వారి లక్ష్యం. ఈ కుట్రలపై యువత అప్రమత్తంగా ఉండాలి. భావోద్వేగాలకు పోవద్దు. పోలీసులు సైతం సంయమనంతో వ్యవహరించాలి..’’ అని భట్టి పేర్కొన్నారు.

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత విలువైన కంచ గచ్చిబౌలి భూములను నాటి చంద్రబాబు ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిందని.. వారి కబంధ హస్తాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం చెర విడిపించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో బిల్లీరావుకు కట్టబెట్టిన భూముల కేటాయింపులను రద్దు చేసి, దానిపై న్యాయపోరాటం చేసినది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా అద్భుత ముగింపు ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడి ప్రజలకు కానుకగా ఇచ్చామని, అవే భూముల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణానికి ఎలాంటి ఇక్కట్లు కలగకుండానే అభివృద్ధి ఉంటుందని హామీ ఇచ్చారు. కంచ గచ్చిబౌలి భూములపై వివాదం రగులుతున్న నేపథ్యంలో భట్టి విక్రమార్క బుధవారం ‘సాక్షి’తో మాట్లాడారు. వివాద అంశాలపై స్పష్టత ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

చంద్రబాబు హయాంలో ధారాదత్తం..

‘‘యూనివర్సిటీ భూములను చంద్రబాబు ప్రభుత్వం 2003 ఆగస్టు 9న బిల్లీరావు అనే వ్యక్తికి చెందిన ఐఎంజీ భారత్‌కు అప్పనంగా ధారాదత్తం చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2004 ఫిబ్రవరి 10న సేల్‌డీడ్ ద్వారా 400 ఎకరాల భూమిని బిల్లీరావుకు ఇచ్చారు. దీనికి బదులుగా యూనివర్సిటీకి గోపన్పల్లిలో 397 ఎకరాల భూమిని ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో యూనివర్సిటీకి, బిల్లీరావుకు లబ్ధి జరిగితే నష్టపోయినది రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలే.

వైఎస్ పోరాడితే.. మేం ముగింపునిచ్చాం..

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిల్లీరావుకు కట్టబెట్టిన భూములను రద్దు చేస్తూ ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. 2006 అక్టోబర్ 21న సేల్‌డీడ్‌ను రద్దు చేస్తూ.. భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై బిల్లీరావు హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తే.. వైఎస్సార్ బలంగా న్యాయ పోరాటం చేశారు. క్రమేణా రాష్ట్ర విభజన అనంతరం ఈ భూముల అంశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే.. కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చాక కోర్టులో న్యాయపోరాటం మొదలుపెట్టింది. 2024 మార్చిలో హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానిదేనని తీర్పు ఇస్తే.. బిల్లీరావు తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో సైతం బలమైన వాదనలు వినిపించింది. దీనితో అదే ఏడాది మే 3న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. వైఎస్సార్ చేసిన పోరాటానికి ప్రభుత్వం అలా ముగింపునిచ్చింది. దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల్లో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంది. రాష్ట్ర ఆస్తి రాష్ట్ర ప్రజలకే దక్కాలన్నది ప్రభుత్వ భావన. ఇది ప్రజల విజయం.

పెట్టుబడులు, ఉద్యోగాలు లక్ష్యంగా అభివృద్ధి..

యువతకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ఆవిర్భావం జరిగింది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం యువత ఆశయాల కోసం కట్టుబడలేదు. అటు ప్రభుత్వ రంగంలో, ఇటు ప్రైవేటు రంగంలో ఉపాధి ఊసే లేదు. ప్రస్తుత ప్రభుత్వం యువత కోసం టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తోంది. మరోవైపు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పన చేయాలన్న లక్ష్యంతో ఉంది. ఈ భూముల్లో ఐటీ హబ్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్స్ సిటీ, హైటెక్ సిటీ ఫేజ్–1, 2 ఏర్పాటు చేస్తాం. దీనిద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. హైదరాబాద్‌కు ఇప్పటికే ఉన్న గ్లోబల్ సిటీ పేరును మరింత విస్తరించేందుకు ఇది దోహదం చేస్తుంది. ఇందులో రాష్ట్ర ప్రయోజనాలే తప్ప.. ఎవరి సొంత ప్రయోజనాలు లేవు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిరక్షిస్తూనే అభివృద్ధి చేపడతాం.

చంద్రబాబు రియల్ ఎస్టేట్ దందాను రేవంత్ కొనసాగిస్తున్నాడు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణలు
- కేసీఆర్ హరితహారం చేపడితే కాంగ్రెస్ హరితసంహారం చేస్తోందంటూ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: గురువు చంద్రబాబు రియల్ ఎస్టేట్ దందాను ఆయన శిష్యుడు, సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆరోపించారు. హెచ్‌సీయూ భూములను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని చూస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ అడ్డం పడుతున్నాయని టీడీపీలో పనిచేసిన కాలంలో 2012, సెప్టెంబర్ 16న రేవంత్ విమర్శించిన విషయాన్ని జగదీశ్‌రెడ్డి ప్రస్తావించారు. సెంట్రల్ యూనివర్సిటీలో మూడు చెరువులు ఉన్నా హైడ్రా సంస్థ రంగనాథ్ ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ జగదీశ్‌రెడ్డి బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. విద్యార్థులను పెయిడ్ బ్యాచ్‌గా అవమానిస్తున్న వారికి సీఎం, మంత్రి పదవులు పేమెంట్‌తోనే వచ్చాయని ఎద్దేవా చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులకు అండగా నిలిచిన కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం కూడా పెయిడ్ బ్యాచేనా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ హరితహారాన్ని చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం హరిత సంహారాన్ని చేస్తోందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే యూనివర్సిటీలో పోలీసులు అడుగు పెట్టకుండా చూడాలని హితవు పలికారు.

సచివాలయ ముట్టడికి యత్నించిన మహిళా మోర్చా నేతల అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని ఆపాలంటూ సచివాలయ ముట్టడికి యత్నించిన బీజేపీ మహిళా మోర్చా నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సెక్రటేరియట్ సమీపానికి వచ్చిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, ఇతర నాయకులను అరెస్ట్ చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తాకట్టుపెట్టి, ప్రభుత్వం చేస్తున్న పర్యావరణ విధ్వంస చర్యలను నిరసిస్తూ సచివాలయాన్ని ముట్టడించేందుకు వచ్చినట్టు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపిన మహిళా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆమె ఖండించారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జ్

- శాంతియుతంగా ర్యాలీ చేస్తుండగా ఘటన
- యూనివర్సిటీ అష్టదిగ్బంధం.. 400 ఎకరాల్లో పోలీసుల పహారా



హెచ్‌సీయూలో ఈస్ట్ క్యాంపస్‌కు చేరుకున్న విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు

గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములు వెనక్కి ఇవ్వాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. బుధవారం హెచ్‌సీయూ విద్యార్థి సంఘం పిలుపు మేరకు హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, ఎస్ఎఫ్ఐ, డీఎస్‌యూ, ఏఎస్ఏ, ఏఐటీసీఎస్ఏ, పీడీఎస్‌యూ, ఏబీఎస్ఏ, బీఎస్ఎఫ్, ఫ్రటర్నిటీ, ఎంఎస్ఎఫ్, ఎస్ఐఓ, టీఎస్ఎఫ్ తదితర సంఘాలు ఈస్ట్ క్యాంపస్ నుంచి నార్త్ క్యాంపస్‌కు ర్యాలీగా బయలుదేరాయి. సౌత్ క్యాంపస్‌కు కొద్ది దూరంలోకి రాగానే ఒక్కసారిగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థులు పోలీస్ గోబ్యాక్..రేవంత్‌రెడ్డి ముర్దాబాద్ అంటూ గర్జించారు. విద్యార్థుల 400 ఎకరాల వైపు వెళతారని భావించిన పోలీసులు ముందస్తుగా అటువైపు వెళ్లకుండా రోప్ పార్టీని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆ రోప్‌ను లాగారని, వారిని అదుపు చేసేందుకు రోప్, నేలపై లాఠీలతో కొట్టారని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు.

భారీగా పోలీసుల మోహరింపు..

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో క్యాంపస్‌లో భారీగా పోలీసులను మోహరించారు. మొదట ప్రధాన గేటు వద్ద ఎక్కువ సంఖ్యలో బందోబస్తు పెట్టి..హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వైపు వెళ్లే రోడ్డును పూర్తిగా మూసివేశారు. ఉద్యోగుల కోసం సర్వీస్ గేట్‌ను కేటాయించారు. దాదాపుగా క్యాంపస్ పోలీసుల గుప్పిట్లో ఉంది. పలుచోట్ల బారికేడ్లు, కూడళ్ల వద్ద పికెట్లు కూడా ఏర్పాటు చేశారు. మొత్తంగా వర్సిటీని అష్టదిగ్బంధనం చేశారు. డీఐజీ సత్యనారాయణ, మాదాపూర్ డీసీపీ వినీత్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

ఏబీవీపీ చలో ఈస్ట్ క్యాంపస్ ర్యాలీ

హెచ్‌సీయూలో ‘చలో ఈస్ట్ క్యాంపస్’పేరిట నిరసన వ్యక్తంగా చేయాలని ఏబీవీపీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద స్టూడెంట్స్ క్యాంటీన్ నుంచి చలో ఈస్ట్ క్యాంపస్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం భూములు మావే అంటూ.. పాటలతో ర్యాలీ కొనసాగించారు.

ప్రధాన ద్వారం వద్ద నిరసన

నిరసన ర్యాలీ అనంతరం విద్యార్థులు యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ భూముల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులంతా ఆందోళనలో భాగంగా రెండవరోజూ బుధవారం తరగతులను సామూహికంగా బహిష్కరించారు. దీనికితోడు ఫ్యాకల్టీ కూడా ర్యాలీలో పాల్గొంది. దీంతో తరగతులు జరగలేదు.



హెచ్‌సీయూలోని ఈస్ట్ క్యాంపస్‌కు వెళుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

అమ్మాయిలపై కూడా లాఠీచార్జ్


శాంతియుతంగా ర్యాలీలో పాల్గొన్న అమ్మాయిలపై కూడా లాఠీ చార్జ్ చేశారు. ఇంతమంది పోలీసులు వచ్చి అమ్మాయిలపై లాఠీచార్జ్ చేసే హక్కు వారికి ఎక్కడిది. క్యాంపస్ వద్ద పోలీసులు, మీడియా ఇద్దరూ ఒకేచోట ఉండాలి. కానీ పోలీసులు లోపల, మీడియా బయట ఉన్నారు. బుల్డోజర్లను వెంటనే క్యాంపస్ నుంచి బయటకు పంపాలి.

– ప్రజ్ఞ, హెచ్‌సీయూ ఎంఎస్సీ విద్యార్థిని



వర్సిటీ భూముల్ని ప్రైవేటుకు అప్పగించింది బాబే

- ఆపద్ధర్మ సీఎంగా ఉంటూ 850 ఎకరాలను బిల్లీ రావు కంపెనీకి అప్పగించిన వైనం
- అందులో 400 ఎకరాలు వర్సిటీ భూములు.. మరో 450 ఎకరాలు మామిడిపల్లిలో...
- అప్పనంగా అప్పగించిన ఆ భూములను రద్దు చేసిన నాటి వై.ఎస్. ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన రూ. వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూములను తొలుత ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది చంద్రబాబు నాయుడేననే విషయం మరోసారి బయటపడింది. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూ కీలక నిర్ణయాలు తీసుకోరాదనే నైతికతను మరచి వందల ఎకరాల భూములను ఊరూపేరూ లేని సంస్థకు కట్టబెట్టిన వైనం మళ్లీ తెరపైకి వచ్చింది. 2004 జనవరి 13న జీవో ఇవ్వడం, ఆ తర్వాత ఆగమేఘాలపై వర్సిటీకి చెందిన 534 ఎకరాలు తీసుకొని అందులో 400 ఎకరాలను, మిగతా 450 ఎకరాలను అప్పటి సరూర్‌నగర్ మండలంలోని మామిడిపల్లిలో బిల్లీరావుకు చెందిన ఐఎంజీ భారత అనే ఊరూపేరూ లేని సంస్థకు కేటాయించారు. 2004 ఫిబ్రవరి 10న రిజిస్ట్రేషన్ చేయడం దాకా ఈ ప్రక్రియను చకచకా జరిపించేశారు. కానీ ఆ తర్వాత వచ్చిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం బాబు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను, చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడానికి ఏకంగా చట్టం తీసుకొచ్చిన విషయాన్ని యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్లు హరగోపాల్, నరసింహారెడ్డి గుర్తుచేస్తున్నారు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన ఒప్పందాలపై బిల్లీ రావు హైకోర్టును ఆశ్రయించినా సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత గతేడాది మార్చిలో హైకోర్టు అప్పట్లో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన విషయాన్ని కూడా వారు చెబుతున్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకు వెళ్లినా అక్కడా బిల్లీరావుకు ఎదురుదెబ్బ తగిలిందంటున్నారు. ప్రజల ఆస్తిని కాపాడటానికి వైఎస్సార్ ఏకంగా చట్టం తెచ్చారని.. వర్సిటీ భూమిని తిరిగి వర్సిటీకి అప్పగించడం సరైందన్న వాదనను ప్రస్తుతం పోరాడుతున్న వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి.

‘మాదిగ దండోరా ఉద్యమకారులపై కేసులు ఎత్తేయాలి’

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపై నమోదైన కేసులు వెంటనే ఎత్తివేయాలని, మాదిగ దండోరా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని మాదిగ దండోరా ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల్లో దండోరా ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహను మాదిగ దండోరా ఉద్యమకారులు రుద్రవరం లింగస్వామి, జిల్లా వెంకటేశ్, గల్ల వెంకట్, మీసాల కురుమయ్య, బడుగుల బాలకృష్ణ, పాలడుగు రమేశ్, నక్క వెంకటేశ్, గంగాపురం నరసింహ, అరుణ్, నరేశ్, అడ్వొకేట్ మల్లన్న కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ అమరవీరుల జ్ఞాపకాలతో స్మృతివనాల్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి రాష్ట్రంలో అమలుకు కృషి చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ దండోరా ఉద్యమకారులు చేసిన విజ్ఞప్తిపై దామోదర సానుకూలంగా స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా మాదిగ దండోరా ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేసేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామన్నారు.

ఆ 400 ఎకరాల్లో భూమి చదునుపై వెంటనే నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర అటవీశాఖకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ ఆదేశాలు
- వాస్తవ నివేదికతోపాటు ‘యాక్షన్ టేకన్ రిపోర్ట్’ పంపాలని సూచన
- అటవీ అదనపు కార్యదర్శికి కేంద్ర అటవీశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్ సుందర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో భూమిని చదును చేయడంపై వెంటనే వాస్తవ ఆధారిత నివేదిక సమర్పించాలని రాష్ట్ర అటవీశాఖను కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆదేశించింది. దీనికి సంబంధించి వెంటనే వాస్తవ నివేదికతోపాటు, ఆయా అంశాలకు సంబంధించిన ‘యాక్షన్ టేకన్ రిపోర్ట్’ను కూడా తమ శాఖకు పంపించాలని సూచించింది. ఈ భూమిలో టీజీఐఐసీ ద్వారా అక్రమంగా చెట్లను తొలగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఈ భూమిలో చెట్ల తొలగింపు వంటి చర్యలతో వన్యప్రాణులు, పర్యావరణానికి నష్టం జరుగుతోందని, ఇక్కడున్న చెరువులు, వినూత్న ‘రాక్ ఫార్మేషన్’కు నష్టం వాటిల్లుతోందని వివిధ వార్తాపత్రికలు, సోషల్ మీడియాలోనూ వార్తలు వచ్చాయని తెలిపింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర అటవీశాఖ అదనపు కార్యదర్శికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్ సుందర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతిని పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్, చెన్నైలోని డీడీజీఎఫ్, హైదరాబాద్ సబ్ ఆఫీస్ ఐజీఎఫ్ (సెంట్రల్)కు పంపించారు. చెట్ల నరికివేతతోపాటు పర్యావరణానికి నష్టం కలిగే చర్యలు చేపట్టి ఉంటే వెంటనే అటవీచట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. మంగళవారం ఈ అంశంపై ఢిల్లీలో మంత్రి భూపేందర్ యాదవ్‌కు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీలు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర అటవీశాఖకు వెంటనే వాస్తవ ఆధారిత నివేదికను సమర్పించాలని కేంద్ర అటవీశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి.

అది అటవీ ప్రాంతం కాదు?

కంచ గచ్చిబౌలిలోని భూముల్లో చెట్ల తొలగింపు, ఇతర క్లియరెన్స్ కార్యకలాపాలపై కేంద్ర అటవీ శాఖకు ఒకటిరెండురోజుల్లో రాష్ట్ర అటవీశాఖ నివేదిక పంపించినట్టు అధికారవర్గాల సమాచారం. బుధవారమే ఈ లేఖ అందినందున, ఆయా అంశాలపై స్పష్టమైన సమాచారంతో నివేదిక పంపాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అదీగాక ఆ 400 ఎకరాల భూమికి సంబంధించిన కేసు హైకోర్టులో విచారణలో ఉన్నందున, కోర్టు ఏ విధంగా స్పందిస్తుందనే దానిపై వేచిచూసే ధోరణిని ఉన్నట్టు తెలిసింది. హెచ్‌సీయూకు సమీపంలోని 400 ఎకరాల భూమిని అటవీప్రాంతంగా ప్రకటించనందున అది రక్షిత ప్రాంతం కిందకు రాదనే అభిప్రాయం అటవీశాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం, పలువురు మంత్రుల దృష్టికి అటవీశాఖ ఉన్నతాధికారులు తీసుకొచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. అయితే చెట్ల తొలగింపు, క్లియరెన్స్ వంటి చర్యల వల్ల వన్యప్రాణులు, జీవజాలం, పర్యావరణం, జీవవైవిధ్యానికి వాటిల్లే నష్టం, ఈ విషయంలో నియమనిబంధనలు పాటించారా లేదా అన్న దానిపై అటవీశాఖ ఎలాంటి నివేదిక ఇస్తుందనేది చూడాల్సి ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

హెచ్‌సీయూపై సెలబ్రిటీలు సై!

- జాతీయ స్థాయిలో స్పందిస్తున్న భిన్న రంగాల ప్రముఖులు
- పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దంటూ పిలుపు



ఉపాసన



సమంత



ప్రకాశ్‌రాజ్



దియా మీర్జా



మణిశర్మ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వివాదం చినికి చినికి గాలివానగా మారుతోంది. విద్యార్థుల నిరసనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. వారికి మద్దతుగా సినీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, భిన్న రంగాల ప్రముఖులు గొంతు కలుపుతున్నారు. దీనితో హెచ్‌సీయూ భూముల అంశాన్ని మరింత చర్చనీయాంశంగా మారుస్తోంది.

పర్యావరణ పరిరక్షణ కోసం..: హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా సినీహీరో రాంచరణ్ సతీమణి ఉపాసన స్పందిస్తూ.. ‘‘జంతువులు, పక్షులకు ఎక్కడ పునరావాసం కల్పిస్తారు? మనం చెట్టును ఎక్కడ తిరిగి నాటుతున్నాం? దీనిపై మీ భవిష్యత్తు ప్రణాళికను పంచుకోండి. అటవీ ప్రాంతాన్ని నిర్మూలించిన తర్వాత ఏం చేయబోతున్నారు’అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇన్‌స్టాగామ్‌లో పోస్టు పెట్టారు. ప్రముఖ నటి సమంత కూడా ఈ అంశంపై స్పందించారు. గచ్చిబౌలిలో జీవవైవిధ్యమున్న భూమిని ధ్వంసం చేయడం వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందంటూ.. పర్యావరణ ప్రభావాలపై ఓ ఆంగ్లపత్రిక నివేదికను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నారు. నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ ‘ఎక్స్’లో పోస్టు పెట్టారు. ‘‘ఈ విధ్వంసం ఆమోదయోగ్యం కాదు. ఇది మంచిది కాదు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా నేను విద్యార్థులకు అండగా నిలుస్తాను. భవిష్యత్తును కాపాడుకోవడానికి అందరూ నిరసన తెలపాలి’’అని పిలుపునిచ్చారు. ఇక.. ‘‘పర్యావరణ భవిష్యత్తు కోసం విద్యార్థులు గళం విప్పుతున్నారు. యువతకు సుస్థిరమైన రేపటికి అవకాశం కల్పించేవి ఐటీ పార్కులు కాదు, అరణ్యాలే. జీవవైవిధ్యాన్ని పణంగా పెట్టి చేసేది అభివృద్ధి కాదు వినాశనం. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో కంచ ఫారెస్ట్‌ను కాపాడండి’’అని బాలీవుడ్ నటి దియా మీర్జా పేర్కొన్నారు. వీరితోపాటు నటి ఈషా రెబ్బా, బిందు మాధవి కూడా విద్యార్థులకు మద్దతుగా ప్రకటనలు చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ నేరుగా నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

టీవీ, సోషల్ మీడియా ప్రముఖులు సైతం..

యాంకర్, నటి అనసూయ భరద్వాజ్, నటి రష్మీ గౌతమ్ తదితరులతోపాటు పలువురు టీవీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. చాలా మంది నెటిజన్లు తమ ఇన్‌స్టాగామ్ పోస్టుల్లో ‘ఆల్ ఐస్ ఆన్ హెచ్‌సీయూ, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ’వంటి నినాదాలను షేర్ చేస్తున్నారు.



వెనక్కి వెళ్లడం ద్వారానే జీవితాన్ని అర్థం చేసుకోగలం.
కానీ ముందుకు వెళ్తూనే దాన్ని జీవించాలి.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 3 ఏప్రిల్ 2025

ఇకనైనా అరాచకం ఆగేనా!

రాచరికాల్లో అధికారానికీ, దర్పానికీ, దానిద్వారా లభించే న్యాయానికీ రాజదండం చిహ్నం. ఈమధ్యకాలంలో బుల్‌డోజర్ అలాంటి పాత్ర పోషిస్తున్న వైనం కనబడుతోంది. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ పాలన మొదలయ్యాక బుల్‌డోజర్ అర్థం, దాని పరమార్థం మారిపోయాయి. ఆ రాష్ట్రాన్ని చూసి మరికొన్ని రాష్ట్రాలు వాతలు పెట్టుకోవటం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో 2021 మార్చిలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అమానవీయంగా, చట్టవిరుద్ధంగా ఆవాసాలను కూల్చేసిన అధికారగణంపై మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేయటంతోపాటు, ఇళ్లు కోల్పోయిన ఆరుగురు పిటిషనర్లకూ ఆరువారాల్లో రూ. 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అంతేకాదు... ఈ ఉదంతం తమ అంతరాత్మను తీవ్రంగా కలవరపరిచిందని ధర్మాసనం తెలియజేసింది. అధికారమంటే ఇష్టానుసారం ఏదైనా చేయడానికి దొరికిన లైసెన్స్‌గా భావించే సంస్కృతి దేశంలో ముదిరిపోయింది. ఒక్క యూపీలోనేకాదు... మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వగైరాల్లో ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకున్న తీరు గమనిస్తే ఇదో అంటువ్యాధిగా మారిందన్న అభిప్రాయం కలుగుతుంది. ఏదైనా కేసులో నిందితులుగా ఉన్నా లేదా శిక్షపడినా... అధికార పక్షానికి అనుకూలంగా లేకపోయినా అలాంటివారి ఇళ్లూ, దుకాణాలూ కూల్చేయడానికి బుల్‌డోజర్‌లు అత్యుత్సాహంతో ఉరుకుతున్న తీరు ఆశ్చర్యపరుస్తోంది. నిర్మాణ నిబంధనల్ని తీవ్రంగా ఉల్లంఘించారని తేలినా, ప్రభుత్వ భూమినో, మరొకరి భూమినో దురాక్రమించి కట్టారని తేలినా అలాంటివాటిని కూల్చేయటాన్ని ఎవరూ తప్పుబట్టరు. కానీ అందుకొక విధానం ఉండాలి. చట్ట నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. తప్పు చేశారని ఆరోపణలొచ్చినవారికి తగిన నోటీసులిచ్చి వారి సంజాయిషీ కోరాలి. సంతృప్తి చెందనట్టయితే ఆక్రమణదారులకు హేతుబద్ధమైన వ్యవధినిచ్చి కూల్చివేత ప్రక్రియ ప్రారంభించాలి.

ఇప్పుడు సుప్రీంకోర్టు విచారిస్తున్న కేసు సంగతే తీసుకుంటే 2021 మార్చి 1న మొదటిసారి అక్కడ నివాసముంటున్నవారికి నోటీసులు వచ్చాయి. వారికి అంతకు దాదాపు మూణ్ణెల్ల ముందే... అంటే జనవరి 8న నోటీసులిచ్చినట్టు, అందులో ఆ నెల 27లోగా ఎవరికివారు సొంత ఖర్చులతో ఇళ్లు కూల్చేయాలని ఆదేశించినట్టు ఉంది. దానికి స్పందన రాకపోవటంతో తాజాగా నోటీసులు జారీచేశామని అందులో పేర్కొన్నారు. మరో ఆరు రోజుల్లో బుల్‌డోజర్‌లతో వచ్చి ఇళ్లు కూల్చేశారు. తొలుత నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వటానికి చేసిన ప్రయత్నం విఫలం కావటంతో ఇళ్ల దగ్గర అతికించామన్న ప్రభుత్వ వాదనను న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన బెంచ్ విశ్వసించలేదు. పిటిషనర్లకు సహేతుకమైన వ్యవధినిచ్చిన దాఖలా కనబడటం లేదని, ఇది పౌరులకు రాజ్యాంగంలోని 21వ అధికరణ ద్వారా సమకూరిన ఆవాస హక్కును ఉల్లంఘించటమేనని తేల్చిచెప్పింది.

ఈ తీర్పు అనేకవిధాల ఎన్నదగినది. పిటిషనర్లకు ఆ స్థలంపై చట్టబద్ధమైన హక్కుందా లేదా అన్న అంశంలోకి ధర్మాసనం పోలేదు. దానిపై వారు విడిగా న్యాయస్థానాల్లో తేల్చుకోవాల్సిందే! 2023 ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన రాజకీయ నాయకుడు, పలు కేసుల్లో నిందితుడైన అతీఖ్ అహ్మద్ అక్రమంగా ఆక్రమించుకున్న భూమిలో ఈ ఇళ్లున్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఎన్నడో 1906లో అప్పటి అలహాబాద్ జిల్లా కలెక్టర్ షకీర్ అహ్మద్ అనే వ్యక్తికి 30 ఏళ్లకు లీజుకిచ్చి మరో రెండు దఫాలు పొడిగించుకునే వీలు కల్పించారని రికార్డులు చెబుతున్నాయి. 1960లో జిల్లా మేజిస్ట్రేట్ అనుమతితో షకీర్ దాని హక్కుల్ని వేరేవారికి బదలాయించాడు. ఆ తర్వాత క్రమంలో అది మరికొందరి చేతులు మారింది. చివరకు ప్రస్తుత పిటిషనర్లు దాన్ని కొనుగోలు చేశారు. ప్రభుత్వం వాదిస్తున్నట్టు ఆ కొనుగోలు చెల్లకపోవచ్చు. అది ప్రజా ప్రయోజనం కోసం వినియోగించాల్సిన భూమే కావొచ్చు. అంతమాత్రాన నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇళ్లు కూల్చటం సరైన చర్య కాదు. సుప్రీంకోర్టు తీర్పు దీన్ని తేటతెల్లం చేసింది.

ఈ సందర్భంగా వేరేచోట బుల్‌డోజర్ కూల్చివేతలు సాగిస్తుండగా ఒకటో తరగతి బాలిక అనన్యా యాదవ్ తన స్కూల్ బ్యాగ్‌ను రక్షించుకోవటానికి మంటలంటుకున్న షెడ్ సమీపానికి వెళ్లిన వీడియోను న్యాయమూర్తులు ప్రస్తావించటం గమనార్హం. అలాంటి ఉదంతాలు అందరినీ దిగ్భ్రాంతిపరుస్తాయన్న వారి వ్యాఖ్యలతో ఏకీభవించని వారుండరు. గత నవంబర్‌లో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సైతం ఇటువంటి వ్యాఖ్యలే చేసింది. 'ఇళ్లు కూల్చినప్పుడల్లా నిశిరాత్రిలో నడిరోడ్లపై చిన్నారులూ, మహిళలూ విలపిస్తున్న దృశ్యాలు అరాచకానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి' అని ధర్మాసనం గుర్తు చేసింది. ఇలాంటి సందర్భాల్లో కూల్చివేతలకు పాల్పడిన అధికారుల నుంచి ఇళ్ల, దుకాణాల పునర్నిర్మాణానికి అయ్యే వ్యయం వసూలు చేయాలని కూడా చెప్పింది. ఇతర మార్గదర్శకాలు కూడా రూపొందించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలైనా ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. కేవలం అయిదేళ్ల కోసం ఎన్నికై అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలు శాశ్వతంగా నిలిచే రాజ్యాంగ విలువలను కాలరాయటం, ఇష్టానుసారం ప్రవర్తించటం తప్పుడు సంకేతాలిస్తుంది. సాధారణ పౌరుల్ని కూడా చట్ట ఉల్లంఘనలకు ప్రోత్సహిస్తుంది. అందుకే ప్రభుత్వాలు ఎంత త్వరగా మేల్కొంటే అంత మంచిది. నాలుగేళ్ల ఆలస్యమైనా సర్వోన్నత న్యాయస్థానంలో బాధితులకు సరైన న్యాయం దక్కటం హర్షించదగ్గది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.షష్ఠి రా.3.27 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** రోహిణి ప.12.25 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.5.45 నుండి 7.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.02 నుండి 10.51 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.24 నుండి 10.55 వరకు.

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ద్విముఖ పోరు

సందర్భం



డా॥ సుబ్రోకమల్ దత్తా

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో ఒక లేఖ బయటపడింది. మహిళా కమాండర్ మన్‌కీకి నక్సల్ నేత మోటూ రాసిన ఆ లేఖను చూస్తే మునుపు ఎన్నడూ లేని విధంగా నక్సలైట్లలో నిస్పృహ ఆవరించి ఉన్నట్లు అనిపిస్తుంది. బోడ్కా నుంచి గామ్‌పూర్ వరకూ, దోడితుమ్నార్ నుంచి తోడ్కా వరకూ నక్సలైట్లకు సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయిందని ఆ లేఖలో పేర్కొన్నారు. భద్రతా దళాల నిరంతర నిఘా, దాడులు ఈ పరిస్థితిని తెచ్చాయి. నక్సలైట్లను 2026 మార్చ్ 31లోగా ఛత్తీస్‌గఢ్‌లో లేకుండా చేస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన నేపథ్యంలో ఈ లేఖకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. బస్తర్, అబూర్ఝమాడ్ అడవుల నుంచి గరియాబంద్ వరకూ భద్రతాదళాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏడాది కాలంలో సుమారు 300 మంది నక్సలైట్లు మరణించగా, మరెందరో అరెస్ట్ అయ్యారు. లేదా లొంగిపోయారు.

భారత అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాదం చాలాకాలంగా సవాలు విసురుతున్నది. రాజ్యాంగానికి సమాంతరంగా వ్యవస్థలు ఏర్పాటు చేసిన నక్సలైట్లను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సమర్థంగా అణచివేయగలిగింది. ఇందుకోసం ప్రభుత్వం ద్విముఖ వ్యూహాన్ని అనుసరించింది. ఒకవైపు అభివృద్ధి కార్యకలాపాలకు పెద్దపీట వేస్తూనే, ఇంకోవైపు భద్రతా దళాల కార్యకలాపాలనూ ముమ్మరం చేసింది.

నక్సలైట్ల రాజ్యంలోకి...

సామాజిక, ఆర్థిక వెనుకబాటు, దశాబ్దాల నిర్లక్ష్యం కారణంగా దేశంలో నక్సలిజం పెరిగిపోయింది. ఇది కేవలం శాంతి భద్రతల సమస్య కాదు. వివక్షకు గురైన ప్రజలు, ప్రాంతాలు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా అక్కడ తిరుగుబాటు పుట్టుకొచ్చింది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం అభివృద్ధి విషయంలోని లోటుపాట్లను సరిచేయడంతోపాటు, దేశాద్యంతం రాజ్యాంగ పరిధిలోనే పనిచేసేలా ద్విముఖ వ్యూహం అనుసరించింది. పట్టు కోల్పోయిన ప్రాంతాలను భద్రతా దళాలు మళ్లీ తమ స్వాధీనంలోకి తీసుకోగలిగాయి. ఒకప్పటి నక్సలైట్ల రాజ్యంలో ప్రభుత్వ వ్యవస్థలను ఏర్పాటు చేయగలిగాయి.

అయితే ఈ మార్పు ఒక్కరోజులో జరిగిందేమీ కాదు. కచ్చితమైన ప్రణాళికతో అమలు చేసిన ఈ వ్యూహం నక్సలైట్ల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించింది. వ్యూహాత్మక మోహరింపులు, నిఘా వర్గాలను బలోపేతం చేయడం, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ వంటి భద్రతాదళాల సాయంతో అతివాదుల అడ్డాలను నిర్వీర్యం చేయగలిగారు. అననుకూల పరిస్థితుల్లో పనిచేసే ఈ భద్రతా దళాలు అత్యాధునిక డ్రోన్లు, నిఘా పరికరాలు, కృత్రిమ మేధ, ఉపగ్రహ ఛాయా చిత్రాల వంటి వాటి సాయంతో నక్సలైట్ల ఆట కట్టిస్తున్నాయి.

తీవ్రవాద సంస్థల ఆర్థిక వనరులపై ఉక్కుపాదం మోపడం కూడా కీలకమైంది. ఎన్ఐఏ, ఈడీ వంటి సంస్థలు కొన్ని కోట్ల రూపాయల సొమ్మును స్వాధీనం చేసుకుని నక్సలైట్ల వెన్నువిరిచాయి. పీఎంఎల్ఏ చట్టాలతో కఠిన చర్యలు తీసుకోవడంతో నక్సలైట్లకు ఆర్థిక దన్నుగా నిలిచిన వారినీ కట్టడి చేయగలిగారు. ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ పని చేయడం నక్సలైట్ల సమస్య గణనీయంగా తగ్గేందుకు ఒక కారణంగా నిలిచింది.

కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేస్తే శాంతి చర్చలకు సిద్ధమంటూ సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో బుధవారం లేఖ విడుదలైంది.



> నక్సలిజానికి చరమగీతం పాడే ఈ దశలో ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలన్నీ అభివృద్ధి, భద్రత అన్న రెండు అంశాల మేళవింపునకు నిదర్శనంగా నిలుస్తాయి.

మౌలిక సదుపాయాల్లో వృద్ధి కూడా నక్సలిజం అణచివేతకు సాయపడింది. 2014–2024 మధ్యకాలంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 11,503 కిలోమీటర్ల హైవేలు, 20 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మించారు. ఫలితంగా అక్కడి ప్రజలు ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశాలు వచ్చాయి. వేలాదిగా ఏర్పాటు చేసిన మొబైల్ టవర్ల కారణంగా సమాచార వినిమయం సులువైంది. వెయ్యికి పైగా బ్యాంక్ శాఖలు, 937 ఏటీఎంల ఏర్పాటుతో ఈ ప్రాంతాలు దేశ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యాయి. నక్సలైట్ల ఆధ్వర్యంలో నడిచే ఆర్థిక వ్యవస్థ ప్రభావం తగ్గింది.

తగ్గిన ప్రభావం

ఈ చర్యల ఫలితం సుస్పష్టం. 2004–2014 దశతో పోలిస్తే ఇప్పుడు హింసాత్మక ఘటనలు 53 శాతం, భద్రతా దళాల మరణాలు 73 శాతం తగ్గాయి. సాధారణ ప్రజల మరణాలు కూడా 70 శాతం మేరకు తగ్గడం గమనార్హం. ఏడాది కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోనే 380 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. 1,194 మంది అరెస్ట్ అయ్యారు. 1,045 మంది లొంగిపోయారు. నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య దేశవ్యాప్తంగా 2014 నాటి 126 నుంచి 12కు చేరుకోవడం విశేషం.

నక్సలిజానికి ముగింపు పలికే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన భద్రతాదళ సిబ్బంది కుటుంబాలను ఆదుకునే విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించింది. ఆయుష్మాన్ భారత్‌లో వీరిని భాగస్వాములను చేసింది. ఆరోగ్య సేవలను దగ్గరకు చేర్చింది. సుమారు లక్ష మందికి ఈ–హౌసింగ్ పోర్టల్ ద్వారా ఖాళీగా ఉన్న ఇళ్లలో ఆవాసం లభించింది. సెంట్రల్ పోలీస్ వెల్ఫేర్ ఫండ్‌కు తీసుకొచ్చిన మార్పుల కారణంగా ఎక్స్‌గ్రేషియా మొత్తం పెరిగింది. 'భారత్ కే వీర్' వంటి కార్యక్రమాలు వీరమరణం పొందిన వారి కుటుంబాలకు ఆధారంగా నిలుస్తున్నాయి.

నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టడం చేయడంతోపాటు ఈ ప్రాంతాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా మూడు రెట్లు పెరగడం విశేషం. నైపుణ్యాభివృద్ధి, గిరిజన యువతను భద్రతా దళాల్లో చేర్చుకోవడం, సామాజిక సేవా కార్యక్రమాలు ముమ్మరం చేయడం ద్వారా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలందరూ జన జీవన స్రవంతిలో భాగమయ్యేలా జాగ్రత్త తీసుకున్నారు.

నక్సలిజానికి చరమగీతం పాడే ఈ దశలో ఇప్పటివరకూ సాధించిన విజయాలన్నీ అభివృద్ధి, భద్రత అన్న రెండు అంశాల మేళవింపునకు నిదర్శనంగా నిలుస్తాయి. కృతనిశ్చయం, విధాన పరంగా స్థిరత్వం మాత్రమే నక్సలిజం అంతానికి పరిష్కార మార్గాలని రుజువు చేశాయి.

వ్యాసకర్త కన్జర్వేటివ్ పొలిటికల్, ఫారిన్ పాలసీ ఎక్స్‌పర్ట్

మారాల్సిన తీరు

సందర్భం



పోటు రంగారావు

దండకారణ్యంలోని ఛత్తీస్‌గఢ్‌లో నరమేధం జరుగుతున్నది. బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో అంతిమ యుద్ధం ప్రకటించింది. మూడు శాతం ఆదివాసీ ప్రజలు జీవించే అబూర్ఝమాడ్, దంతెవాడ, కాలేకర్, కిష్టారం ప్రాంతాలున్న కీకారణ్యాన్ని 70 వేల మంది మిలిటరీ బలగాలతో చుట్టుముట్టింది. 630కి పైగా పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేసింది. అటు గడ్చిరోలి నుంచి ఇటు ఒరిస్సా మల్కాన్‌గిరి దాకా వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలను సమన్వయం చేసుకుంటూ సెర్చింగ్, వేట కొనసాగిస్తున్నది. 2026 మార్చ్ నాటికి మావోయిస్టు రహిత ప్రాంతంగా ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదే పదే ప్రకటిస్తున్నారు. అందుకోసం మాజీలనూ, కోవర్టులనూ ఉపయోగించుకుంటున్నారు. ఈ ఆరు నెలల కాలంలోనే దాదాపు 350 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారు.

అంతిమ యుద్ధం?

బస్తర్ ప్రాంతాన్ని, అందులో ముఖ్యంగా అబూర్ఝమాడ్‌ను కేంద్రంగా చేసుకొని నాటి పీపుల్స్‌వార్ పార్టీ, అదే నేటి మావోయిస్టు పార్టీ సాయుధ దళాల కేంద్రంగా ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నది. దళాల సంఖ్య పెంచుకోవడమేగాక, పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ (పీజీఎల్‌ఏ)ని ఏర్పాటు చేశామని ప్రకటించింది. ఈ ప్రాంతంలో జనతన్ సర్కార్ ఏర్పడిందని ప్రకటించింది. వ్యవసాయం, స్కూళ్ళు, ఆర్థిక విధానం తామే నియంత్రిస్తున్నామని చెప్పుకొన్నది. అరుంధతీ రాయ్ నుంచి అంతర్జాతీయ మేధావుల దాకా, జర్నలిస్టుల నుంచి రచయితల దాకా జనతన్ సర్కార్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజా గెరిల్లాలు ప్రభుత్వ బలగాలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు.

4 వేల చదరపు కిలోమీటర్లకు పైగా వైశాల్యం, 233 ఆదివాసీ గ్రామాలు, 25 వేల ఆదివాసీ జనాభా గల, కొండలు, గుట్టలు, దట్టమైన అడవి ప్రాంతమది. క్లైమోర్‌మైన్స్‌తో అనేక మిలిటరీ బలగాల వాహనాలను పేల్చి, వందల సంఖ్యలో మిలిటరీ వారిని హతమార్చారు. ప్రజా కోర్టులు నిర్వహించి శిక్షలు వేశారు.

వందలాది మంది చైతన్య స్ఫూర్తితో ఆ ప్రాంతానికి తరలి వెళ్ళి విప్లవ జీవితం గడపటం అసాధారణ విషయమే. త్యాగాలకు సిద్ధపడటం గొప్ప విషయం. ఆ మేరకు వారి అంకిత భావాన్ని గౌరవించాలి. అణచివేతకు వ్యతిరేకంగా, మిలిటరీ క్యాంపులకు వ్యతిరేకంగా, రోడ్లను, టెలిఫోన్ తీగలను మావోయిస్టులు ధ్వంసం చేశారు. తమ విముక్తి జోన్‌లోకి రాజ్యం జొరబడొద్దని ఈ చర్యలు చేపట్టారు. ఇది ప్రభుత్వానికి సవాల్‌గా, అవకాశంగా కూడా మారింది. దానితో ఒక దశలో పాలకులు సల్వాజుడుంను నెలకొల్పి, ఆదివాసీ తెగల మధ్య వైషమ్యాలు సృష్టించి బీభత్సకాండ కొనసాగించారు. వివిధ డెడ్‌లైన్లతో వివిధ ఆపరేషన్లు చేపట్టారు. మావోయిస్టు చర్యలను పెద్ద ఎత్తున ప్రచారం చేసి, వారి తరపున మాట్లాడే సమూహాలకు మాట్లాడలేని పరిస్థితిని కల్పించారు. ఆ తరువాత అధునాతన ఆయుధాలు, టెక్నాలజీతో జాయింట్ ఆపరేషన్లకు తెరలేపారు. అదే ఆపరేషన్ కగార్. అంటే అంతిమ యుద్ధం!

> నిర్బంధం ద్వారా విప్లవాలను దెబ్బతీయవచ్చేమో కానీ, ఆ వర్గ పోరాటం అనివార్యంగా జరగాల్సిందే. ప్రభుత్వ దమన నీతిపై పోరాటం చేస్తూనే, భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలను ఎంచుకోవడం విప్లవ శక్తుల కర్తవ్యం.

మారాల్సిన పంథా

మూడు దశాబ్దాలుగా అబూర్ఝమాడ్ మావోయిస్టు ఉద్యమానికి బలమైన స్థావరంగా నిలబడింది. ఆదివాసులు ఉద్యమాలలో, గెరిల్లా దళాలలో భాగమయ్యారు. 1969–70లలో వరంగల్, ఖమ్మం, గోదావరి జిల్లాలలో కమ్యూనిస్టు విప్లవకారులు పని చేసిన నాటి పరిస్థితి నేడు ఛత్తీస్‌గఢ్‌లో ఉంది. మావోయిస్టు పార్టీ అఫెన్సివ్ మిలిటరీ ఎత్తుగడల వలన సాయుధ శక్తిని సమకూర్చుకున్నది. ఆయుధాలు సేకరించడం, తయారు చేయడం, ప్రెషర్ బాంబులు, మందు పాతర్లతో పోలీసులు అడవికి రావాలంటేనే భయపడే రోజులు నడిచాయి. ఆదివాసులు తమ నిత్య జీవన సమరంలో మావోల హీరోయిక్ చైతన్యానికి ఆకర్షితులయ్యారు. కానీ ఒకవైపు పోలీసుల నిర్బంధం, మరోవైపు మావోయిస్టుల ప్రతి విధ్వంసాల మధ్య చాలామంది వలస పోయారు.

ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో వర్గ పోరాటం ఎవరి మీద చేయాలి? అక్కడ భూస్వాములు లేరు. అరాకొరా ధనిక రైతులు ఉన్నారు. మిగిలిన వారంతా పేద రైతులు, ఆదివాసీ జనాభా. కాబట్టి భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో వర్గ వైరుధ్యం తీవ్రమయ్యే పరిస్థితి లేదు. ప్రభుత్వ బలగాల మీద, యంత్రాంగం మీద, వారు కొమ్ముకాస్తున్న, ఖనిజాల కోసం కోరలు చాస్తున్న కార్పొరేట్ కంపెనీల మీదనే పోరాటం చేయాలి. ప్రజాస్వామిక స్పందనలు నామమాత్రంగా ఉన్న ఈ కాలంలో, ఒక చిన్న మారుమూల చోట, ఆదివాసీ కొండ ప్రాంతాల్లో జనతన సర్కార్ ఏర్పడటం, నిలవడం అసాధ్యమైన విషయం.

ఈ ప్రాంత ప్రజలు ఎన్నికలలో పాల్గొంటున్నారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. ప్రభుత్వ విద్యాలయాల కోసం, ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గెలవడం గమనార్హం. అలాంటప్పుడు ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వ విముక్తి ప్రాంతం సాధ్యమా? పాత అతివాదపు అఫెన్సివ్ ఎత్తుగడలతో కాకుండా, ప్రస్తుత స్థితికి తగిన విధంగా విధానాలను రూపొందించుకోవడం మావోయిస్టు ఉద్యమానికి అవసరం. యుద్ధం చేస్తున్నామనే భావనలో నుంచి మావోయిస్టు పార్టీ బయటపడి, తగిన ప్రజా ఉద్యమక్షేత్రాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.

అలాగే, నెత్తురుటేర్లతో విప్లవోద్యమాలను నిర్మూలించలేరు. ఆ భావజాలం మళ్ళీ మళ్ళీ పురుడు పోసుకుంటూనే ఉంటుంది. వ్యవస్థ మారేంత వరకు ఈ పోరాటపు నెగళ్ళు సమాజం నిండా అలుముకుంటూనే ఉంటాయి. వీటిని నిర్బంధం ద్వారా దెబ్బతీయవచ్చేమో కానీ, ఆ వర్గ పోరాటం అనివార్యంగా జరగాల్సిందే! ప్రభుత్వ దమన నీతిపై పోరాటం చేస్తూనే, భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలను ఎంచుకోవడం విప్లవశక్తుల కర్తవ్యం.

వ్యాసకర్త సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) కార్యదర్శి

ఎంత 'నిర్మల'మైన న్యాయం?!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

ఇంట్లో గోనె సంచుల్లో నోట్ల కట్టలు తగులబడిన జస్టిస్ యశ్వంత్ వర్మ కథ ఇంకా మరిచిపోక ముందే, దాని అడుగుజాడల్లోనే, థ్రిల్లర్ సినిమాను మైమరపింపజేసే మరొక న్యాయమూర్తి రసవత్తరమైన కథ గురించి చెప్పుకోవలసి వస్తున్నది. 'తీగలాగితే డొంక కదిలింది' అనే సామెతను అక్షరాలా నిజం చేసే వాస్తవ కథనం ఇది.

సినిమా కథలు తిరిగినన్ని మలుపులు, అనూహ్య సంఘటనలు, తారుమారు పరిణామాలు ఎన్నో ఉన్న ఈ అవినీతి కథ ఒక తారుమారు తమాషాతో మొదలయింది. పంజాబ్–హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ 2008 జూలై 10న పదవి స్వీకరించారు. తర్వాత నెల రోజులకు, 2008 ఆగస్ట్ 13న ఆమె ఇంటికి ఒక వ్యక్తి వచ్చి 'నిర్మల్ జీకి ఇమ్మని ఢిల్లీ నుంచి ఈ పార్సెల్ వచ్చింది' అని ఒక ప్లాస్టిక్ కవర్ ఇచ్చాడు. అమ్రిక్ సింగ్ అనే వాచ్‌మన్ ఆ పార్సెల్ లోపలికి తీసుకొచ్చి న్యాయమూర్తి ముందు విప్పితే, అందులో నుంచి అక్షరాలా పదిహేను లక్షల రూపాయలు బైటపడ్డాయి. ఆ పార్సెల్ తెచ్చిన ప్రకాష్ అనే వ్యక్తిని పోలీసులకు అప్పగించి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విషయం తెలియజేశారు.

పోలీసులు ప్రకాష్‌ను ప్రశ్నించగా, అతను పంజాబ్ హైకోర్టులో అడ్వకేట్ జనరల్‌గా ఉన్న సంజీవ్ బన్సాల్ దగ్గర గుమాస్తా అని తేలింది. పోలీసులు బన్సాల్‌ను ప్రశ్నించగా, అవి తన డబ్బులు కావని, ఢిల్లీకి చెందిన హోటల్ యజమాని రవీందర్ సింగ్ తనకు పంపి, జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు అందజేయమని చెప్పాడని, తన గుమాస్తాకు 'జస్టిస్ నిర్మల్ జీకి ఇవ్వు' అని పంపిస్తే, పొరపాటున జస్టిస్ నిర్మల్‌జిత్ జీకి ఇచ్చాడని చెప్పాడు. అంటే ఆ సొమ్ము వాస్తవంగా చేరవలసింది జస్టిస్ నిర్మల్ యాదవ్ అనే మరొక న్యాయమూర్తికన్నమాట. గుమాస్తా చేసిన చిన్న పొరపాటువల్ల, ఇద్దరు న్యాయమూర్తుల పేర్లలో నిర్మల్ ఉండడం వల్ల ఈ అవినీతి బయటపడింది.

జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇచ్చిన ఫిర్యాదుతో, రెడ్ హ్యాండెడ్‌గా పదిహేను లక్షల రూపాయలు, అది పట్టుకొచ్చి ఇచ్చిన వారు, పంపించినవారు దొరికారు గనుక పోలీసు కేసు నమోదయింది. కాని, న్యాయమూర్తి, అడ్వకేట్ జనరల్‌లకు ఇందులో భాగం ఉంది గనుక పది రోజుల్లో ఈ కేసును పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేశారు. తర్వాత సీబీఐ చేసిన దర్యాప్తులో సంజీవ్ బన్సాల్, రాజీవ్ గుప్తా కలిసి హరియాణాలోని పంచ్ కులాలో కొన్న ఒక భూమి కేసులో, జస్టిస్ నిర్మల్ యాదవ్ వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, అందుకు ప్రతిఫలంగా ఈ లంచం పంపించారని తేలింది. అది మాత్రమే కాక, జస్టిస్ నిర్మల్ యాదవ్ విదేశీ ప్రయాణపు టికెట్లు, విదేశాలలో ఆమె వాడిన మొబైల్ ఫోన్ కార్డ్ కూడా సంజీవ్ బన్సాల్ కొనిపెట్టాడని సీబీఐ సాక్ష్యాధారాలు సేకరించింది. నిందితులకు, న్యాయమూర్తికి మధ్య జరిగిన సంభాషణల



ఫోన్ రికార్డులను కూడా సీబీఐ సేకరించింది. చివరికి అవినీతి నిరోధక చట్టం కింద, భారత శిక్షా స్మృతి కింద జస్టిస్ నిర్మల్ యాదవ్ మీద, మిగిలిన నిందితుల మీద కేసు పెట్టవచ్చునని సీబీఐ నిర్ధారించింది.

ఇక్కడిదాకా సాఫీగా సాగిన కథ తర్వాత ఎన్నో ఉత్కంఠ భరితమైన మలుపులు తిరిగింది. న్యాయమూర్తి మీద ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇమ్మని కోరుతూ సీబీఐ స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఆ నివేదికకు జవాబిస్తూ సీబీఐ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ నిందితుల మీద కేసు నడపడానికి తగిన ఆధారాలు లేవని అన్నారు. కాని ఆ సమయంలో సీబీఐకి డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తి ఇది తప్పకుండా ప్రాసిక్యూట్ చేయవలసిన అవినీతి నేరమే అన్నారు. సీబీఐ ఉన్నతాధికారులిద్దరు ఇలా భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, మూడో అభిప్రాయం కోసం అప్పటి అటార్నీ జనరల్‌కు పంపారు. అదే ప్రతిని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్‌కు కూడా పంపారు. అటార్నీ జనరల్ కూడా ఈ కేసులో పస లేదు అన్నారు.

ఈ వ్యవహారం బయటకు పొక్కి, 'హైకోర్టు న్యాయమూర్తి మీద కేసు నడపడానికి తిరస్కరించిన సీబీఐ' అని హిందుస్థాన్ టైమ్స్ 2009 జూన్ 6న ఒక వార్త రాసింది. అది చూసిన అప్పటి న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ, ఇంత తీవ్రమైన వ్యవహారంలో కేసు నడపకపోవడం తప్పు అనీ, అలా చేస్తే న్యాయ వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందనీ తీవ్ర పదజాలంతో న్యాయశాఖ కార్యదర్శికి నోట్ పెట్టి, దర్యాప్తు చేసి నివేదిక ఇమ్మన్నారు. అప్పుడు సీబీఐ మళ్లీ కొత్తగా వచ్చిన అటార్నీ జనరల్ సలహా కోసం వెళ్లింది. కొత్త అటార్నీ జనరల్ కూడా కేసు అవసరం లేదు అంటూ పాత అటార్నీ జనరల్ అభిప్రాయాన్నే ప్రకటించారు.

దానితో తర్వాత సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో కేసును ఉపసంహరించుకుంటున్నానని (క్లోజర్ రిపోర్ట్) సీబీఐ తెలిపింది. ఇక్కడ కథ మరొక మలుపు తిరిగి, సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, కేసు నడపవలసిందే అన్నారు. అప్పుడు సీబీఐ మరొకసారి అనుమతి కోసం దరఖాస్తు... పైకి పంపించింది. దాన్ని పరిశీలించిన న్యాయశాఖ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించగా, రాష్ట్రపతి 2011 మార్చ్‌లో అనుమతి ఇచ్చారు. అంటే రెడ్ హ్యాండెడ్‌గా అవినీతి పట్టుబడినా కేసు ప్రారంభించడానికే మూడు సంవత్సరాలు పట్టిందన్న మాట.

అప్పుడు సీబీఐ చార్జిషీట్ వేసింది. అప్పటికే ఈ కేసు నడపడానికి వీలులేదని ఎన్నో పిటిషన్లు దాఖలు చేసిన జస్టిస్ నిర్మల్ యాదవ్ ఇప్పుడు ఈ అనుమతి చెల్లదని హైకోర్టుకు వెళ్ళారు. హైకోర్టు అనుమతి చెల్లుతుందని తేల్చి చెప్పింది. ఆ తీర్పును నిర్మల్ యాదవ్ సుప్రీం కోర్టులో సవాలు చేయగా, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురయింది. కేసును తాత్సారం చేయడానికి ఆమె వేసిన మరెన్నో పిటిషన్లు కూడా గడిచిన తర్వాత, చివరికి 2013 మేలో నెల లోపు దర్యాప్తు, చార్జెస్ ఫ్రేమ్ ప్రక్రియలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అలా అవినీతి సొమ్ము దొరికిన ఐదు సంవత్సరాల తర్వాత సీబీఐ ప్రత్యేక కోర్టులో కేసు మొదలయింది. ఏడున్నర సంవత్సరాల తర్వాత చార్జెస్ ఫ్రేమ్ అయి విచారణ మొదలయింది.

ఈలోగా జస్టిస్ నిర్మల్ యాదవ్ పదవీ విరమణ జరిగింది. సంజీవ్ బన్సాల్ మరణించాడు. డబ్బు పట్టుకొచ్చిన గుమాస్తా మరణించాడు. నలుగురు కీలక సాక్షులు అడ్డం తిరిగారు. న్యాయస్థానం దాదాపు 70 మంది సాక్షులను విచారించింది. ఇలా ఎన్నెన్నో అవరోధాలు దాటి, ఘటన జరిగిన 17 సంవత్సరాల తర్వాత, కేసు మొదలైన 14 సంవత్సరాల తర్వాత... ఎట్టకేలకు సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అల్కా మాలిక్ సరిపోయినన్ని సాక్ష్యాధారాలు లేవని, సాక్షుల వాఙ్మూలాల్లో వైరుధ్యాలున్నాయని కేసు కొట్టేశారు. ఎంత నిర్మలమైన న్యాయం!!


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అనుభవం

ఆధ్యాత్మిక జీవితంలో నిత్య సత్యం (దేవుని గూర్చి కావలసినది) అనుభవమే కాని... వాద వివాదాలు, ఊహాపోహలు కావు. మన ప్రకృతి శాశ్వతమైనదని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. ఈ విషయాలు సత్యమని మనం నమ్మినప్పటికీ, వానిని గూర్చి తెలుసుకొన్నప్పటికీ వాటిని వ్యక్తిగత అనుభవంలోకి తెచ్చుకోవడం లేదు.

ముఖ్యంగా భగవంతుని దర్శించుట ఒక అనుభవమే. ఇంద్రియాలచే కాని లేక ప్రమాణంచే కాని (ప్రత్యక్షానుమానాదులతో) దేవుని గ్రహించలేం. వాస్తవంగా ఆలోచించి చూస్తే ఒక వ్యక్తి అనుభవమే చిట్టచివరి నిరూపణం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఇచట 'అనుభవం' అనేది మనం మామూలుగా వాడుకలో వాడే 'అనుభవము' అనే పదానికి భిన్నమైనది. ఇది బాహ్య వస్తువులతో (విషయములతో) కలుగు సుఖ–దుఃఖాలను బయటకు గోచరింపజేసెడి అనుభవం కాదు. ఇది కేవలం కర్తకు ఆత్మస్థాయిలో కలిగే అనుభవం. ఒక విషయాన్ని తెలుసుకోవడానికి ఒకవైపు కర్త, రెండవ వైపు కర్మ ఉండాలి కాని ఆత్మానుభవానికి చివర అనేది లేదు. ఇది శాశ్వతమైనది.

ఒక పాత్రలో ఒక కర్పూరం బిళ్ళను ఉంచితే అది కొంత కాలానికి దాని ఆనవాలు లేకుండా అదృశ్యమవుతుంది. బొగ్గును నిప్పులలో వేస్తే దాని పూర్వ రూపాన్ని పూర్తిగా కోల్పోతుంది.

అదే విధంగా మనస్సును భగవంతునిపై లగ్నం చేసి ప్రార్థన చేస్తే, మన 'అహం' నెమ్మదిగా తొలగి తప్పని సరిగా దాని రూపు మాసిపోతుంది. ఫలితంగా మనం ఈ జన్మలోనే మోక్షాన్ని పొందగలం.

అంత స్వల్ప సమయంలో యువతినెలా నమ్మించాడు?

- విదేశీ మహిళపై అత్యాచార ఘటనలో ఆరా తీస్తున్న పోలీసులు
- నిందితుడు అరెస్ట్



పహాడీషరీఫ్: సంచలనం సృష్టించిన విదేశీ యువతిపై అత్యాచార ఘటనలో రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన పాతబస్తీ యాకుత్‌పురాకు చెందిన నిందితుడు మహ్మద్ అస్లాంను మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. కేవలం గంట రెండుగంటల వ్యవధిలోనే నిందితుడు యువతితో పాటు ఆమె స్నేహితుడిని అంతగా ఎలా నమ్మించాడనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో దుబాయ్‌లో డ్రైవర్‌గా పనిచేసిన నిందితుడికి ఆంగ్లంపై పట్టుండటంతో చలాకీగా మాట్లాడి ఆకర్షించాడా.. వేరే కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకున్న నిందితుడు.. గతంలో కూడా ఇదే తరహా ఏవైనా నేరాలకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పవిత్రమైన రంజాన్ పర్వదినం రోజున అస్లాం ఇలాంటి ఘటనకు పాల్పడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, విజిటింగ్ వీసాపై జర్మనీ నుంచి వచ్చిన యువతిపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి పోలీసులు భారత్‌లోని జర్మన్ కాన్సులేట్‌కు నివేదికను పంపనున్నారు. ఇదిలా ఉండగా, మీర్‌పేట మిథులానగర్‌లోని స్నేహితుడి ఇంట్లో ఉంటున్న ఆ యువతి గురువారం అర్ధరాత్రి తిరిగి స్వదేశానికి వెళ్లనుంది.

మావోయిస్టు రేణుకకు కన్నీటి వీడ్కోలు



రేణుక మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేవరుప్పుల: దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో హతమైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుక అలియాస్ భానుకు బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక స్థూపంవద్ద రేణుక మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ప్రజాసంఘాలు, వామపక్షభావజాల పార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించి, స్థానిక వాగులో దహన సంస్కారాలు నిర్వహించారు. నాలుగున్నర గంటలపాటు జరిగిన అంతిమయాత్రలో ఏపీసీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్, విరసం నేత పాణి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, మాజీ నక్సల్ గాదె ఇన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాయుధులను పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట కేంద్రం రాజ్యహింసకు పాల్పడుతోందని విమర్శించారు.

బీఆర్‌ఎస్ నేతల నిలదీత

రేణుక అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వీరిద్దరిని అక్కడికి వచ్చిన పలు సంఘాల నేతలు ఈ ఎన్‌కౌంటర్‌ల పట్ల బీఆర్‌ఎస్ వైఖరి తెలపాలని నిలదీశారు.

మీ-సేవ కేంద్రాలకు దరఖాస్తుల వెల్లువ

- ఆదాయ, కులధ్రువీకరణ కోసం 13.45 లక్షల మంది యువత దరఖాస్తులు
- రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులు ఆదాయ, కులధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. దీంతో వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4,500 మీ-సేవ కేంద్రాలకు ఆదాయ, కులధ్రువీకరణ పత్రాల కోసం రికార్డు స్థాయిలో 13.45 లక్షల దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలోనూ రికార్డు సృష్టించినట్లు అధికారవర్గాలు చెప్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీతో కలుపుకుని రూ.3 లక్షల ఆర్థికసాయం అందించే రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గత నెల 25న శ్రీకారం చుట్టింది. ఈ పథకంపై ఆసక్తి కలిగిన యువత దరఖాస్తు చేసుకునేందుకు తొలుత ఈనెల 5వ తేదీని తుది గడువుగా పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా 14వ తేదీ వరకు పొడిగించింది. అయితే దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు 30 వరకు పెంపు

ఫీజు చెల్లింపులకు 25 శాతం రాయితీ పొడిగింపు • ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ

పాత గడువులోగా ఓపెన్‌స్పేస్ చార్జీలు చెల్లించని వారికి అందులో రాయితీ వర్తించదని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) గడువును ప్రభుత్వం పొడిగించింది. ఎల్‌ఆర్‌ఎస్-2020లో దరఖాస్తు చేసుకున్న వారు ఫీజు చెల్లించే గడువును ఈ నెల 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2020 ఆగస్టు 31 నాటికి ఉన్న అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వివిధ కారణాల వల్ల దరఖాస్తుదారులకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఆలస్యం కావడంతో ఆ పథకం వెనక్కి వెళ్లింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందులో కొన్ని నిబంధనలను చేర్చింది. దీనిప్రకారం 2025 మార్చి 31లోగా క్రమబద్ధీకరణ చార్జీలు, ఓపెన్‌స్పేస్ చార్జీలు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభించేలా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పథకం గడువు ముగిసిన నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులకు 25 శాతం రాయితీ గడువును ఈ నెల 30 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో మార్చి 31లోగా ఓపెన్‌స్పేస్ చార్జీలు చెల్లించని వారికి మాత్రం ఓపెన్‌స్పేస్ చార్జీల్లో ఎలాంటి రాయితీలు ఉండదని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద మార్చి 31 వరకు 4.43 లక్షల మంది దరఖాస్తుదారులు సుమారు రూ. 1,400 కోట్ల మేర ఫీజులు చెల్లించారు. ఈ నెలాఖరు వరకు పథకాన్ని పొడిగించిన నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా మరో రూ. 1,500 కోట్లు సమకూర్చుకోవాలని పురపాలక శాఖ భావిస్తోంది.

భరోసా.. మెల్లమెల్లగా!

దశలవారీగా 57 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 5,057 కోట్లు జమ

మరో 13 లక్షల మందికి రూ.4 వేల కోట్లమేర పెండింగ్

2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడంతో మిగతా వారికి జమపై సందేహాలు

ఏ పద్దు కింద పెట్టుబడి సాయం అందిస్తారనే విషయంలో లేని స్పష్టత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకం నిధుల కొరత కారణంగా క్రమక్రమంగా అమలవుతోంది. ఎకరాకు రూ. 6 వేలు చెల్లించే కార్యక్రమాన్ని జనవరి 26న లాంఛనంగా ప్రారంభించిన ప్రభుత్వం.. రైతుల భూమి విస్తీర్ణాన్ని బట్టి వారి ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమచేస్తోంది. జనవరి 27న అన్ని మండలాల్లోని 577 గ్రామాల్లోని సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసాను జమ చేసిన ప్రభుత్వం.. ఆ తరువాత మూడు విడతల్లో కలిపి 3 ఎకరాల్లోపు భూములున్న 44.82 లక్షల మంది రైతులకు చెందిన 58.13 లక్షల ఎకరాలకు రూ. 3,487.82 కోట్లను జమ చేసింది. మార్చి నెలాఖరు నుంచి ఇప్పటివరకు మరో రూ.1,500 కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ఖజానా పరిస్థితి, నిధుల లభ్యతను పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ. 5,057 కోట్లను జమ చేసినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ లెక్కన 84.28 లక్షల ఎకరాలకు ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమచేసినట్లు తెలుస్తోంది. సుమారు 57 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

మిగతా వారికి ఎలా?

ప్రభుత్వం ఇంకా సుమారు మరో 13 లక్షల మంది రైతులకు దాదాపు రూ. 4 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఖజానా నుంచి 2-3 రోజులకోసారి రూ. 100 కోట్లకుపైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు పడ్డాయనే కచ్చితమైన సమాచారం అధికారుల వద్ద కూడా లేకపోవడం గమనార్హం. అయితే గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు కింద వచ్చిన నిధుల లెక్కలను బట్టి దాదాపు 5 ఎకరాల విస్తీర్ణం వరకు గల భూములకు రైతుభరోసా డబ్బులు జమ అయినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో మిగతా వారికి ఏ సంవత్సరం పద్దు కింద పెట్టుబడి సాయం అందజేస్తారనే విషయంలో స్పష్టత లేదు.

యాసంగి కోతలు మొదలైనా తప్పని నిరీక్షణ

రాష్ట్రంలో యాసంగి కోతలు మొదలయ్యాయి. నల్లగొండ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన 44 కొనుగోలు కేంద్రాల ద్వారా 183 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మార్చి నెలాఖరు వరకే కొనుగోలు చేశారు. బుధవారం నుంచి కొనుగోలు కేంద్రాల సంఖ్యను కూడా పెంచుతున్నారు. ఒకవైపు యాసంగి కోతలు మొదలై పంట చేతికి వస్తున్నప్పటికీ ఇంకా రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి కోతలు పూర్తయితే జూన్ నుంచి వానాకాలం పంటసాగు మొదలవనుంది. ఇప్పటికే మరో రూ. 4 వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా వచ్చే వానాకాలం సాగుకు ఆర్థికసాయం సకాలంలో అందే అవకాశాలు కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొర్రీలతో చాలా మంది రైతులకు ఆగిన సాయం

రైతుభరోసా కింద సాగుయోగ్యమైన భూములన్నింటికీ పెట్టుబడి సాయం అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వివిధ కారణాలతో చాలా గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్‌ఎస్‌ఆర్)లో ఉన్న భూవిస్తీర్ణంకన్నా రైతుల పాస్ పుస్తకాల్లో ఎక్కువుంటే ఆ సర్వే నంబర్‌లోని రైతులకు డబ్బులు పడలేదు. దీనిపై ఫిర్యాదులతో సమస్య పరిష్కారం అయినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ చాలా జిల్లాల్లో ఆ సమస్య పెండింగ్‌లోనే ఉంది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు అధిక మొత్తంలో పొందేందుకు కొందరు రైతులు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి భూవిస్తీర్ణాన్ని పెంచడమే అందుకు కారణమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అలాగే వ్యవసాయ భూముల్లో సొంత ఇళ్లు ఉన్నవారికి కూడా ఆయా సర్వే నంబర్లలోని భూములను రైతుభరోసాకు మినహాయించారు. స్కూళ్లు, కళాశాలలు, రైస్ మిల్లులు, కోళ్ల ఫారాల వంటి వాణిజ్య కార్యకలాపాలు ఉన్న భూముల సర్వే నంబర్లలో వ్యవసాయం చేసే రైతులకు కూడా చాలాచోట్ల రైతుభరోసా జమకాలేదు. కొన్ని గ్రామాల్లో ఒకే సర్వే నంబర్‌లో ఉన్న ఒక రైతుకు రైతుభరోసా సాయం అందితే పక్కనున్న మరో రైతుకు డబ్బు జమకాలేదు. అలాగే భూ లావాదేవీల్లో కొత్తగా భూమి పట్టా అయి పాస్‌పుస్తకం వచ్చిన వారికి కూడా చాలా చోట్ల డబ్బులు జమకాలేదు. ఇలాంటి సమస్యలు ఎందుకొచ్చాయో తెలియట్లేదని అధికారులు చెబుతుండటం గమనార్హం.

శాంతి చర్చలకు మేం సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

పర్యావరణ కార్యకర్తలను ఆ పార్టీ కోరింది. మీడియా కూడా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో తాజాగా విడుదల చేసిన లేఖ బుధవారం వెలుగులోకి వచ్చింది.

అమానవీయంగా చంపేస్తున్నారు..: ఆపరేషన్ కగార్ పేరుతో 2024 నుంచి విప్లవ ప్రభావిత రాష్ట్రాల్లో కేంద్రం నరసంహారం కొనసాగిస్తోందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. సాధారణ ఆదివాసీ ప్రజానీకం, దళసభ్యులు, కమాండర్లు, అగ్రనేతల వరకు 400 మందికి పైగా కగార్ కారణంగా ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్డన్ – కిల్ (చుట్టుముట్టి చంపేయడం) ఆపరేషన్లలో పట్టుబడిన తమ పార్టీ నేతలు, సభ్యులు, సానుభూతిపరులను అమానవీయంగా చిత్రహింసలకు గురిచేసి చంపేస్తున్నారని, మహిళా కామ్రేడ్లపై అత్యాచారాలకు పాల్పడి ప్రాణాలు తీస్తున్నారని ప్రకటించింది. అందుకే ఈ యుద్ధాన్ని జినోసైడ్ (నరసంహారం)గా పేర్కొంటున్నట్లు వెల్లడించింది.

రాజ్యాంగ విరుద్ధం..: విప్లవోద్యమ ప్రాంతాలను కల్లోలిత ప్రదేశాలుగా ప్రకటించకుండానే అంతర్గత భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ విరుద్ధమని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేర్కొంది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కమాండో బలగాల ముసుగులో కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించిందని ఆరోపించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆదివాసీ యువతను సాయుధ బలగాల్లో చేర్చుకుని వారితోనే ఆదివాసీలను హత్య చేయిస్తున్నారని తెలిపింది. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా.. ఆదివాసీ, పేదల రక్తపు పునాదులపై వికసిత్ భారత్ ఏర్పాటు జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది.

కాల్పుల విరమణ.. షరతులు: శాంతిచర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోలు.. ఇదే సమయంలో కొన్ని షరతులు విధించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో అమలవుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని, విప్లవ ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కొత్త క్యాంపులు ఏర్పాటు చేయొద్దని ఆ పార్టీ సూచించింది. తమ షరతులకు ఒప్పుకుంటే తక్షణమే కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించింది. ప్రజా ప్రయోజనాల కోసమే తాము శాంతి చర్చలకు ముందుకొచ్చామని పేర్కొంది.

రౌండ్ టేబుల్ తర్వాత..: శాంతి చర్చల కమిటీ మార్చి 24న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఇందులో 'మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి, సీపీఐ (మావోయిస్టు) భేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించాలి' అని కోరింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని మావోయిస్టు పార్టీ స్వాగతిస్తూ.. 'శాంతి చర్చలు – కాల్పుల విరమణ – షరతులు' అని పేర్కొంటూ మార్చి 28న జారీ చేసిన లేఖ బుధవారం వెలుగులోకి వచ్చింది.

కోలుకున్న 'ఎంఎంటీఎస్' బాధితురాలు

ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

సికింద్రాబాద్: సికింద్రాబాద్–మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులో లైంగిక దాడి యత్నం ఘటన నుంచి బైటపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు పూర్తిగా కోలుకుంది. దీంతో ఆమెను ఈ నెల 1న సాయంత్రం డిశ్చార్జి చేయించి కడప జిల్లాలోని తన సొంత ఊరికి పంపించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మార్చి 22న రాత్రి ఎంఎంటీఎస్ రైలులో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న బాధితురాలిపై ఓ దుండగుడు దాడిచేయటంతో, తప్పించుకునే ప్రయత్నంలో ఆమె నడుస్తున్న రైలు నుంచి కిందకుదూకిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం తొలుత గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాధితురాలి ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ, దంతాలకు శస్త్ర చికిత్సలు చేయించారు. పది రోజులపాటు చికిత్స పొందిన బాధితురాలు పూర్తిగా కోలుకున్నట్లు డాక్టర్లు ధ్రువీకరించటంతో సొంత ఊరికి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

రెండోసారి గంట సేపు విచారణ!

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు హాజరైన శ్రవణ్‌రావు

- టీవీలో పెట్టుబడుల అంశంపై ప్రశ్నలు
- దుబాయ్‌లోని ఫ్లాట్ వ్యవహారాలపైనా ఆరా
- ఈ నెల 8న మరోసారి రావాలని నోటీసు



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌కుమార్‌రావు బుధవారం రెండోసారి సిట్ ఎదుట హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు వచ్చిన ఆయనను అధికారులు దాదాపు గంటపాటు ప్రశ్నించారు. శనివారం మొదటిసారి సిట్ ముందు హాజరైనప్పుడు అధికారులు, శ్రవణ్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించారు. బుధవారం సైతం సుదీర్ఘంగానే విచారించాలని భావించారు. అయితే హెచ్‌సీయూ పరిణామాల నేపథ్యంలో పోలీసులు బిజీ అయ్యారు. దీంతో కేవలం గంట మాత్రమే ప్రశ్నించి పంపిస్తూ.. ఈ నెల 8న మరోసారి విచారణకు రావాలని నోటీసు జారీ చేశారు. శ్రవణ్‌రావు గతంలో ఓ టీవీ చానల్‌ను నిర్వహించారు. ఆ చానల్‌ను ఎందుకు తీసుకున్నారు? దానికి పెట్టుబడులు ఎవరు పెట్టారు? అనే కోణంలో అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. మరోపక్క దుబాయ్‌లో సొంత ఫ్లాట్ ఉన్న శ్రవణ్, ఇటీవల రెండు నెలల పాటు అక్కడ ఉన్నారు. ఆ సమయంలో ఆయనతో పాటు మరో ఐదుగురు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ఫ్లాట్ ఎప్పుడు? ఎలా? ఖరీదు చేశారనే అంశంతో పాటు ఆ ఐదుగురు ఎవరని పోలీసులు అడిగారు. కాగా, పోలీసులు అడిగిన ఏ ప్రశ్నకు కూడా శ్రవణ్‌రావు నుంచి సరైన సమాధానం రాలేదని తెలుస్తోంది. శనివారం విచారణ సందర్భంగా శ్రవణ్‌రావు తాను 2023 ఎన్నికల సమయంలో ఓ సర్వే చేశానని. దాని వివరాలను ప్రభాకర్‌రావుతో పంచుకున్నానని చెప్పారు. ఆయనతో పాటు ఆయన ద్వారా పరిచయమైన ప్రణీత్‌తో తప్ప మరే ఇతర అధికారి, నాటి ప్రభుత్వ పెద్దలతో తనకు సంబంధం లేదంటూ శ్రవణ్‌రావు వాదిస్తున్నారు. అయితే ఆ సర్వే ఎవరి సూచనల మేరకు చేశారు? అందుకు సంబంధించిన నగదు ఎవరు చెల్లించారు? అనే అంశంపై పోలీసులు ప్రశ్నించినా.. శ్రవణ్ నుంచి సామాధానం రాలేదని తెలుస్తోంది. 2023 ఎన్నికల సమయంలో శ్రవణ్ 2 ఫోన్లు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వాటిని తీసుకువచ్చి అప్పగించాలని శనివారమే స్పష్టం చేశారు. అయితే బుధవారం ఆయన ఓ పాత సెల్‌ఫోన్ తీసుకువచ్చి ఇచ్చారు. అది చూసి షాక్‌కు గురైన పోలీసులు గతంలో వాడినవి కావాలని స్పష్టం చేశారు. ఆ రెండు సెల్‌ఫోన్లను ఎనిమిదో తేదీన విచారణకు వచ్చే సమయంలో తీసుకురావాలని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లను మార్చే ప్రయత్నం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్యాప్తు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలంటూ శ్రవణ్‌రావును సుప్రీంకోర్టు ఆదేశించిందని, అయితే ఆయన నుంచి సరైన సహకారం లభించడం లేదని పోలీసులు చెపుతున్నారు.

'గుట్ట'లోకి వెళ్లడాన్ని గుర్తించి అత్యాచారం

- ఊర్కొండపేట ఘటన వివరాలను వెల్లడించిన ఎస్పీ

కల్వకుర్తిటౌన్: బాధితురాలి కదలికలను గుర్తించే నిందితులు అత్యాచారానికి పాల్పడ్డారని నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో జరిగిన ఆ ఘటన వివరాలను బుధవారం కల్వకుర్తిలోని డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వెల్లడించారు. జడ్చర్లకు చెందిన ఓ వివాహిత తన తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి మార్చి 29న (శనివారం) మధ్యాహ్నం ఊర్కొండపేటకు వచ్చి దైవదర్శనం చేసుకొని రాత్రి అక్కడే బస చేశారు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో మరో బంధువు అక్కడకు రాగా.. ఆయనతో మాట్లాడుతూ 150 మీటర్ల దూరంలో ఆలయానికి ముందు భాగంలో ఉన్న గుట్ట ప్రాంతంలోకి వెళ్లడాన్ని నిందితులు గమనించారు. ఈ క్రమంలో నిందితులు అక్కడకు వెళ్లి బాధితులను బెదిరించి, ఆ వ్యక్తిని చెట్టుకు కట్టేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల్లో మార్పాకుల ఆంజనేయులు, సిద్ధిఖ్ బాబా, వాగుల్దాస్ మణికంఠ, కార్తీక్ మొదట అత్యాచారం చేశారు. ఆ తర్వాత ఈ నలుగురు.. మట్ట మహేష్‌గౌడ్, హరీశ్‌గౌడ్, మట్ట ఆంజనేయులును ఘటనా ప్రాంతానికి పిలిపించగా, మద్యం తాగి వారు సైతం అత్యాచారం చేశారు. బాధిత మహిళ తాగడానికి నీరు అడగ్గా, కార్తీక్ బాటిల్‌లో మూత్రం పోసి ఇచ్చాడని ఎస్పీ పేర్కొన్నారు. నిందితులంతా 28 ఏళ్లలోపు వారేనని, మహిళపై రాత్రి 12 గంటల వరకు అత్యాచారం చేశారని, ఈ విషయాన్ని బయటకు చెబితే మీరు కలిసి ఉన్న ఫొటోలను పబ్లిక్ చేస్తామని హరీశ్‌గౌడ్ బెదిరించారని చెప్పారు. మార్చి 30న (ఆదివారం) తెల్లవారుజామున బాధితురాలు తన బంధువుతో కలిసి వెళ్తుండగా విషయాన్ని బయటకు చెప్పకుండా వారిని బెదిరించి ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మహేశ్‌గౌడ్ వారి వద్ద రూ.6 వేలు డిమాండ్ చేసి వసూలు చేశాడు. బాధితురాలు తన ఊరికి వెళ్లి, తిరిగి సోమవారం ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అత్యాచార ఘటనలో నిందితులను కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచామని, జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. అత్యాచార ఘటనలో బాధితురాలి నుంచి నిందితులు బంగారం, నగదు తీసుకున్నారని చెప్పినా.. అందుకు సంబంధించిన రికవరీని పోలీసులు చూపించలేదు. ఈ సమావేశంలో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐలు మాధవరెడ్డి, కృష్ణదేవ, కురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

హాస్టల్ భవనంపై నుంచి దూకడంతో తీవ్ర గాయాలు



విద్యార్థి కిందపడిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి వద్ద గురుకుల హాస్టల్ విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసిన అనంతరం విద్యార్థులందరూ నిద్రించేందుకు గదిలోకి చేరుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో హాస్టల్ వార్డెన్ గదుల పరిశీలన చేస్తున్న సమయంలో విద్యార్థి లేకపోవడం గమనించి చుట్టుపక్కల వెతికారు. పాఠశాల వెనక భాగంలో గాయాలతో కిందపడి ఉండటాన్ని గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. శ్రావణ్‌కు స్థానికంగా చికిత్స చేయించి, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెప్పారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కాగా, హాస్టల్‌పై నుంచి విద్యార్థి దూకిన ఘటన గురించి కలెక్టర్ విజయేందిర బోయి ఆరా తీశారు. పూర్తి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా జోనల్ అధికారి రాణి, జిల్లా వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు సందర్శించారు. విద్యార్థికి ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని, ఆత్మహత్యాయత్నానికి కుటుంబ సమస్యలు కారణం కావొచ్చని ప్రిన్సిపాల్ అధికారులకు వివరించారు.

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

న్యూఢిల్లీ: మోదీ సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వక్ఫ్ (సవరణ) బిల్లు–2025ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధ రాత్రి 12 గంటల దాకా వాడీవేడీగా చర్చ కొనసాగింది. ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీయడానికి మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందని విపక్షాలు మండిపడ్డాయి. బిల్లును అంగీకరించబోనంటూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సభలోనే బిల్లు ప్రతిని చించేశారు. అధికార ఎన్డీయే కూటమి ఎంపీలు బిల్లును సమర్థించారు. విపక్షాలవి ఓటు బ్యాంకు రాజకీయాలని ధ్వజమెత్తారు. వక్ఫ్ సవరణ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఎగువ సభలో చర్చకు 8 గంటల సమయం కేటాయించారు. అనంతరం బిల్లుపై ఓటింగ్ జరగనుంది. రాజ్యసభలోనూ అధికార ఎన్డీయేకు తగిన మెజార్టీ ఉండడంతో బిల్లు సులువుగా ఆమోదం పొందడం ఖాయంగా కనిపిస్తోంది.



యూపీఏ పాపమే: రిజిజు



వక్ఫ్ (సవరణ) బిల్లు–2025ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దానిపై సుదీర్ఘ చర్చ జరిగింది. బిల్లుకు అనుకూలంగా బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ, వ్యతిరేకంగా కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటముల మధ్య సంవాదం సభను వేడెక్కించింది. ముస్లింల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎన్డీఏ పక్షాలు పేర్కొనగా, బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమంటూ విపక్షాలు తీవ్రంగా ఆక్షేపించాయి. వక్ఫ్ బిల్లు పేరును ఉమ్మీద్ (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్–యూఎంఈఈడీ)గా మారుస్తున్నట్టు రిజిజు ప్రకటించారు. అనంతరం చర్చను ప్రారంభించారు. వక్ఫ్ బిల్లుకు తాము ప్రతిపాదిస్తున్న సవరణలే లేకపోతే పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తే అంటారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తుల్లో భాగమేనని ఆలిండియా ముస్లిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ గతంలో వ్యాఖ్యలు చేశారు. వాటినుద్దేశించే మంత్రి ఇలా మాట్లాడినట్టు చెబుతున్నారు. ఈ బిల్లు కేవలం వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయమే తప్ప ముస్లింల మత విశ్వాసాల్లో ఎలాంటి జోక్యమూ చేసుకోబోదని ఆయన స్పష్టం చేశారు. ''వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘం వేసి అత్యంత సుదీర్ఘంగా చర్చలు, సంప్రదింపులు జరిపాం. జేపీసీ సూచించిన పలు సవరణలకు అంగీకరించాం. అయినా విపక్షాలు అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించజూస్తున్నాయి. వక్ఫ్ చట్టానికి యూపీఏ హయాంలో చేసిన మార్పుల వల్ల దానికి విపరీతమైన అధికారాలు దఖలు పడ్డాయి. వక్ఫ్ చట్టాన్ని ఇతర చట్టాలకు అతీతంగా మార్చేశాయి. అందుకే ఈ సవరణలు తప్పనిసరయ్యాయి'' అని రిజిజు అన్నారు. ఏ మత సంస్థల వ్యవహారాల్లోనూ తమ ప్రభుత్వం వేలుపెట్టబోవడం లేదని చెప్పారు. ''ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో వక్ఫ్ ఆస్తులున్నది భారత్‌లోనే. వాటిని పేద ముస్లింల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. అలా జరిగేలా చూడటమే బిల్లు లక్ష్యం. దీనికి మద్దతిస్తున్నదెవరో, వ్యతిరేకిస్తున్నదెవరో దేశం ఎన్నటికీ గుర్తుంచుకుంటుంది'' అని చెప్పారు. కాంగ్రెస్ తరఫున గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ రిజిజు వాదనను తీవ్రంగా ఖండించారు. బిల్లును రాజ్యాంగ మౌలిక స్వరూపంపైనే దాడిగా అభివర్ణించారు. రిజిజు చర్చకు బదులిచ్చారు. మైనారిటీలకు భారత్‌ను మించిన సురక్షితమైన దేశం ప్రపంచంలోనే లేదన్నారు. అత్యల్ప సంఖ్యాకులైన పార్సీలు కూడా సగర్వంగా నివసిస్తున్నట్టు చెప్పారు.

అంతా అంగీకరించాల్సిందే: అమిత్ షా

వక్ఫ్ బిల్లు విషయమై దేశంలో అయోమయం సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ముస్లింలను భయపెట్టడం ద్వారా వారిని ఓటుబ్యాంకుగా మార్చుకున్నాయంటూ దుయ్యబట్టారు. ఈ బిల్లు ముస్లింల మత సంబంధిత అంశాల్లో వేలు పెడుతుందన్న ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. ''ఈ సవరణలను మైనారిటీలు ఒప్పుకోరని కొందరంటున్నారు. భారత ప్రభుత్వం, పార్లమెంటు చేస్తున్న చట్టమిది. దీన్ని ప్రతి ఒక్కరూ అంగీకరించి తీరాల్సిందే'' అని కుండబద్దలు కొట్టారు. ''2014 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు వక్ఫ్ చట్టానికి హడావుడిగా రాత్రికి రాత్రి అడ్డగోలు సవరణలు చేసింది. తద్వారా దాన్ని చట్టాలకు అతీతంగా మార్చింది. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాలకు ఇది పరాకాష్ట. లేదంటే ఈ సవరణ బిల్లు అవసరముండేదే కాదు'' అని అమిత్ షా అన్నారు. ''యూపీఏ నిర్ణయం వల్ల ఢిల్లీలోని ల్యూటెన్స్ జోన్‌లో ఏకంగా 123 ఆస్తులు కేవలం 25 రోజుల వ్యవధిలో వక్ఫ్ ఆస్తులుగా మారిపోయాయి. ఇలాంటి దారుణమైన అవకతవకలను సరిదిద్దడం, వక్ఫ్ భూములు, ఆస్తుల నిర్వహణ పూర్తిగా ప్రజాస్వామికంగా, పారదర్శకంగా జరిగేలా చూడటమే తాజా బిల్లు ఉద్దేశం. అంతేతప్ప ఓటుబ్యాంకు కోసం చట్టాలు చేయడం మోదీ సర్కారుకు అలవాటు లేదు'' ని స్పష్టం చేశారు. పౌరుల వ్యక్తిగత, ప్రభుత్వ ఆస్తులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షించి తీరతామని చెప్పారు. ''కేవలం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించినంత మాత్రాన ఎవరి భూమీ వక్ఫ్ భూమిగా మారకుండా తగిన రక్షణలను ఈ బిల్లు కల్పిస్తుంది'' అని వివరించారు. అనంతరం బీజేపీతో పాటు విపక్షాల నుంచి పలువురు సభ్యులు బిల్లుపై అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా మాట్లాడారు. అనంతరం ఓటింగ్ ద్వారా బిల్లు ఆమోదం పొందింది. తర్వాత దానికి విపక్షాలు పలు సవరణలు ప్రతిపాదించగా అవన్నీ ఒక్కొక్కటిగా వీగిపోయాయి.

చర్చకు రాహుల్ గైర్హాజరు

సోదరి, వయనాడ్ ఎంపీ ప్రియాంక కూడా



కీలకమైన వక్ఫ్ (సవరణ) బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చకు, ఓటింగ్‌కు విపక్ష నేత రాహుల్‌గాంధీ గైర్హాజరయ్యారు. ఆయన సోదరి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ కూడా బుధవారం సభకు హాజరు కాలేదు. బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహంపై ఉదయం సభలో ఆయన పార్టీ ఎంపీలతో చర్చించారు. దాంతో బిల్లుపై కాంగ్రెస్ తరఫున చర్చకు రాహులే సారథ్యం వహిస్తారని భావించారు. కానీ చర్చలో పాల్గొనరాదని రాహుల్ నిర్ణయించుకున్నారు. పార్లమెంటు ప్రాంగణం నుంచి నిష్క్రమించారు. ప్రియాంక కూడా చర్చలో పాల్గొనకపోవడం విశేషం. కాంగ్రెస్‌కు కేటాయించిన గంటా 40 నిమిషాల సమయంలో గౌరవ్ గొగోయ్ తదితర పార్టీలే ఎంపీలే మాట్లాడారు.

బీజేపీ నయా మత రాజకీయం

లౌకిక ఇమేజ్ కు పెద్ద దెబ్బ: అఖిలేశ్



వక్ఫ్ బిల్లు ప్రపంచ దేశాలకు తప్పుడు సంకేతాలు పంపుతుందని, భారత లౌకిక ఇమేజ్ కు పెద్ద దెబ్బ అని సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. బీజేపీ నయా మత రాజకీయం అని ధ్వజమెత్తారు. లోక్ సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బల నేపథ్యంలో.. ఓట్ల పోలరైజేషన్ కు, తమకు దూరమైన కొన్ని వర్గాలను దగ్గర చేసుకునేందుకు కాషాయ పార్టీ ఈ ఎత్తుగడ వేసిందన్నారు. అధికార కూటమిలోకి కొన్ని పార్టీలు వక్ఫ్ బిల్లుకు మద్దతిస్తున్నప్పటికీ వాటికీ మనస్ఫూర్తిగా ఇష్టం లేదని తెలిపారు.

బిల్లుపై ఎవరి వాదనేమిటి?

- వక్ఫ్ ఆస్తులు కాజేసే కుట్ర
- పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం
- విపక్షాలు, ముస్లిం సంఘాలు
- మెరుగైన నిర్వహణ కోసమే: కేంద్రం

వక్ఫ్. కొద్ది రోజులుగా దేశమంతటా చర్చనీయంగా మారిన అంశం. ఇస్లాం సంప్రదాయంలో ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానం లేదా విరాళాన్ని వక్ఫ్ అంటారు. వక్ఫ్ ఆస్తులన్నీ అల్లాకు చెందుతాయని భావిస్తారు. కనుక వాటి అమ్మకం, ఇతర ప్రయోజనాలకు వాడకం పూర్తిగా నిషిద్ధం. మసీదులు, మదర్సాలు, శ్మశానవాటికలు, అనాథాశ్రమాల నిర్మాణ నిర్వహణ తదితరాల నిమిత్తం ఉపయోగించాలి. భారత్‌లో వక్ఫ్ సంప్రదాయం 12వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానుల హయాంలో మొదలైంది. స్వాతంత్య్రానంతరం 1954లో కేంద్ర వక్ఫ్ చట్టం వచ్చింది. దాని స్థానంలో 1995లో తెచ్చిన కొత్త చట్టం ద్వారా వక్ఫ్ బోర్డులకు మరిన్ని అధికారాలు దఖలు పడ్డాయి. వాటిని అపరిమితంగా పెంచుతూ యూపీఏ ప్రభుత్వం 2013లో మరిన్ని సవరణలు చేసింది. దేశవ్యాప్తంగా 8.7 లక్షలకు పైగా వక్ఫ్ ఆస్తులున్నాయి! వీటన్నింటికీ కలిపి 9.4 లక్షల ఎకరాలున్నాయి! ఆ లెక్కన వక్ఫ్ బోర్డులు దేశంలో మూడో అతి పెద్ద భూ యజమానులుగా అవతరించాయి. వాటి భూముల మొత్తం విలువ కనీసం రూ.1.2 లక్షల కోట్ల పై చిలుకేనని అంచనా. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డులున్నాయి. వాటిలో అవినీతి తీవ్ర సమస్యేనని ముస్లిం సంఘాలు కూడా అంగీకరిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 60 వేలకు పైగా వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. 13 వేలకు పైగా ఆస్తులు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. ఇక 4.35 లక్షల ఆస్తుల గురించి సమాచారమే లేదు! వక్ఫ్ భూములను రక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని అన్యాక్రాంతం చేస్తోందని సచార్ కమిటీ ఆక్షేపించింది కూడా. అయితే తీవ్ర వాద వివాదాల నడుమ వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల ఏర్పాటుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నది విపక్షాల ఆరోపణ. దీన్ని వక్ఫ్ భూములను ముస్లింల నుంచి లాక్కునేందుకు మోదీ సర్కారు కుట్రగా మజ్లిస్ వంటి పార్టీలు అభివర్ణిస్తున్నాయి. ఇందులోని పలు ప్రతిపాదనలు 14, 26, 26, 29 తదితర ఆర్టికల్స్‌కు పూర్తిగా విరుద్ధమని వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ రగడపై ఇండియాటుడే న్యూస్ చానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ బుధవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా, వ్యతిరేకంగా పలు పార్టీల నేతలు తదితరులు, నిపుణులు వాదనలు విన్పించారు. వక్ఫ్ ఆస్తులు అంతిమంగా పేద ముస్లింల అభ్యున్నతికి దోహదపడాలన్నదే తాజా బిల్లు ఉద్దేశమని ప్రభుత్వం చెబుతుండగా అందులోని ప్రతిపాదనలను అంశాలవారీగా విపక్షాలు దుయ్యబట్టాయి.

వక్ఫ్ బిల్లులోని ముఖ్యాంశాలు...

1. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉంటారు. వక్ఫ్ కౌన్సిల్‌తో పాటు రాష్ట్ర బోర్డుల్లో ఇద్దరు ముస్లిమేతరులకు స్థానం కల్పించాలి.
2. వక్ఫ్ బోర్డులో కనీసం ఇద్దరు మహిళలుండటం కూడా తప్పనిసరి
3. వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను 90 రోజుల్లోగా హైకోర్టులో సవాలు చేయవచ్చు.
4. వక్ఫ్ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారి కూడా ఉండాలి.
5. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుదా, కాదా అన్న వివాదం తలెత్తితే దానిపై ప్రభుత్వం నియమించే ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమం.
6. నూతన వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిన ఆర్నెల్లలోపు ప్రతి వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ డేటాబేస్‌లో విధిగా నమోదు చేయించాలి
7. ఇప్పటిదాకా ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డులకు విరాళాలు, దానాలు ఇవ్వవచ్చు. ఇకపై కనీసం ఐదేళ్లుగా ఇస్లాంను అనుసరిస్తున్న వాళ్లు మాత్రమే వక్ఫ్ బోర్డులకు దానాలివ్వడానికి అర్హులు.

బిల్లుపై అభ్యంతరాలివీ...

- వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు, షియా, బోహ్రా, ఆగాఖానీ, ఓబీసీ వర్గాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడం తమ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం.
- ఇది మత సంస్థలైన వక్ఫ్ బోర్డులను లౌకికీకరించే ప్రయత్నమే. ధార్మిక, సేవా కార్యక్రమాలకు సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, నిర్వహించుకోవడం ఆర్టికల్ 26 ద్వారా రాజ్యాంగం కల్పించిన మతపరమైన హక్కును ఇది కాలరాస్తోంది.
- ఇతర మతాలకు చెందిన బోర్డులకు కూడా ఇదే ప్రాతిపదికను వర్తింపజేసి వాటిలో ముస్లింలను నియమిస్తారా?
- వక్ఫ్ బోర్డుల పనితీరును పారదర్శకంగా, మరింత సమర్థంగా మార్చేందుకే బిల్లు తెచ్చామని చెబుతున్నా, అందుకు ఏం చేస్తారో బిల్లులో ఎక్కడా ప్రస్తావన కూడా లేదు.
- ప్రతి వక్ఫ్ ఆస్తినీ ఆర్నెల్లలోపు సెంట్రల్ డేటాబేస్‌లో విధిగా నమోదు చేయని పక్షంలో వాటికి సంబంధించిన వివాదాల్లో కోర్టులను ఆశ్రయించే వీలుండదనడం దారుణం. అత్యధిక వక్ఫ్ ఆస్తులు దశాబ్దాల తరబడి వారి అనుభవంలో ఉన్నాయి. అలాంటి వాటిని ఆర్నెల్లలోగా నమోదు చేసుకోవడమెలా సాధ్యం?
- పేద ముస్లింలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధే మోదీ సర్కారుకు ఉంటే ప్రస్తుత వక్ఫ్ చట్టాన్ని మరింత మెరుగుపరచాల్సింది. తద్వారా ఫెసిలిటేటర్‌గా వ్యవహరించాల్సింది పోయి వక్ఫ్ ఆస్తులపై హక్కులను లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది.
- చిరకాలంగా మత, సేవాపరమైన కార్యక్రమాలకు వాడే ఆస్తిని సరైన డాక్యుమెంట్లు లేకున్నా వక్ఫ్ ఆస్తిగానే పరిగణించే 'వక్ఫ్ బై యూజర్' నిబంధన రద్దు ప్రతిపాదన కూడా సరికాదు.
- ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా, ప్రభుత్వానికా అన్న వివాదం తలెత్తితే దానిపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమమన్న ప్రతిపాదనా వివక్షాపూరితమే. ఎందుకంటే ఆ తీర్పు ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుంది.
- వక్ఫ్ భూముల వివాదాలపై వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు ఇప్పుడు అంతిమం కాదు. కోర్టుల్లో సవాలు చేయవచ్చు. అయినా పనిగట్టుకుని ఆ మేరకు కొత్తగా ప్రతిపాదన చేయడం వెనక దురుద్దేశాలు దాగున్నాయి.
- వక్ఫ్ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఉండాలనడం కూడా వాటిపై పెత్తనం చెలాయించే ప్రయత్నమే.

ప్రభుత్వ వాదన

- వక్ఫ్ బోర్డుల్లో అవినీతిని రూపుమాపి వాటి ఆస్తుల వినియోగంలో పూర్తి పారదర్శకత తీసుకురావడం.
- ఆగాఖానీలు, బోరాలు, పస్మాందా ముస్లింలు, ముస్లిం మహిళలకు కూడా వక్ఫ్ ఆస్తుల్లో సముచిత భాగస్వామ్యం కల్పించాం.
- వక్ఫ్ ఆస్తుల నమోదును తప్పనిసరి చేయడం వల్ల వాటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చు.
- వక్ఫ్ బోర్డుల్లో మహిళలకు కూడా విధిగా స్థానం కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యపడుతుంది.
- వక్ఫ్ ఆస్తులను డిజిటైజ్ చేయడం ద్వారా ఆర్థిక అవకవతకలను అడ్డుకట్ట పడుతుంది.
- ముస్లిం దేశాల్లో కూడా వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణే ఉంటుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ముస్లింలపై ఎందుకింత ద్వేషం?

- వక్ఫ్ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం
- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ధ్వజం
- తాను సూచించిన 10 సవరణలు అంగీకరించాలని వినతి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ఈ బిల్లును తాను అంగీకరించబోనంటూ లోక్‌సభలో బిల్లు ప్రతిని ఆయన చించేశారు. దేశంలో మసీదు, ఆలయం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. ఆయన బుధవారం లోక్‌సభలో బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడారు. కేంద్రం పచ్చి అబద్ధాలు చెబుతోందని, ఈ బిల్లుతో ముస్లింలకు ఎలాంటి న్యాయం జరుగుతుందని తేల్చిచెప్పారు. రాత్రికి రాత్రి వక్ఫ్ భూములను ఆక్రమించుకున్న వారంతా వక్ఫ్(సవరణ) బిల్లుతో యజమానులుగా మారిపోతారని ఓవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేం తమాషా? అని ప్రశ్నించారు. ముస్లింలపై ఎందుకింత ద్వేషం? అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. వక్ఫ్ బోర్డు అనేది పూర్తిగా ధార్మిక సంస్థ అని స్పష్టంచేశారు. వక్ఫ్ బిల్లు విషయంలో తాను సూచించిన 10 సవరణలు అంగీకరించాలని కోరారు.



ప్రాచీన మందిరాలకే న్యాయం జరుగుతుంది

''ఆర్టికల్ 14 ప్రకారం హిందూ, సిక్కు, జైన, బౌద్ధ ధర్మాలకు చెందిన వారికి సంబంధిత ఎండోమెంట్‌లోని ప్రోత్సాహకాలు వారికే దక్కాలి. పాలనా యంత్రాంగం మొత్తం వారి ఆధీనంలోనే ఉంటుంది. వారి పాలనా యంత్రాంగంలో వేరే ధర్మానికి చెందిన వారికి అవకాశం ఉండదు. వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాలను నూతన వక్ఫ్ బిల్లు ద్వారా తొలగించారు. ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డు పాలనా యంత్రాంగంలో భాగం అవుతారు. ఇది ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమే అవుతుంది. ఆర్టికల్ 25, ఆర్టికల్ 26ను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత వక్ఫ్ ఆస్తులు(అనధికార ఆక్రమణదారుల తొలగింపు) బిల్లు–2014ను ప్రవేశపెట్టి 2024లో ఎందుకు ఉపసంహరించుకున్నారు? అనధికార ఆక్రమణలు జరుగుతున్నాయని భావించినప్పుడు ఆ బిల్లును ఎందుకు వెనక్కి తీసుకున్నారో చెప్పాలి. నూతన చట్టం ప్రకారం.. వివాదాస్పద భూముల్లో మసీదులు ఉన్నచోట ఇది ప్రభుత్వ భూమి అని అధికారి నిర్ణయించి ఒక నోటీసు అతికిస్తే అక్కడ మసీదు మూతబడి అది ప్రభుత్వ భూమిగా మారిపోతుంది. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశంలోని ప్రాచీన మందిరాలకు న్యాయం జరుగుతుంది తప్ప ప్రాచీన మసీదులకు కాదు. ప్రస్తుతం ఢిల్లీలో 172 వక్ఫ్ ఆస్తులు దేశ పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నాయి. వాటికి సంబంధించిన పత్రాలు లేని కారణంగా ఇప్పుడు అవి ఇక ప్రభుత్వ భూములుగా మారిపోతాయి'' అని అసదుద్దీన్ ఓవైసీ ఆందోళన వ్యక్తంచేశారు.

హద్దు మీరిన పాక్ సైన్యం బుద్ధి చెప్పిన భారత జవాన్లు

ఎల్ఓసీ వద్ద కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన పాక్

జమ్మూ: పాకిస్తాన్ సైన్యం మరోసారి హద్దు మీరింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ భారత భూభాగంపై కాల్పులు జరిపింది. అప్రమత్తమైన భారత సైన్యం గట్టిగా బదులివ్వడంతో పాక్ సైన్యం తోకముడిచింది. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వద్ద ఈ ఘటన జరిగినట్లు భారత సైనిక అధికార ప్రతినిధి బుధవారం వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ఎల్ఓసీ వద్ద కృష్ణా ఘాటీ సెక్టార్‌లో తొలుత మందుపాతర పేలుడు సంభవించిందని, ఆ తర్వాత పాక్ భూభాగం నుంచి ఎలాంటి హెచ్చరికలు లేకుండానే కాల్పులు మొదలయ్యాయని అన్నారు. అక్కడే విధుల్లో ఉన్న భారత సైన్యం వెంటనే అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపిందని తెలిపారు. భారత సైన్యం నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావడంతో చేసేది లేక పాక్ సైన్యం వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ఓసీ వద్ద పరిస్థితి నియంత్రణలోనే ఉందని స్పష్టంచేశారు. ఎల్ఓసీ వెంట భారత సైన్యం పట్టు కొనసాగుతోందని తెలియజేశారు. అయితే, ఈ కాల్పుల ఘటనలో పాక్ సైన్యానికి ఏమైనా ప్రాణనష్టం వాటిల్లిందా? అనేది బయటపెట్టలేదు. ఐదుగురు పాక్ జవాన్లు గాయపడినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి.

మృత్యువుతో 108 గంటల పోరాటం

- మయన్మార్‌లో శిథిలాల నుంచి ప్రాణాలతో బయటపడిన నాయింగ్ లిన్ టున్
- 9 గంటలపాటు భారీ ఆపరేషన్ చేపట్టిన సహాయక సిబ్బంది

బ్యాంకాక్: భారీ భూకంపం మయన్మార్‌ను అతలాకుతలం చేసింది. వేలాది మంది మరణించారు. మృతుల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది. వందలాదిగా భారీ భవనాలు, వంతెనలు, రహదారులు ధ్వంసమయ్యాయి. ఎటుచూసినా విధ్వంసమే కనిపిస్తోంది. శిథిలాల నుంచి తవ్వినకొద్దీ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. అదృష్టవశాత్తూ కొందరు ప్రాణాలతో మిగిలి ఉంటున్నారు. హోటల్‌లో కార్మికుడిగా పని చేస్తున్న 26 ఏళ్ల నాయింగ్ లిన్ టున్ అదృష్టం కూడా బాగున్నట్లుంది. 108 గంటలపాటు మృత్యువుతో పోరాడి ఎట్టకేలకు ప్రాణాలతో బయటకు వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున రెస్క్యూ సిబ్బంది అతడిని కాపాడారు. ఇందుకోసం చాలా శ్రమించాల్సి వచ్చింది. నాయింగ్ లిన్ టున్ మయన్మార్ రాజధాని నేపడాలోని క్యాపిటల్ సిటీ హోటల్‌లో పని చేస్తున్నాడు. గత శుక్రవారం సంభవించిన భూకంపం ధాటికి ఈ హోటల్ కుప్పకూలింది. శిథిలాలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఇక్కడ గత ఐదు రోజులుగా జరుగుతున్న సహాయక చర్యల్లో కేవలం మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి.



నాయింగ్ లిన్ టున్ ఆసుపత్రికి తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది

శిథిలాల కింద ఎవరైనా బతికి ఉండొచ్చన్న అంచనాతో ఎండోస్కోపిక్ కెమెరాతో గాలించారు. శిథిలాల కింద చిక్కుకున్న నాయింగ్ లిన్ టున్ ప్రాణాలతో ఉన్నట్లు గుర్తించారు. యంత్రాల సాయంతో కాంక్రీట్ దిమ్మెలకు భారీ రంధ్రం చేసి అతడిని జాగ్రత్తగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఆపరేషన్ పూర్తికావడానికి 9 గంటలకు పైగా సమయం పట్టింది. ఆహారం, నీరు లేక పూర్తిగా నీరసించిపోయినప్పటికీ స్పృహలోనే ఉన్న నాయింగ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు ప్రకటించారు.

3,000 దాటిన మృతుల సంఖ్య

ఇదిలా ఉండగా, మయన్మార్ భూకంపంలో మృతుల సంఖ్య 3,000కు చేరుకున్నట్లు స్థానిక మీడియా ప్రకటించింది. మరో 4,639 మంది గాయపడ్డారని తెలియజేసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. మరో వైపు బ్యాంకాక్‌లో భూకంపం మృతుల సంఖ్య 22కు చేరుకుంది. 34 మంది క్షతగాత్రులయ్యారు. బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న భారీ భవనం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఇక్కడ బుధవారం మరో మృతదేహాన్ని వెలికితీశారు. భూకంపం వల్ల తీవ్రంగా నష్టపోయిన మయన్మార్‌కు మానవతా సాయం అందించేందుకు ప్రపంచ దేశాలు ముందుకొస్తున్నాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇప్పటికే 1.25 మిలియన్ డాలర్ల సాయం ప్రకటించగా, అదనంగా మరో 4.5 మిలియన్ డాలర్లు అందజేస్తామని బుధవారం ప్రకటించారు. సహాయక చర్యల కోసం భారత ప్రభుత్వం 200 మందిని పంపించింది. చైనా 270 మందిని, రష్యా 212 మందిని, యూఏఈ 122 మందిని పంపించాయి. మయన్మార్‌లో ఎంత నష్టం వాటిల్లిందనేది ఇంకా నిర్ధారించలేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, సెల్‌ఫోన్ సేవలను ఇంకా పునరుద్ధరించలేదు. రోడ్లు చాలావరకు దెబ్బతినడంతో సహాయక బృందాలు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. మాండలే నగరానికి 65 కిలోమీటర్ల దూరంలోని సింగు టౌన్‌షిప్‌లో ఓ బంగారు గని భూకంపం వల్ల కుప్పకూలడంతో అందులో ఉన్న 27 మంది కార్మికులు మృత్యువాత పడినట్లు తాజాగా వెల్లడయ్యింది.

అమెరికాపై సుంకాలు ఎత్తేసిన ఇజ్రాయెల్

జెరూసలేం: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికలు పని చేస్తున్నాయి. అమెరికా దిగుమతులపై అన్ని సుంకాలను ఇజ్రాయెల్ ఎత్తేసింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం ఈ మేరకు ప్రకటించారు. ''అమెరికా వస్తువులపై కస్టమ్స్ సుంకాలను రద్దు చేయడమంటే మార్కెట్‌ను ఒక దశాబ్దం పాటు పోటీకి తెరవడం. ఆర్థిక వ్యవస్థకు వైవిధ్యాన్ని పరిచయం చేయడం. జీవన వ్యయాన్ని తగ్గించడానికి మా ప్రభుత్వం ఎంచుకున్న విధానాల్లో ఇది అదనపు దశ. మార్కెట్‌కు, ఇజ్రాయెల్ పౌరులకు ప్రయోజనం చేకూర్చేది. ఇజ్రాయెల్, అమెరికాల సంబంధాలను ఈ చర్య మరింత బలోపేతం చేస్తుంది'' అని 'ఎక్స్'లో నెతన్యాహు ప్రకటించారు.

40 ఏళ్ల స్వేచ్ఛా వాణిజ్యం

ఇజ్రాయెల్, అమెరికా మధ్య 40 ఏళ్లుగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో ఉంది. 99 శాతం అమెరికా దిగుమతులను ఇజ్రాయెల్ ఇప్పటికే సుంకాల నుంచి మినహాయించింది. ఈ నేపథ్యంలో తాజా చర్యను ఆర్థిక చర్యగా కంటే దౌత్య, రాజకీయ చర్యగా భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా వ్యవసాయోత్పత్తులపై ఇజ్రాయెల్ ఏటా 42 మిలియన్ షెకెల్స్ (సుమారు 1.15 కోట్ల డాలర్ల) సుంకాలు వసూలు చేస్తోంది. ఇజ్రాయెల్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ డేటా ప్రకారం 2024లో ఆ దేశంమొత్తం ఎగుమతుల విలువ 172 కోట్ల డాలర్లు. అమెరికా నుంచి దిగుమతుల విలువ 92 కోట్ల డాలర్లు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



సిటీలో దొడ్డు బియ్యమే!
జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. -8లో



నాన్న.. నువ్వు మా ప్రాణం!
రోడ్డు ప్రమాదాలపై కూతురితో అవగాహన కల్పిస్తే తండ్రిలో మార్పు వస్తుందనే ఆలోచనతో 'సర్వేజన ఫౌండేషన్'.. 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్' పేరుతో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0/23.0
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

జలమండలికి 'వరల్డ్ వాటర్' అవార్డు



జలమండలి ఎండీకి అవార్డు అందజేత

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024–2025 సంవత్సరానికి గాను 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డులకు ప్రభుత్వ కేటగిరీలో జలమండలి ఎస్టీపీని ఎంపిక చేసింది. రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కార్యాక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ అవార్డు అందుకున్నారు. బుధవారం ప్రధాన కార్యాలయంలో ఆయన ఈడీ చేతుల మీదుగా మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగునీరు అందించడంతో పాటు.. మురుగును శుద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. నాగోల్ ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థంగా మురుగునీటి శుద్ధి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు నాగోలు ఎస్టీపీ ఈ అవార్డుకు ఎంపికైందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ పాల్గొన్నారు.

కంచ గచ్చిబౌలి భూములపై డ్రోన్ ఎగరేసిన ముగ్గురి అరెస్ట్

గచ్చిబౌలి: టీజీఐఐసీ భూములపై డ్రోన్ ఎగరేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చదును చేస్తున్న కంచ గచ్చిబౌలి సర్వే నంబర్–25లోని 400 ఎకరాలపై మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో బంజాహిల్స్‌కు చెందిన అడ్వొకేట్ రోహన్ నాగిరెడ్డి, జూబ్లీహిల్స్‌కు చెందిన సాయి విజయ్‌రెడ్డి (29)లు డ్రోన్ ఎగరేశారని డీసీపీ చెప్పారు. రాత్రి 11.30 గంటల సమయంలో మణికొండకు చెందిన ఓ ఐటీ కంపెనీలో అనలిస్ట్‌గా పని చేసే అరుణ్ నాయర్ (33) సైతం డ్రోన్ ఎగరేశారని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్ ఎగరేసినందుకు.. టీజీఐఐసీ అధికారుల ఫిర్యాదు మేరకు సంబంధిత ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని డీసీపీ వివరించారు.

బాల్కనీ రెయిలింగ్ కూలి ముగ్గురికి గాయాలు

కాచిగూడ: గోల్నాక డివిజన్ సంజయ్‌గాంధీ నగర్ బస్తీలో బాల్కనీ రెయిలింగ్ కూలి ఓ వ్యక్తితో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. సంజయ్‌గాంధీ నగర్ బస్తీలోని క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఎం.సంజయ్ తన కూతురు క్షేత్రతో కలిసి ఇంట్లో నుంచి పాల ప్యాకెట్ తీసుకురావడానికి బయటికి వెళ్తుండగా బాల్కనీ రెయిలింగ్ ఒక్కసారిగా కూలింది. దీతో తండ్రీకూతుళ్లిద్దరూ కిందపడిపోవడంతో గాయపడ్డారు. రెయిలింగ్ శిథిలాలు పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడటంతో ఆరునెలల చిన్నారి పి.నిత్యాసింగ్ గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారు అప్పుడే ఇంటి బయటకు వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. కాగా.. ఘటన స్థలాన్ని హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి. సంధ్యారాణి, జీహెచ్ఎంసీ ఏసీపీ దేవేందర్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌లతో పాటు కాంగ్రెస్ నేతలు మీసాల శివకుమార్, హరితిలక్ సింగ్, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్ తదితరులు సందర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ డి.సంధ్యారాణి తెలిపారు.

మరో ముందడుగు..

మూసీ, ఈసా నదుల సుందరీకరణ
- ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- 100 మీటర్ల వరకు నిర్మాణాలకు అనుమతుల్లేవ్

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ మూసీ సుందరీకరణకు మరో ముందడుగు పడింది. పారిశ్రామిక, గృహ వ్యర్థాల కలుషితంతోనే మూసీ నది కలుషితమవుతోందని గుర్తించిన ప్రభుత్వం.. నివారణ చర్యలకు ఉపక్రమించింది. మూసీ, ఈసా నదుల మధ్య కలుషిత జలాలు నదిలో కలవకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంది. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా ఇచ్చే అనుమతులకు రాష్ట్ర ప్రభుత్వం ముకుతాడు వేసింది. ప్రత్యేకించి చెరువులు, నదీ పరిసర ప్రాంతాల నిర్మాణాలపై ఆంక్షలు విధించింది. మూసీ, ఈసా నదుల పరీవాహక ప్రాంతాలలో వంద మీటర్ల వరకు నిర్మాణాలకు ఆంక్షలు పెట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. మూసీ, ఈసా నదుల వెంట ఉన్న ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన, స్థిరమైన అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

సమగ్ర మాస్టర్ ప్లాన్..

మూసీ, ఈసా నదులు వాటి పరిసర ప్రాంతాల పునరుజ్జీవనం, సుందరీకరణ కోసం సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ), జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మూసీ, ఈసా నది ఒడ్డు, బఫర్ జోన్‌లో ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించిన ఈ కమిటీ.. ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ నదుల నుంచి ఔటర్ రింగ్ రోడ్‌లోని కొత్రెముల గ్రామం వరకు ఉన్న మూసీ, ఈసా నదులకు ఇరువైపులా పలు ఆంక్షలు విధించింది.



ఆంక్షలివీ..
- మూసీ, ఈసా నదులకు ఇరువైపులా 50 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు, అభివృద్ధి పనులకు అనుమతులు లేవు.
- మూసీ, ఈసా నదుల సరిహద్దుల నుంచి 50–100 మీటర్ల వరకు (బఫర్ 50 మీటర్లు కలిపి) అభివృద్ధి పనులకు పరిమితులున్నాయి. ఈ జోన్‌లో ఎలాంటి అభివృద్ధి పనులైనా సరే మూసీ, ఈసా నదులకోసం సమగ్ర మాస్టర్ ప్లాన్ ఖరారు చేసే వరకు ఈ ప్రాంతంలో కొత్త నిర్మాణాలు, భవనాలకు అనుమతులు ఇవ్వరు.
- నది సరిహద్దుల నుంచి 100 మీటర్ల లోపు చేపట్టే ఏదైనా పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, కొత్త రోడ్లు, బ్రిడ్జిలు మొదలైన వాటికి డీటీసీపీ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎంఆర్‌డీసీఎల్ అధికారుల కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి.

చాకలి ఐలమ్మ యాదిలో..



కోఠిలోని మహిళా వర్సిటీ దర్బారు హాల్‌లో బుధవారం రివల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ఆంగ్ల పద్య రూప చిత్రపటం ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలువురు విద్యార్థినులు ఇలా సెల్ఫీ తీసుకుని చాకలి ఐలమ్మను గుర్తు చేసుకున్నారు.

మురుగు.. కనుమరుగు



ఇక నిరంతరం డీసిల్టింగ్ ఆపరేషన్

180 రోజుల్లో 3,183 కి.మీ..
- 2.50 లక్షల మ్యాన్‌హోళ్లలో డీసిల్టింగ్
- కాలం చెల్లిన పైపులైన్ల గుర్తింపు
- 137 ప్రాంతాల్లో కొత్తవాటికి ప్రతిపాదనలు
- 30 శాతానికిపైగా తగ్గిన డ్రైనేజీ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులు
- సత్ఫలితాలిచ్చిన సీవరేజీ ఆపరేషన్



సాక్షి, సిటీబ్యూరో:

వంద శాతం మురుగు పొంగుడు రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిదేందుకు చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తుండటంతో.. డీసిల్టింగ్ ఆపరేషన్‌ను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని జలమండలి నిర్ణయించింది. బుధవారం నాటికి సీవరేజీ డీసిల్టింగ్ ఆపరేషన్‌కు 180 రోజులు పూర్తయాయి. నిజానికి నగరంలో నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల ఓవర్ ఫ్లో తీవ్ర సమస్యగా మారడంతో పూర్తి స్థాయిలో నివారించేందుకు సరిగా ఆరు నెలల క్రితం జలమండలి ప్రత్యేకంగా డ్రైనేజీ డీసిల్టింగ్ ఆపరేషన్‌కు దిగింది. రోజువారీగా సీవరేజీ సమస్యను ఎప్పటికప్పుడు తాత్కాలికంగా పరిష్కరించడం కంటే పూర్తి స్థాయిలో శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ప్రధాన, అంతర్గత రహదారులపై మురుగు పరుగుల కట్టడికి చర్యలు చేపట్టింది. సెక్షన్ల వారీగా సీవరేజీ జెట్టింగ్, ఎయిర్ టెక్, సిల్ట్ మిషన్లతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి ఫిర్యాదులతో సంబంధం లేకుండా పైపులైన్ల క్లీనింగ్ పనులు నిర్వహించింది. దీంతో సీవరేజీ ఓవర్‌ఫ్లోపై ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయి.

పైసా ఖర్చు లేకుండా..

స్పెషల్ డ్రైవ్‌లో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ చేయడంతో పైసా ఖర్చు లేకుండానే, పైపులైన్ల రీమోడలింగ్ జరగకుండానే పలు ప్రాంతాల్లో దీర్ఘకాలిక సీవరేజీ సమస్యలకు సైతం ఫుల్‌స్టాప్ పడింది. మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం పైపులైన్ల రీమోడలింగ్, కొత్త పైపులైన్ల అవసరాలను గుర్తించింది. మొత్తమ్మీద స్పెషల్ డ్రైవ్‌లో క్షేత్రస్థాయి నుంచి 137 ప్రాంతాల్లో సుమారు 18 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ల ప్రతిపాదనలు అందాయి. దీంతో కొత్త ప్రతిపాదనలపై మరోసారి పరిశీలన జరిపి మంజూరు చేసేందుకు సిద్ధమైంది. మొత్తమ్మీద మియాపూర్, పాతబస్తీ, నారాయణగూడ, కూకట్‌పల్లి డివిజన్ల నుంచి కిలో మీటర్ నుంచి ఆరు కిలో మీటర్ల వరకు ప్రతిపాదనలు రాగా, మిగతా డివిజన్ల నుంచి కిలో మీటర్ల లోపు ప్రతిపాదనలు వచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

జలమండలి పరిధిలో మొత్తం సీవరేజీ నెట్‌వర్క్ ఇలా..

ప్రాంతం	కి.మీ
కోర్ సిటీలో పైపులైన్లు	5,570
జీహెచ్ఎంసీ పరిధిలో	4,199
ట్రంక్ లైన్లు	612

జలమండలికి ఫిర్యాదులు ఇలా

నెల	2023	2024
అక్టోబర్	34,967	33,655
నవంబర్	38,179	29,992
డిసెంబర్	45,957	34,207
నెల	**2024**	**2025**
జనవరి	46,462	34,510
ఫిబ్రవరి	45,391	32,797
మార్చి	48,811	39,243

3,183 కి.మీ పైపులైన్ క్లీనింగ్..

సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 3,183 కిలో మీటర్ల సీవరేజీ పైపులైన్ మార్గంలో డీసిల్టింగ్ నిర్వహించారు. సుమారు 2,4117 ప్రాంతాల్లో దాదాపు 2.50 లక్షల మ్యాన్‌హోళ్ల ద్వారా పూడికతీత పనులు పూర్తయ్యాయి. వాటినుంచి టన్నుల కొద్దీ సిల్ట్ బయటపడింది. సీవరేజీ ఫిర్యాదులు కూడా 30 శాతానికి తగ్గాయి. ఈ కార్యాచరణ అమలుకు 227 ఎయిర్‌టెక్ మిషన్లు, 144 సిల్ట్ కార్ట్ మిషన్లు వినియోగించారు. ఏకంగా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్యాష్ బోర్డు క్షేత్ర స్థాయి డీసిల్టింగ్ ప్రక్రియను పర్యవేక్షించింది.

టార్గెట్ సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ..



సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌కు 180 రోజులు పూర్తయ్యాయి. డ్రైనేజీ ఆపరేషన్ సత్ఫలితాలిస్తోంది. ఎంసీసీకి 30 శాతం ఫిర్యాదు తగ్గాయి. పాత పైపులైన్ల స్థానంలో కొత్తవాటి అవసరాన్ని గుర్తించాం. వంద శాతం మురుగు రహిత నగరంగా లక్ష్యంగా ఇక రెగ్యులర్‌గా డీసిల్టింగ్ ఆపరేషన్ కొనసాగిస్తాం
– అశోక్ రెడ్డి, ఎండీ , జలమండలి

నిరాశాజనకం..

జీహెచ్ఎంసీలో తగ్గిన భవన నిర్మాణ అనుమతులు

- గత ఏడాది కంటే స్వల్ప తగ్గుదల
- ఆదాయం మాత్రం కొంత పెరిగింది
- నేటి నుంచి 'బిల్డ్ నౌ' ద్వారానే దరఖాస్తుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు కొంత తగ్గుముఖం పట్టాయి. గత ఆర్థిక సంవత్సరంలో 13,641 భవన నిర్మాణాలకు అనుమతులివ్వగా, తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024–25)లో అవి 13,421కి తగ్గాయి. అయినప్పటికీ ఆదాయం మాత్రం కొంత పెరిగింది. క్రితంసారి రూ.1107.29 కోట్ల ఆదాయం రాగా, ఈసారి రూ.1138.44 కోట్ల ఆదాయం సమకూరింది.

అనుమతులిలా..

కేటగిరీ	ఎన్ని
ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్	523
ఇన్‌స్టంట్ అప్రూవల్	8377
సింగిల్‌విండో	2422
గేటెడ్ కమ్యూనిటీ లే ఔట్లు	6
ఓపెన్ ప్లాట్ లే ఔట్లు	5
ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు	2088
మొత్తం	13,421

- వ్యక్తిగత నివాస భవనాలు 75 చదరపుగజాల్లోపు ఇళ్లకు ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్, పదిమీటర్ల లోపు ఎత్తు, 500 చదరపు గజాల్లోపు వాటికి ఇన్‌స్టంట్ అప్రూవల్ ఇస్తారు. అంతకు మించిన వాటికి సింగిల్‌విండో ద్వారా అనుమతులు జారీ చేస్తారు.


సింగిల్ విండో ద్వారా పెద్ద భవనాల అనుమతుల జారీ ఇలా..

ఏ రకం	ఎన్ని భవనాలు (2024–25)	క్రితం సారి (2023–24)
వాణిజ్య భవనాలు	112	140
ఇనిస్టిట్యూషనల్, ఆస్పత్రులు తదితరాలు	19	27
నివాస భవనాలు	2189	2282
మొత్తం	2320	2456

హై రైజ్ భవనాలు సైతం క్రితం కంటే తగ్గాయి. క్రితంసారి 130 హై రైజ్ భవనాలకు అనుమతులు జారీ కాగా.. ఈసారి 102 హై రైజ్ భవనాలకు మాత్రమే అనుమతులు జారీ అయ్యాయి. హై రైజ్ భవనాల్లో ఇనిస్టిట్యూషనల్ భవనాలు, ఆస్పత్రుల వంటివి మాత్రం గతం కంటే ఈసారి పెరిగాయి. గతంలో అలాంటివి కేవలం 12 మాత్రం ఉండగా, ఈసారి 46కు పెరిగాయి. దీంతో ఆదాయం పెరిగింది.

50 అంతస్తుల భవంతికి అనుమతి

తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కొండాపూర్‌లో జీ+49 అంతస్తులతో 50 అంతస్తుల నివాస భవనానికి అనుమతులు జారీచేశారు. 165.95 మీటర్ల ఎత్తుతో 8 టవర్లుగా ఈ నిర్మాణానికి అనుమతులు జారీ అయినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.



నేటి నుంచి 'బిల్డ్ నౌ'

జీహెచ్ఎంసీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల్ని మరింత సరళీకరించేందుకు అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత 'బిల్డ్ నౌ' పోర్టల్ ద్వారానే కొత్త దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్ తెలిపారు. భవన నిర్మాణాలకు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారంతా 'బిల్డ్ నౌ'లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇటీవలే దీన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించడం తెలిసిందే.

ఎయిర్‌క్వాలిటీ కోసం సమష్టి కృషి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ఎయిర్ క్వాలిటీ పెంచే చర్యల కోసం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.112.36 కోట్ల నిధులు అందనున్న నేపథ్యంలో వివిధ విభాగాలు సమన్వయంతో పని చేసి ఎయిర్ క్వాలిటీ పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కె. ఇలంబర్తి సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన సిటీ లెవల్ ఇంప్లిమెంటేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగింది. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ట్రాఫిక్, టీజీ పీసీబీ, టీజీఐఐసీ, టీజీఎస్ ఆర్టీసీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, హెచ్ఎంఆర్ఎల్, పౌరసరఫరాలు, రవాణా, తదితర విభాగాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ.. భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఎయిర్‌క్వాలిటీ మానిటరింగ్ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిందిగా పీసీబీకి సూచించారు. ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించేందుకు కార్ పూలింగ్‌ను ప్రోత్సహించే చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ తెలిపారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ.. 550 పీయూసీ వాహనాల్లో 478 వాహనాలను ఆన్‌లైన్ సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానించి పర్యావరణ అనుమతి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌లు రఘుప్రసాద్, సుభద్రాదేవి, చీఫ్ ఇంజినీర్లు భాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరావు, రత్నాకర్, సీసీపీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇలంబర్తి

పెన్షనర్లే టార్గెట్

- లండన్ కేంద్రంగా కథ నడిపిన ఘరానా ముఠా
- నిందితులు ముగ్గురూ హైదరాబాదీలే..

స్కాట్‌లాండ్ వృద్ధురాలిని నిండా ముంచారు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా సాగిన మరో అంతర్జాతీయ స్కామ్ వెలుగులోకి వచ్చింది. స్కాట్‌లాండ్‌లో ఉన్న పెన్షనర్లే టార్గెట్‌గా చేసుకుని ఇక్కడి కాల్ సెంటర్ పని చేస్తోంది. దీని ద్వారా ట్రాప్ అయిన అక్కడి ఓ వృద్ధురాలి నుంచి రెండు మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.22 కోట్లు) విలువైన బంగారం కాజేశారు. ఈ స్కామ్‌లో లండన్‌లో నివసిస్తున్న ముగ్గురు హైదరాబాద్ వాసులు కీలక పాత్రధారులుగా ఉన్నారు. గత ఏడాది జనవరిలో మొత్తం ఏడుగురిని లండన్ పోలీసులు అరెస్టు చేయగా... వీరిలో ముగ్గురు హైదరాబాదీలను దోషిగా నిర్ధారించిన అక్కడి న్యాయస్థానం గత వారం శిక్షలు ఖరారు చేసింది.

డార్క్ వెబ్ డేటాతో..

డార్క్ వెబ్‌లో దొరుకుతున్న డేటా ఆధారంగా ఈ తరహా స్కామ్స్ జరుగుతున్నాయి. ప్రధానంగా లండన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ఉన్న పెన్షనర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఓ కాల్ సెంటర్ కేంద్రంగా స్కాట్‌లాండ్‌లో ఉండే వృద్ధురాలిని (86) టార్గెట్ చేశారు. 2023 మేలో ఆమెకు కాల్ చేసిన మోసగాళ్లు మీ డబ్బు ఉన్న బ్యాంక్‌లో భారీ ఫ్రాడ్ జరిగిందని, అక్కడ డబ్బు ఉండటం ఏమాత్రం శ్రేయస్కరం కాదని నమ్మించారు. తక్షణం మీ డబ్బుతో బంగారం ఖరీదు చేయాలని, దాన్ని ప్యాక్ చేసి ఉంచితే... తమ ఏజెంట్లు తీసుకువెళ్లి సేఫ్ లాకర్లలో భద్ర పరుస్తారని చెప్పారు. ఈ మాటలు నమ్మిన వృద్ధురాలు దఫదఫాలుగా తన బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బుతో బంగారం ఖరీదు చేయడం మొదలెట్టారు.

లండన్ నుంచి వెళ్లి..


హైదరాబాద్‌లోని అన్వరుల్ ఉల్ ఉలూం కాలేజీ నుంచి బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్న సునీల్ తేయత్ ఈ స్కామ్‌లో కీలక పాత్రధారిగా ఉన్నాడు. హైదరాబాద్‌లో కాల్ సెంటర్ నిర్వహించే సూత్రధారి ఆదేశాల మేరకు పని చేశాడు. అక్కడి ఆక్స్‌ఫర్డ్ బిజినెస్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న హైదరాబాదీ ఉమర్ మహ్మద్, ఇతడి భార్య హాఫీజా సమ్రీన్‌లను తనతో చేర్చుకున్నాడు. సునీల్ ఆదేశాల మేరకు సమ్రీన్ నిర్దేశిత సమయాల్లో స్కాట్‌ల్యాండ్‌లోని వృద్ధురాలి వద్దకు వెళ్లి బంగారం తీసుకుని వచ్చేది. దీన్ని ఉమర్ ద్వారా అందుకునే సునీల్ విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ మొత్తంలో తమ కమీషన్లు పోను మిగిలింది క్రిప్టో కరెన్సీ రూపంలో హైదరాబాద్‌లో ఉన్న సూత్రధారికి పంపాడు. 2023 మే–అక్టోబర్ మధ్య ఈ గ్యాంగ్ స్కాట్‌ల్యాండ్ వృద్ధురాలి నుంచి రూ.22 కోట్ల విలువైన బంగారం కాజేశారు.

చిక్కిన ఏడుగురిలో ముగ్గురు దోషులుగా...

వృద్ధురాలి ఫిర్యాదు మేరకు 2024 జనవరిలో కేసు నమోదు చేసుకున్న స్కాట్‌ల్యాండ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సునీల్, ఉమర్, సమ్రీన్‌లతో పాటు వీరు రాకపోకలు సాగించడానికి సహకరించిన నలుగురినీ అరెస్టు చేశారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఈ ముఠా చాలా తెలివిగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఎక్కడా సొంత వాహనాలు వాడని వీళ్లు లండన్ నుంచి ట్యాక్సీలో స్కాట్‌లాండ్‌కు వచ్చి... అక్కడ సెల్ఫ్ డ్రైవింగ్ కారులో సమ్రీన్‌ను వృద్ధురాలి వద్దకు పంపేవారు. ఈ మొత్తం వ్యవహారంలో ఈ ముగ్గురు సహా ఏడుగురి పాత్రను నిర్ధారించిన లండన్ పోలీసులు గత ఏడాది జనవరిలో అరెస్టు చేశారు. వీరిపై అభియోగపత్రాలు దాఖలు చేయగా... సునీల్, ఉమర్, సమ్రీన్‌లను దోషులుగా తేలుస్తూ గత వారం తీర్పు ఇచ్చింది. సునీల్‌కు 63 నెలలు, ఉమర్‌కు 45 నెలలు, సమ్రీన్‌కు 30 నెలల శిక్ష విధించింది. హైదరాబాద్‌లో కాల్ సెంటర్ నిర్వహిస్తున్న సూత్రధారికి సంబంధించి వీళ్లు ఎలాంటి వివరాలు బయటపెట్టకపోవడంతో లండన్ పోలీసులు సాంకేతికంగా ఆరా తీస్తున్నారు.

తూనికలు, కొలతల శాఖలో దిద్దుబాటు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి, సిటీబ్యూరో: తూనికలు, కొలతల శాఖ పరిపాలన యంత్రాంగం దిద్దుబాటు పనిలో పడింది. ఏసీబీకి చిక్కి.. అనంతరం అనతి కాలంలో పోస్టింగ్‌లో చేరిన అధికారిణికి జిల్లా స్థాయి కీలక పోస్టుకు అదనపు బాధ్యతలు అప్పగించిన వ్యవహారంపై 'సాక్షి' దినపత్రికలో గత నెల 30న 'త్రాసు.. తిరకాసు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆ శాఖ రాష్ట్ర కంట్రోలర్ స్పందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ (ఏసీ) జగన్‌మోహన్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో సీనియర్లను కాదని జూనియర్ అయిన అధికారిణికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించడం తూనికలు, కొలతల శాఖలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై తీవ్రంగా స్పందించిన కంట్రోలర్ తక్షణమే సదరు అధికారిణిని అసిస్టెంట్ కంట్రోలర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఏసీగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వర్

తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ (ఏసీ)గా రాజేశ్వర్ బుధవారం తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం వరంగల్ రెగ్యులర్ ఏసీగా, హైదరాబాద్ హెడ్‌క్వార్టర్‌లో అసిస్టెంట్ కంట్రోలర్ (అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు బాధ్యతలు అప్పగించడంపైనా తూనికలు, కొలతల శాఖలో చర్చనీయాంశమైంది. వాస్తవానికి సింగిల్ బాధ్యతలున్న జిల్లా స్థాయి ఇన్‌స్పెక్టర్లు ఉన్నా.. వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

మొరాయించిన మెట్రో రైలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మెట్రో రైళ్లు మరోసారి స్తంభించాయి. ఎల్బీనగర్–మియాపూర్ మధ్య బుధవారం సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో నాంపల్లి వద్ద 15 నిమిషాల పాటు మెట్రో రైలు ఆగిపోయింది. ఈ క్రమంలో ఆ కారిడార్‌లో నడిచే మెట్రోల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒకవైపు వేసవి దృష్ట్యా అన్ని రూట్లలో రైళ్లు కిక్కిరిసి రాకపోకలు సాగిస్తుండగా అకస్మాత్తుగా తలెత్తిన సాంకేతిక సమస్యలు ప్రయాణికులకు చుక్కలు చూపాయి. మెట్రో సాంకేతిక నిపుణులు తగిన చర్యలు చేపట్టిన తరువాత రైళ్లు యథావిధిగా నడిచాయి. ప్రయాణికులకు అసౌకర్యం కలగడం పట్ల అధికారులు విచారం వ్యక్తం చేశారు.

విదేశీ కరెన్సీ ఆశ చూపి మోసం


కాగితాల బండిల్స్ చూపిస్తున్న బాధితుడు హైమద్

ఉప్పల్: విదేశీ కరెన్సీ ఆశ చూపి రూ.రెండున్నర లక్షలు కొట్టేసిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెల్పిన మేరకు...కార్వాన్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎండీ హైమద్‌కు అదే ప్రాంతంలో కర్చీఫ్‌లు విక్రయించే ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తన వద్ద దుబాయి కరెన్సీ ఉందని, వాటిని తక్కువ ధరకు ఇస్తానని హైమద్‌కు ఆ వ్యక్తి ఆశచూపాడు. తన వద్ద ఏడు లక్షల విలువైన కరెన్సీ ఉందని, కేవలం రూ.రెండున్నర లక్షలు ఇస్తే వాటిని ఇస్తానని చెప్పాడు. దీంతో హైమద్ బుధవారం నగదు తీసుకుని ఆ వ్యక్తి చెప్పిన మేరకు.. ఉప్పల్‌లో ఇద్దరు అగంతకులు ఇచ్చాడు. వారు వస్త్రంలో చుట్టిన రెండు బండిల్స్ ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు. బండిల్‌ను ఓపెన్ చేసి చూస్తే..తెల్ల కాగితాలు మాత్రమే ఉండడంతో బాధితుడు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిటీలో దొడ్డు బియ్యమే!

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నన్నబియ్యం పంపిణీకి బ్రేక్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిస్తే కానీ, సన్న బియ్యం పంపిణీ జరిగే అవకాశాలు కానరావడం లేదు. జీహెచ్‌ఎంసీ ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీతో ముగియనుంది. విత్‌డ్రాల అనంతరం ఎన్నిక ఏకగ్రీవమైతే 10వ తేదీ తర్వాత కోడ్ ముగిసే అవకాశం ఉంటుంది. ఒక వేళ ఎన్నికల బరిలో అభ్యర్థులు మిగిలి ఎన్నికలు జరిగితే మాత్రం ఈ నెల 29 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఆ తర్వాతనే సన్న బియ్యం జరిగే అవకాశాలున్నాయి. వాస్తవంగా ఏప్రిల్ కోటా నుంచి బియ్యం కేటగిరి మారుతుండటంతో ఎన్నికల కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీపై పౌరసరఫరాల శాఖ ఎన్నికల కమిషన్‌ను అనుమతి కోరినా..ఇప్పటి వరకు అనుమతి లభించలేదు. దీంతో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ కొనసాగుతోంది.

దొడ్డు బియ్యంపై అనాసక్తి

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆహార భద్రత(రేషన్) లబ్ధి



కుటుంబాలు దొడ్డు బియ్యంపై పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. పౌరసరఫరాల శాఖ అర్బన్ పరిధిలో సుమారు 12.56 లక్షల రేషన్ కార్డులుండగా, అందులో బుధవారం నాటికి కేవలం 20 వేల కుటుంబాలు మాత్రమే ఈ నెల కోటా డ్రా చేసినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ నెల 17న హైదరాబాద్, 23న రంగారెడ్డి జిల్లాలో, 20న మేడ్చల్‌మల్కాజిగిరి అర్బన్ పరిధిలో నెల వారి కోటా గడువు ముగియనుంది. అయితే కోటా గడువులోగా ఎన్నికల కోడ్ ముగిస్తే మాత్రం సన్నబియ్యం కోటా డ్రా చేయవచ్చని లబ్ధికుటుంబాలు భావిస్తున్నాయి.

పౌరసరఫరాల శాఖ అర్బన్ సర్కిల్	రేషన్ కార్డులు	లబ్ధిదారులు
మలక్‌పేట	68,865	2,54,569
యాకుత్‌పురా	90,828	3,44,210
చార్మినార్	94,454	3,57,514
నాంపల్లి	39,045	1,34,215
మెహిదీపట్నం	81,387	3,10,191
అంబర్‌పేట	58,765	1,94,862
ఖైరతాబాద్	82,987	2,88,347
బేగంపేట్	69,213	2,32,357
సికింద్రాబాద్	53,793	1,82,379
సరూర్‌నగర్	2,09,794	6,82,594
బాలానగర్	2,04,398	6,93,835
ఉప్పల్	1,80,988	5,90,308
పటాన్ చెరు	9,415	31,477
రామచంద్రాపురం	12,871	43,029

'గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ స్థలంపై ఆందోళన వద్దు'

కాచిగూడ: గచ్చిబౌలిలోని భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ స్థలం విషయంలో సభ్యులు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని సొసైటీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. సొసైటీకి సంబంధం లేని, సభ్యులు కాని కొంత మంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. బుధవారం కాచిగూడలో భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, కోశాధికారి .శ్రీనివాస్, డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఇటీవల సర్వే నెంబర్ 25 కంచ గచ్చిబౌలి లోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూమిని ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుందన్నారు. అయితే ఇందులో తమ సొసైటీ స్థలం కూడా ఉందని కొంతమంది ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇందులో వాస్తవం లేదన్నారు. త్వరలో టీఎన్జీవోస్ 80వ ఆవిర్భావ దినోత్సవం ఎల్బీ స్టేడియంలో మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ హుసేనీల ఆధ్వర్యంలో జరుగనుందని, ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సొసైటీ స్థలం విషయంలో గందరగోళంపై ఈ సమావేశంలో స్పష్టత ఇస్తారన్నారు.

విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్లు, ఆర్టిజన్లే కీలకం

- నందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షి, సిటీబ్యూరో: నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఆర్టిజన్లు, లైన్‌మెన్ల పాత్రే కీలకమని ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చెప్పారు. వారి పనితీరు, వ్యవహారశైలిపైనే సంస్థ అభివృద్ధి, ప్రతిష్ట ఆధార పడి ఉందన్నారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ సరఫరా, సంస్థాగతంగా ఎదురవుతున్న ఇబ్బందులపై బంజారాహిల్స్ సర్కిల్ ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యలపై తక్షణమే స్పందించే గుణంతో పాటు స్నేహపూర్వకంగా వ్యవహరించడం వల్ల వ్యక్తిగతంగానే కాకుండా సంస్థకు మంచి గుర్తింపు తీసుకురావొచ్చని సూచించారు. వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టే సరఫరా

ఈ యాసంగిలో విద్యుత్ డిమాండ్ 17162 మెగావాట్లకు చేరిందని తెలిపారు. గత వేసవితో పోలిస్తే..ఈ సారి గరిష్ట ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగే ఛాన్సు ఉందని, ఆ మేరకు సరఫరా చేసేందుకు సంస్థ సంసిద్ధంగా ఉందని తెలిపారు. గత ఏడాది గ్రేటర్‌లో 4352 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని తెలిపారు. ఈసారి ఏకంగా 5000 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. డిమాండ్ ఎంత పెరిగినా..దానికి తగినట్లుగా సరఫరా చేయడానికి డిస్కం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు నరసింహులు, సాయిబాబా, నందకుమార్, సుధామాధురి, చీఫ్ ఇంజినీర్ చక్రపాణి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, బంజారాహిల్స్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే వ్యక్తి దుర్మరణం
- మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబీకులు
- కల్వకోల్ గ్రామంలో విషాదం


శంకరయ్య (ఫైల్)

మహేశ్వరం: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని కల్వకోల్ గేటు సమీపంలో మన్సాన్‌పల్లి చౌరస్తా–దుబ్బచర్ల మధ్యలో చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఆయన మహేశ్వరానికి వ్యక్తిగత పని మీద బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో అదే ఊరికి చెందిన కొండని ప్రశాంత్ కారులో వస్తూ కల్వకోల్ చౌరస్తా వద్ద ముందున్న బైక్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శంకరయ్య తలకు బలంగా దెబ్బ తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రోడ్డుపై వెళ్లే వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

దాయాదులపై ఫిర్యాదు

ఇదిలా ఉండగా తన భర్త శంకరయ్య మృతి పట్ల అనుమానాలున్నాయని భార్య కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల నుంచి తమకున్న భూమిపై దాయాదులతో వివాదం ఉందన్నారు. ఇటీవల కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని తన భర్త చెప్పాడన్నారు. భూమి దక్కదనే ఆలోచనతో దాయాదులు కారు డ్రైవర్‌కు సుపారి ఇచ్చి రోడ్డు ప్రమాదం చేయించి హత్య చేయించారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. గ్రామంలో శంకరయ్య మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రైకార్ బకాయి రుణాలు విడుదల చేయాలి

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ట్రైకార్ బకాయి రుణాలు రూ.219 కోట్లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘాల జేఏసీ, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివనాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ గోపీనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ ధర్మా నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు సంబంధించిన ట్రైకార్ 2019–2020, 2021లో 30వేల మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం గుర్తించి రూ.219 కోట్లు కేటాయించిందని, క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ నిధులను నేటికీ విడుదల చేయకుండా గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే బకాయి రుణాలు విడుదల చేయాలని కోరారు.

చిట్టీల పుల్లయ్య ఆస్తులు సీజ్

- ఇంటికి తీసుకు వచ్చి విచారణ
- ఆందోళనకు దిగిన బాధితులు..ఉద్రిక్తత


బీకే గూడలోని పుల్లయ్య నివాసం వద్ద బాధితులు

అమీర్‌పేట: చిట్టీలు, అధిక వడ్డీల ఆశ చూపి ప్రజలను నిలువునా మోసం చేసిన పుల్లయ్య ఆస్తులను సీసీఎస్ పోలీసులు సీజ్ చేశారు. సనత్‌నగర్ బీకేగూడ దాసారం బస్తీ రవీంద్రనగర్ సమీపంలో ఉండే పుల్లయ్య చిట్టీలు, వడ్డీల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి..వందల మందిని మోసం చేసిన విషయం విదితమే. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు ఇటీవల బెంగుళూరులో పుల్లయ్యను అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. విచారణలో భాగంగా బుధవారం సాయంత్రం సీసీఎస్ పోలీసులు బీకేగూడలోని నివాసానికి పుల్లయ్యను తీసుకువచ్చారు. ఏసీపీ మల్లికార్జున చౌదరి ఆధ్వర్యంలో పుల్లయ్య తోపాటు అతని ఇద్దరు కుమారులను మూడు గంటల పాటు విచారించి ఆస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఐదు అంతస్తుల ఇంటితో పాటు ఫార్చ్యూనర్ కారు, ఇతర సామాగ్రిని సీజ్ చేసి తరలించారు. కాగా ఇంటిపై రూ.60 లక్షల బ్యాంకు లోను ఉన్నట్లు తెలిపారు. కాగా పుల్లయ్యను ఇంటికి తీసుకువచ్చారన్న సమాచారంతో బాధితులు పెద్ద ఎత్తున నివాసానికి చేరుకుని ఆందోళకు దిగారు. మహిళా బాధితులు కొందరు ఆగ్రహంతో ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పుల్లయ్యతో మాట్లాడించాలని వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. తిరిగి పుల్లయ్యను సీసీఎస్‌కు తరలించే క్రమంలో పోలీసు వాహనాలను వెళ్లనివ్వకుండా అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కారు వెంట పరుగెత్తడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ దశలో పోలీసులు అప్రమత్తమై జనాలను అడ్డుకున్నారు.

డెలివరీ బాయ్స్ పేరిట దోపిడీలు

- ముగ్గురు దొంగల ముఠా అరెస్టు
- 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.8 వేలు రికవరీ


దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ బాలస్వామి

లాలాపేట: జెప్టో డెలివరీ బాయ్ ముసుగులో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగల ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, రూ. 8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ జగన్, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ బుధవారం వివరాలు వెల్లడించారు. అంబర్‌పేట్ చెన్నారెడ్డి నగర్‌కు చెందిన బి.మహేశ్, ఎస్.ప్రవీణ్, జి.శ్రీకాంత్‌లు జెప్టో డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. వీరు వస్తువుల డెలివరీ పేరిట కాలనీల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి రాత్రి వేళలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో హబ్సిగూడ రవీంద్రనగర్‌లోని రంజన్‌కుమార్ నివాసంలో అతని అత్త ఆశా ఠాకూర్(65) నివాసం ఉంటుంది. గత నెల 22న మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఆమె స్వస్థలం బిహార్‌కు వెళ్లింది. ఈ నెల 28న వీరి ఇంట్లో దొంగతనం జరిగినట్లు వాచ్‌మెన్ గమనించి ఇంటి యజమానికి సమాచారం అందివ్వగా వెంటనే తిరిగొచ్చిన బాధితురాలు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంగారు నగలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు డెలివరీ బాయ్స్ ఈ చోరీలకు పాల్పడ్డట్లు గుర్తించారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఆధారాలతో కేవలం మూడు రోజుల్లోనే ఈ కేసును ఛేదించి దొంగలను పట్టుకున్నారు.

అన్ని రంగాల్లోనూ టెక్నాలజీదే ముఖ్య భూమిక

మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నాలెడ్జి సిటీలోని ఐకొలాబ్ హబ్ ఫౌండేషన్ కార్యకలాపాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో టీహబ్, ఐకొలాబ్ హబ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కూడా చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీలో ముఖ్యంగా ఏఐ అత్యంత ముఖ్యపాత్ర పోషించడమేకాకుండా ప్రపంచ ప్రగతినే మార్చేస్తోందన్నారు. రాష్ట్రంలో చిన్నచిన్న సంస్థలకు కూడా పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఓఆర్‌ఆర్‌పై ప్రమాదం: ఒకరి మృతి

కీసర: గుర్తు తెలియని కంటైనర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున కీసర ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల పట్టణానికి చెందిన వ్యాపారి అందె విజయ్ (50) శంషాబాద్ విమానాశ్రయం నుండి కారులో తిరిగి వెళ్తుండగా..కీసర–శామీర్‌పేట రహదారిపై ఓఆర్‌ఆర్ మైలురాయి వద్ద డ్రైవర్ మార్పుకోసం కారు పక్కన నిలిపాడు. కారు తలుపు తీస్తుండగా గుర్తు తెలియని కంటైనర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలకు గురైన విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నేరాలను సహించేది లేదు

పహాడీషరీఫ్: రౌడీషీటర్లు సామాన్యులను బెదిరించినా, దాడులకు పాల్పడినా ఉక్కుపాదంతో అణచివేస్తామని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి హెచ్చరించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం ఆమె ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డితో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వారి ప్రవర్తన, పని చేసే చోట వ్యవహరిస్తున్న తీరును పరిశీలిస్తున్నామన్నారు. బస్తీల్లో ఇరుగు పొరుగు వారిపై జులుం ప్రదర్శించడం, దాడులు, ఇతరత్రా నేరాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రవర్తనలో మార్పు లేని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చ రించారు. ముఖ్యంగా పండుగల సమయంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కమ్యూనల్ షీట్లు కూడా తెరుస్తామన్నారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో ఈతకెళ్లి ఒకరి మృతి..మరొకరి గల్లంతు


గండె జతిన్ (ఫైల్)


శ్యామ్‌చరణ్ (ఫైల్)


లైట్లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

భూదాన్‌పోచంపల్లి: సరదాగా ఈత కొట్టేందుకు క్వారీ గుంతలోకి దిగిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని మియాపూర్‌కు చెందిన గండె జతిన్(18), కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన బొడ్డు శ్యాంచరణ్ (18)తో పాటు కర్మన్‌ఘాట్ న్యూగాయత్రీనగర్‌కు చెందిన చల్లా అక్షయ్‌కుమార్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన వర్జాల శ్రీమాన్, భరత్‌లు దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నారు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌లపై కాలేజీకి వచ్చారు. కళాశాలలో పరీక్ష రాసిన అనంతరం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు కళాశాలకు అర కిలోమీటర్ దూరంలో ఉన్న సాయివికాస్ స్టోన్ క్రషర్‌కు చెందిన నిర్మానుష్య క్వారీ వద్దకు వెళ్లారు. ముందుగా గండె జతిన్, బొడ్డు శ్యాంచరణ్ ఈత కొట్టడానికి నిండుగా నీళ్లున్న క్వారీ గుంతలోకి దిగారు. అయితే వీరికి లోతు తెలియక..ఈతరాక నీటిలో మునిగిపోయారు. దీంతో అక్కడే ఉన్న మిగతా విద్యార్థులు కాపాడాలని కేకలు వేసినా అక్కడ ఎవ్వరు లేరు. అందులో ఓ విద్యార్థి ధైర్యం చేసి వారిని కాపాడేందుకు విఫలయత్నం చేశారు. కానీ కొద్ది నిమిషాల వ్యవధిలోనే క్షణాల్లో స్నేహితులు నీటి మునిగి పోయారు.

నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి..

వెంటనే మిగిలిన ముగ్గురు విద్యార్థులు చల్లా అక్షయ్‌కుమార్‌రెడ్డి, వర్జాల శ్రీమాన్, భరత్ భయంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు నేరుగా వెళ్లి జరిగిన ఘటన గురించి చెప్పారు. అయితే ఘటనా స్థలం తమ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాదని వారు పోచంపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోచంపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ రాములు ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఒకరి మృతదేహం లభ్యం

బుధవారం చీకటి పడటంతో ఘటనా స్థలంలో లైట్లు ఏర్పాటు చేసి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పిలిపించి విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు శ్యామ్ చరణ్ మృతదేహం మాత్రమే లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో మునిగి మరొకరు..


మనీశ్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ రాయరావు చెరువులో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ లింగం కథనం మేరకు..గాజుల రామారానికి చెందిన మనీశ్(19) వీఎస్ఆర్ కళాశాలలో బీటెక్ సెకండర్ ఇయర్ చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. ముందే స్నేహితులతో వేసుకున్న ప్లాన్ ప్రకారం అతడి మిత్రులు హరిశంకర వర ప్రసాద్, ప్రియాకర్, కౌటిల్య, సంజయ్, సాత్విక్, రాగ, తన్వి మొత్తం 8 మంది కలిసి నర్సాపూర్ రాయరావు చెరువు వద్దకు వచ్చారు. అక్కడ కట్టపై ఉన్న పార్కులో కాలక్షేపం చేసి అనంతరం మధ్యాహ్నం చెరువు తూము వద్ద ఉన్న మెట్లపై నుంచి నీటి అంచుకు చేరుకున్నారు. మెట్లపై నుంచి నీటిలో కాళ్లు పెట్టి సరదాగా ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మనీశ్ నీటిలో పడిపోయి మునిగిపోయాడు. మిత్రుడు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల సాయంతో మనీశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్లీ బర్డ్ స్కీంకు స్పందన

బంజారాహిల్స్: 2024–25 సంవత్సరానికి గాను లక్ష్యానికి మించి ఆస్తి పన్ను వసూళ్లు చేసి రికార్డు సృష్టించిన జంట సర్కిళ్లు జూబ్లీహిల్స్ సర్కిల్–18, ఖైరతాబాద్ సర్కిల్–17లు ఎర్లీ బర్డ్ స్కీంలోనూ దూసుకెళ్తున్నాయి. ఎర్లీ బర్డ్ స్కీం బుధవారం ప్రారంభం కాగా మొదటిరోజే ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో 482 మంది వినియోగదారులు రూ. 42 లక్షలు చెల్లించగా, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 388 మంది వినియోగదారులు రూ. 60 లక్షలు పన్ను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ స్కీం ఈనెల చివరి వరకు ఉంటుందని ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించేవారికి 5 శాతం రాయితీ లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెంగళరావునగర్ : ఎర్లీబర్డ్ పథకాన్ని ఆస్తి పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి గాను ఈనెల 30గా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధి దాతకు సత్కారం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని ఉదయ్‌నగర్ కట్టమైసమ్మ ఆలయంలో ఆలయ కమిటీ నేతలు, దాతలు, భక్తులు ఆలయంలో మండప నిర్మాణ పనులకు బుధవారం పూజలు నిర్వహించారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఆలయ మండప నిర్మాణానికి సహకరిస్తున్న దాత వై.శాలిని సూరజ్‌దేవిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొంపల్లి శేఖర్, నజీర్, ఫూల్‌సింగ్, బాలరాజ్ పూజారి, ప్రేమ్ వైరల్, జేఎస్ఆర్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ డీఎంసీగా బాధ్యతల స్వీకరణ



సమ్మయ్య

బంజారాహిల్స్: జూబ్లీ హిల్స్ సర్కిల్–18 డీఎంసీగా సమ్మయ్యను నియమిస్తూ 2 రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు ఆస్తి పన్ను వసూళ్లు ఉండడంతో ఇక్కడ డీఎంసీగా పని చేస్తున్న ప్రశాంతి బుధవారం రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో సమ్మయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ విభాగాల అధికారులను పరిచయం చేసుకున్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు.


రోడ్లకిరువైపులా ఆక్రమణలు తొలగించండి



ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఫిలింనగర్: ఫిలింనగర్ సొసైటీ కార్యాలయం చుట్టుపక్కల, మహనీయుల చౌరస్తా, ఇతర రోడ్లకిరువైపులా ఆక్రమణలు తొలగించాలని ఫిలింనగర్ కాలనీవాసులు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కొన్నేళ్లుగా ఫిలింనగర్ సొసైటీలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లకిరువైపులా ఏర్పాటుచేసిన డబ్బాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఏసీపీ కూడా సానుకూలంగా స్పందించారని త్వరలోనే ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



రహమత్‌నగర్ : బోరబండ సైట్–1లోని సర్వాయి పాపన్న కమ్యూనిటీ హాల్ వద్ద సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గౌడ సంఘం నాయకులు వనజ లక్ష్మణ్ గౌడ్, కాసుల మహేశ్‌గౌడ్, గణేశ్, ప్రభుగౌడ్, జంగయ్యగౌడ్ ,వెంకటేశ్ గౌడ్, బస్తీ అధ్యక్షుడు ఆనంద్, చెట్టి దేవేందర్, ఫిరోజ్, ఖదీర్, భాస్కర్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం @ 6 కేంద్రాలు

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు • ఈనెల 14 వరకు అందించేందుకు అవకాశం

బంజారాహిల్స్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో గల జూబ్లీహిల్స్ సర్కిల్–18 కార్యాలయంలో, అలాగే బంజారాహిల్స్ డివిజన్ కేంద్రాన్ని బంజారాహిల్స్ రోడ్డునంబర్–12 లోని సీఎండీసీ, జూబ్లీహిల్స్ డివిజన్ కేంద్రాన్ని జూబ్లీహిల్స్ క్లబ్ ఎదుట ఉన్న వార్డు కార్యాలయంలో, షేక్‌పేట్ డివిజన్‌కు సంబంధించి షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో, ఖైరతాబాద్ డివిజన్‌కు సంబంధించి ఖైరతాబాద్ వార్డు ఆఫీస్, సోమాజీగూడ డివిజన్‌కు సంబంధించి సోమాజీగూడ వార్డు కార్యాలయంలో సెంటర్లను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఆయా కౌంటర్లలో సిబ్బందిని సైతం ప్రత్యేకంగా నియమించారు. ఈనెల 14 వరకు దరఖాస్తులు అందజేయవచ్చని, అప్పటివరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. యూసీడీ విభాగంలో పనిచేసే రీసోర్స్ పర్సన్లు అర్జీలు స్వీకరించి ప్రతిరోజూ వచ్చిన దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్లకు అందజేస్తారు. గడువు ముగిసిన తర్వాత కమిటీలు ఏర్పాటుచేసి దరఖాస్తులు పరిశీలిస్తారు.



ఖైరతాబాద్ జోనల్ ఆఫీసులోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రం

● అన్ని కులాల వారికి స్వయం ఉపాధి..

రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. దీనిలో సుమారు 60 నుంచి 80 శాతం సబ్సిడీ కూడా ఇవ్వనున్నారు.

● దరఖాస్తుకు జతపర్చాల్సినవి..

- ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- ఇన్‌కాం సర్టిఫికెట్ ఏప్రిల్ 2024 నుంచి లేటెస్ట్‌గా ఉండాలి
- పాన్‌కార్డు, దరఖాస్తుదారుడి ఫొటో, మొబైల్ నంబర్
- రేషన్‌కార్డులోని సభ్యుల్లో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది.

● ఉపాధి అవకాశాలు..

పంపుసెట్లు, ఎయిర్ కంప్రెషన్, గేదెలు, ఆవులు, చేపలు, పాల వ్యాపారం, పౌల్ట్రీఫారం, బేకరీ, హెయిర్ కటింగ్ షాపు, బ్యూటీ పార్లర్, ఎలక్ట్రిక్ షాపు, డిష్ టీవీల ఏర్పాటు, జనరల్ స్టోర్, పండ్ల దుకాణం, గిఫ్ట్ ఆర్టికల్ షాపు, ఐస్‌క్రీం పార్లర్, హోటల్, మినీ సూపర్ బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాపు..ఇలా 75 రకాల షాపుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల రుణాలను 60–80 శాతం వరకు రాయితీతో అందించనున్నారు.

లంబాడీలకు మంత్రి ఇవ్వాలంటూ..

సీఎం ఇంటి ముట్టడికి యత్నం



విద్యార్థి సంఘం నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

బంజారాహిల్స్: లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించిన వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలన్నారు. లేకుంటే లంబాడీల ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట నిరసనలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఇన్‌చార్జి రోహిత్‌పవార్, రాష్ట్ర కళా, సాంస్కృతిక శాఖ అరుణ్‌శ్రీరామ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాన్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భరత్‌నాయక్, రవీందర్‌నాయక్, కార్యదర్శి కాట్యనాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదానాయక్, ఉపాధ్యక్షులు పరశురామ్‌నాయక్, మహేశ్‌నాయక్ , పున్నీబాయి, అచ్చిబాయి, అనితాబాయి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



రెజ్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్‌లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఇంటర్నేషనల్ రెజ్లర్ సిపిరి కిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో అండర్ 15, 17, 19, 20 విభాగాల్లో రెజ్లింగ్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. 4 రోజుల పాటు పలు విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తామని, అలాగే విజేతలు తదుపరి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనం శ్రీనివాస యాదవ్, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్యామ్, మనోజ్‌యాదవ్, గొంటి శ్రీనివాస యాదవ్, సంతోష్‌గౌడ్, శరత్‌గౌడ్, చిన్న ముదిరాజ్, గొంటి సాయినాథ్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్, గని, మహేశ్ ముదిరాజ్, అంపైర్లు పాల్గొన్నారు.

అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు మరింత సులభం

- నిమ్స్, యూటీఎస్‌డబ్ల్యూ మధ్య ఒప్పందం
- దేశంలోనే నిమ్స్‌లోనే తొలిసారి



లక్డీకాపూల్ : నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలు ఇక మరింత సులభతరం కానున్నాయి. ఈ మేరకు అమెరికాలోని యూటీ సౌత్ వెస్ట్రన్ మెడికల్ సెంటర్ (యూటీఎస్‌డబ్ల్యూ)తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రోగులకు అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందివ్వడంతో పాటు అవయవ మార్పిడి సంరక్షణ ప్రమాణాలు, నాణ్యత మరింత మెరుగవుతాయి. ఇక నుంచి నిమ్స్‌లో యూటీఎస్ డబ్ల్యూ వైద్యుల మార్గదర్శకత్వంలో కంబైన్డ్ హార్ట్–లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్సలు జరుగుతాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ఈ తరహా శస్త్రచికిత్సలు జరగడం దేశంలోనే నిమ్స్‌లోనే తొలిసారి.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.23, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.18, క్యాప్సికం.35, పచ్చి కాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.10, క్యారెట్.18, దొండకాయ.23, గుండు బీన్నీస్.65, గింజ చిక్కుడు.55, గోకరకాయ.35, కీర.15, దోసకాయ.21, బీట్‌రూట్.13, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.24, చామగడ్డ.40, మొరంగడ్డ.23, కంద గడ్డ.75, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ.18, పొట్లకాయ.18, అరిటికాయ.9, మునగకాయ.4, మామిడికామ.23, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.28. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

భూముల విక్రయాన్ని విరమించుకోవాలి



మాట్లాడుతున్న మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

హిమాయత్‌నగర్ : హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ రాజ్ బహదూర్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమ్మకం పెట్టిన భూములను యూనివర్సిటీ అవసరాల కోసం ఉపయోగించాలన్నారు. యూనివర్సిటీ నుంచి తక్షణమే పోలీస్ బలగాలను వెనక్కి పిలవాలన్నారు. అలాగే యూనివర్సిటీ పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, అరుణ్, హరీశ్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేశ్, శ్రావణి, ఆకాశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

వెంగళరావునగర్ : ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున మైత్రీవనం నుంచి యూసుఫ్‌గూడ వైపు ఆటో వెళ్తోంది. మధురానగర్ ఆల్‌సబా హోటల్ వద్దకు రాగానే డ్రైవర్ అతి వేగంతో ఎడమచేతి వైపు తిప్పగా అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని కె.మౌనిక, ఏ.అశోక్, పి.మణికంఠ హరీశ్, మరో మహిళకు గాయాలయ్యాయి. కాగా డ్రైవర్ మద్యం తాగి నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఆటో బోల్తాపడిందని కె.పవన్ అనే ప్రయాణికుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13న మున్నూరు కాపు గర్జన సన్నాహక సమావేశం



అభివాదం చేస్తున్న మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు

పంజగుట్ట: ఈనెల 13న నెక్లెస్ రోడ్డు జలవిహార్‌లో మున్నూరు కాపు గర్జన సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కాపుల గర్జన సన్నాహక కమిటీ కో ఆర్డినేటర్లు పూటం పురుషోత్తం పటేల్, కొత్త లక్ష్మణ్, చందు జనార్దన్ పటేల్, సామల వేణుతో కలిసి మాట్లాడుతూ.. కాపులు, మున్నూరు కాపులు కలిస్తే సుమారు 60 లక్షల వరకు తమ జనాభా ఉందని కానీ ఇటీవల చేపట్టిన సర్వేలో కేవలం 13 లక్షలు ఉన్నట్లు, బీసీల్లో ఐదో స్థానంలో చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేమెంతో ప్రజలు, పాలకుల దృష్టికి తీసుకువచ్చేందుకు మే నెలలో 10 లక్షల మందితో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మున్నూరు కాపు గర్జన చేపడుతున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి అన్ని పార్టీల నుంచి మున్నూరు కాపు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అన్ని సంఘాల ప్రధాన నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో మణికొండ వెంకటేశ్వర్లు, ఎడ్ల రవి, బండి పద్మ, బండి సంజీవ, వనమాల ప్రవీణ్, మంగళారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘హెచ్‌సీయూ విషయంలో హైడ్రా నిద్రపోతోందా..?’

లిబర్టీ: హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమి కబ్జాకు గురవుతుంటే, రాష్ట్రంలో చెరువులు కాపాడుతానని ప్రతిజ్ఞ బూనిన హైడ్రా రంగనాథ్ ఏం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రశ్నించారు. 400 ఎకరాల అడవితో పాటు మూడు చెరువులు పీకాక్ లే క్, బఫెల్లో లేక్, క్రే లేక్‌లు ఉన్నాయని అంటే ఈ భూమి బఫర్ జోన్‌లోకి వస్తాయని, అంగుళం స్థలం కూడా బఫర్ జోన్‌లో ఉంటే వదలం అని చెప్పే రంగనాథ్ ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి నిర్ణయానికి రావాలన్నారు.

వీధి కుక్కల బెడదను అరికట్టాలి

ఫిలింనగర్: తమ అపార్ట్‌మెంట్‌లో వీధి కుక్కల బెడదను నివారించాలని కోరుతూ షేక్‌పేట మెయిన్‌రోడ్డులోని ఆదిత్య ఎంప్రెస్ టవర్స్ వాసులు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీ–బ్లాక్‌లోని కొంతమంది వీధి కుక్కలను కొంతకాలంగా అపార్ట్‌మెంట్‌లోకి తీసుకురాగా తన ఎనిమిదేళ్ల కుమారుడు కుక్క కాటుకు గురయ్యాడని వినయ్‌కుమార్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని తీసుకురావద్దని కోరినా పట్టించుకోవడం లేదన్నారు.ఈ విషయమై ఇప్పటికే తాము హైకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. సుమారుగా 1200 మంది నివాసితులు ఉంటున్న అపార్ట్‌మెంట్ వీధి కుక్కలకు కేంద్రంగా మారిందని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకోవాలి



భూమి పూజ చేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్ : శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో వేడుకలకు సంబంధించిన పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈయేడు యంగ్ స్టార్ హనుమాన్ యూత్ అసోసియేషన్, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 6 వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

ఫిలింనగర్: పోక్సో కేసులో ఫిలింనగర్ పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌లో నివసించే చిర్ల నాగవేంద్ర అలియాస్ సాయి (22) జులాయిగా తిరుగుతుంటాడు. ఇటీవల 5వ తరగతి చదువుతున్న ఓ బాలిక (11) ఉగాది పండుగ కోసం ఫిలింనగర్‌కు వచ్చింది. రాత్రి 7 గంటల సమయంలో తల్లి పని కోసం బయటకు వెళ్లగా, నాగవేంద్ర ఒంటరిగా ఉన్న బాలికను చేయి పట్టుకొని బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక అరుపులు, కేకలు పెడుతూ బయటకు పరుగులు తీసింది. ఈ విషయం బాధితురాలి తల్లికి చెప్పగా తల్లి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న డీపీఓ

వెంగళరావునగర్ : జీహెచ్ఎంసీ సర్కిల్–19 పరిధిలోవారు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో అందించాలని జిల్లా ప్రాజెక్ట్ అధికారి వెంకట్ కిషన్‌రావు తెలిపారు. బుధవారం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించారని ఇప్పుడు దానిని ఈనెల 14వ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇంకా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయని వారు ఉంటే ఆధార్, ఇన్‌కం, పాన్‌కార్డ్, రేషన్‌కార్డు, ఫొటోతో సహా వార్డు కార్యాలయాలకు వస్తే అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

‘మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి’



పంజగుట్ట: మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలని సీనియర్ నాయకత్వ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అల్లారం రత్నయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షులు లింగాల పెద్దయ్య, స్వామిదాస్, బాల్‌రాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మాదిగ ఉప కులానికి మంత్రి పదవి ఉంది.. కానీ 33 లక్షల జనాభా ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమన్నారు. ఇదే డిమాండ్‌పై ఈనెల 5న ఇందిరా పార్క్ వద్ద దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. తమ సంఘానికి అనుబంధ సంఘాలైన యువజన, మహిళా, విద్యార్థి సంఘాలు సైతం ఒక్కోరోజు ఒక్కొక్కరు దీక్ష చేపడతారని పేర్కొన్నారు.

బీజేపీ మహిళా నేతల అరెస్టు



వెంగళరావునగర్ : గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ భూముల వేలం విషయంలో బీజేపీ మహిళా నేతలు బుధవారం సెక్రటరీయేట్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మధురానగర్ పీఎస్ పరిధిలో ఉన్న పలువురు సీనియర్ మహిళా నేతలను పోలీసులు వారి ఇళ్లకు వెళ్లి ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఆయా మహిళా నేతలు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు. అరెస్టు అయిన వారిలో శ్రీనగర్‌కాలనీ డివిజన్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, హైదరాబాద్ జిల్లా ఓబీసీ కార్యదర్శి బి.రూప, స్వప్న, సంగీత, నర్మద, ప్రమీల, కళ, లక్ష్మి తదితరులు ఉన్నారు. ఉదయం అరెస్టు చేసిన వీరిని సాయంత్రం విడుదల చేశారు.

ఎయిమ్స్ పరీక్షల్లో శ్రీనిధి విద్యార్థుల ప్రతిభ



మోక్షిత



డి.చతుర్



ఉదయ్ కార్తీక్

వెంగళరావునగర్ : ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాథ్స్ అండ్ సైన్స్ (ఏఐఐఎంఎస్) పరీక్షల్లో మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి, స్వీట్ ఏంజిల్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఎయిమ్స్ పరీక్షలను శ్రీనిధి స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. నాలుగో తరగతి విద్యార్థిని కె. మోక్షిత (ఆల్‌ఇండియా 9వ ర్యాంక్), మూడో తరగతి విద్యార్థిని డి.ఛాతుర్ (8వ ర్యాంక్), తొమ్మిదో తరగతి చదువుతున్న ఉదయ్ కార్తీక్ (7వ ర్యాంక్) ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సమావేశంలో సంస్థ చైర్మన్ కొల్లి లక్ష్మణ్‌రావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాళ్లు విమల, రాజేశ్వరి, ఇన్‌చార్జి కుముదవల్లి, సాయి, మ్యాథ్స్, సైన్స్ టీచర్లు భవానీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్ : డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏఎంఓహెచ్ హేమలతతో కలిసి ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులను పూర్తిస్థాయిలో నియమించి ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రం చేస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, గురువారం,
3, ఏప్రిల్, 2025



తండ్రీ కూతుళ్ల ప్రేమ అనిర్వచనీయం.. కూతురంటే ప్రతి తండ్రికీ ఎనలేని ప్రేమ.. తన కళ్లలో సంతోషం కోసం ఎంతటి కష్టమైనా సునాయసంగా భరిస్తుంటాడు తండ్రి.. తన తండ్రి రోజంతా కష్టపడి పనిచేసేది తన కోసమేనని తెలుసుకుంటుంది కూతురు. ప్రతిరోజూ సమయానికి ఇంటికి వచ్చే నాన్న.. కాస్త ఆలస్యం అయితే చాలు అమ్మా.. నాన్న ఎప్పుడొస్తాడని తల్లి వెంటపడుతుంది. తండ్రి ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎగిరిగంతేస్తుంది. ఇది తండ్రీ కూతుళ్ల మధ్య నిత్యం జరిగేదే.. అయితే.. యాక్సిడెంట్‌లో తన తండ్రి ప్రాణాలు విడిచాడని, ఇక ఎప్పటికీ ఇంటికి రాడనే వార్త విన్న కూతురిని ఓదార్చడం ఎవరి తరమూ కాదు. ఇలాంటి ఘటనలు ఎక్కడా చోటుచేసుకోవద్దని ట్రాఫిక్ రూల్స్‌పై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా చాలా మందిలో మార్పు రావడం లేదు. దాంతో కూతురితో అవగాహన కల్పిస్తే తండ్రిలో తప్పకుండా మార్పు వస్తుందనే ఆలోచనతో 'సర్వేజన ఫౌండేషన్'.. 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్' పేరుతో కొత్త తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టింది. - ఖైరతాబాద్

నాన్న.. నువ్వు మా ప్రాణం!



నాన్న! నేను ఇటీవల ఒక వార్త చదివాను. 2024లో 1.57 కోట్ల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు నమోదయ్యాయని, ఇది మన రాష్ట్ర జనాభాలో దాదాపు సగంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ కేసుల్లో ఒకటి మీదైతే? ఒక చిన్న తప్పు మా జీవితాన్ని మార్చగలదనే ఆలోచన కూడా నన్ను భయపెడుతోంది. ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన కుటుంబాలను నేను చూశాను. తల్లిదండ్రుల కోసం ఏడుస్తూ వాళ్లు లేని జీవితం ఎలా ఉంటుందో తెలియక భయపడే పిల్లల్ని చూశాను. అందుకే నిన్ను కోల్పోవడం తలచుకుంటేనే నా గుండె భారంగా మారుతోంది నాన్న..

నాన్న! ఒక రోజు మేమంతా నీ రాక కోసం ఎదురుచూస్తుంటే.. నీవు ఇక ఎప్పటికీ రాకపోతే? ఒక నిర్లక్ష్య క్షణం నిన్ను మా నుంచి దూరం చేసేస్తే? నీ ప్రేమ, నీ నవ్వు, నీ మార్గనిర్దేశం లేకుండా మేము ఎలా బతకుతాం? నాన్న దయచేసి ఎప్పుడూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తానని నాకు మాటివ్వు. ఎప్పుడు మద్యం తాగి వాహనం నడపకూడదు, అధిక వేగంతో ప్రయాణించకూడదు, హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరగా ధరించాలి, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడకూడదు. ఇవి చేయనని నాకు మాటివ్వు నాన్న.. ఎందుకంటే నీవు లేకుండా మా జీవితం ఊహించుకోలేం..

- అంతులేని ప్రేమతో..
నీ ప్రియమైన కుమార్తె



రోడ్డు ప్రమాదాలను అరికట్టే లక్ష్యంతో 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్'

కొత్త తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టిన 'సర్వేజనా ఫౌండేషన్'

బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు

ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాల్లో వేల కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోతున్నాయి. 90శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయి.. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం, సిగ్నల్ జంపింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటివి ఎంతో మంది ప్రాణాలు పోయేందుకు కారణం అవుతున్నాయి.

☛ మానవ తప్పిదాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలనే లక్ష్యంతో 'సర్వేజనా ఫౌండేషన్'.. 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్' కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు ఓ కూతురు తండ్రికి ప్రేమతో అవగాహన కల్పించేలా 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్ యాప్' ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఈ అవగాహన కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుండగా ఈ మహత్ కార్యాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని సర్వేజన ఫౌండేషన్ చైర్‌పర్సన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి అన్నారు. ప్రతి నెలా యాప్ ద్వారా పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తున్నామని, కూతురితో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ సీఈఓ బి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు.





ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవీ సింధు, డాక్టర్ ఏవీ గురవారెడ్డి, బి.జనార్ధన్‌రెడ్డి

☛ రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే 2022లో రోడ్డు ప్రమాదాల్లో 1.63 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు ఇవి 1.63 లక్షల మంది కుటుంబాలు తల్లడిల్లిన సంఘటనలు.. వారి కలలు, భవిష్యత్తు నాశనమై, తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన పిల్లలు, పిల్లలను కోల్పోయి కన్నీళ్లు మిగిలిన తల్లిదండ్రులూ ఉన్నారు. అయితే వీరిలో 50 వేల మంది హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడిపినవారయితే, మరొక 17 వేల మంది సీటు బెల్ట్ లేకుండా ప్రయాణించి ప్రాణాలు కోల్పోయారు.




జీబ్లీ.. ట్రెండ్

ఒకప్పుడు ప్రత్యేక టూల్స్‌తో చేసే పని ఇప్పుడు క్షణాల్లో..

- ఆర్టిస్ట్ అవసరం లేకుండానే యూనిక్ పోట్రెట్స్
- మా కళ మాయమైపోతోంది..: ఆర్టిస్టులు
- ఏఐ ఆవిష్కరణలో ఇప్పుడిదే వైరల్

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'జీబ్లీ తరం' కొనసాగుతుందా..? ఎప్పటికప్పుడు కృత్రిమ మేథ వేదికగా పుట్టుకొస్తున్న కృత్రిమ ఆవిష్కరణలే ఈ తరం ట్రెండ్‌గా మారుతున్నాయా..? రానున్న రోజుల్లో ప్రతీదీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పైనే ఆధారపడి పనిచేస్తుందా..? ఇలాంటి ప్రశ్నలకు అవుననే సమాధానాలు వస్తున్నాయి. విషయానికొస్తే.. గతంలో ఒక పోట్రేట్(ముఖ చిత్రం) వేయించుకోవాలంటే ఒక మంచి ఆర్టిస్టు దగ్గరికో, ఈ మధ్య కాలంలోనైతే ఆన్‌లైన్‌లోనే ఆర్టిస్టులకు ఆర్డర్ ఇస్తే వారే అందమైన చిత్రాన్ని వేసి ఇంటికి పంపించేవారు. అయితే కొన్ని రోజుల నుంచి జీబ్లీ ఏఐ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఓపెన్ ఏ1 సంస్థ తన చాట్ జీపీటీ-40 మోడల్‌లో ఈ కొత్త ఇమేజ్ జనరేషన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఈ ట్రెండ్ మరింత వేగంగా వ్యాపించింది. ప్రతి ఒక్కరూ తమ ఫొటోలను ఈ వేదికగా సబ్మిట్ చేసి క్షణాల్లో వారి జీబ్లీ ఫొటోలను పొంది.. సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో







ఇది అనైతికం..: హయావో మియాజాకి

తమ సాంకేతికత శైలిని పోలిన కళాత్మక ఫొటోలను సృష్టించడం అనైతిక చర్యగా గతంలో స్టూడియో జీబ్లీ సహ వ్యవస్థాపకుడు హయావో మియాజాకి తెలిపారు. 2016లోనే ఏఐ ద్వారా సృష్టించబడిన చిత్రాలను జీవితానికే అవమానంగా ఆయన అభివర్ణిస్తూ ఈ కళపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇలాంటి ఆధునిక సాంకేతికత వలన పెయింటింగ్, డ్రాయింగ్, పోట్రేట్ పెయింటింగ్ వంటి కళలపైన జీవనం సాగిస్తున్న కళాకారులకు కష్ట-నష్టాలను తెచ్చిపెడుతుంది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్, ఎక్స్ వంటి సోషల్ మీడియా యాప్స్ వినియోగం పెరిగిన తర్వాత.. వ్యక్తిగత ఫొటోలను వివిధ సందర్భాలను మిత్రులు, తెలిసినవారికి పంచుకోవాలనే ఆసక్తి బాగా పెరిగిన విషయం విధితమే. అయితే.. మారుతున్న కాలానికి అనుగుణంగా అందంగా, వినూత్నంగా తమ ఫొటోలను చూసుకోవాలన్న కుతూహలం పెరిగింది. గతంలోనైతే నగరంలోని ట్యాంక్ బండ్ పైనో, అలా శిల్పారామంలోనో పోట్రేట్ వేసే కళాకారులు ఉండేవారు.. వారి వద్ద లైవ్‌గా వేయించుకునేవారు. కానీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పుణ్యమా అని.. వినూత్న, కళాత్మక యానిమేటెడ్ ఫొటోలు క్షణాల్లో వచ్చేస్తున్నాయ్.. ఇంకేముంది.. వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవడం, షేర్లు, పోస్టులు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. దీనికి సామాన్యులు మొదలు సెలబ్రెటీల వరకు మినహాయింపు లేకుండా వాడేస్తున్నారు. ఐతే ఇందులోనూ చిక్కులు లేకపోలేదు. ఈ ట్రెండ్‌లో ప్రైవసీ, కాపీరైట్ సమస్యలు లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాపీరైట్స్ మాత్రం జపాన్‌కు చెందిన స్టూడియో జీబ్లీ..

ప్రస్తుతం వైరల్‌గా మారిని జీబ్లీ ఫొటోలు.. చాట్‌జీపీటీలో సరికొత్త ఇమేజ్ జనరేషన్ ఫీచర్. కానీ ఈ ఫొటోలు జపాన్‌లో ప్రసిద్ధి పొందిన స్టూడియో జీబ్లీకి చెందిన యానిమేషన్ శైలిలోకి మారుస్తున్నాయి. ఈ ట్రెండ్‌తో కొన్ని ప్రైవసీ, కాపీరైట్ సమస్యలు తలెత్తే అవకాశముంది. వినియోగదారులు తమ వ్యక్తిగత ఫొటోలను యాప్ సాధనాలకు అప్లోడ్ చేస్తున్నప్పుడు ఆ డేటా నిల్వ చేస్తారు. విభిన్న విధాలుగా ఉపయోగించవచ్చనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రధానంగా స్టూడియో జీబ్లీ ప్రత్యేక శైలిని అనుకరించడంతో ఆ సంస్థ కాపీరైట్ హక్కుల ఉల్లంఘన జరుగుతుందా అనే చర్చ కూడా కొనసాగుతుంది. మిలియన్ల కొద్దీ మంది ఈ సాంకేతికతను ఒకేసారి వినియోగిస్తున్న నేపథ్యంలో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సందర్భమే గతంలోనూ జరిగింది. 'హ్యాపీ బర్త్ డే టూ యూ' అంటూ ప్రతీఒక్కరి బర్త్ డే రోజు వాడుకునే ఈ పాట వార్నర్/చాపెల్ అనే మ్యూజిక్ పబ్లిషర్‌ది. అప్పట్లో ఇది కూడా వైరల్ కావడంతో దీనిపై కూడా కాపీరైట్ కేసు కూడా ఫైల్ చేశారు యాజమాన్యం. కానీ అనంతరం అధికారికంగా పబ్లిక్ డోమైన్‌లోకి ఉచితంగా అందుబాటులోకి వచ్చింది.



భల్లే భల్లే..

పంజాబీ ఫుడ్ ఫెస్టివల్

- రాయల్ రెవ్ హోటల్ వేదికగా ఏర్పాటు
- పాకశాస్త్రం నైపుణ్యాలను ప్రదర్శించిన ప్రముఖ పంజాబీ మాస్టర్ చెఫ్స్
- 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఫెస్టివల్





సాక్షి, సిటీబ్యూరో: నగరం విభిన్న సంస్కృతులకు నిలయమే కాకుండా ఆహార వైవిధ్యానికి కూడా కేంద్రంగా నిలుస్తోంది. దీనికి ప్రతిగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విభిన్న ప్రాంతాలకు చెందిన వంటకాలు నగరంలో అలరిస్తుంటాయి. ఇందులో భాగంగానే సికింద్రాబాద్‌లోని రాయల్ రెవ్ హోటల్ వేదికగా ప్రతిష్టాత్మక పంజాబీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. పంజాబ్ సంప్రదాయ పంటల పండుగ 'పంజాబీ ఫుడ్ ఫెస్టివల్'ను అమృత్సర్ గ్యాస్ట్రోనమికల్ యాత్రలో భాగంగా ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు రాయల్ రెవ్ హోటల్, లాజీజ్ మల్టీక్యూసిన్ రెస్టారెంట్ వేదికగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం రాయల్ రేవ్ హోటల్ వేదికగా పంజాబీ పసందైన వంటకాలతో ప్రముఖ పంజాబీ మాస్టర్ చెఫ్ రాజుసింగ్ సోన్వాల్ ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకంగా రూపొందించిన మెనూలో మటన్ బెలిరామ్, రారా మటన్, సాగ్ మీట్, తందూరీ కుక్కడ్, కుక్కడ్ మఖన్వాలా, మచ్లీ టిక్కా, మచ్లీ అమృత్సరి వంటి మాంసాహార వంటకాలు ఉన్నాయన్నారు. శాఖాహారులు పనీర్ టిక్కా జలంధరి, పెధివాలి టిక్కిని ఆస్వాదించవచ్చు. వీటితో పాటు మరెన్నో అందుబాటులో ఉన్నాయన్నారు.

నేటి తరానికి నాటికల పరిచయం

ఆకట్టుకున్న భక్త చింతామణి

బంజారాహిల్స్: ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో జరుగుతున్న నాటకోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాటకాల్లో భాగంగా బుధవారం ఖమ్మంకు చెందిన సుమిత్రా యూత్ అసోసియేషన్ కళాకారులు నిర్వహించిన భక్త చింతామణి నాటకం ఆకట్టుకుంది. బిళ్వగా కె.శ్రీనివాసరావు, రాధగా లహరి, చింతామణిగా నెల్లూరి భానుమతి, భవానీగా కె.రామ్‌కుమార్, చిత్రగా గుడివాడ కుమారి, సుబ్బిశెట్టిగా ఎస్.రోశిరెడ్డి, శ్రీహరిగా డాక్టర్ సుబ్బరాజు, దామోదరగా సూర్యప్రకాశ్ రావు నటించారు. సుబ్బారావు మాట్లాడుతూ నేటితరానికి రంగస్థల నాటికల గొప్పదనాన్ని తెలియజేసేందుకు, రంగస్థల నటులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్



నాగోలు: ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం చేస్తుందని కుంగ్‌ఫూ ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సీహెచ్ మదన్‌కుమార్ అన్నారు. న్యూ నాగోలులోని ట్రస్టెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ భవన్ ఆవరణలో మంకీ ఫస్ట్ కుంగ్ ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్టు ఫిఫ్ట్ డాన్ అర్హత పరీక్షను ఆయన నిర్వహించారు. సుమారు 30 మంది పరీక్షకు హాజరయ్యారు. విజేతలకు బెల్టులను ప్రదానం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు మదన్‌కుమార్‌ను సత్కరించారు. అంబాల శ్రీనివాస్, రాజారావు, అల్లుమారి అంజన్న, పురుషోత్తం, సుధాకర్, తెలంగాణ, మహారాష్ట్ర మాస్టర్లు పాల్గొన్నారు.

మీ నిబద్ధతకు హ్యాట్సాఫ్!

స్థానిక సంస్థల పార్టీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ''మీ అందరినీ చూస్తుంటే చాలా గర్వంగా ఉంది.. రాజకీయాలలో ఎప్పుడూ విలువలు, విశ్వసనీయత ఉండాలని నేను చాలా గట్టిగా నమ్మే వ్యక్తిని. నేను అలాగే ఉంటా.. పార్టీ కూడా అలాగే ఉండాలని మొట్టమొదటి నుంచి ఆశించా. కష్టకాలంలో మీ అందరూ చూపించిన తెగువ, స్ఫూర్తికి హ్యాట్సాఫ్..'అని స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించారు. ఏపీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా.. బెదిరింపులు, అక్రమ కేసులు, దాడులకు వెరవకుండా పార్టీ కోసం గట్టిగా నిలబడిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను అభినందించారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న పరిణామాలను ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కు చేరాయని వ్యాఖ్యానించారు. ''రాబోయే రోజులు మనవే.. కళ్లు మూసుకుంటే మూడేళ్లు గడిచిపోతాయి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో అధికారంలోకి వస్తుంది.. జగన్ 1.0 పాలనలో కోవిడ్ వల్ల కార్యకర్తలకు చేయాల్సినంత చేయకపోయి ఉండవచ్చు. కానీ.. జగన్ 2.0లో అలా జరగదు.. అందరికీ మాట ఇస్తున్నా.. కార్యకర్తలకు కచ్చితంగా అండగా ఉంటా.. కార్యకర్తల కోసం జగన్ ఎంత గట్టిగా నిలబడతాడో వచ్చే ఎన్నికల తర్వాత మీ జగన్ చేసి చూపిస్తాడు''అని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ''చంద్రబాబునాయుడు మోసాలు క్లైమాక్స్‌కి చేరాయి. చాలామంది చంద్రబాబు మారిపోయి ఉంటారని అనుకున్నారు. కానీ ఆయన మారలేదని నిరూపిస్తూ ఈమధ్య పీ–4 అని కొత్త మోసం తీసుకొచ్చాడు. పీ–4 విధానం ద్వారా సమాజంలో 20 శాతం పేదవారి బాగోగులు అన్నింటినీ 10 శాతం సంపన్నులకు అప్పగిస్తాడట. ఈ మనిషి ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదు. అసలు చంద్రబాబుకు రాష్ట్రంలో ఎన్ని తెల్లరేషన్ కార్డులు ఉన్నాయో తెలుసా? రాష్ట్రంలో 1.61 కోట్ల ఇళ్లు ఉంటే 1.48 కోట్ల వైట్ (తెల్ల) రేషన్ కార్డులున్నాయి. అంటే 90 శాతం మంది దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నారు. రాష్ట్రంలో 8.60 లక్షల మంది మాత్రమే ఆదాయపన్ను కడుతున్నారు. 25 లక్షల మంది ఐటీ ఫైల్ చేస్తున్నారు. అంటే 8.60 లక్షల మందికి.. 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డు దారులను అప్పగించాలి. అక్కడ కూడా మోసం చేస్తున్నాడు. పేదలు కేవలం 20 శాతం అంటున్నాడు. చంద్రబాబు చెప్పిన దానికి కనీసం వెయ్యి మంది కూడా ముందుకు రారు. చంద్రబాబు చెప్పింది అవాస్తవమని, జరగదని అందరికీ తెలుసు. ఆయన డ్రామాలు ఆడుతున్నాడని ప్రజలకు తెలుసు. జనం నవ్వుకుంటున్నారు. ఆయన మాట్లాడినప్పుడు మీటింగ్‌ల నుంచి వెళ్లిపోతున్నారు. అయినాసరే నేను చెప్పేది ప్రజలు నమ్మాల్సిందే అన్నట్లు అబద్ధాల మీద అబద్ధాలు చెప్పుకుంటూ పోతున్నారు'' అని విమర్శించారు.

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని..

ముగ్గురు పిల్లలను చంపిన తల్లి
- ఊపిరి ఆడకుండా చేసి టవల్‌తో హత్య
- అమీన్‌పూర్ పిల్లల హత్య కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోశ్ పంకజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్, చిత్రంలో పటాన్ చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి జోన్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని ముగ్గురు పిల్లలను ఊపిరి ఆడకుండా చేసి అతి కిరాతకంగా తల్లే హత్య చేసిందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ వెల్లడించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అమీన్‌పూర్ మండలం బీరంగూడ గ్రామం రాఘవేంద్రనగర్‌లో ఇటీవల జరిగిన ముగ్గురు పిల్లల మృతి ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. పిల్లల తల్లి రజిత ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా.. ఆరు నెలల క్రితం పదో తరగతి పూర్వ విద్యార్థులు అంతా కలసి పార్టీ చేసుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. ఆ పార్టీ సందర్భంగా తన క్లాస్ మేట్ అయిన శివతో రజిత స్నేహం ఏర్పరుచుకుంది. రోజూ చాటింగ్, కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడేవారు. అంతే కాకుండా పలు మార్లు రహస్యంగా కలుసుకున్నారు. కాగా, రజిత భర్త చెన్నయ్య.. ఆమె కంటే వయసులో ఇరవై సంవత్సరాలు పెద్దవాడు కావడంతో మొదటి నుంచీ ఆమెకు చెన్నయ్య అంటే ఇష్టం ఉండేది కాదు. తరచూ గొడవలు పడేవారు. ఈ క్రమంలో తన పదోతరగతి క్లాస్‌మేట్ శివను కలసుకోవడం, అతనికి పెళ్లి కాకపోవడంతో ఎలాగైనా అతడిని పెళ్లి చేసుకుని జీవితాంతం సుఖంగా ఉండాలని భావించింది. ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోమని రజిత, శివను అడగ్గా.. పిల్లలు లేకుండా ఒంటరిగా తనతో వస్తా అంటే కచ్చితంగా పెళ్లి చేసుకుంటా అని చెప్పాడు. దీంతో శివను పెళ్లి చేసుకోవాలంటే పిల్లలను అడ్డు తొలగించుకోవాల్సిందేనని రజిత నిర్ణయించుకుంది. మార్చి 28న సాయంత్రం ఆరు గంటలకు పిల్లలను చంపేస్తానని శివకు చెప్పగా, త్వరగా ఆ పని పూర్తి చేయమని చెప్పాడు. అదే రోజు రాత్రి భర్త భోజనం చేసి 10 గంటలకు ట్యాంకర్ తీసుకొని చందానగర్ వెళ్లగా, ఇదే అదనుగా భావించి మొదట పెద్ద కొడుకు సాయికృష్ణ (12)ను, తర్వాత కూతురు మధుప్రియ (10)ను, ఆ తర్వాత చిన్న కొడుకు గౌతమ్ (8)ను.. ఇలా ముగ్గురిని ఒకరి తరువాత ఒకరిని ముక్కు, మూతిపై టవల్ వేసి, చేతితో గట్టిగా అదిమి ఊపిరాడకుండా చేసి చంపింది. పిల్లలను అడ్డు తొలగించుకోవాలని రజితను శివ ప్రోత్సహించగా ఆమె కిరాతకంగా వారిని చంపివేసిందని ఎస్పీ వెల్లడించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, డీఐ రాజు, ఎస్ఐ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతులు చేస్తున్న అధికారులు

టన్నెల్ లీకేజీ ఎక్కడి నుంచి?

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ సమీపంలో మూడు రోజుల క్రితం టన్నెల్‌లో చోటుచేసుకున్న లీకేజీకి సంబంధించి ఇప్పటివరకు ఎక్కడి నుంచి నీరు కచ్చితంగా లీక్ అయిందో సంబంధిత అధికారులు కనిపెట్టలేకపోయారని తెలుస్తోంది. దేవాదుల పథకంలో భాగంగా 3వ ప్యాకేజీ కింద హసన్‌పర్తి మండలం దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి అక్కడినుంచి రిజర్వాయర్ వరకు 200 మీటర్ల టన్నెల్‌ను నిర్మించారు. గత నెల 27న దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ ప్రారంభించగా మూడు రోజుల క్రితం టన్నెల్ లీకేజీ అయి నీరంతా బయటకు ఎగ జిమ్మి, పక్కనున్న పొలాలు మునిగాయి. అధికారులు వెంటనే పంప్‌లు బంద్ చేసి డీ వాటరింగ్ ప్రారంభించగా బుధవారం రాత్రి వరకు నీళ్లు తగ్గుముఖం పట్టాయి. అయితే లీకేజీ ఎక్కడ జరిగింది? అనేది స్పష్టంగా తెలియడంలేదని, తిరిగి పంపింగ్ ట్రయల్ రన్ ప్రారంభిస్తేనే లీకేజీ ఎక్కడినుంచి జరుగుతుందో తెలుస్తుందని అధికారులు అంటున్నారు.

ఏపీలో ప్రేమోన్మాది ఘాతుకం

తల్లీ కూతుళ్లపై విచక్షణారహితంగా కత్తితో దాడి ● తల్లి అక్కడికక్కడే మృతి, కూతురి పరిస్థితి విషమం




నిందితుడు నవీన్

మధురవాడ (విశాఖ)/శ్రీకాకుళం క్రైమ్/బూర్జ/వీరఘట్టం/సాక్షి, అమరావతి : పెళ్లికి నిరాకరించారన్న కారణంతో తల్లీ కూతుళ్లపై ప్రేమోన్మాది విచక్షణారహితంగా దాడి చేశాడు. తల్లి మృతి చెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ఈ దాడి ఘటనతో విశాఖ నగరం ఉలిక్కిపడింది. సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా దేవుదళ సమీపంలోని పెద్దపుర్లికి చెందిన నక్కా రాజు బతుకు తెరువు కోసం రెండేళ్ల క్రితం మధురవాడకు వచ్చి, కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య గృహిణి. ఇద్దరు పిల్లలు. కుమార్తె దీపిక (20) ఆరేళ్ల క్రితం వీరఘట్టం మండలం పనసనందివాడలోని తన పిన్ని ఇంటికి ఓ కార్యక్రమానికి వెళ్లింది. ఎదురింట్లో ఉంటున్న దమరసింగి నవీన్ (26) పరిచయమయ్యాడు. నవీన్ డిగ్రీ పూర్తి చేసి, ఖాళీగా ఉంటున్నాడు. దీపిక విశాఖలోని మహిళా డిగ్రీ కళాశాలలో మైక్రోబయాలజీ పూర్తి చేసి, నర్సింగ్ చేస్తోంది. ఈ క్రమంలో దీపికను పెళ్లి చేసుకుంటానంటూ ఆమె తల్లిదండ్రులపై నవీన్ తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాడు. ఇతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో పెళ్లి ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో పెళ్లికి అంగీకరించకపోతే చంపేస్తానని కూడా పలుమార్లు బెదిరించాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అతడి జీవితం నాశనం అయిపోతుందని దీపిక తండ్రి రాజు ఆలోచించాడు. అదే ఆ కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కొమ్మాది జంక్షన్ హైవేకు కూత వేటు దూరంలో ఉన్న స్వయంకృషి నగర్‌లో బాధితుల ఇంటికి నవీన్ వచ్చాడు. కొన్నాళ్ల తర్వాత పెళ్లి చేస్తామని చెప్పడంతో విచక్షణ కోల్పోయి వాదనకు దిగాడు. ఓ దశలో ఉన్మాదంతో ఊగిపోతూ 1.30 గంటలకు తల్లీ కూతుళ్లపై చాకుతో దాడి చేశాడు. విచక్షణా రహితంగా పొడిచాడు. దీంతో నక్క లక్ష్మి (47) అక్కడికక్కడే మృతి చెందగా, దీపికకు చేయి, మెడ ఇతర భాగాలపై తీవ్ర గాయాలై, స్పృహ తప్పింది. ఆ వెంటనే నిందితుడు పరారయ్యాడు. కాసేపటికి స్పృహలోకి వచ్చిన దీపిక తల్లి చలనం లేకుండా ఉండడాన్ని గమనించింది. సహాయం కోసం ఎంత ప్రయత్నించినా ఎవ్వరూ అందుబాటులోకి రాలేదు. మేడ మీద నుంచి అతి కష్టంగా కిందికి వచ్చి ఆర్తనాదాలు చేయడంతో పక్కనే ఉన్న వ్యక్తి 112కి ఫోన్ చెయ్యడంతో పీఎం పాలెం స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.భాస్కరరావు సంఘటనా స్థలికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న దీపికను ద్విచక్ర వాహనంపై దగ్గర్లోని గాయత్రి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలిస్తామని చెప్పారు. నిందితుడు నవీన్ సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు ఐదు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టి, శ్రీకాకుళం జిల్లా బూర్జ నుంచి వీరఘట్టం వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని చెప్పారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు: వైఎస్ జగన్

విశాఖపట్నంలో ప్రేమోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండడంపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

జొన్న రైతుకు సర్కారు అండ

- బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర అందకపోవడంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు నిర్ణయం
- అధికారులతో భేటీలో వ్యవసాయ మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జొన్న పంటకు బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర అయిన రూ. 3,371కన్నా చాలా తక్కువ రేటు లభిస్తుండటంపై రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. యాసంగిలో రైతులు పండించిన జొన్నలను కనీస మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులతో సమావేశమై ఆదేశించారు. జొన్న పంటను ఎకరాకు ఎన్ని క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలి? ఎన్ని వేల టన్నులు సేకరించాలనే అంశంపై చర్చించారు.

2.97 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

రాష్ట్రంలో 3.44 లక్షల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేయగా 2.97 లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడిని అంచనా వేస్తున్నారు. ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోళ్లు పోగా లక్ష మెట్రిక్ టన్నుల వరకు మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించే అవకాశం ఉంది. ఎకరాకు 8.65 క్వింటాళ్ల దిగుబడి అంచనాతో కొనుగోళ్లు జరపాలని మార్క్‌ఫెడ్ భావిస్తోంది. గతేడాది 93.900 మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ సేకరించింది. సుమారు 50 వేల నుంచి 60 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు ఉంటాయని సమాచారం. గత సంవత్సరం 60 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయగా ఈసారి 70 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

నగర వార్తలు

నగరంలో నేడు

- ఫిలింనగర్‌లోని ఫిలిం చాంబర్ రామానాయుడు కళామండపంలో చుక్కపల్లి శంకరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పద్య నాటక మహోత్సవంలో భాగంగా కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన షణ్ముఖి నాట్యమండలి వారిచే కురుక్షేత్రం నాటక ప్రదర్శన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.
- మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన
- స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

హలీమ్ @ రూ.వెయ్యి కోట్లు!

దేశంలోనే అత్యధికంగా హైదరాబాద్‌లో బిజినెస్

- హైదరాబాదీల మెనూలో హలీమ్‌దే అగ్రస్థానం
- రికార్డు స్థాయిలో 50 లక్షలకుపైగా ప్లేట్ల విక్రయాలు
- గతేడాది రంజాన్ మాసం కంటే ఈసారి 20 శాతం పెరిగిన అమ్మకాలు



సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ వచ్చిందంటే హైదరాబాదీలకు ముందుగా గుర్తుకు వచ్చేది హలీమే. ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే హలీమ్ కోసం మాంసప్రియులు తహతహలాడతారు. ఈసారి రికార్డు స్థాయిలో జరిగిన హలీమ్ అమ్మకాలే దానికి నిదర్శనం. ఏకంగా రూ.వేయి కోట్ల మేర హలీమ్ వ్యాపారం జరిగిందని అంచనా. దేశంలోనే అత్యధికంగా హైదరాబాద్‌లో హలీమ్ విక్రయాలు సాగాయని వ్యాపారులు చెబుతున్నారు. పోషకాలతో కూడిన రుచికరమైన హలీమ్ కేంద్రాలు, హోటళ్లు రంజాన్ నెలంతా కిటకిటలాడాయి. ప్రతి హోటల్ ముందు ప్రత్యేక బట్టీలు, కౌంటర్ల ద్వారా విక్రయాలు సాగాయి. ఈ సీజన్‌లో దాదాపు 50 లక్షల ప్లేట్ల హలీమ్ అమ్మకాలు జరిగినట్లు హైదరాబాద్ హోటళ్ల సంఘం చెబుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 20 శాతం అధికంగా హలీమ్ అమ్మకాలు సాగాయని అంటోంది. కేవలం హోటళ్లలోనే కాదు ఫుడ్ డెలివరీ యాప్‌లలోనూ హలీమ్‌కే ఆహారప్రియులు ఓటేశారు. టేక్ అవేలు, స్విగ్గీ, జొమాటో లాంటి ఫుడ్ డెలివరీ యాప్‌లతో హలీం అమ్మకాలు ఒక రేంజ్‌లో సాగాయి.

ఆరువేల విక్రయ కేంద్రాలు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 6 వేల చిన్నా, చితక హలీమ్ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రధాన రెస్టారెంట్లు వీటికి అదనం. చిన్న, మధ్య తరగతి రెస్టారెంట్లే కాదు స్టార్ హోటళ్లలోనూ రంజాన్ సీజన్ మెనూలో హలీం డిష్‌ను తప్పనిసరి చేశారు. హైదరాబాదీ బిర్యానీని హలీం ఓవర్ టేక్ చేసి మెనూలో టాప్‌లో నిలిచింది. చిన్న హలీం కేంద్రాల్లో రోజుకు దాదాపు వంద ప్లేట్ల చొప్పున అమ్మకాలు జరిగితే, పేరున్న హోటళ్లు, కేంద్రాల్లో సుమారు 500–600 ప్లేట్ల హలీం విక్రయించారని అంచనా.

హలీమ్ ప్లేట్ ధర రూ.100 నుంచి 320 వరకు పలికింది. ఎక్కువ శాతం మటన్ హలీమ్ సెంటర్లు ఉండగా, పలు ప్రాంతాల్లో చికెన్, బీఫ్ కేంద్రాలు కూడా వెలిశాయి. వీటిలో అత్యధికంగా 70 శాతం మేర పాతబస్తీలోనే ఉన్నాయి. సగటున రోజుకు దాదాపు రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్ల వ్యాపారం జరిగిందని అంచనా. సాధారణ రోజుల కంటే వీకెండ్‌లలో 25 శాతం అధికంగా విక్రయాలు జరిగాయని జహంగీర్ అనే హలీం కేంద్ర నిర్వాహకుడు తెలిపారు. పాతబస్తీతో పోలిస్తే సైబరాబాద్‌లో హలీం జోష్ ఎక్కువగా ఉందని, పేరొందిన ఫుడ్ బ్లాగర్స్ కూడా హలీంను ప్రమోట్ చేసేలా వార్తలు ఇవ్వడం అమ్మకాలకు కలిసొచ్చిందని షెరటన్ హోటల్ మేనేజర్ నాసర్ చెప్పారు.

వీకెండ్‌లలో 25 శాతం అధికం..

ఊపిరి పీల్చుకోలేక.. ఉక్కిరిబిక్కిరి..

- జీడిమెట్ల పారిశ్రామికవాడ పరిసరాల్లో ఘాటైన వాసనలు
- ఆరు గంటలపాటు జనం నరకయాతన


అయోధ్యనగర్‌లో నాలాలో రసాయనాలు పారుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జనం నిద్ర నుంచి తేరుకునే లోగా ఘాటైన వాసనలు చుట్టుముట్టాయి.. పరిసరాలను దట్టమైన పొగలు కమ్ముకున్నాయి.. పలుచోట్ల విష రసాయనాలు వరదలాగా పారాయి.. స్థానికులు ఊపిరి పీల్చలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు.. ఇదీ జీడిమెట్ల పారిశ్రామిక వాడ పరిసరాల్లో బుధవారం తెల్లవారుజామున కనిపించిన దృశ్యం. తెల్లవారుజామున 4:30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ఆ ప్రాంత ప్రజలు శ్వాస తీసుకోవడంలో నరకయాతన అనుభవించారు. తుమ్ములు, దగ్గు, తల తిరగడం వంటి వాటితో తీవ్రంగా ఇబ్బంది పడ్డామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడకు ఆనుకొని ఉన్న పలు రసాయన పరిశ్రమల నుంచి తెల్లవారుజామున నాలాల్లో వదిలిన విష రసాయనాలతో ఘాటైన వాసనలు వ్యాపించాయి. వెంకటేశ్వరనగర్, చెరుకుపల్లి ప్రతాపరెడ్డి కాలనీ, అయోధ్యనగర్ , బీరప్పనగర్, వీరస్వామినగర్, కుత్బుల్లాపూర్ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ విషయంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు కేఎం ప్రతాప్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా, అప్రమత్తమైన అధికారులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ ఘాటైన వాసనలు మధ్యాహ్నం వరకు కూడా అదుపులోకి రాకపోవడం గమనార్హం. వారానికి ఒకరోజైనా ఈ తరహా ఘాటైన వాసనలు వస్తున్నందున జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఉన్న రసాయన పరిశ్రమలపై నిఘా పెట్టి నియంత్రించాలని ప్రతాప్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక కాలనీవాసులతో కలిసి రసాయన పరిశ్రమలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉప్పల్ స్టేడియాన్ని ముట్టడించిన యూత్ కాంగ్రెస్



ఉప్పల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు వైఖరిని నిరసిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ముట్టడించారు. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే ఆయన అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్టేడియం గేటు ముందు బైటాయించి జగన్ మోహన్‌రావుకు వ్యతిరేక నినాదాలు చేశారు. అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వాసు, ప్రశాంత్, అశోక్, కిషోర్, నవకాంత్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల టికెట్ల విషయమై వివాదం రగులుతున్న నేపథ్యంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావును తొలగించి కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

క్యాంపస్ నుంచి పోలీసులను బయటకు పంపాలి

- హెచ్‌సీయూ వీసీకి జేఏసీ వినతి


హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావుకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో జరుగుతున్న పరిణామాలు, విద్యార్థుల పోరాటం, పోలీసుల లాఠీచార్జి, అటవీ ప్రాంతాన్ని అధికారులు చదును చేయడం వంటి అంశాలను బుధవారం రాత్రి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావును హెచ్‌సీయూ జేఏసీ ప్రతినిధులు కలిసి వివరించారు. హెచ్‌సీయూ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ భాంగ్యానాయక్, పలు విద్యార్థి సంఘాల నాయకులు సంయుక్తంగా వినతిపత్రాన్ని అందజేశారు. క్యాంపస్ నుంచి వెంటనే పోలీసులను బయటకు పంపించివేయాలని, హెచ్‌సీయూ భూములను రక్షించాలని కోరారు. వీసీ స్పందిస్తూ హెచ్‌సీయూకు న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పోలీసుల అదుపులో నిరుద్యోగ జేఏసీ నేతలు

చిక్కడపల్లి: నిరుద్యోగ జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీజీపీఎస్‌సీ గ్రూప్–1 ప్రధాన పరీక్ష ఫలితాలపై నిరుద్యోగ అభ్యర్థులు మీడియా సమావేశం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, త్యాగరాయ గానసభల వద్ద భారీగా మోహరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ఉన్నందున సమావేశానికి అనుమతి లేదంటూ నిరుద్యోగ జేఏసీ నేతలు జనార్దన్, అశోక్‌లను అదుపులోకి తీసుకొని చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, తెలుగు మాధ్యమ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఒకే కేటగిరీకి చెందిన అభ్యర్థులకు అధిక మార్కులు వచ్చాయని, వెంటనే రీ వాల్యుయేషన్ చేపట్టాలని అన్నారు. ఈ బందోబస్తులో చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు పాల్గొన్నారు.

కుక్కల దాడి.. నెమలికి గాయాలు



గచ్చిబౌలి: కుక్కల దాడిలో గాయపడిన నెమలిని ఓ వాకర్ రక్షించాడు. బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో కుక్కల దాడిలో జాతీయ పక్షి నెమలి గాయపడింది. అటుగా వెళ్లిన ఓ వాకర్ గమనించి నెమలిని అటవీ అభివృద్ధి సంస్థ అధికారులకు అప్పగించారు. అనంతరం వారు దానికి వైద్యం చేసి గార్డెన్‌లో వదిలి పెట్టారు. వీధికుక్కల సంఖ్య ఎక్కువైందని, అవి తరచూ నెమళ్లపై దాడులకు పాల్పడుతున్నాయని వాకర్స్ పేర్కొన్నారు.

గ్రూప్–1లో 100కుపైగా ర్యాంకులు: ఆర్‌సీ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్‌సీ గ్రూప్–1 ఫలితాల్లో వందకుపైగా ర్యాంకులు సాధించినట్లు ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్‌సీ రెడ్డి తెలిపారు. ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్ గత 45 ఏళ్లుగా ఎంతోమంది సివిల్స్, గ్రూప్–1 స్థాయి అధికారులను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎప్పటిలాగే ఈసారి కూడా రికార్డు స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకర్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ వర్సిటీ ప్రతిష్టను పెంచాలి: కంచ ఐలయ్య


చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న కంచ ఐలయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థినులు మహిళా వర్సిటీ కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య సూచించారు. చాకలి ఐలమ్మ పేరు మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టడంతో తెలంగాణ రాష్ట్రం పునీతమైందని అన్నారు. రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని దర్బారు హాల్‌లో వీరనారి చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ఆంగ్ల పద్య రూపంలో ఉన్న చిత్రపటాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశంలో మహిళల పేర్లతో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు చాలా తక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఐలమ్మ పేరు పెట్టడం శుభపరిణామమని కొనియాడారు. మహిళా విద్యాభివృద్ధికి, సాధికారత కోసం దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సావిత్రిబాయి పూలే పేరు ఏ విద్యాసంస్థకూ లేకపోవడం బాధాకరమన్నారు. దేశం కోసం పనిచేసిన వీర వనితల పేర్లను కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు పెట్టాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ పార్లమెంట్‌లో 50 శాతం మహిళా సభ్యులు ఉన్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. వైస్ చాన్స్‌లర్ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం, దీనికి తొలి వైస్ చాన్సలర్‌గా తాను ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను పాటగా పాడి సభికులను అలరించారు.


మాట్లాడుతున్న కనిమొళి, సుప్రియా సూలే

దద్దరిల్లిన జంతర్‌మంతర్

పోరుగర్జనకు దేశం నలుమూలల నుంచి బీసీ నేతలు
- సంఘీభావం ప్రకటించిన పలు జాతీయ పార్టీల ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలనే డిమాండ్‌తో బుధవారం బీసీ జాతీయ సంక్షేమ సంఘం నిర్వహించిన బీసీల పోరు గర్జనతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ దద్దరిల్లింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన బీసీ నేతలు, కార్యకర్తల నినాదాలతో జంతర్‌మంతర్ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ మార్మోగాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ కీలక నేతలంతా హాజరయ్యారు. తెలంగాణ నుంచి సుమారు రెండు వేల మంది ప్రత్యేక రైలులోఢి ఢిల్లీకి తరలి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 200 మంది హాజరయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లోని కీలక నేతలంతా హాజరయ్యారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు సురేశ్ షెట్కార్, మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురామిరెడ్డి, బలరామ్ నాయక్, కడియం కావ్య, అనిల్‌కుమార్, రేణుకా చౌదరి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి, ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, సంజీవరెడ్డి, వాకిటి శ్రీహరి, లక్ష్మీకాంతరావు, రాజ్‌ఠాకూర్, వీర్లపల్లి శంకర్, ప్రకాశ్ గౌడ్ బీర్ల అయిలయ్య, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్, సినీ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఎన్సీపీ–ఎస్పీ నేత సుప్రియా సూలే, డీఎంకే ఎంపీలు కనిమొళి, విల్సన్, ఎస్పీ ఎంపీ నరేశ్‌ఉత్తమ్ పటేల్, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, సీపీఐ కార్యదర్శి నారాయణ, ఆర్జేడీ ఎంపీలు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్, పంజాబ్ పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ బ్రార్, మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ మనుమడు ఇంద్రజిత్ సింగ్ తదితరులు ధర్నాకు మద్దతు ప్రకటించారు.

కుదిరితే సయోధ్య.. లేకుంటే ధర్మయుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి
అని అడుగుతున్నాం. ఇకపై విజ్ఞప్తులు తీసుకొని ఢిల్లీకి రాం. గల్లీలకు వాళ్లు ఎట్లా వస్తారో చూస్తాం. ధర్మయుద్ధం ప్రకటించి మన సత్తా ఏంటో చూపుదాం' అని పిలుపునిచ్చారు.

గద్దె దిగుడో.. గద్దెలు కూల్చుడో..

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచుకుంటామని అడిగితే ప్రధాని మోదీకి వచ్చిన నొప్పేంటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీ కుర్చీ అడిగామా? లేక గుజరాత్‌లో అమలు చేయమన్నామా? అని నిలదీశారు. 'బీజేపీకి హెచ్చరిక జారీ చేస్తున్నా. అయితే రిజర్వేషన్లు పెంచాలి. లేదంటే మీరు గద్దె దిగాల్సిందే.. గ్రామాల్లో గద్దెలు కూలాల్సిందే. ఇదే నినాదంతో ముందుకు పోతాం.


మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్, నారాయణ, భట్టి, పొన్నం, మహేశ్‌గౌడ్, అంజన్‌కుమార్, మక్కాన్‌సింగ్, ఆదిశ్రీనివాస్ తదితరులు

ఇప్పుడు రాకుంటే రిజర్వేషన్లు ఎప్పుడూ రావు. మీకు సహకారం అందించే సీఎంగా నేనున్నా. రాహుల్‌గాంధీ మద్దతు ఉంది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రాష్ట్రాలను ఏకం చేసి రిజర్వేషన్లు పెంచే బాధ్యత రాహుల్‌గాంధీ తీసుకుంటారు. మీరంతా ఏకమై ధర్మయుద్ధం ప్రకటించండి. మీ బలమేంటో పరేడ్ గ్రౌండ్‌లో చూపెట్టండి. ముస్ముందు ఎర్రకోటపై మనమే జెండా ఎగురవేస్తాం. అందరం కలిసి రిజర్వేషన్లను సాధించుకుందాం' అని పిలుపునిచ్చారు.

నరేంద్రమోదీ కమండల్ యాత్ర ప్రతినిధి

రాహుల్‌గాంధీ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కులగణన చేపట్టామని, బీసీల రిజర్వేషన్ల పెంపు తీర్మానం చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ విధానపరంగా వ్యతిరేకమని విమర్శించారు. మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను నియమిస్తే, దానికి వ్యతిరేకంగా బీజేపీ కమండల్ యాత్ర మొదలుపెట్టిందని తెలిపారు. ఆ యాత్ర ప్రతినిధే నరేంద్ర మోదీ అని విమర్శించారు. బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందనే 2021లో చేయాల్సిన జనాభా లెక్కలను బీజేపీ ప్రభుత్వం వాయిదావేసిందని ఆరోపించారు. 'బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టలేదు. మేము బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరడం లేదు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతి ఇస్తే 10 లక్షల మందితో సభ పెట్టి మోదీని సన్మానిస్తాం. అలా కాకుండా మాపై అధికారం చెలాయిస్తామంటే నాడు రజాకార్లకు పట్టిన గతే ఇప్పుడు బీజేపీకి పడుతుంది. జనగణనతో పాటు కులగణన నిర్వహించాల్సిందే. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీసీల కోసం ప్రాణం ఇస్తామంటున్నారు. మాకు ప్రాణాలు అక్కర్లేదు. కేవలం రిజర్వేషన్లు పెంచితే చాలు' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు యువత పోరాడినా గత దుర్మార్గ పాలకులు పట్టించుకోలేదని బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఉద్యోగాలు ఇవ్వనందుకే తండ్రీకొడుకుల ఉద్యోగాలను యువత ఊడగొట్టారని తెలిపారు.

అన్నివర్గాలు రేవంత్‌లోనే..

- ఆయనలో ఒక రెడ్డి, బీసీ, దళితుడు, ముస్లిం, క్రిస్టియన్ ఉన్నాడు
- మోదీ అంటే బీజేపీ నేతలకు భయమా?
- బీసీ మహా గర్జనలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- బీసీలు ఐక్యంగా పోరాడాలి: మంత్రులు పొన్నం, సురేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక అపరిచితుడు అని.. ఆయనలో ఒక రెడ్డి, బీసీ, దళితుడు, ముస్లిం, క్రిస్టియన్, యాదవ్, గౌడ్.. ఇలా అన్ని వర్గాలవారు ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అనేక ఒత్తిళ్లు ఉన్నా సామాజిక కోణంలో కుల సర్వే నిర్వహించి రాష్ట్రంలో బీసీలు మొత్తం 56 శాతం ఉన్నారని తేల్చిన ఘనత రేవంత్‌రెడ్డిదే అని చెప్పారు. బుధవారం జంతర్‌మంతర్‌లో బీసీ పోరు గర్జన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డికి దమ్ము ధైర్యం ఉంది కాబట్టే రాష్ట్రంలో కులగణన సాధ్యమైందని అన్నారు. 'బీసీల మహాగర్జన సభకు హాజరుకాని బీజేపీ నేతలకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదు. వారికి ప్రధాని మోదీ అంటే భయమా? బీసీ సభకు వారు ఎందుకు రాలేదో ప్రజలు నిలదీయాలి. బీసీలపై బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు బీసీ సంఘాల ఆధ్వర్యంలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం. మోదీ కళ్లు తెరవాలి. దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చేపట్టాలని పోరాడుతున్న కాంగ్రెస్‌తో ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావాలి' అని పిలుపునిచ్చారు.

రేవంత్ చరిత్రలో నిలిచిపోతారు

బడుగుల హక్కుల కోసం పోరాడిన ఫూలే, జగ్జీవన్‌రామ్‌లాగే తెలంగాణలో కులగణన నిర్వహించిన రేవంత్‌రెడ్డి కూడా చరిత్రలో నిలిచిపోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలు కులాల పేరుతో విడిపోవొద్దని మంత్రి కొండా సురేఖ కోరారు. బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో


మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్

పెట్టేలా ప్రధాని మోదీపై ఒత్తిడి తెచ్చేందుకే ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కోదండరామ్ తెలిపారు. బీసీలంతా ఐక్యమై ఉడుంపట్టు పడితే 42 శాతం రిజర్వేషన్లు అసాధ్యం కాదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లుతో ముస్లింలకు కూడా న్యాయం జరుగుతుందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. మహా ధర్నాలో ఎన్సీపీ ఎంపీ సుప్రియాసూలే, డీఎంకే ఎంపీ కనిమొళి, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా తదితరులు మాట్లాడారు.

బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీకి పంపేందుకు

పకడ్బందీ స్క్రీన్‌ప్లే

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీకి పంపేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు పకడ్బందీ స్క్రీన్‌ప్లే రచించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ చేసిన తీర్మానాలను తెరమరుగు చేయడమే ప్రభుత్వ ప్రయత్నమని, నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కాపాడేందుకే సీఎం డైవర్షన్ డ్రామాకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళతానని అసెంబ్లీ, కౌన్సిల్ సాక్షిగా హామీ ఇచ్చిన సీఎం ఢిల్లీలో బుధవారం బీసీ సంఘాలు నిర్వహించిన సమావేశానికి హాజరై అఖిలపక్షం అంశాన్ని డైవర్ట్ చేశారని తెలిపారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తే, తనకు అన్నివిధాలా అండగా నిలుస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇరుకున పడుతుందన్నదే రేవంత్‌రెడ్డి భయమన్నారు. బీసీ సంఘాలు సమావేశమైన జంతర్‌మంతర్‌కు కూతవేటు దూరంలోనే మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ ఉన్నా, సమావేశానికి రాలేదని.. ఇది బీసీలను అవమానించడమేనని చెప్పారు.

బీసీ సంఘాల ముసుగులో రేవంత్ ధర్నా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల పేరు చెప్పి ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర బీసీ సంఘాల ముసుగులో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ధర్నాకు దిగారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నంగానే దీనిని తమ పార్టీ చూస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని తాము ముందునుంచీ చెపుతున్నది ఇప్పుడు మరోసారి నిరూపితమైందన్నారు. బీసీలను వాడుకొని వదిలేయాలన్న ఆలోచనే తప్పితే వారి అభివృద్ధి కాదని బుధవారం ఆయన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. 'బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని మీరు హామీ ఇచ్చి, ఇప్పుడు కేంద్రంపై ఎలా నెపం నెడతారు? రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే, ఎలా హామీ ఇచ్చారు? రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే రేవంత్‌రెడ్డి ఈ డ్రామా లాడుతున్నారు. ఆయనే అసలైన బీసీ ద్రోహి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీయే.. రేవంత్‌రెడ్డి వెనకుండి ఈ డ్రామాలు ఆడిస్తున్నారు' అని మండిపడ్డారు.

కాంగ్రెస్ మాయ గర్జన : బీసీ పోరు గర్జన పేరుతో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ మరో రాజకీయ డ్రామాకు తెరతీసిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. 'అది బీసీ గర్జన కాదు.. కాంగ్రెస్ మాయ గర్జన' అని బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు అన్యాయం జరిగిందని, మళ్లీ అదే నాటకం చేస్తున్నారని దుయ్యబట్టారు.

బీసీ సంఘాలు నోరెత్తడం లేదెందుకు?

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తుంటే ఎందుకు నోరెత్తడం లేదని బీసీ సంఘాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో 56 శాతమున్న బీసీలను 46 శాతానికి తగ్గించి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ తీరు చూస్తుంటే ముస్లింల కోసమే బీసీ రిజర్వేషన్లు తెచ్చినట్లు స్పష్టమవుతోందని ఓ ప్రకటనలో విమర్శించారు. 'బీసీలకు అన్యాయం జరుగుతుంటే బీసీ సంఘాల నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు? పైగా కాంగ్రెస్‌ను సంకనేసుకుని ఢిల్లీకిపోయి ధర్నాల పేరుతో డ్రామాలాడటం ఎంతవరకు న్యాయం? ఇకనైనా బీసీ రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధితో కృషి చేయాలి' అని ఆయన పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలే లబ్ధి పొందుతారని, మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ ముమ్మాటికీ వ్యతిరేకమని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ బిల్లువల్ల బీసీలకు అదనంగా దక్కేది 5 శాతమేనని, ఆ లెక్కన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసినట్లా? అన్యాయం చేసినట్లా? అని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఆ అధికారమున్నా కాంగ్రెస్ చేతగానితనాన్ని కేంద్రంపై రుద్ది తప్పించు కోవాలనుకుంటున్నారని సంజయ్ మండిపడ్డారు.

ఢిల్లీలో ధర్నాలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: బీసీల కోసం కాంగ్రెస్ ఢిల్లీలో ధర్నాలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎద్దేవాచేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను 46 శాతమే ఉన్నారనడం బీసీలను వంచించడం కాదా? అని ఒకప్రకటనలో ప్రశ్నించారు. ముస్లిం బీసీలంటూ వారికి రిజర్వేషన్లు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు బద్ధ విరోధి, వ్యతిరేకి అని ఆరోపించారు. బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని బీసీలెన్నటికీ క్షమించబోరన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించే బాధ్యత రాహుల్, సోనియాలదేనని శంకర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని బీజేపీ ఎమ్మెల్యే రామారావు పటేల్ విమర్శించారు. బీసీలకు 42 శాతం హామీ ఇస్తామన్న కాంగ్రెస్, దాన్ని అమలు చేసే ఉద్దేశం లేక ధర్నా పేరుతో డ్రామాలు చేస్తోందని ఒక ప్రకటనలో మండిపడ్డారు.

మొసలి కన్నీరు కార్చుతున్న కేసీఆర్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు కన్నీరు కార్చుతున్నారని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చొని మొసలి కన్నీరు కార్చుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ విమర్శించారు. తమ అధికారం పోయిందన్న అక్కసు, ఈర్ష్యతో సీఎం రేవంత్ రెడ్డి అంటే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బుధవారం మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. ఉచితంగా ఎరువులు ఇస్తామని ప్రకటించి మోసం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా, తాము రైతులకు సాగునీరు ఇస్తున్నందుకు సంతోషంగా లేరా?.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే రూ.62 వేల కోట్లు ఖర్చు చేసినందుకు రైతులు సంతోషంగా లేరా? అని శ్రీనివాస్ ప్రశ్నించారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కి రూ.500 బోనస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తోందని, ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు ఇస్తున్నా కేసీఆర్ విమర్శలు చేయటంలో అర్థంలేదని పేర్కొన్నారు.

బందిపోట్లలా కాంగ్రెస్ సర్కారు తీరు!

▶ మొదటి పేజీ తరువాయి
పయనిస్తోందని, దానిని ఎవరూ రక్షించలేరని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదని తెలుసుకునే సీఎంతోపాటు మంత్రులు వీలైనంత త్వరగా సొంత జేబులు నింపుకొనేందుకు పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి దారితీస్తుందని చెప్పారు. బుధవారం ఎర్రవల్లి నివాసంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లు, దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి సహా 20కిపైగా మంది ముఖ్య నాయకులు పాల్గొన్నట్టు వెల్లడించాయి.

మోదీ పట్ల ఆర్‌ఎస్‌ఎస్ అసంతృప్తి..

''దేశవ్యాప్తంగా బీజేపీ ప్రతిష్ట క్రమంగా మసకబారుతోంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గడమే దీనికి సంకేతం. ఆర్‌ఎస్‌ఎస్ కూడా ప్రధాని మోదీ పనితీరు పట్ల సంతృప్తిగా లేదు. ఆయన ఒంటెద్దు పోకడల పట్ల ఆర్‌ఎస్‌ఎస్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పదవి కోసం ఆర్‌ఎస్‌ఎస్‌ను దేబిరించాల్సిన పరిస్థితిలో ప్రధాని మోదీ ఉన్నారు..'' అని కేసీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలో తొలి రెండు పర్యాయాలు ప్రజలను మభ్యపెట్టి మసిపూసి మారేడుకాయ చేయడం ద్వారానే బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీజేపీ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా నిర్మాణాత్మకంగా దేశానికి చేసినది చెప్పుకునేందుకు ఏమీ లేదని.. దీంతో ప్రజలు మళ్లీ తమవైపు చూస్తున్నారని చెప్పారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ చేసిన పనితో ఇతర పార్టీల పనితీరును ప్రజలు పోల్చి చూసుకుంటున్నారని.. రాష్ట రాజకీయాల్లో నిరంతరం బీఆర్‌ఎస్ చేసిన పనులే ఇతర పార్టీల పనితీరుకు గీటు రాయిలా ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

లక్షలాదిగా సభకు తరలిరావాలి..

ఏప్రిల్ 27న అన్ని గ్రామాల్లోనూ పార్టీ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్ జెండా ఎగరవేసి వరంగల్ సభకు బయలుదేరాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. వరంగల్‌కు దగ్గరలో ఉండే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల నుంచి ఎక్కువ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. ఒక్కో జిల్లా నుంచి కనీసం రెండు లక్షల మంది తరలివచ్చేలా వాహనాలు సమకూర్చుకోవాలని.. ఆర్టీసీ, ఇతర బస్సులను ఇప్పటి నుంచే సమీకరించడం ప్రారంభించాలని సూచించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ప్రచార పోస్టర్ రూపకల్పనకు సంబంధించి కేసీఆర్ పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి... ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ బిగాల, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబుద్దీన్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, పార్టీ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏం ప్రభాకర్.. దుబ్బాకలో ఏం నడుస్తోంది?

ఇటీవల సీఎంను కలవడంతో ఎమ్మెల్యేతో కేసీఆర్ ప్రత్యేక భేటీ



దుబ్బాక: ''ఏం ప్రభాకర్ బాగున్నావా? దుబ్బాకలో ఏం నడుస్తోంది? ప్రజలు ఎలా ఉన్నారు? త్వరలోనే నియోజకవర్గ కార్యకర్తల సమావేశం పెట్టుకుందాం'' అంటూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పలకరించారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం, ఆ తర్వాత దుబ్బాకలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఎర్రవల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయనను కేసీఆర్ ప్రత్యేకంగా పలకరించడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు కొత్త ప్రభాకర్‌రెడ్డితో కేసీఆర్ కాసేపు ప్రత్యేకంగా మాట్లాడినట్టు తెలిసింది. దీనిపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని పలకరించగా.. దుబ్బాకలోనే పుట్టి, చదువుకున్న కేసీఆర్‌కు ఈ ప్రాంతంపై ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. బీఆర్‌ఎస్ శ్రేణులు కలవాలని ఎదురుచూస్తున్నాయని తాను చెప్పడంతో.. ప్లీనరీ తర్వాత రాష్ట్రంలో మొదటి పార్టీ సమావేశం దుబ్బాకలోనే పెట్టుకుందామని కేసీఆర్ చెప్పారని వివరించారు.

పాతికేళ్ల పండుగకు బీఆర్‌ఎస్ సన్నద్ధం

- హనుమకొండ జిల్లా చింతలపల్లి వద్ద భూమిపూజ
- ఈ నెల 27న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవం
- 1,200 నుంచి 1,600 ఎకరాల్లో సభ నిర్వహణ


రజతోత్సవ సభా స్థలంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సభ ఏర్పాట్లకు బుధవారం అంకురార్పణ జరిగింది. అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కలిసి ఉండే చింతలపల్లి శివారులో పార్టీ నేతలు శాస్త్రోక్తంగా పూజలు చేసి పనులను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సభా పర్యవేక్షకుడు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, ఇతర ముఖ్య నేతలు భూమి పూజలో పాల్గొన్నారు. భారీ సభావేదిక నిర్మాణం కోసం కొబ్బరికాయలు కొట్టి పలుగు, పారతో మట్టి తీసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన నాటి టీఆర్‌ఎస్, నేటి బీఆర్‌ఎస్ ఇప్పటికీ, ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందన్నారు. తెలంగాణ కోసం బీఆర్‌ఎస్‌ను స్థాపించి తెగించి కొట్లాడి త్యాగాలు చేసిన నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని అన్నారు. తెలంగాణను దేశంలోనే నంబర్1గా నిలిపి 10 సంవత్సరాలు ప్రజలకు సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన పార్టీ రజతోత్సవ వేడుకలకు వరంగల్ వేదిక కావడం సంతోషంగా ఉందని, 14 ఏళ్ల పోరాటం, పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ పాత్రను ప్రజలకు వివరిస్తామని అన్నారు. పది లక్షల మంది సభకు వచ్చే అవకాశం ఉన్నందున సభావేదిక, పార్కింగ్, ప్రజల కోసం 1,200 నుంచి 1,600 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 27న సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చర్యలు తీసుకోకున్నా చేతులు కట్టుకొని చూస్తుండాలా?

▶ మొదటి పేజీ తరువాయి
కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఎస్ఎల్పీపై సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం, రిట్ పిటిషన్‌పై దామ శేషాద్రి నాయుడు, పి.మోహిత్ రావు వాదనలు వినిపించగా స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

స్పీకర్ స్వతంత్రుడు...

తొలుత ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ 'స్పీకర్ స్వతంత్రుడు, కోర్టులు ఆదేశాలు ఇవ్వజాలదు. స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తర్వాతే న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుంది. సుప్రీంకోర్టుకు హైకోర్టులపై నియంత్రణ అధికారం లేదు. స్పీకర్ తన విధానాలకు స్వతంత్రుడు. కాబట్టి కోర్టు ఆదేశాలు ఇవ్వజాలదు' అని పేర్కొన్నారు. ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. ఇది రాజ్యాంగ తీర్పులకు వ్యతిరేకమని వ్యాఖ్యానించింది. సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని తాము స్పీకర్‌కు చెప్పలేమా? అంటూ ముకుల్ రోహత్గీని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 'మేం అలా చేయకపోతే రాజ్యాంగ నిబంధనలను నిరాశ పరిచినవారమవుతాం. 2, 3, 4 ఏళ్లు నిర్ణయం తీసుకోకపోయినా ఆర్టికల్ 226 కింద ఆదేశాలు జారీ చేయడానికి కోర్టుకు అధికారం లేదని మీరెలా అంటారు?' అని ధర్మాసనం ప్రశ్నించింది. అనర్హత పిటిషన్లను నిర్దిష్ట కాలపరిమితిలో నిర్ణయించాలని తాము స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే హైకోర్టులో పిటిషనర్లు పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు వేస్తూ వచ్చారని.. కనీసం స్పీకర్‌కు ఫిర్యాదును పరిశీలించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని తెలిపారు.

చర్యలకు ఉపక్రమించొచ్చు

ముకుల్ రోహత్గీ వాదనలపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'న్యాయస్థానాలు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయి. 11 నెలలుగా స్పీకర్ ఫిరాయింపులపై స్పందించలేదు. మేం జోక్యం చేసుకున్న తర్వాతే కదా వాళ్లకు మీరు నోటీసులు ఇచ్చింది. మేం స్పందించకపోతే ఇలాగే మరో నాలుగేళ్లు వేచి చూసేవాళ్లేమో?, స్పీకర్ జోక్యం చేసుకోకుంటే మేం ఇలాగే చేతులు కట్టుకొని కూర్చోవాలా? ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచినట్లే. రాజ్యాంగ సంరక్షకుడిగా వ్యవహరించాల్సిన బాధ్యత మాపై ఉంది. 'సింగిల్ బెంచ్ కేవలం స్పీకర్‌ను నాలుగు వారాల్లో షెడ్యూల్‌ను నిర్ణయించాలని మాత్రమే అడిగింది. అలాంటప్పుడు అందులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం లేదు. కానీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలు, అభ్యర్థనలను రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి అయినా పాటించనప్పుడు.. వారిపై చర్యలు తీసుకొనే అధికారం ఉంటుంది. మా నిర్ణయాన్ని స్పీకర్‌కు అభ్యర్థన రూపంలో తెలియపరుస్తాం. అప్పటికీ స్పీకర్ స్పందించకపోతే ఆర్టికల్ 142 ప్రకారం మా అధికారాలు ఉపయోగించి చర్యలకు ఉపక్రమిస్తాం. గతంలో మాకున్న అధికారాలతో ఓ స్పీకర్‌ను కోర్టుకు పిలిపించిన విషయాన్ని మర్చిపోవద్దు' అంటూ ధర్మాసనం గుర్తుచేసింది. ముకుల్ రోహత్గీ వాదనల అనంతరం స్పీకర్ కార్యదర్శి తరపున అభిషేక్ మనుసింఘ్వీ, ఎమ్మెల్యేల తరఫున రవిశంకర్ జంధ్యాల, ఎమెల్యేల తరఫున గౌరవ్ అగర్వాల్‌లు వాదనలను వినిపించారు. స్పీకర్, స్పీకర్ కార్యదర్శి తరఫున ముగ్గురు వాదనలను వినిపిస్తారా? ఏం చెప్పినా ఒకటే కదా మీ అందరూ చెప్పేది అంటూ జస్టిస్ గవాయి వారిని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

సీఎం రేవంత్‌పై సుప్రీం ఆగ్రహం

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 'రాష్ట్రంలో ఉపఎన్నికలు రావు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను విచారణ సందర్భంగా బీఆర్‌ఎస్ తరఫు న్యాయవాది ఆర్యమా సుందరం సుప్రీం ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'స్పీకర్ సమక్షంలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను అపహాస్యం చేసినట్లే' అని ధర్మాసనం మండిపడింది. అయితే తాను సీఎం తరఫున వాదనలను వినిపించట్లేదని.. అందువల్ల ఆ వ్యాఖ్యల గురించి వివరించలేకపోతున్నానని ముకుల్ రోహత్గీ బదులిచ్చారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ గతంలో అదే సీఎం తరఫున ఒక కేసులో హాజరైన విషయం మర్చిపోవద్దంటూ గుర్తుచేశారు. 'రాజకీయ నాయకులు అసెంబ్లీలో ఏదైనా చెప్పినప్పుడు దానికి కొంత పవిత్రత ఉంటుంది, ప్రజలు ఆ మాటలను విశ్వసిస్తారు. మేము కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేయడంలో నెమ్మదిగా ఉండొచ్చు.. కానీ శక్తిలేని వారమైతే కాదు. కాబట్టి ఇకపై ఇటువంటి వ్యాఖ్యలను పునరావృతం చేయొద్దని సీఎంకు చెప్పి హెచ్చరించండి' అని ధర్మాసనం రోహత్గీకి సూచించింది. అనంతరం ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించనున్నారు. అనంతరం ఆర్యమా సుందరం రోహత్గీ, సింఘ్వీల వాదనలపై రిప్లయి ఇవ్వనున్నారు.

ఆర్టికల్ 142 ఏం చెబుతోందంటే...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు విస్తృతాధికారాలు కల్పిస్తోంది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌పై అవసరమైన ఉత్తర్వులు జారీ చేసేందుకు అవకాశమిస్తుంది. ఈ ఉత్తర్వులను దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అమలు చేసి తీరాల్సిందే. గతంలో ఈ ఆర్టికల్ మేరకు అధికారాలను వినియోగించి భోపాల్ గ్యాస్ లీక్ కేసులో పరిహారం అందించాలని, జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్లలోపు వైన్ షాపులు ఏర్పాటు చేయవద్దని.. ఇలా పలు కేసుల్లో సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 3-4-2025

స్త్రీ శక్తి



ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన స్త్రీ–టీ క్యాంటీను



'మా పాప–మా ఇంటి మణిదీపం' కార్యక్రమానికి హాజరైన ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

'ఆడపిల్ల పుట్టింది' అనే వార్త చెవిన పడగానే... 'మా ఇంటికి మహాలక్ష్మి వచ్చింది' అంటూ సంబరం అంబరాన్ని అంటాలి. 'మా పాప–మా ఇంటి మణి దీపం' ఇచ్చే స్ఫూర్తి అదే. 'ఆడ పిల్లలు ఎంత చదివితే అంత ముందుకు వెళతారు. అంత అదనపు శక్తి వస్తుంది' అని అమ్మమ్మ చెబుతుండే వారు. తన అమ్మమ్మ స్ఫూర్తితో చదువు నుంచి స్వయం ఉపాధి వరకు మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నారు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్...

మా ఇంటి మణిదీపం

'బేటీ బచావో...బేటీ పడావో' స్ఫూర్తితో ఖమ్మం జిల్లాలో 'మా పాప–మా ఇంటి మణి దీపం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్ల పుట్టిన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, నానమ్మని సత్క రిస్తారు. శాలువ కప్పి స్వీట్ బాక్స్, పండ్లు, ఒక సర్టిఫికెట్‌ను అందజేస్తారు. కొందరి ఇళ్లకు స్వయంగా కలెక్టర్ వెళుతున్నారు.



మా అమ్మమ్మ అలా లాయర్ అయింది...

మహిళలు చదువుకుంటే తరతరాలుగా ఆ కుటుంబం బాగుపడుతుందని చెబుతారు. అది కళ్లతో చూశా. మా అమ్మమ్మకు పన్నెండేళ్లకే పెళ్లి చేశారు. అమ్మమ్మ వాళ్ల ఇంటి ఎదుట కిరాణాషాపు ఉండేది. అక్కడ సరుకులను న్యూస్ పేపర్లలో కట్టి ఇచ్చేవారు. ఆ న్యూస్ పేపర్లను చదువుతూ మరోసారి చదువుపై ఆసక్తిని పెంచుకుని బీఈడీ, ఎంఈడీ పూర్తి చేసింది. లాయర్ అయింది. అప్పుడే నాకు తెలిసింది చదువుతో ఎంతైనా సాధించ వచ్చునని.

– ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్, ఖమ్మం

హాజరు శాతం పెరిగింది

పాఠశాలల్లో బాలికల హాజరు శాతంపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. బాలికల హాజరు శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో బాలికల హాజరు శాతం 86 నుంచి 92 శాతానికి పెరిగింది. పాఠశాలల్లో బాలికలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకున్నారు.



కలెక్టర్ మా ఇంటికి వచ్చారు!

నాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. మా ఇంటికి కలెక్టర్ సార్ వచ్చిండు. మాకు సన్మానం చేసి, పూలు, పండ్లు, స్వీట్లు ఇచ్చారు. సర్టిఫికెట్ అందజేశారు. మా పాప పెద్దయ్యాక ఈ సర్టిఫికెట్ చూపించి కలెక్టర్ ఇచ్చారని చెప్పమన్నారు. 'మీకు మహాలక్ష్మి పుట్టింది. బాగా చదివించండి. భవిష్యత్తులో మంచి ఉద్యోగం సంపాదిస్తుంది' అంటూ ఆశీర్వదించారు.

– బానోత్ కృష్ణవేణి, రామచంద్రాపురం, ఖమ్మం జిల్లా

ఆర్థిక శక్తి

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఉపాధి కలిగిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో స్త్రీ–టీ క్యాంటీన్లు ప్రసిద్ధి చెందాయి.

ఇప్పటికే 50 కి పైగా క్యాంటీన్‌ల వరకు జిల్లా వ్యాప్తంగా లాభాల బాటలో నడుస్తుండగా మరిన్ని క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. యూనిట్లను మంజూరు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు వాటి పనితీరును కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

– బొల్లం శ్రీనివాస్, సాక్షి ప్రతినిధి, ఖమ్మం

సాహస పథం

శిఖరాన్ని వంచింది

ప్రకృతి పాఠశాల అంటే భరణికి చిన్నప్పటి నుంచి ఇష్టం. ఆ ఇష్టమే ఆమెను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చేలా చేసింది. కొండలు, కోనలు భరణి నేస్తాలు. ఆ స్నేహమే ప్రపంచంలోని ప్రసిద్ధ పర్వతాలు అధిరోహించేలా చేస్తోంది. లద్దాఖ్‌లోని కాంగ్ యాప్సే నుంచి రష్యాలోని ఎల్ బ్రస్ పర్వతం వరకు ఎన్నో పర్వతాలను అధిరోహించిన చిత్తూరు జిల్లా డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) భరణి గురించి...



కిలిమంజారోపై...



భరణి

స్ఫూర్తినిచ్చే సాహసికుల గురించి వినడం, చదవడం భరణికి ఎంతో ఇష్టమైన పని. అలా విన్నప్పుడు, చదివినప్పుడు తాను కూడా ఆ పర్వతాలను అధిరోహించినట్లు కల కనేవారు. ఆ కల నిజమయ్యే సమయం రానే వచ్చింది. ఐపీఎస్ అధికారి అతుల్ కరవాల్ 50 ఏళ్ల వయసులో ఎవరెస్టు అధిరోహించడం భరణిని ప్రభావితం చేసింది. అతుల్ కరవాల్ ఎవరెస్ట్ అధిరోహించినట్లే తానూ ప్రపంచంలో మేటి శిఖరాలను అధిరోహించాలనుకున్నారు. 30 రోజులపాటు శిక్షణ తీసుకున్నారు భరణి.

శిక్షణ తరువాత... ఎన్నో శిఖరాలు

రంపచోడవరంలో ఉప అటవీశాఖ అధికారిణిగా పనిచేస్తూనే డార్జిలింగ్‌లో కేంద్ర రక్షణ శాఖ నిర్వహిస్తోన్న హిమాలయన్ మౌంటెనరీ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు పూర్తి చేశారు. తొలి ప్రయత్నం గా లద్దాఖ్‌లోని కాంగ్ యాప్సే పర్వతాన్ని అధిరోహించారు.

తొలి ప్రయత్నం... తొలి విజయం.

తన మీద తనకు ఎంతో నమ్మకం వచ్చింది. మరింత ఉత్సాహం వచ్చింది. ఆ తరువాత...ఉత్తరాఖండ్‌లోని 4,200 మీటర్ల మల్లార్ లేక్ శిఖరాన్ని, రష్యాలో 5,642 మీటర్ల ఎత్తైన ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించారు.

కిలిమంజారో పిలిచింది

ఎన్నోసార్లు ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతం గురించి ఆసక్తిగా విన్న భరణి ఆ పర్వతాన్ని అధిరోహించాలనుకున్నారు. కిలిమంజారో ఎత్తు 5,895 మీటర్లు. వీపుపై 28 కిలోల బరువును మోస్తూ ఏటవాలుగా ఉన్న కొండలను ఎక్కడమంటే పెద్ద సాహసమే. ఏమాత్రం పట్టు తప్పినా ప్రాణాలకే ప్రమాదం. అయినా సరే కంటిముందు లక్ష్యం మాత్రమే కనిపించిందని భరణి చెబుతారు.

26 గంటలపాటు సుదీర్ఘంగా కిలిమంజారో అధిరోహణ సాగిందని, పర్వత శిఖరాగ్రంపై పాదం మోపిన వెంటనే కష్టాలన్నీ క్షణంలో మరచిపోయానని అంటారు భరణి.

ప్రతి సాహసం ఒక పాఠమే

ప్రతి ప్రయాణం, ప్రతి సాహసం ఎన్నో పాఠాలు నేర్పుతుంది. అలా ఎప్పటికప్పుడు కొత్త కొత్త పాఠాలు నేర్చుకుంటున్నాను. 'హాయిగా ఉద్యోగం చేసుకోకుండా ఎందుకు ఈ రిస్క్?' అనే వాళ్లు కూడా ఉంటారు. అయితే రిస్క్ లేనిది ఎక్కడా! సాహసం చేస్తేనే దానిలో ఉన్న మజా ఏమిటో తెలుస్తుంది. ఒక సాహసం మరొక సాహసానికి స్ఫూర్తినిస్తుంది. పర్వతారోహణ అనేది మనలోని ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసే సాహసం. భవిష్యత్‌లో మరిన్ని ప్రసిద్ధ పర్వతాలను అధిరోహించాలనుకుంటున్నాను.

– భరణి

ప్రకృతి పాఠశాలలో...

తమిళనాడులోని కోయంబత్తూరు భరణి జన్మస్థలం. తండ్రి సాథూర్ స్వామి ఆర్మీ ఆఫీసర్. తల్లి పద్మ టీచర్. నాన్న ఉద్యోగరీత్యా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆమె చదువు కొనసాగింది. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ పూర్తి చేసింది. తొమ్మిదో తరగతిలో కొడైకెనాల్‌కు విహారానికి వెళ్లినప్పుడు ఆ దట్టమైన అటవీ ప్రాంతం, సరస్సులు, కొండల నడుమ జాలువారే జలపాతాలు భరణి మనసును కట్టిపడేశాయి. పర్వతప్రాంతాలకు వెళ్లేటప్పుడు పర్వతారోహణకి సంబంధించి మెలకువలు నేర్చుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని శిఖరాలను అధిరోహించాలనేది భరణి కల.

ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.

– నామా హరీశ్, సాక్షి, చిత్తూరు

ఈ రాతగాళ్లు సవ్యసాచులు






రెండు చేతులతో సంపాదించే వాళ్లను చూశాం కానీ.. రెండు చేతులతో రాసే పిల్లల్ని చూడాలంటే మధ్యప్రదేశ్ వెళ్లాల్సిందే. సింగ్రౌలీ జిల్లాకు 15 కిలోమీటర్ల దూరంలోని బుధేలా గ్రామంలో వీణావాదిని పబ్లిక్ స్కూల్ ఉంది. 1999 జూలై 8న ఈ పాఠశాలను స్థాపించారు. ఇక్కడి విద్యార్థుల ప్రత్యేకత ఏమిటంటే ఒకే సారి ఐదు భాషల్లో రెండు చేతులను ఉపయోగించి రాయగలరు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ ద్విచేతి విద్యలో ఆరితేరారు. హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, ఉర్దూ, స్పానిష్ భాషల్లో ప్రావీణ్యులు. అలాంటి శిక్షణ పొంది ఇప్పటివరకు 500 మందికి పైగా ఉత్తీర్ణత సాధించారు.. ఇది భారతదేశంలోనే తొలి సవ్యసాచి పాఠశాలగా గుర్తింపు పొందింది.





రెండు చేతులతో అందమైన చేతిరాతను సాధన చేస్తూ..

మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, రతన్‌టాటా, బిల్‌గేట్స్, సచిన్ టెండుల్కర్, బరాక్ ఒబామా వంటి ప్రముఖులు ఎడమ చేత్తో రాసేవారు. పూర్వ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ రెండు చేతులతో రాయగల నేర్పరి. ఆయన స్ఫూర్తితో తమ విద్యార్థులకు ఈ సృజనను నేర్పినట్లు ప్రిన్సిపాల్ వ్యంగద్ శర్మ అంటారు. తొలుత సైనికుడిగా ఉన్న ఆయన రాజీనామా చేసి ద్విచేతి విద్యలో శిక్షణ పొందారు. అప్పుడే ఈ పాఠశాలను నెలకొల్పి చిన్న వయసు విద్యార్థులకు రెండు చేతులతో రాయడం నేర్పించడం ప్రారంభించారు. నిరంతర సాధనతో ఈ పాఠశాల విద్యార్థులు కేవలం 11 గంటల్లో 24 వేల పదాలు రాయగలరు. రెండు చేతులతో రాయడం వల్ల గుర్తుంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది. దీన్ని ఆధ్యాత్మిక సాధనగా ఆయన అభివర్ణించారు. యోగ, ధ్యానం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అందుకే రోజూ గంట సేపు స్కూల్లో వీటిని సాధన చేయిస్తారు.





మధ్యప్రదేశ్‌లోని బుధేలా గ్రామంలో గల వీణావాదిని స్కూల్... ప్రిన్సిపాల్, వ్యవస్థాపకుడు వ్యంగద్ శర్మ

అనువాద బ్రహ్మలు

విద్యార్థులు ఒకటి నుంచి 100 పదాలు ఉర్దూలో 45 సెకన్లు, రోమన్‌లో ఒక నిమిషంలో, దేవనాగరి లిపి ఒక నిమిషంలో రాయగలరు. ఒక నిమిషంలో రెండు భాషల నుంచి 250 పదాలను అనువదించగలరు. నిమిషంలో 17 పదాల వరకు రాయగలరు. వారికి ఒక చేత్తో రెండు పదాల పట్టికను, మరో చేత్తో మూడు పదాల పట్టికను రాస్తే సత్తా ఉంది.

కొంతమంది పిల్లలను పలకరించినప్పుడు వారు తమ అనుభవాలను పంచుకున్నారు. మూడోతరగతిలో ఉన్నప్పుడు కుడిచేత్తోనే రాసేవారట. తర్వాత ఎడమ చేతి వాటం నేర్చుకున్నారు. ఎనిమిదో తరగతికి వచ్చేసరికి ఒకేసారి రెండు చేతులతో.. అది కూడా ఐదు భాషలను మార్చి మార్చి రాసే ప్రావీణ్యతను సంపాదించినట్లు చెప్పారు. మానవ మెదడు రెండు భాగాలుగా విభజించి ఉంటుంది. ఆ రెండింటినీ ఒకేసారి ఉపయోగించగలిగేలా ఉపాధ్యాయులు పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అందుకే ఏకకాలంలో రెండు చేతులతో రాయగలరని మనస్తత్వవేత్తలు చెబుతున్నారు.

– చెన్నాప్రగడ శర్మ

మన(సు)లో మాట

ఆ హీరోనే పెళ్లి చేసుకుంటాననంటోంది!

మాది తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి. మా అమ్మాయి ఈ మధ్యే బి.టెక్. పూర్తి చేసింది. తనకి సంబంధాలు చూడడం మొదలుపెట్టాం. తను ఈ మధ్య కాస్త విచిత్రంగా మాట్లాడటం మొదలుపెట్టింది. తాను ఒక సినిమా హీరోని ప్రేమిస్తున్నానని, అతణ్ణి మాత్రమే పెళ్ళి చేసుకుంటానని అంటోంది. ఏదో చిన్న పిల్ల సరదాగా మాట్లాడుతుంది అనుకున్నాము. ఆ హీరో కూడా తనను ఇష్టపడుతున్నాడని, అందుకే తాను ఎవర్నీ పెళ్ళి చేసుకోవట్లేదని ఏదేదో మాట్లాడుతుంది. తన గది నిండా ఆ హీరో ఫోటోలతో నింపేసింది. ఫోన్‌లో ఎప్పుడూ ఆ హీరో సినిమాలే చూస్తుంటుంది. అతను ఇంటర్వ్యూలో ఏదైనా మాట్లాడితే అది తనకి ఇన్‌డైరెక్ట్‌గా మెసేజెస్ పంపిస్తున్నాడని అనుకుంటుంది. సినిమా ఇండస్ట్రీలో కొంతమంది తమను కలుసుకోకుండా అడ్డం పడుతున్నారని, అందుకే నేరుగా వెళ్ళి తనను కలుస్తానని, ఇంట్లో నుండి వెళ్ళిపోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. మేం గట్టిగా చెప్తే ఏదైనా చేసుకుంటా అని బెదిరిస్తోంది. మాకు ఏం చెయ్యాలో పాలుపోవట్లేదు. దయచేసి మాకు ఈ సమస్య నుండి బయటపడే దారి చూపెట్టండి.

– విజయలక్ష్మి, రాజమండ్రి

మీరు రాసిన లక్షణాలన్నీ 'ఎరటో మేనియా' లేదా 'డిక్లేరాంబాల్ట్ సిండ్రోమ్' అనే ఒక రకమైన మానసిక రుగ్మతకు సంబంధించినవి. ఈ సమస్య ఎక్కువగా మహిళల్లోనే చూస్తుంటాం. తమకంటే బాగా ఉన్నతమయిన స్థాయిలో లేదా పదవిలో ఉన్న పురుషులు లేదా సినిమా స్టార్స్, స్పోర్ట్స్ స్టార్స్ లాంటి వారు తమతో రహస్యంగా ప్రేమలో ఉన్నారనే భ్రమలో ఉంటారు. వాళ్ళ ప్రవర్తనని, మాట్లాడే మాటలని తమకోసమే చేస్తున్నారని తప్పుగా భావించుకుంటారు. వాళ్ళకి ఉత్తరాలు, ఇమెయిల్స్, బహుమతులు పంపడం లాంటివి కూడా చేస్తుంటారు. అవతలివైపు నుండి ఎటువంటి స్పందన లేకపోతే తమ మధ్య వేరేవాళ్ళు అడ్డుపడుతున్నారనో లేదా కావాలనే అవతలి వ్యక్తి గోప్యతని పాటిస్తున్నారని కూడా వాదిస్తారు. వాళ్ళు అనుకునేది నిజం కాదు, భ్రమ అని చెప్పడానికి ఎవరైనా ప్రయత్నిస్తే, నమ్మకపోగా గొడవలు చేయడం, ఇంట్లో నుండి వెళ్ళిపోవడం లేదా ఏదైనా చేసుకుంటాం అని బెదిరించడం లాంటివి కూడా చేస్తారు. వాళ్ళకి ఉన్నది ఒక మానసిక సమస్యే అని వారికి తెలియకపోవడం వల్ల వారితో మందులు వేయించడం కూడా కష్టమే. ఇది కాస్త క్లిష్టమైన మానసిక సమస్యే అయినప్పటికీ కొంతకాలం వాళ్ళని సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో, ఆసుపత్రిలో ఉంచి, మందులు, కౌన్సెలింగ్ ద్వారా వైద్యం చేస్తే క్రమంగా వాళ్లలో మార్పు తీసుకురావచ్చు. వెంటనే మీ దగ్గర్లోని మానసిక వైద్యుని దగ్గరకు తీసుకువెళ్ళి తగిన వైద్యం చేయించండి.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

ఆహా!

మూడు సెకన్లలో... మూడు దేశాలలో!





'మూడు సెకన్‌లలో మూడు దేశాల్లోకి అడుగు పెట్టగలరా?' అని అడిగితే... సమాధానం ఏమిటో మనకు తెలియనిదేమీ కాదు.

ఒక యువతి మాత్రం... 'కచ్చితంగా సాధ్యమే' అని నిరూపించింది. కేవలం మూడు సెకన్‌ల వ్యవధిలో భారతీయ యువతి ఒకరు మూడు దేశాల్లోకి అడుగు పెట్టిన వీడియో క్లిప్ 'వావ్' అనేలా చేస్తోంది. సామ్రాంగి సాధు జిలిక్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ క్లిప్‌ను పోస్ట్ చేశారు. జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం సరిహద్దులు కలిసే అపూర్వప్రదేశం ఆచెన్‌లో నిలబడి కనిపిస్తుంది ఈ యువతి. 'ప్రసిద్ధ మూడు దేశాల పాయింట్' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. మూడు దేశాల సరిహద్దు రేఖల మధ్య మూడు సెకన్‌లలో యువతి దూకుతున్న దృశ్యం వీడియో క్లిప్‌లో కనిపిస్తుంది. మూడు దేశాల సరిహద్దులు ఒకే చోట కలుసుకునే ప్రపంచంలోని అతికొద్ది ప్రదేశాల్లో ఆచెన్ ఒకటి.

సమ్‌థింగ్ స్పెషల్



మా తాత పెళ్లికి ఆహ్వానం

1960లలో...

హర్షద్, మృదు అనే యువ జంట ప్రేమించుకున్నారు. వారి ప్రేమ పెళ్లి వరకు రావడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వారి వివాహం అత్యంత నిరాడంబరంగా జరిగింది. తమ ప్రేమ కష్టాల గురించి వారు తమ పిల్లలకు చెబుతుండేవారు.

'అప్పుడెప్పుడో అలా జరిగింది అని బాధ పడవద్దు. ఇప్పుడు మీ పెళ్లి గ్రాండ్‌గా చేయాలనుకుంటున్నాం' అనడమే కాదు ఎన్నో దశాబ్దాల తరువాత హర్షద్, మృదు పెళ్లివేడుకలను ఘనంగా చేశారు మనవళ్లు, మనవరాళ్లు.

హృదయాన్ని కదిలించే ఈ పెళ్లి వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అయిదు మిలియన్‌లకు పైగా వ్యూస్‌ను ఈ వీడియో సొంతం చేసుకుంది.

'అద్భుతమైన ప్రేమకథ' అంటూ స్పందించారు నెటిజనులు.



సెమీస్‌లో జాదుమణి సింగ్

న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో రెండో రోజు భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. జాదుమణి సింగ్ (50 కేజీలు) సెమీఫైనల్ చేరుకొని కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకోగా... నరేందర్ బెర్వాల్ (ప్లస్ 90 కేజీలు), నిఖిల్ దూబే (75 కేజీలు), జుగ్నూ (85 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు లుగాకు పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. ఎలిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రస్తుత జాతీయ చాంపియన్ జాదుమణి సింగ్ 3-2తో గెలుపొందాడు. నరేందర్ 2-3తో నపార్చె డానియల్ (కజకిస్తాన్) చేతిలో, నిఖిల్ 0-5తో కయు బెలిని (బ్రెజిల్) చేతిలో, జుగ్నూ 1-4తో అబ్దులయె ట్రారోర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు. భారత్ నుంచి ఈ టోర్నీలో పది మంది బాక్సర్లు బరిలోకి దిగగా... నలుగురు బాక్సర్లు ఆరంభ రౌండ్లలోనే ఓడిపోయారు. మనీశ్ రాథోడ్ (55 కేజీలు), హితేశ్ (70 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) తమ తొలి రౌండ్ బౌట్‌లు ఆడాల్సి ఉంది. ఆరు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నీలో 19 దేశాల నుంచి 130 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

గువాహటిలో తొలిసారి టెస్టు

- స్వదేశంలో భారత క్రికెట్ జట్టు షెడ్యూల్ విడుదల
- విశాఖపట్నంలో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో వన్డే



ముంబై: ఈ ఏడాది సొంతగడ్డపై భారత జట్టు ఆడే మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదలైంది. ఈ సంవత్సరం భారత క్రికెట్ జట్టు స్వదేశంలో 4 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా స్వరాష్ట్రం అస్సాంలో భారత జట్టు తొలిసారి టెస్టు మ్యాచ్ ఆడనుంది. గువాహటిలోని అస్సాం క్రికెట్ సంఘం (ఏసీఏ) స్టేడియం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో టెస్టుకు నవంబర్ 26 నుంచి ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. వెస్టిండీస్‌తో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. అనంతరం దక్షిణాఫ్రికాతో టీమిండియా రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టి20 మ్యాచ్‌ల్లో తలపడుతుంది. భారత్-దక్షిణాఫ్రికా మధ్య డిసెంబర్ 6న జరిగే మూడో వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం వేదిక కానుంది.

స్వదేశంలో భారత జట్టు షెడ్యూల్

- అక్టోబర్ 6-10: భారత్ X వెస్టిండీస్ తొలి టెస్టు (అహ్మదాబాద్)
- అక్టోబర్ 14-18: భారత్ X వెస్టిండీస్ రెండో టెస్టు (కోల్‌కతా)
- నవంబర్ 18-22: భారత్ X దక్షిణాఫ్రికా తొలి టెస్టు (న్యూఢిల్లీ)
- నవంబర్ 26-30: భారత్ X దక్షిణాఫ్రికా రెండో టెస్టు (గువాహటి)
- నవంబర్ 30: భారత్ X దక్షిణాఫ్రికా తొలి వన్డే (రాంచీ)
- డిసెంబర్ 3: భారత్ X దక్షిణాఫ్రికా రెండో వన్డే (రాయ్‌పూర్)
- డిసెంబర్ 6: భారత్ X దక్షిణాఫ్రికా మూడో వన్డే (విశాఖపట్నం)
- డిసెంబర్ 9: భారత్ X దక్షిణాఫ్రికా తొలి టి20 (కటక్)
- డిసెంబర్ 11: భారత్ X దక్షిణాఫ్రికా రెండో టి20 (చండీగఢ్)
- డిసెంబర్ 14: భారత్ X దక్షిణాఫ్రికా మూడో టి20 (ధర్మశాల)
- డిసెంబర్ 17: భారత్ X దక్షిణాఫ్రికా నాలుగో టి20 (లక్నో)
- డిసెంబర్ 19: భారత్ X దక్షిణాఫ్రికా ఐదో టి20 (అహ్మదాబాద్)

ముంబై నుంచి గోవాకు...

దేశవాళీ క్రికెట్‌లో జట్టు మారనున్న భారత స్టార్ యశస్వి జైస్వాల్



ముంబై: భారత స్టార్ క్రికెటర్ యశస్వి జైస్వాల్ దేశవాళీ టోర్నీలలో ఇక ముంబై జట్టు తరఫున బరిలోకి దిగకూడదని నిర్ణయం తీసుకున్నాడు. 2025-2026 దేశవాళీ సీజన్‌లో యశస్వి గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ముంబై నుంచి విడుదల చేసి... గోవా జట్టు తరఫున ఆడేందుకు నిరభ్యంతర పత్రం అందజేయాలని కోరుతూ ముంబై క్రికెట్ సంఘానికి యశస్వి దరఖాస్తు చేసుకున్నాడు. యశస్వి కోరినట్లే ముంబై క్రికెట్ సంఘం అతనికి నిరభ్యంతర పత్రం జారీ చేసింది. వచ్చే సీజన్‌లో 23 ఏళ్ల యశస్వి గోవా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సమాచారం.

12 ఏళ్ల ప్రాయంలో క్రికెటర్ కావాలనే కలను నిజం చేసుకునేందుకు యశస్వి స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోని భదోహి ప్రాంతం నుంచి ముంబైకి వచ్చాడు. ఎన్నో కష్టాలు పడి ముంబై జట్టులో చోటు సంపాదించిన యశస్వి ఆ తర్వాత జూనియర్ ఇండియా జట్టులోకి, అనంతరం 2023లో సీనియర్ ఇండియా జట్టులోకి వచ్చాడు. గత రెండేళ్ల కాలంలో యశస్వి భారత్ తరఫున 19 టెస్టులు ఆడి 52.88 సగటుతో 1798 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 10 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 23 టి20 మ్యాచ్‌ల్లో భారత్‌కు ఆడిన యశస్వి 164.31 స్ట్రయిక్ రేట్‌తో 723 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, 5 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌పై యశస్వి వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు.

బెంగళూరుకు సిరాజ్ షాక్

3 వికెట్లతో మెరిసిన గుజరాత్ టైటాన్స్ పేసర్

ఏడేళ్ల పాటు బెంగళూరు ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించిన మొహమ్మద్ సిరాజ్... తొలిసారి ఆ జట్టుకు ప్రత్యర్థిగా ఆడుతూ నిప్పులు చెరిగాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున తన పాత సహచరులపై బుల్లెట్ బంతులతో ప్రతాపం చూపాడు. ఫలితంగా ఐపీఎల్‌లో టైటాన్స్ రెండో విజయం నమోదు చేసుకోగా... రెండు విజయాల తర్వాత బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. సిరాజ్ ధాటికి ఓ మాదిరి స్కోరుకే పరిమితమైన బెంగళూరు జట్టు... ఆ తర్వాత బౌలింగ్‌లో కూడా ఎలాంటి మెరుపులు లేకుండా ఓటమిని ఆహ్వానించింది. బ్యాటింగ్‌లో బట్లర్ మెరుపు ఇన్నింగ్స్‌తో మరో 13 బంతులు మిగిలుండగానే గుజరాత్ గెలుపొందింది.

- రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి ఓటమి
- 8 వికెట్లతో నెగ్గిన గిల్ బృందం





బట్లర్

బెంగళూరు: వరుస విజయాలతో జోరుమీదున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఐపీఎల్ 18వ సీజన్‌లో తొలి ఓటమి ఎదురైంది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన బెంగళూరు... బుధవారం జరిగిన పోరులో 8 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమి పాలైంది. గత సీజన్ వరకు ఆర్‌సీబీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ సిరాజ్ (3/19) గుజరాత్ టైటాన్స్ తరఫున చెలరేగిపోగా... అతడి బౌలింగ్‌ను ఆడలేక బెంగళూరు ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. మొదట బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ (40 బంతుల్లో 54; 1 ఫోర్, 5 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... జితేశ్ శర్మ (33; 5 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (7), దేవదత్ పడిక్కల్ (4) కెప్టెన్ రజత్ పాటీదార్ (12), ఫిల్ సాల్ట్ (14), కృనాల్ పాండ్యా (5) విఫలమయ్యారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిరాజ్ 3 వికెట్లు, సాయికిశోర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. బట్లర్ (39 బంతుల్లో 73 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (36 బంతుల్లో 49; 7 ఫోర్లు, 1 సిక్స్), రూథర్‌ఫోర్డ్ (18 బంతుల్లో 30 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు.

సూపర్ సిరాజ్...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు శుభారంభం దక్కలేదు. అర్షద్ ఖాన్ వేసిన రెండో ఓవర్‌లో అనవసర షాట్‌కు యత్నించిన కోహ్లి ఫైన్ లెగ్‌లో ప్రసిధ్ చేతికి చిక్కాడు. దీంతో చిన్నస్వామి స్టేడియంలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. తదుపరి ఓవర్‌లో పడిక్కల్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్ టైటాన్స్ ఆనందాన్ని రెట్టింపు చేశాడు. ఇక కొన్ని మంచి షాట్లు ఆడిన సాల్ట్‌ను కూడా సిరాజ్ బుట్టలో వేసుకున్నాడు. ఈ మధ్య పాటీదార్‌ను ఇషాంత్ శర్మ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో... బెంగళూరు జట్టు 42 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జితేశ్ శర్మ, లివింగ్‌స్టోన్... చివర్లో డేవిడ్ ధాటిగా ఆడారు. 15 ఓవర్లు ముగిసేసరికి 105/6తో ఉన్న ఆర్‌సీబీ... చివరి 5 ఓవర్లలో 64 పరుగులు జోడించింది. రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో 3 సిక్స్‌లు బాదిన లివింగ్‌స్టోన్‌ను తదుపరి ఓవర్‌లో సిరాజ్ అవుట్ చేశాడు. చివరి ఓవర్‌లో డేవిడ్ 4, 6, 4 కొట్టడంతో బెంగళూరు ఆ మాత్రం స్కోరు చేసింది.

అలవోకగా...

ఛేదనలో గుజరాత్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురుకాలేదు. లక్ష్యం చిన్నది కావడంతో ఆ జట్టు ఆడుతూ పాడుతూ ముందుకు సాగింది. బ్యాటింగ్‌లో భారీ స్కోరు చేయలేకపోయిన ఆర్‌సీబీ... బౌలింగ్‌లోనూ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (14) త్వరగానే అవుటైనా... మరో ఓపెనర్ సాయి సుదర్శన్‌తో కలిసి బట్లర్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో చెలరేగిన ఈ జంట రెండో వికెట్‌కు 47 బంతుల్లో 75 పరుగులు జతచేసింది. అనంతరం సుదర్శన్ అవుట్ కాగా... రూథర్‌ఫోర్డ్‌తో కలిసి బట్లర్ మూడో వికెట్‌కు 32 బంతుల్లోనే 63 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (బి) సిరాజ్ 14; కోహ్లి (సి) ప్రసిధ్ కృష్ణ (బి) అర్షద్ 7; దేవదత్ పడిక్కల్ (బి) సిరాజ్ 4; పాటీదార్ (ఎల్బీ) (బి) ఇషాంత్ 12; లివింగ్‌స్టోన్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 54; జితేశ్ శర్మ (సి) తెవాటియా (బి) సాయికిశోర్ 33; కృనాల్ పాండ్యా (సి అండ్ బి) సాయికిశోర్ 5; టిమ్ డేవిడ్ (బి) ప్రసిధ్ కృష్ణ 32; భువనేశ్వర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1-8, 2-13, 3-35, 4-42, 5-94, 6-104, 7-150, 8-169. **బౌలింగ్:** సిరాజ్ 4-0-19-3; అర్షద్ ఖాన్ 2-0-17-1; ప్రసిధ్ కృష్ణ 4-0-26-1; ఇషాంత్ 2-0-27-1; సాయికిశోర్ 4-0-22-2; రషీద్ ఖాన్ 4-0-54-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) జితేశ్ శర్మ (బి) హాజల్‌వుడ్ 49; గిల్ (సి) లివింగ్‌స్టోన్ (బి) భువనేశ్వర్ 14; బట్లర్ (నాటౌట్) 73; రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 30; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.5 ఓవర్లలో 2 వికెట్లకు) 170. వికెట్ల పతనం:** 1-32, 2-107. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-23-1, హాజల్‌వుడ్ 3.5-0-43-1; యశ్ దయాళ్ 3-0-20-0; రసిక్ సలామ్ 3-0-35-0; కృనాల్ పాండ్యా 3-0-34-0; లివింగ్‌స్టోన్ 1-0-12-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
పంజాబ్	2	2	0	4	1.485
ఢిల్లీ	2	2	0	4	1.320
బెంగళూరు	3	2	1	4	1.149
గుజరాత్	3	2	1	4	0.807
ముంబై	3	1	2	2	0.309
లక్నో	3	1	2	2	-0.150
చెన్నై	3	1	2	2	-0.771
హైదరాబాద్	3	1	2	2	-0.871
రాజస్తాన్	3	1	2	2	-1.112
కోల్‌కతా	3	1	2	2	-1.428

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X హైదరాబాద్
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఆ నవల ఆధారంగా ఆదిత్య 369 తీశాను - సింగీతం శ్రీనివాసరావు



''34 ఏళ్ల క్రితం విడుదలైన 'ఆదిత్య 369' రీ రిలీజ్ కావడం అద్భుతమైన అనుభూతి. ఈ సినిమాని ఇప్పుడు తీసుంటే బాగుండేది అనిపించిన క్షణాలు ఉన్నాయి. శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమాను నేటి టెక్నాలజీతో కంప్లీట్‌గా అప్‌గ్రేడ్ చేసి రీ రిలీజ్ చేస్తుంటే... ప్రేక్షకులకే కాదు.. నాలాంటి వాళ్లకి కూడా సినిమా చూడాలనిపిస్తుంది. ఇదొక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్'' అని ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాలకృష్ణ, మోహిని జంటగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదిత్య 369'. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సింగీతం శ్రీనివాసరావు మాట్లాడుతూ- ''ఆదిత్య 369' సీక్వెల్‌కి కథ సిద్ధం చేశాం. ఈ మూవీ ద్వారా తన కుమారుడు మోక్షజ్ఞని హీరోగా పరిచయం చేయాలనుకున్నారు బాలకృష్ణ. ఈ మూవీని ప్రకటించినప్పటికీ కుదరల్లేదు. కానీ, ఆయన మాత్రం ఎప్పటికైనా సీక్వెల్ చేయాలని అంటుంటారు. అది ఎప్పుడు అవుతుందన్నది దైవ నిర్ణయం. ఇక నేను కాలేజీలో చదువుతున్నప్పుడు హెచ్. జి. వెల్స్ రచించిన 'ది టైమ్ మెషిన్' నవల ఆధారంగా 'ఆదిత్య 369' తీశాను. ఈ కథలో లీనమై సంగీతం అందించారు ఇళయరాజా. పీసీ శ్రీరామ్, వీఎస్‌ఆర్ స్వామి, కబీర్ లాల్.. ఇలా ముగ్గురు కెమేరామెన్లు పని చేయడం దైవ నిర్ణయం. పేకేటి రంగాగారు శ్రీకృష్ణ దేవరాయలవారి సెట్‌ని, టైమ్ మెషిన్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు'' అని తెలిపారు.

సోషల్ మీడియాని మితిమీరి వాడితే...



● రవిశంకర్ వర్మ, సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య దేవి, గిరికృష్ణ కమల్

''సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల జీవితంలో ఎలాంటి భయంకరమైన పరిస్థితులు ఏర్పడటానికి అవకాశాలు ఉన్నాయి? అనే అంశంపై తీసిన చిత్రమే 'శారీ'. ఈ సినిమాకు నేను మూల కథ అందించాను. కథ రాసినప్పుడు నేను ఊహించనదానికంటే సినిమాను బాగా తీశాడు దర్శకుడు గిరికృష్ణ కమల్. ఈ సినిమా సబ్జెక్ట్‌ను చర్చిస్తున్నప్పుడు, అతని ఆలోచనలు నచ్చి, 'శారీ' సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కల్పించాను'' అని దర్శక-నిర్మాత-రచయిత రామ్‌గోపాల్ వర్మ అన్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'శారీ'. గిరికృష్ణ కమల్ దర్శకత్వంలో ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పీ పతాకాలపై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషలలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో గిరికృష్ణ కమల్ మాట్లాడుతూ- ''సత్య, ఆరాధ్య... ఇలా ప్రధానంగా రెండు పాత్రలతో సాగే ఇంటెన్స్ డ్రామా ఫిల్మ్ ఇది'' అన్నారు. ''ఇది నాకో డ్రీమ్ ప్రాజెక్ట్'' అని పేర్కొన్నారు ఆరాధ్య దేవి. ''ఈ మూవీలో ఉన్నవి తక్కువ పాత్రలే అయినా, అవి ఎఫెక్టివ్‌గా ఉంటాయి'' అని తెలిపారు సత్య యాదు. ''గులాబి' సినిమా నుంచి రామ్‌గోపాల్ వర్మతో వర్క్ చేస్తున్నాను. ఆయన ఎప్పుడు ఏ మూవీ కోసం పిలిచినా రెడీగా ఉంటాను'' అని చెప్పారు ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శశి ప్రీతమ్.

చిరంజీవి సినిమాలో అతిథి?



● వెంకటేశ్

చిరంజీవి, వెంకటేశ్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే... అవుననే సమాధానమే తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇటీవల ఓ సినిమా ప్రారంభోత్సవం జరుపుకుంది. సాహు గారపాటి, సుష్మితా కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో చిరంజీవి 'రా' (రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) ఏజెంట్‌గా కనిపించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక ఈ సినిమాలోని అతిథి పాత్రలో వెంకటేశ్ నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమా ప్రారంభోత్సవంలో చిరంజీవిపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి వెంకటేశ్ క్లాప్ కొట్టారు... సో.. అతిథి పాత్ర చేస్తున్నారు కాబట్టి ప్రారంభోత్సవంలో అతిథిగా పాల్గొన్నారనే ఊహాగానాలు ఉన్నాయి. ఈ విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమా 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది.

ఆర్గానిక్ హాస్యంతో నవ్వించనున్నాం - దర్శకులు నితిన్-భరత్



''అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమా ఈ వేసవిలో కుటుంబమంతా కలిసి సరదాగా నవ్వుకుంటూ చూసేలా ఉంటుంది'' అని డైరెక్టర్స్ నితిన్-భరత్ చెప్పారు. ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. మాంక్స్- మంకీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు నితిన్, భరత్ మాట్లాడుతూ- ''ప్రదీప్‌గారి ఫస్ట్ సినిమా '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' కోసం ఒక ప్రమోషనల్ సాంగ్ చేశాం. అప్పుడే ఆయనతో సినిమా తీయాలనుకున్నాం. అలా మేం చెప్పిన కథ ప్రదీప్‌కి నచ్చడంతో 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం ఆరంభమైంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లా రూపొందిన ఈ సినిమాలో వినోదం సందర్భానుసారంగా, ఆర్గానిక్‌గా ఉంటుంది. తెలుగు అమ్మాయిని హీరోయిన్‌గా తీసుకోవాలనుకుని, ఆడిషన్స్ చేసి, దీపికని తీసుకున్నాం. ప్రదీప్‌గారి ఫ్రెండ్స్ ఈ మూవీ నిర్మించారు. రథన్‌గారి అద్భుతమైన సంగీతం, బాల్ రెడ్డిగారి విజువల్స్ ఆకట్టుకుంటాయి. మా సినిమా మైత్రీ మూవీ మేకర్స్‌కి నచ్చడంతో విడుదల చేస్తున్నారు'' అన్నారు.

లోకల్ కుర్రాడు



● ఆశిష్

నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 60వ సినిమాని ప్రకటించారు. 'రౌడీ బాయ్స్, లవ్ మీ' చిత్రాల్లో తన నటనతో ఆకట్టుకున్న ఆశిష్ ఈ మూవీలో హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం ద్వారా ఆదిత్య రావు గంగాసాని దర్శకునిగా పరిచయమవుతున్నారు. ''హైదరాబాద్ ఓల్డ్ సిటీ నేపథ్యంలో రూపొందనున్న సినిమా ఇది. ఈ మూవీలో ఆశిష్ లోకల్ కుర్రాడిగా మాస్ లుక్‌లో కనిపిస్తారు. ఈ చిత్రం కోసం తను పూర్తిగా మేకోవర్ కానున్నారు. మా సినిమాలో కొత్తవారికి... ముఖ్యంగా హైదరాబాద్ యాసని అనర్గళంగా మాట్లాడే వారికి ఆడిషన్స్ నిర్వహించనున్నాం. ఈ నటీనటుల ఎంపిక అన్ని వయసుల వారికి ఓపెన్‌గా ఉంటుంది. ఇతర వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.

పాముతో సీన్స్ చేయడానికి భయపడ్డాను - కేథరిన్



● మహేశ్ శ్రీరామ్, కేథరిన్

హీరోయిన్ కేథరిన్ ట్రెసా ప్రధాన పాత్రలో, మహేశ్ శ్రీరామ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఫణి'. ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్, ఏయూ అండ్ ఐ స్టూడియోల సమర్పణలో డా. మీనాక్షి అనిపిండి ఈ సినిమాను నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలతో పాటు ఇతర ప్రపంచ భాషల్లో కూడా ఈ సినిమా రిలీజ్ కానుంది. బుధవారం జరిగిన ఈ చిత్రం ప్రెస్‌మీట్‌కు దర్శక-నిర్మాత కె. రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై, 'ఫణి' సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- ''వీఎస్ ఆదిత్య కొత్త వాళ్లతోనూ సినిమా చేయగలడు, స్టార్స్‌తోనూ సినిమా చేయగలడు. 'ఫణి' విజయం సాధించాలి'' అని అన్నారు. ''నాకు పాములంటే భయం. దీంతో పాముతో నేను చేయాల్సిన సీన్స్ అన్నీ సీజీలో చేయాలని ఆదిత్యగారిని రిక్వెస్ట్ చేస్తే, సరే అన్నారు. అయితే షూటింగ్ చివర్లో పాము కాంబినేషన్‌లో నాతో సీన్స్ చేయించారు. ఒకసారి సీన్ పూర్తయ్యేసరికి పాము నా ముఖానికి దగ్గరగా ఉంది. అప్పుడు నా ఫీలింగ్ ఎలా ఉండి ఉంటుందో ఊహించుకోండి. మేలో మా 'ఫణి' మూవీని రిలీజ్ చేస్తున్నాం'' అని తెలిపారు కేథరిన్. ''యూఎస్ వెళ్లినప్పుడు నా సోదరి మీనాక్షి-బావ శాస్త్రిగారి ఇంట్లో ఉంటాను. వారు తమ ఓ.ఎం.జీ సంస్థలో నాతో సినిమా చేస్తామన్నప్పుడు నాకు భయం వేసింది. 'ఫణి' చిత్రాన్ని చిన్నగా మొదలు పెట్టాం. ఆ తర్వాత కేథరిన్‌గారు ఒప్పుకోవడంతో మరో స్థాయికి వెళ్లింది'' అన్నారు వీఎస్ ఆదిత్య. ''ఫణి' మూవీతో కేథరిన్‌గారికి జాతీయ అవార్డు వస్తుంది'' అని తెలిపారు నిర్మాత, సంగీత దర్శకురాలు డా. మీనాక్షి అనిపిండి. ''హాలీవుడ్‌లో మోడలింగ్, మూవీస్ చేస్తున్నాను. ఈ సినిమాలో నటించడంతో సొంత ఇంటికి వచ్చినట్లుంది'' అన్నారు మహేశ్ శ్రీరామ్. ఈ చిత్రసమర్పకుడు పద్మనాభరెడ్డి, సహ-నిర్మాత శాస్త్రి అనిపిండి, రైటర్ పద్మ, నటుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడారు.

చైనా పీస్



● నిహాల్

నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా రూపొందిన చిత్రం 'చైనా పీస్'. అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై రూపొందింది. వాలి పాత్రలో నిహాల్ కోధాటిని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''యూనిక్ స్పై డ్రామాగా రూపొందిన చిత్రం 'చైనా పీస్'. ఈ సినిమాలో నిహాల్ చేసిన వాలి పాత్ర బాగుంటుంది. త్వరలోనే చిత్రం రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమేరా: సురేష్ రగుతు, సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్.

హారర్... సెంటిమెంట్



● సుమన్‌బాబు

సుమన్‌బాబు నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎర్రచీర: ది బిగినింగ్'. సాయి తేజస్విని, శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. బేబీ ఢమరి సమర్పణలో ఎన్.వి.వి. సుబ్బారెడ్డి, సీహెచ్. వెంకట సుమన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ''మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. 45 నిమిషాల గ్రాఫిక్స్ హైలైట్‌గా ఉంటాయి'' అని తెలిపారు సుమన్‌బాబు. ''అఘోరాలతో శివుడిని చూపించే సీక్వెన్స్, క్లైమాక్స్ ఎపిసోడ్ అద్భుతంగా వచ్చాయి. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన చిత్రమిది'' అన్నారు ఎన్.వి.వి. సుబ్బారెడ్డి.

రెండో సినిమా షురూ



● నిహారిక, సంగీత్ శోభన్, మానసా శర్మ

నటిగా, నిర్మాతగా తనకంటూ గుర్తింపు సొంతం చేసుకున్నారు నిహారిక కొణిదెల. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు' గత ఏడాది విడుదలై, హిట్‌గా నిలిచింది. నిహారిక తన రెండో సినిమాని బుధవారం ప్రకటించారు. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం ద్వారా మానసా శర్మ దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. నిహారిక, సంగీత్ శోభన్, మానసా శర్మ కాంబినేషన్‌లో గతంలో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' అనే వెబ్ సిరీస్ తెరకెక్కింది. తాజాగా ఈ ఫ్యూచర్ ఫిల్మ్ రూపొందనుంది. త్వరలో షూటింగ్ మొదలు కానున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	593	76,617
నిఫ్టీ ▲	167	23,332

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	17,586	▲ 136
డోజోన్స్	42,169	▲ 179
ఎఫ్‌టీఎస్ఈ 100	8,608	▼ 26
డాక్స్	22,391	▼ 149
షాంఘై	3,350	▲ 2
నికాయ్	35,726	▲ 101

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	90,996
బంగారం (99.5 స్వచ్ఛత)	90,632
వెండి (కిలో)	99,536

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారమనసుకి	83.66	87.34
£	బ్రిటన్ పౌండ్	భారమనసుకి	108.23	113.17
€	యూరో	భారమనసుకి	90.29	94.79
¥	జపాన్ ఎన్ (100)	భారమనసుకి	46.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారమనసుకి	51.47	56.30
S$	సింగపూర్ డాలర్	భారమనసుకి	61.37	66.06
SAR	సౌదీ రియాల్	భారమనసుకి	21.90	23.46
UAE D	యూఏఈ దిర్హామ్	భారమనసుకి	22.39	24.17
¥	చైనా యువాన్	భారమనసుకి	10.89	12.71

టారిఫ్‌లపై కంట్రోల్ రూమ్..

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించే టారిఫ్‌ల సంబంధ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖతో పాటు వివిధ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు ఇందులో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.




ప్రతీకార టారిఫ్‌ల పరిణామాలు నాలుగు విధాలుగా ఉండొచ్చనే అంచనాలతో, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై వాణిజ్య, పరిశ్రమల శాఖ కసరత్తు చేసినట్లు వివరించాయి. దేశాలవారీగా లేదా రంగాలవారీగా లేదా ఉత్పత్తులవారీగా అమెరికా సుంకాలను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లో అమెరికా దిగుమతులపై సగటున టారిఫ్‌లు 7.7%గా ఉండగా, ఆ దేశానికి మన ఎగుమతులపై సగటున సుమారు 2.8 శాతమే. ప్రస్తుతం 190 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలనేది ఇరు దేశాల లక్ష్యం. ఈ దిశగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చిస్తున్నాయి.

ఏజెంటిక్ ఏఐలో భారత్ టాప్!

- సొంతంగా తయారీపై కంపెనీల ఆసక్తి...
- డెలాయిట్ నివేదిక

న్యూఢిల్లీ: కృత్రిమ మేధకు సంబంధించి ఏజెంటిక్ ఏఐ వినియోగంలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది. దేశీయంగా పలు వ్యాపార సంస్థలు దీనిపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. దాదాపు 80 శాతం సంస్థలు తమ అవసరాల కోసం సొంతంగా ఏఐ ఏజెంట్లను తయారు చేసుకోవడంపై ఆసక్తిగా ఉన్నాయి. భారత్‌లో జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ వినియోగం తీరుతెన్నులపై డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 80 శాతం భారతీయ సంస్థలు అటానమస్ ఏజెంట్లను తయారు చేసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. ఏజెంటిక్ ఏఐ విషయంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకోవడాన్ని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. 70 శాతం కంపెనీలు జెన్‌ఏఐని ఆటోమేషన్ కోసం ఉపయోగించుకోవడంపై ఆసక్తి కనపర్చగా, సగానికి పైగా కంపెనీలు దాదాపు పది జెన్ ఏఐ ప్రయోగాలు నిర్వహిస్తున్నాయి. మనిషి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేకుండా, స్వతంత్రంగా నిర్దిష్ట పనులను పూర్తి చేసేందుకు ఉపయోగపడే ఏఐ సిస్టమ్‌లను అటానమస్ ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. వివిధ పనులు, ప్రక్రియలను ఆటోమేట్ చేసేందుకు వీటిని వినియోగించుకునే విధానాన్ని ఏజెంటిక్ ఏఐగా పరిగణిస్తారు. ఈ సాంకేతికతపై ఆసక్తి పెరుగుతుండటమనేది .. కొత్త ఆవిష్కరణలు, సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు కంపెనీలు ఏఐని ఉపయోగించుకునే విధానంలో వస్తున్న మార్పులను సూచిస్తోందని నివేదిక పేర్కొంది.



సవాళ్లూ ఉన్నాయి..


ఏఐ వినియోగం పెరుగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లూ ఉంటున్నాయి. తప్పిదాలు (36 శాతం), పక్షపాతం (30 శాతం), డేటా నాణ్యత (30 శాతం)లాంటివి భారీ స్థాయిలో వినియోగానికి సమస్యగా ఉంటున్నాయి. వెంటనే వినియోగించుకోవడానికి వీలుగా ఉండే రెడీమేడ్ ఏఐని ఎక్కువగా కంపెనీలు ఎంచుకుంటూ ఉండటంతో అవసరాలకు తగ్గట్లుగా వాటిలో పెద్దగా మార్పులు, చేర్పులు చేయడానికి అవకాశాలు ఉండటం లేదు. పైపెచ్చు కొన్నాళ్లకు కొరగాకుండా పోయేలా ఉంటున్నాయి. తాము ప్రస్తుతం ఉపయోగిస్తున్న సొల్యూషన్స్ రెండేళ్లలోపే పనికి రాకుండా పోయే అవకాశం ఉందని 28 శాతం కంపెనీలు భావిస్తున్నాయి.

ఆశాభావంతో కంపెనీలు..

ఏఐని విస్తృతంగా వినియోగించుకోవడంపై సవాళ్లు నెలకొన్నప్పటికీ వచ్చే రెండేళ్లలో వాటిని అధిగమించగలమని దేశీ కంపెనీలు ఆశాభావంతో ఉన్నాయి. ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్న ఈ రంగంలో వృద్ధి చెందేందుకు, అగ్రస్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారత్ మరిన్ని పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని, కొత్త ఆవిష్కరణలపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ మౌమితా సర్కార్ తెలిపారు. కొన్ని దేశీ సంస్థలు సొంతంగా తయారు చేసుకోవడం కాకుండా ఏఐ సొల్యూషన్స్‌ను కొనుక్కోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా మల్చుకోగలిగేలా వాటిని తీర్చిదిద్దాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏఐ పురోగమనంలో ముందంజలో ఉండేందుకు, దీర్ఘకాలంలో అధిక ప్రయోజనాలను పొందేందుకు, పరిస్థితులకు తగ్గట్లుగా మల్చుకోగలిగే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని సర్కార్ చెప్పారు. ఇటు వినియోగం వేగవంతం కావడం అటు దీర్ఘకాలంలో నిలబడగలిగే వ్యూహాలను అమలు చేయడం మధ్య సమతూకం పాటించడమే ఏఐపై పెట్టుబడులకు కీలకమని వివరించారు.

ఇక రిలయన్స్ ఈస్పోర్ట్స్

బ్లాస్ట్ ఈస్పోర్ట్స్‌తో జేవీ ఏర్పాటు



న్యూఢిల్లీ: దేశీయంగా ఈస్పోర్ట్స్ బిజినెస్ నిర్వహించేందుకు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేయనుంది. సొంత అనుబంధ సంస్థ రైజ్ వరల్డ్‌వైడ్ ద్వారా బ్లాస్ట్ ఈస్పోర్ట్స్‌తో ఇందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. తద్వారా జేవీకి తెరతీయనుంది. రిలయన్స్, బ్లాస్ట్ జత కట్టడం(జేవీ) ద్వారా దేశీయంగా అత్యున్నత ఐపీలను అభివృద్ధి చేయనున్నట్లు సంయుక్త ప్రకటనలో రెండు సంస్థలు పేర్కొన్నాయి. అంతేకాకుండా అభిమానులు, క్రీడాకారులు, బ్రాండ్ల కోసం బ్లాస్ట్‌కున్న గ్లోబల్ ఐపీలను సైతం దేశీయంగా ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశాయి. బ్లాస్ట్ ఏపీఎస్(డెన్మార్క్) ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద టోర్నమెంట్ నిర్వాహక సంస్థలలో ఒకటికాగా.. గేమ్ పబ్లిషింగ్ గ్లోబల్ దిగ్గజాలు ఎపిక్ గేమ్స్, వాల్వ్, రియట్ గేమ్స్, క్రాఫ్టన్, యూబిసాఫ్ట్ తదితరాలతో కలసి పనిచేస్తోంది. తద్వారా గ్లోబల్ ఈస్పోర్ట్స్ ప్రాపర్టీలను ఆవిష్కరిస్తోంది.

యూపీఐ.. రయ్

- అన్నింటికీ డిజిటల్ చెల్లింపులే...
- ఆరు నెలల్లో 9,323 కోట్ల లావాదేవీలు
- 2024 జూలై–డిసెంబర్ మధ్య నమోదు
- డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ఆధిపత్యమే కొనసాగుతోంది. చెల్లింపుల్లో ఉన్న సౌకర్యంతో యూపీఐ లావాదేవీలు ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. 2024 ద్వితీయార్ధంలో (జూలై–డిసెంబర్) 9,323 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. 2023 సంవత్సరం ద్వితీయార్ధంలోని 6,577 కోట్ల లావాదేవీలతో పోల్చి చూస్తే 42 శాతం పెరిగాయి. విలువ పరంగా పోల్చి చూసినప్పుడు 2023 ద్వితీయ ఆరు నెలల్లో రూ.99.68 లక్షల కోట్ల లావాదేవీలు జరిగితే.. 2024 ద్వితీయార్ధంలో రూ.130.19 లక్షల కోట్లకు చేరాయి. ఈ వివరాలతో వరల్డ్‌లైన్ ఇండియా సంస్థ 'డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్'ను విడుదల చేసింది. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ఈ మూడు సంస్థలు యూపీఐ లావాదేవీల్లో అధిక వాటాను కాపాడుకుంటున్నాయి. గత డిసెంబర్ నెల యూపీఐ లావాదేవీల్లో 93 శాతం ఈ మూడు సంస్థల ప్లాట్‌ఫామ్‌ల నుంచే జరిగాయి. విలువ పరంగా 92 శాతంగా ఉంది. యూపీఐ కాకుండా ఇతర డిజిటల్ చెల్లింపుల్లో క్రెడిట్ కార్డులు, ప్రీపెయిడ్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ లావాదేవీలు ఉన్నాయి.



మర్చంట్ చెల్లింపుల్లో అధిక వృద్ధి..

యూపీఐ చెల్లింపులను వ్యక్తుల నుంచి వ్యక్తులకు (పీ2పీ), వ్యక్తుల నుంచి వ్యాపారస్థులకు (పీ2ఎం) అని రెండు విభాగాలుగా వర్గీకరిస్తారు. ఇందులో పీ2పీ లావాదేవీల సంఖ్య 2023 ద్వితీయ ఆరు నెలల్లో 2704 కోట్లుగా ఉంటే, 2024 ద్వితీయ ఆరు నెలల్లో 3,521 కోట్లకు పెరిగాయి. అంటే 30 శాతం వృద్ధి కనిపించింది. ఇదే కాలంలో పీ2పీ లావాదేవీల విలువ 26 శాతం పెరిగింది. పీ2ఎం లావాదేవీల సంఖ్య 3,873 కోట్ల నుంచి 5,803 కోట్లకు పెరగ్గా (50 శాతం వృద్ధి).. విలువ పరంగా 43 శాతం వృద్ధి చెందింది. 2024 ద్వితీయ ఆరు నెలల్లో ఒక్కో యూపీఐ లావాదేవీ సగటు విలువ రూ.1,396గా ఉంది. 2023 ద్వితీయ ఆరు నెలల్లో ఉన్న రూ.1,515తో పోల్చితే 8% తగ్గింది. ''భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అసాధారణ వృద్ధిని చూస్తోంది. ఎక్కువ మంది యూపీఐ వినియోగానికి మొగ్గు చూపిస్తున్నారు. పీవోఎస్ సదుపాయాల విస్తరణతోపాటు, మొబైల్ లావాదేవీలకు ప్రాధాన్యం పెరుగుతోంది''అని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు.

మార్కెట్ రీబౌండ్

సెన్సెక్స్ 593 పాయింట్లు జూమ్

ముంబై: టారిఫ్ భయాలను వీడిన దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. సెన్సెక్స్ 593 పాయింట్లు జంప్‌చేసి 76,617 వద్ద నిలిచింది. 167 పాయింట్లు ఎగసిన నిఫ్టీ 23,332 వద్ద స్థిరపడింది. ఒక దశలో సెన్సెక్స్ 656 పాయింట్లు పెరిగి 76,680ను దాటగా.. నిఫ్టీ 23,350 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. యూఎస్ టారిఫ్‌లపై ఆందోళనలతో మంగళవారం సెన్సెక్స్ 1,390, నిఫ్టీ 354 పాయింట్లు చొప్పున పతనమైన సంగతి తెలిసిందే. అయితే భారత్ వాణిజ్య చర్చలు సానుకూల ఫలితాలనిచ్చే వీలున్నట్లు పెరిగిన అంచనాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు మార్చిలో పుంజుకున్న తయారీ రంగ గణాంకాలు సానుకూల సెంటిమెంటుకు దోహదపడినట్లు తెలియజేశారు.

అన్ని రంగాలూ...: ఎన్‌ఎస్ఈలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. ప్రధానంగా రియల్టీ, కన్జూమర్ డ్యురబుల్స్ 3.6–2.5 శాతం మధ్య ఎగిశాయి. నిఫ్టీ దిగ్గజాలలో టాటా కన్జూమర్, జొమాటో, టైటన్, ఇండస్ఇండ్, టెక్ఎం, మారుతీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ 7–1.5 శాతం మధ్య జంప్‌చేశాయి.



రూ. 3.54 లక్షల కోట్లు ప్లస్: మార్కెట్ల బౌన్స్‌బ్యాక్‌తో ఇన్వెస్టర్ల సంపద రూ. 3.54 లక్షల కోట్లకు పైగా బలపడింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 4,12,98,096 కోట్ల (4.82 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పెరుగుతున్న విమానయాన జోష్	తయారీ రంగం.. 8 నెలల గరిష్టం

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

ఎంబీఏ, ఎంసీఏకు మార్గం.. ఐసెట్

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా ఐసెట్! రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు సుపరిచితమైన పరీక్ష! ఈ ఎంట్రన్స్ టెస్ట్‌లో ర్యాంకుతో.. మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అందించే ఎంబీఏ కోర్సు, అదేవిధంగా కంప్యూటర్ కెరీర్‌కు మార్గం వేసే ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు!! ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ.. ఐసెట్-2025 నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ, టీజీ ఐసెట్ వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



- » ఏపీ, టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల
- » ఏపీలో మే 7న, టీజీలో జూన్ 8, 9 తేదీల్లో పరీక్షలు
- » ఐసెట్ స్కోర్‌తో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం
- » భవిష్యత్తులో మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో కొలువులు

రెండు తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు.. ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తున్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభించే అవకాశముంది. అయితే బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం పొందాలంటే మాత్రం వేయిలోపు ర్యాంకుతోనే సాధ్యమవుతుందని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

అర్హతలు

- ఎంబీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఎంసీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంటర్మీడియెట్ లేదా డిగ్రీలో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

200 మార్కులకు ఏపీ ఐసెట్

- ఏపీ ఐసెట్ పరీక్ష మూడు విభాగాల్లో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటుంది.
- సెక్షన్ ఏ అనలిటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు–75 మార్కులకు(ఉప విభాగం–1 డేటా సఫీషియన్సీ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఉప విభాగం–2 ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు–55 మార్కులు) ఉంటుంది.
- సెక్షన్ బీలో కమ్యూనికేషన్ ఎబిలిటీ 70 ప్రశ్నలు–70 మార్కులకు(ఉప విభాగం –1 వొకాబ్యులరీ 15 ప్రశ్నలు–15 మార్కులు, ఉప విభాగం –2 ఫంక్షనల్ గ్రామర్ 20 ప్రశ్నలు–20 మార్కులు, ఉప విభాగం–3 బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ 15 ప్రశ్నలు–15 మార్కులు, ఉపవిభాగం–4 రీడింగ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు–20 మార్కులు) ఉంటుంది.
- సెక్షన్ సీలో మ్యాథమెటికల్ ఎబిలిటీ 55 ప్రశ్నలు–55 మార్కులకు(ఉప విభాగం–1 అర్థమెటికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు, ఉప విభాగం–2 ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులు, ఉపవిభాగం–3 స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులు) ఉంటుంది.

టీజీ ఐసెట్ ఇలా

- టీజీ ఐసెట్‌ను కూడా మూడు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు.
- సెక్షన్–ఎ అనలిటికల్ ఎబిలిటీలో డేటా సఫిషియన్సీ (20 ప్రశ్నలు– 20 మార్కులు), ప్రాబ్లమ్ సాల్వింగ్ (55 ప్రశ్నలు–55 మార్కులు) విభాగాల నుంచి 75ప్రశ్నలు–75మార్కులకు అడుగుతారు.
- సెక్షన్–బి మ్యాథమెటికల్ ఎబిలిటీలో అర్థమెటికల్ ఎబిలిటీ (35 ప్రశ్నలు–35 మార్కులు), ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ(30 ప్రశ్నలు–30 మార్కులు), స్టాటిస్టికల్ ఎబిలిటీ(10 ప్రశ్నలు–10 మార్కులు) విభాగాలు ఉంటాయి.
- ఈ విభాగానికి 75 ప్రశ్నలు–75 మార్కులు కేటాయించారు.
- సెక్షన్ సీలో కమ్యూనికేషన్ ఎబిలిటీ విభాగం 50 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటుంది.

ఏపీ ఐసెట్ ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, ఏప్రిల్ 9
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: ఏప్రిల్ 29, 30 తేదీల్లో
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: మే 2 నుంచి
- ఐసెట్ తేదీలు: 2025, మే 7
- ఫలితాల వెల్లడి: 2025, మే 21
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/ICET/ICET/ICET_HomePage.aspx

టీజీ ఐసెట్ ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, మే 3
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: మే 16 నుంచి 20 వరకు
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: మే 28
- టీజీ ఐసెట్ తేదీలు: జూన్ 8, 9 తేదీల్లో
- ఫలితాల వెల్లడి: జూలై 7
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://icet.tgche.ac.in

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

మ్యాథమెటికల్ ఎబిలిటీ

మ్యాథమెటికల్ ఎబిలిటీలో ఉండే అర్థమెటిక్, జామెట్రికల్, స్టాటిస్టికల్ ఉప విభాగాలకు సంబంధించిన అంశాల్లో నైపుణ్యం పొందాలంటే.. ముందుగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాల ప్రిపరేషన్ అవసరం. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాల కోసం ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు శాతాలు, లాభనష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని–కాలం, పని–సమయంపై పట్టు పెంచుకోవాలి. ఆల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్

ఈ విభాగంలో రాణించేందుకు విశ్లేషణ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి. ఈ విభాగం నుంచి అడిగే ప్రశ్నలు డేటాను ఇచ్చి.. దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ఉంటాయి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు కోడింగ్, డీ–కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు పెంచుకోవాలి. దీనికోసం ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని వినియోగించే తీరుపై ప్రాక్టీస్ చేయాలి. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం బేసిక్ గ్రామర్ అంశాలుగా పేర్కొనే సినానిమ్స్, యాంటానిమ్స్,కొశ్చన్ ట్యాగ్స్,డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామ ర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు ఒక అంశాన్ని, అందులోని కీలక పదాలను, కీలక సారాంశాన్ని పసిగట్టే నేర్పు పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ వ్యాసాలతోపాటు ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవాలి.

బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీ

సామాజిక వ్యాపార–వాణిజ్య అంశాలు, అదే విధంగా తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ కోసం బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు–వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. ఇక కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, అదే విధంగా కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం పెంచుకోవాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఐసెట్‌లో నిర్దేశించిన విభాగాలన్నీ ప్రాక్టికల్ ఓరియెంటేషన్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌గా ఉంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఆయా అంశాల అధ్యయనంతోపాటు ప్రశ్నల సాధనకు అధిక సమయం కేటాయించాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ లాసెట్/పీజీఎల్‌సెట్-2025

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం/ఎంఎల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ లాసెట్)/పోస్ట్ గ్రాడ్యుయేట్ లా కోర్స్ ఎల్ఎల్ఎం–(ఏపీ పీజీఎల్‌సెట్)–2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » **కోర్సులు:** మూడేళ్ల/ఐదేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం/ఎంఎల్.
- » **అర్హత:** కోర్సును అనుసరించి 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఎల్ఎల్‌బీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.04.2025.
- » **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**30.05.2025
- » **ప్రవేశ పరీక్ష తేది:** 05.06.2025.
- » **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

టీజీ ఎడ్‌సెట్-2025

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ బీఈడీ కోర్సులో ప్రవేశాలకు టీజీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్‌సెట్)–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది పరీక్షను వరంగల్‌లోని కాకతీయ యూనివర్శిటీ నిర్వహిస్తుంది.

- » **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.05.2025
- » **ఆలస్య రుసుము రూ.250తో దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- » **ఆలస్య రుసుము రూ.500తో దరఖాస్తులకు చివరితేది:** 24.05.2025.
- » **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 29.05.2025.
- » **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షతేది:** 01.06.2025.
- » **వెబ్‌సైట్:** https://edcet.tgche.ac.in

టీజీ పీఈసెట్-2025

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(టీఎస్‌సీహెచ్ఈ).. వ్యాయామ విద్యలో ప్రవేశాల కోసం తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీపీఈసెట్)–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షను పాలమూరు యూనివర్శిటీ నిర్వహిస్తోంది.

- » **కోర్సులు:** బీపీఈడీ(రెండేళ్లు), డీపీఈడీ(రెండేళ్లు).
- » **అర్హత:** బీపీఈడీ కోర్సుకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 01.07.2025 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. డీపీఈడీ కోర్సుకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు 01.07.2025 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2025
- » **ఆలస్య రుసుము రూ.500 తో దరఖాస్తులకు చివరితేది:** 30.05.2025.
- » **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 05.06.2025.
- » **క్రీడల పోటీల తేదీలు:** 11.06.2025 నుంచి 14.06.2025 వరకు
- » **వెబ్‌సైట్:** https://pecet.tgche.ac.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 23 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
- » **వేతనం:** నెలకు రూ.37,000.
- » **అర్హత:** 60 శాతం మార్కులతో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 03.03.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** పవర్ పాయింట్ ప్రజంటేషన్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.04.2025
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం

- ఐ కొలాబ్ హబ్ ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువ పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం 'రామ్ ఇన్ఫో లిమిటెడ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఏర్పాటు చేసిన 'ఐ కొలాబ్ హబ్ ఫౌండేషన్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రారంభించిన ప్రతి స్టార్టప్ విజయవంతం కాదని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో అడుగు ముందుకేస్తేనే సక్సెస్ అవుతుందన్నారు. దేశంలో ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ విలువ ఏటా 700 బిలియన్ డాలర్లు ఉంటుందని, ఈ రంగంలో స్టార్టప్స్‌కు మార్గనిర్దేశనం చేసేందుకు దేశంలోనే తొలిసారి ఏర్పాటు చేసిన బీ2జీ (బిజినెస్ 2 గవర్నమెంట్) రెవెన్యూ యాక్సిలేటర్ 'ఐ కొలాబ్ హబ్ ఫౌండేషన్' నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

మాతృమూర్తి అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసిన ఆఫ్రికా మంత్రి

- రాజేశ్వర ప్రసాద్ స్వస్థలం ధర్మపురి



ధర్మపురి: తన మాతృమూర్తి అస్థికలను గోదావరి నదిలో నిమజ్జనం చేశాడు ఆఫ్రికా మంత్రి. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పాలెపు సాంబయ్య- లక్ష్మీబాయమ్మ దంపతుల మూడో కుమారుడు పాలెపు రాజేశ్వరప్రసాద్ ప్రస్తుతం ఆఫ్రికాలోని రిపబ్లిక్ ఆఫ్ గినియా దేశంలో కేబినెట్ మంత్రి, ఆ దేశ ప్రధాని ప్రత్యేక సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. రాజేశ్వర ప్రసాద్ మాతృమూర్తి లక్ష్మీబాయి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆమె అస్థికలను ఆమె స్వగ్రామమైన ధర్మపురిలోని గోదావరి నదిలో కలపడానికి రాజేశ్వర ప్రసాద్ మంగళవారం సాయంత్రం తన సోదరులతో కలిసి వచ్చారు.

రేపు వీసీల సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్‌లతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి శుక్రవారం సమావేశం కానున్నారు. ఇందులో పలు అంశాలపై చర్చిస్తారు. కామన్ అకడమిక్ కేలండర్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల సిలబస్‌లో మార్పులు, అనుబంధ కాలేజీల గుర్తింపు, యూజీ, పీజీ కోర్సుల మార్పిడి, కామన్ పోస్టు-గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్‌తో పాటు పలు అంశాలపై చర్చిస్తారు.

సిమెంట్ ప్లాంట్‌ను పునరుద్ధరించండి

- కేంద్ర మంత్రి కుమార స్వామికి బీఆర్ఎస్ ఎంపీల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ జిల్లాలో మూతబడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంటును పునరుద్ధరించాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావులు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు గాను అప్పటి కేంద్ర ప్రభుత్వం సీసీఐని నెలకొల్పిందని గుర్తు చేశారు. కొన్నేళ్లుగా ఈ కర్మాగారాన్ని మూసివేయడం వల్ల వందలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడంతో వారి కుటుంబాలతో పాటు పరోక్షంగా వేలాది మంది ఉపాధి లేక రోడ్డున పడ్డారని బీఆర్ఎస్ ఎంపీలు, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఎన్టీపీసీకి రూ.99 కోట్ల జరిమానా

కోల్‌సిటీ (రామగుండం): ముందస్తు అనుమతి తీసుకోకుండా ఆరు నిర్మాణాలను చేపట్టిన రామగుండం ఎన్టీపీసీకి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బుధవారం రూ.99.28 కోట్ల జరిమానా విధించారు. గత నెల 19న షోకాజ్ నోటీసు జారీచేసినా ఎన్టీపీసీ స్పందించలేదు. ఈ మేరకు అదేనెల 29న జరిమానా నోటీసులను జారీచేసినట్లు బల్దియా అధికారులు బుధవారం తెలిపారు. గడువులోగా పెనాల్టీలు చెల్లించకపోతే టీఎంఎస్-2019 మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో హెచ్చరించారు.

ఎన్టీపీసీ చేపట్టిన నిర్మాణాలు, విధించిన జరిమానా(రూ.లలో)

నిర్మాణం	జరిమానా
టైప్-బి బిల్డింగ్స్	39,61,90,154
హెచ్‌వోడీ బిల్డింగ్	18,55,70,351
టైప్-డీ బిల్డింగ్	27,29,72,955
గెస్ట్‌హౌస్ బిల్డింగ్	6,61,64,044
ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్	2,35,63,705
కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్	4,83,62,341

బ్యాకప్‌లో మనమే అప్

- వ్యక్తిగత డేటా బ్యాకప్‌లో భారతీయులే ముందు
- నిత్యం బ్యాకప్ చేసుకుంటున్న 30% మంది
- అమెరికాలో 27, బ్రిటన్‌లో 23 శాతమే
- డేటా బ్యాకప్‌లో త్రిముఖ వ్యూహం
- వెస్టర్న్ డిజిటల్ సర్వే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మల్టీ నేషనల్ కంపెనీలు, ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు.. చివరికి సాధారణ వ్యక్తులకు కూడా నేడు డిజిటల్ డేటా కీలకంగా మారింది. సైబర్ నేరగాళ్లు ఏదో ఒక రూపంలో మన సమాచారం చోరీ చేసినా, రాన్‌సమ్‌వేర్ ఎటాక్‌లతో తస్కరించినా ప్రమాదమే. ఇందుకు ఏకైక పరిష్కారం డేటా బ్యాకప్ చేసుకోవడమే. డేటా బ్యాకప్‌లో భారతీయులు ముందంజలో ఉంటున్నట్టు వెస్టర్న్ డిజిటల్ సంస్థ సర్వే వెల్లడించింది. డేటా బ్యాకప్‌కు సంబంధించి ఈ సంస్థ ఇటీవల పలు దేశాల్లో సర్వే నిర్వహించింది. అత్యధికంగా భారతీయులే డేటా బ్యాకప్ చేస్తున్నట్టు సర్వేలో తేలింది.



నివేదికలోని ముఖ్యాంశాలు

- అత్యధికంగా 30% మంది భారతీయులు నిత్యం తమ డేటా బ్యాకప్ చేసుకుంటున్నారు. తర్వాత స్థానంలో అమెరికా 27%, బ్రిటన్ 23 శాతంతో నిలిచాయి.
- భారతీయుల్లో 77%మంది డేటా బ్యాకప్ కోసం తాము క్లౌడ్ స్టోరేజీని వాడుతున్నట్టు వెల్లడించారు. అదే విధంగా మొబైల్ (ఇతర డివైజ్) పాడవడంతో లేదా అనుకోకుండా డిలీట్ చేయడం, లేదా సైబర్ ఎటాక్.. ఇలా ఏదో ఒక కారణంగా తమకు డేటాను పోగొట్టుకున్న అనుభవం ఉందని సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 71 శాతం మంది పేర్కొన్నారు.
- డేటా బ్యాకప్‌కు 3 విధానాలు వాడుతున్నట్టు సర్వేలో వెల్లడైంది. ఇందుకు 3-2-1 సూత్రాన్ని అనుసరిస్తున్నట్టు సర్వే నిర్వాహకులు తెలిపారు. డేటాకు సంబంధించి 3 కాపీలను పెట్టుకోవాలి. రెండింటిని రెండు వేర్వేరు డివైజ్‌లలో స్టోర్ చేసుకోవాలి. ఒక సాఫ్ట్ కాపీని క్లౌడ్ వంటి స్టోరేజీలో దాచుకోవాలి.

ఎంతశాతం మంది భారతీయులు ఎందుకు డేటా బ్యాకప్ చేస్తున్నారంటే..?



ముఖ్యమైన ఫైల్స్ భద్రత కోసం	83%
డివైజ్‌లోని స్పేస్‌ను ఫ్రీ చేసేందుకు	67%
సైబర్ దాడి నుంచి తప్పించుకునేందుకు	42%
తెలిసినవారు సూచించినందున	19%

పంచాయతీరాజ్‌కు 'రిటైర్డ్' స్ట్రోక్

కీలక విభాగాలకు అధిపతులు కరువు

- మిషన్ భగీరథ, ఎస్ఈసీ, స్త్రీనిధి సంస్థలకు నాయకత్వ లేమి.. రిటైర్డ్ అధికారులను తొలగించటంతో ఆయా పోస్టులు ఖాళీ
- మార్చి 31న పీఆర్ ఈఎన్‌సీ పదవీ విరమణ
- కొత్తవారు రాక, ఇన్‌చార్జిలు లేక ఇబ్బందులు



సాక్షి, హైదరాబాద్: పదవీ విరమణ చేసి రీఅపాయింట్ అయిన అధికారులను ఆయా పోస్టుల నుంచి తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ శాఖలోని పలు విభాగాల్లోని కీలక పోస్టుల్లో కొన్నేళ్లుగా రిటైర్డ్ అధికారులే కొనసాగుతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశంతో మిషన్ భగీరథ ఈఎన్‌సీగా కృపాకర్‌రెడ్డి, స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యదర్శిగా అశోక్ కుమార్, స్త్రీ నిధి సంస్థ ఎండీ విద్యాసాగర్‌రెడ్డిలను సర్వీసు నుంచి పంచాయతీరాజ్ శాఖ తొలగించింది. మార్చి 31న పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కనకరత్నం కూడా పదవీ విరమణ చేశారు. దీంతో నాలుగు కీలక విభాగాలకు అధిపతులు లేకుండా పోయారు. వీరికి తగిన ప్రత్యామ్నాయ అధికారులు లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆయా పోస్టులకు కనీసం ఇన్‌చార్జిలను నియమించినా సమస్య ఇంత తీవ్రంగా ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

నియామకాలపై స్పష్టత కరువు

వేసవిలో అత్యంత కీలకమైన తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథకు ఇప్పుడు ఈఎన్‌సీ లేరు. రెండు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన ఎస్ఈసీకి కార్యదర్శి లేరు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీని అందించే, రుణాలు కల్పించే స్త్రీనిధి సంస్థకు ఎండీ లేరు. గ్రామీణ రోడ్లు, ఇతర నిర్మాణ పనులకు బాధ్యులైన పంచాయతీరాజ్ శాఖకు ఈఎన్‌సీ లేకుండా పోయారు. మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డికి ఈ ఏడాది అక్టోబర్ వరకు గడువుంది. విద్యాసాగర్ రెడ్డికి 2026 వరకు పదవీకాలం ఉంది. వీరిని తొలగించాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిన సీఎం.. ఆయా స్థానాల్లో కొత్తవారి నియామకంపై మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెబుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులను మళ్లీ బాధ్యతల్లోకి తీసుకోవాలన్నా, ఎవరికైనా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించాలన్నా ముఖ్యమంత్రికే అధికారం ఉండడంతో.. ఈ విషయంలో వెంటనే ఎలాంటి చర్యలు సాధ్యం కావడం లేదని తెలుస్తోంది. అసలే వేసవి కావడంతో భగీరథకు పెద్దదిక్కు లేకపోతే ఏదైనా సమస్య వస్తే ఎలా ఎదుర్కోవాలి అని అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. జూన్ లేదా జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రెటరీ లేకపోతే ఆ ప్రక్రియకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ ఏడాది హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ 'హామ్'ప్రాజెక్టు కింద వేల కి.మీ గ్రామీణ రోడ్ల నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పీఆర్ ఇంజనీరింగ్ విభాగాధిపతి లేకపోతే పనులు ఎలా చేపట్టి పూర్తిచేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

40 రోజులుగా కొనసాగుతున్న పనులు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో ఆరుగురు కార్మికుల వెలికితీతకు ఆగని ప్రయత్నాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో మట్టిలో కూరుకుపోయిన మిగతా ఆరుగురు కార్మికుల వెలికితీతకోసం నిరాటంకంగా పనులు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 22న సొరంగం కుప్పకూలి ప్రమాదం చోటుచేసుకోగా, బుధవారంతో 40 రోజులు పూర్తయింది. ఇప్పటివరకు ఇద్దరు కార్మికుల మృతదేహాలను బయటకు వెలికితీయగా, మరో ఆరుగురిని వెలికితీసేందుకు సహాయక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఇంకా 110 మీటర్ల వరకూ ఉన్న మట్టి, శిథిలాలు, టీబీఎం భాగాలను తొలగిస్తే కార్మికుల ఆనవాళ్లు లభించే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇందుకోసం నిత్యం 560 మంది వివిధ బృందాలకు చెందిన సాంకేతిక సిబ్బంది పనిచేస్తున్నారు. ఆర్మీకి చెందిన బాబ్‌కాట్ మెషిన్లు, నాలుగు ఎస్కవేటర్ల సాయంతో మట్టిని తొలగించి, కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు. నిమిషానికి 5 వేల లీటర్ల మేర వస్తున్న ఊటనీటిని ఐదు భారీ పంపులతో డీవాటరింగ్ చేస్తున్నారు. ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి, కలెక్టర్ సంతోశ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రెండున్నర ఏళ్లలో సొరంగం పనులు పూర్తి..

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలను బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇక్కడ సహాయక చర్యల సిబ్బందికి సైతం రిస్కు ఉంది'అని అన్నారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. మరో రెండున్నర ఏళ్లలో పనులను పూర్తి చేసి, కృష్ణా నీటిని సద్వినియోగం చేసుకుంటామని వివరించారు.



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వాయుసేన, పౌర విమానాశ్రయంగా ఆదిలాబాద్ పాత ఏరోడ్రోమ్

- సూత్రప్రాయ ఆమోదం తెలిపిన భారత వాయుసేన

సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్‌లోని పురాతన ఏరోడ్రోమ్, ఎయిర్ ఫీల్డ్‌స్టేషన్‌ను పునరుద్ధరించి విమాన సేవలు ప్రారంభించేందుకు భారత వాయుసేన (ఐఏఎఫ్) సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఎయిర్ ఫీల్డ్‌స్టేషన్ ప్రస్తుతం ఐఏఎఫ్ నిర్వహణలో ఉంది. ఇక్కడ కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రతిపాదించింది. దీనికి కావాల్సిన భూమిని సమీకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు సూత్రప్రాయ ఆమోదం తెలుపుతూ ప్రభుత్వానికి భారత వాయుసేన లేఖ రాసింది. దీనిని బహుళ ప్రయోజన విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని ఏఐఎఫ్ సూచించింది. పౌర విమానాల నిర్వహణకు సరిపడా రన్‌వే నిర్మాణానికి, విమానాలు పార్క్ చేసేందుకు, ప్రయాణికుల వసతుల కల్పనకు కావాల్సిన భూమిని సేకరించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించినట్టు పేర్కొంది.

1930లో నిర్మాణం..

ఆదిలాబాద్ పట్టణ శివారులో 1930లో ఏరోడ్రోమ్‌ను నిర్మించారు. యుద్ధ విమానాల విరామ కేంద్రంగా, ఇంధనం నింపే కేంద్రంగా దీనిని వాడుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. ఇక్కడ అవసరానికి తగ్గట్టు పౌర విమానాల సేవల కోసం కూడా ఉపయోగపడేలా వేయి మీటర్ల రన్‌వే సదుపాయం కల్పించారు. దాదాపు 350 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇది భారత వాయుసేన ఆధీనంలోనే ఉంది. ఇప్పటికీ వాయుసేన హెలికాప్టర్లు అక్కడికి వచ్చి వెళుతుంటాయి. దీనిని పూర్తిస్థాయి పౌరవిమానాశ్రయంగా మార్చాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకు సిద్ధంగా ఉన్నామని గతంలో కేంద్రమంత్రి అమిత్‌షా హామీ కూడా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీన్ని మరోసారి ప్రతిపాదిస్తూ లేఖ రాసింది.

ఇంటర్ మూల్యాంకనంలో పొరపాట్లు చేయొద్దు

ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్ని స్థాయిల అధికారులను ఆదేశించారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తర్వాతే మార్కుల విషయంలో నిర్ధారణకు రావాలని సూచించారు. ఇంటర్ బోర్డ్ అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల తీరుతెన్నులు, జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాల్లో స్క్రూటినైజర్లు, సబ్జెక్టు నిపుణులు మూల్యాంకన ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని కోరారు. మూల్యాంకన ప్రక్రియ సమయంలోనే నామినల్ రోల్‌లో దిద్దుబాట్లను పూర్తి చేయాలని సూచించారు. మూడు రకాల ధ్రువీకరణ పూర్తయిన వెంటనే మార్కుల డేటా ఆన్‌లైన్‌లో బోర్డుకు వస్తుందని ఆయన వివరించారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి జయప్రదబాయి పలువురు అధికారులు పాల్గొన్నారు.

సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు

మార్చి 30 నుంచి జూన్ 1 వరకూ ఇంటర్ కాలేజీలకు వేసవి సెలవులు ఉన్నాయని, ప్రైవేటు కాలేజీలు కూడా ఈ ఆదేశాలను పాటించాలని కృష్ణ ఆదిత్య తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం జూన్ 2 నుంచి మొదలవుతుందని, ఈలోపు ప్రైవేటు కాలేజీలు, కోచింగ్ కేంద్రాలు క్లాసులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవుల్లో విద్యార్థులను ప్రైవేటు కాలేజీలకు పంపొద్దని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

రైల్వేకు కాసులు కురిపిస్తున్న తుక్కు

స్క్రాప్ వేలం ద్వారా రూ.501 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: నిరుపయోగంగా మారిన పాత వస్తువులు రైల్వేకు కాసులు కురిపిస్తున్నాయి. తాజాగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని డివిజన్‌లలో ఏడాది కాలం నాటి తుక్కును వేలం ప్రక్రియ ద్వారా అమ్మగా, రైల్వేకు ఏకంగా 501.72 కోట్ల రికార్డు ఆదాయం సమకూరింది. అంతకుముందు సంవత్సరంలో ఈ రూపంలో రూ.411.39 కోట్లు సమకూరింది. ఇది ఇప్పటివరకు గరిష్ఠ మొత్తంగా రికార్డులో నిలిచింది. దీంతో ఈ సంవత్సరం రూ.430 కోట్ల వరకు వేలంలో ఆదాయం సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని, అన్ని డివిజన్లలో తుక్కును వేలం వేసింది. అయితే లక్ష్యంగా నిర్ధారించుకున్న మొత్తం కంటే రూ.71 కోట్లు అదనంగా సమకూరటం విశేషం. గతంలో ఇనుప వస్తువులను ప్రత్యేకంగా వేలం వేసేవారు. ఇప్పుడు ఇనుముతోపాటు పాత కాగితాలు, ఇతర వస్తువులను కూడా కలిపి వేలం వేస్తున్నారు. వేలం ప్రక్రియను కూడా ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తుండటం విశేషం. గతంలో వినియోగించి వాడకం ఆపేసిన రైల్ ఇంజిన్లు, ప్రయాణికుల పాత కోచ్‌లు, సరుకు రవాణా వ్యాగన్లు, పట్టాలు, స్లీపర్లు, జాయింట్లు తదితర వస్తువులను వేలంలో ఉంచడం విశేషం. తుక్కు తొలగింపుపై ఆయా విభాగాల అధికారుల, సిబ్బంది కృషిని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

కొంచెం సులభమే!

మొదటి పేజీ తరువాయి

సీక్వెన్స్ అండ్ సిరీస్‌ల నుంచి వచ్చిన ప్రశ్నలకు తేలికగానే సమాధానాలు రాబట్టినట్టు పలువురు విద్యార్థులు తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల మంది రాస్తున్న ఈ పరీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది వరకు హాజరవుతున్నారు. బుధవారమే సీబీఎస్ఈ పరీక్ష కూడా ఉండటంతో, రెండూ ఎలా రాస్తారనే అభ్యంతరాలు వచ్చాయి. దీంతో ఎన్‌టీఏ సీబీఎస్ఈ పరీక్ష ఉన్న విద్యార్థుల స్లాట్ సమయాన్ని మార్చింది. వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఈ వెసులుబాటు కల్పించింది.

సబ్జెక్టులవారీగా ఇలా..

- మొదటి షిఫ్ట్ ప్రశ్నపత్రం ఓ మోస్తరు క్లిష్టతతో ఉందని, ఫిజిక్స్ విభాగం క్లిష్టంగా, మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలు సుదీర్ఘంగా, మిగతా రెండు విభాగాలతో పోల్చి తే కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఉన్నట్టు అభ్యర్థులు తెలిపారు.
- ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, ఆప్టిక్స్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం లభించింది. న్యూమరికల్ ప్రశ్నల కారణంగా సమయం సరిపోలేదని కొందరు విద్యార్థులు తెలిపారు. రెండో షిఫ్ట్‌లో ఓ మోస్తరు కఠినమైన ప్రశ్నలు అడిగారు. మోడ్రన్ ఫిజిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, కెపాసిటర్, మ్యాగ్నటిక్ ఫీల్డ్, యూనిట్ అండ్ డైమెన్షన్స్, రొటేషన్, ఫ్లూయిడ్ మెకానిక్స్, సర్ఫేస్ టెన్షన్, రే ఆప్టిక్స్, సెమీ కండక్టర్, లాజిక్ గేట్, కైనమాటిక్స్ అంశాలకు ప్రాధాన్యమిచ్చారు.
- జనవరి సెషన్‌తో పోల్చితే కెమిస్ట్రీలో ఈసారి ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలడిగారని అంటున్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ కంటే ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీ ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయి. ఇవి కూడా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోంచి నేరుగా అడిగారు. రెండో షిఫ్ట్‌లో కూడా ఇదే తరహాలో ప్రశ్నలు అడిగారు. ఫిజికల్ కెమిస్ట్రీలో న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు ఎక్కువ ఉన్నాయి. మొదటి షిఫ్ట్ మాదిరిగానే రెండో షిఫ్ట్‌లో కూడా ఫిజికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీలకు ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు.
- మ్యాథమెటిక్స్ విభాగంలో జనవరి సెషన్‌తో పోల్చితే ఈసారి ప్రశ్నలు సులభంగానే ఉన్నాయని, 5 ప్రశ్నలు డైరెక్ట్ ఫార్ములా ఆధారంగా అడిగారని చెబుతున్నారు. రెండో షిఫ్ట్‌లో కూడా ఈ విభాగం ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. వెక్టార్ అండ్ 3డి, మ్యాట్రిసెస్, డిటర్మినెంట్స్, లీనియర్ ఈక్వేషన్స్, ఇంటిగ్రేషన్, కానిక్ సెక్షన్, ఎలిప్స్, ఏరియా అండర్ కర్వ్, ప్రాబబిలిటీలకు రెండో షిఫ్ట్‌లో ప్రాధాన్యం లభించింది. మొదటి షిఫ్ట్‌లో మాత్రం అధిక శాతం ప్రశ్నలు పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్, బైనామియల్స్, సర్కిల్స్, లాగరిథమ్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, సీక్వెన్స్ అండ్ సిరీస్‌ల నుంచి అడిగారు.

గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా..

రెండో సెషన్‌లో మొదటి రోజు పరీక్షల్లో అధిక శాతం ప్రశ్నలు.. గత ప్రశ్నపత్రాల నుంచే అడిగారు. వీటిని బాగా ప్రాక్టీస్ చేసిన వారు ఎక్కువ సమాధానాలు గుర్తించే అవకాశం ఉంది. ఫార్ములాలు, కాన్సెప్ట్‌లపై అవగాహన ఉన్న వారు కూడా సమాధానాలు ఇచ్చేలా ప్రశ్నలున్నాయి. కెమిస్ట్రీలో మిక్స్‌డ్ కాన్సెప్ట్ కొశ్చన్స్ అడిగారు. మ్యాథమెటిక్స్‌లో 52-56 మార్కులు; ఫిజిక్స్‌లో 75-85 మార్కులు; కెమిస్ట్రీలో 60-65 మార్కులతో 99 పర్సంటైల్ పొందే అవకాశం ఉంది.

-ఎం.ఎన్. రావు, జేఈఈ శిక్షణ నిపుణుడు



ఒక్కరోజే 21,290 బస్తాల ధాన్యం

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లో అత్యధికంగా బుధవారం ఒక్కరోజే 21,290 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి సురేశ్ తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ఈరోజు అధికంగా ధాన్యం వచ్చింది. క్వింటాకు గరిష్ఠంగా రూ.1,953, కనిష్ఠంగా రూ.1,650 ధర పలికింది.

వరంగల్ చపాటా మిరపకు జీఐ ట్యాగ్

- కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ చపాటా మిరప రకానికి జీఐ ట్యాగ్ లభించింది. ఇది తెలంగాణ రాష్ట్రం నుంచి భౌగోళిక సూచిక పొందిన 18వ ఉత్పత్తి కాగా.. జీఐ ట్యాగ్ పొందిన మొదటి ఉద్యానవన ఉత్పత్తి. ఈ రకం మిరపను వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో 6,738 ఎకరాల్లో సాగు చేస్తారు. ఏటా దాదాపు 10,951 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. ఈ జీఐ ట్యాగ్ ద్వారా 20,574 మంది రైతులు ప్రయోజనం పొందుతారని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండ రాజిరెడ్డి తెలిపారు. వరంగల్ చపాటా మిరప పండ్లు ఎరుపు రంగులో, మందపాటి గోడల సాగులో ఉంటాయని తెలిపారు. వరంగల్ చపాటా మిరపను స్థానిక ప్రజలు టమాట మిరపకాయ అని కూడా పిలుస్తారని వెల్లడించారు. ఈ మిరపలో సింగిల్ పట్టి, డబుల్ పట్టి, ఓడలు అనే మూడు రకాల పండ్లు ఉన్నాయని, జమ్మికుంట మండలంలోని నాగారం గ్రామంలో వరంగల్ చపాటాను 80 ఏళ్లకు పైగా సాగుచేస్తున్నారని వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యానవన ఉత్పత్తులను జీఐ రిజిస్ట్రేషన్ కోసం దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపు కోసం జీఐ రిజిస్ట్రేషన్ విశ్వవిద్యాలయం ప్రక్రియలో ఉందని వీసీ వెల్లడించారు.

ఆర్టీసీలో 20 మంది రిటైర్డ్ అధికారుల తొలగింపు

సాక్షి, హైదరాబాద్: రిటైర్ అయిన తర్వాత సర్వీసుల్లో కొనసాగుతున్న 20 మంది అధికారులను తప్పిస్తూ ఆర్టీసీ ఆదేశాలు జారీచేసింది. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కూడా ఉండటం విశేషం. ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీందర్‌రావు, మెడికల్ కన్సల్టెంట్‌గా నియమితులై తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సీనియర్ వైద్యుడు సైదిరెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఓఎస్డీగా పనిచేస్తున్న వేణు, కన్సల్టెంట్ ఎల్‌ఏఓలుగా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్, శ్యామ్ మోహన్, ఓఎస్డీ యుగేందర్, స్పెషల్ ఆఫీసర్ జీవన్‌ప్రసాద్, డిప్యూటీ ఈఈ స్వామి, సత్యనారాయణ, అశోక్‌రావు, వీఎస్ఎన్ మూర్తి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు గౌడ్, బల్దేవ్ కుమార్, యేసు, కళాభవన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కేశవులు, డిప్యూటీ సీఏఓ యాదగిరి, ఏఓ బీఆర్‌సీ మూర్తి, ఎల్ఓ సాంబశివరావు, మోహన్, రోడ్డు భద్రత విభాగానికి చెందిన నెథానియెల్‌ను తొలగిస్తున్నట్టు ఆర్టీసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీఆర్వో, వీఆర్ఏలకు మళ్లీ ఆప్షన్లు

- గ్రామ పాలన అధికారుల నియామకంపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో గ్రామపాలన అధికారుల నియామకాల కోసం ప్రభుత్వం మరో మారు ఆప్షన్లు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ నుంచి వచ్చే గూగుల్ ఫామ్ ద్వారా తమ ఆప్షన్లను తెలియజేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆప్షన్లు ఇచ్చేందుకు ఈ నెల 16 చివరి తేదీగా నిర్ణయించారు. గతంలోనే వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆప్షన్లు స్వీకరించింది. అప్పుడు మొత్తం 9,654 మంది రెవెన్యూ శాఖలోకి తిరిగి వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చారు. అయితే ఇటీవల విడుదల చేసిన జీపీఓ పోస్టుల భర్తీ మార్గదర్శకాల ప్రకారం డిగ్రీ లేదా ఇంటర్ పూర్తి చేసినవారు మాత్రమే అర్హులవుతారు. గతంలో ఆప్షన్లు ఇచ్చిన వారిలో ఇంటర్ విద్యార్హత లేనివారు కూడా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు డిగ్రీ, ఇంటర్ చదివిన వారి నుంచి మాత్రమే ఆప్షన్లు స్వీకరించేందుకు ఈ ప్రకటన జారీ చేశారని సమాచారం.

అప్పు కింద గొర్రెలు జప్తు!

- కొంత నగదు చెల్లించాక విడుదల



గొర్రెలను జీపులో ఎక్కిస్తున్న సిబ్బంది

కూసుమంచి: బ్యాంకులో తీసుకున్న అప్పు వాయిదాలు సరిగా చెల్లించకపోవటంతో అధికారులు సదరు వ్యక్తి గొర్రెలను జప్తు చేసిన ఘటన ఇది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోరీలపాడు తండాలో మూడు రోజుల కిందట జరిగింది. గోరీలపాడు తండాకు చెందిన బదావత్ లింగానాయక్ కూసుమంచిలోని డీసీసీబీ బ్రాంచ్‌లో రూ.50 వేల ముద్రా లోన్ తీసుకున్నాడు. కొద్దినెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందన రాలేదు. దీంతో సోమవారం ఆయన ఇంటికి వెళ్లిన మేనేజర్ స్రవంతి, సిబ్బంది అప్పు చెల్లించాలని కోరగా స్పందించకపోవడంతో లింగానాయక్ ఇంట్లో ఉన్న రెండు గొర్రెలను జీపులో బ్యాంకుకు తీసుకొచ్చారు. ఈమేరకు లింగానాయక్ బ్యాంకుకు వచ్చి రూ.10 వేలు చెల్లించి, మిగతా నగదు వాయిదాల్లో చెల్లిస్తానని చెప్పడంతో మేనేజర్ ఆయన గొర్రెలను ఆటోలో తండాకు పంపించారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ స్రవంతిని వివరణ కోరగా లింగానాయక్ రుణం సక్రమంగా చెల్లించకపోవటంతో గొర్రెలు తీసుకొచ్చామన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 3-4-2025

- కాషాయమయం కానున్న కొండగట్టు
- ఈనెల 11 నుంచి చిన్నజయంతి
- తరలిరానున్న 2 లక్షల హనుమాన్ స్వాములు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ



కొండగట్టు అంజన్న క్షేత్రం

జై బోలో హనుమాన్‌కి...

జగిత్యాల: తమ ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి చిన్న జయంతికి స్వాములు తరలిరానున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్ర మైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం జగిత్యాల జిల్లాలో ఉంది. ఈ ఆలయంలో ఈనెల 11 నుంచి మూడు రోజుల పాటు చిన్నజయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది హనుమాన్ దీక్ష స్వాములు తరలివస్తారు. అధిక సంఖ్యలో దీక్షాపరులు వచ్చి మాల విరమణ తర్వాత అంజన్నకు ముడుపుకట్టి దర్శించుకుని వెళ్తుంటారు.

2 లక్షల మంది దీక్ష స్వాములు రాక

అంజన్న సన్నిధి అయిన కొండమీదకు కాలినడకన వాహనాల్లో అనేక ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుంటారు. భక్తులు సోమవారం వరకు చేరుకుని ఆలయంలో అంజన్న సన్నిధిలో సేదతీరి అర్ధరాత్రి వరకు ఉండి ఆలయ క్యూలైన్లలో నిలబడి విరమణ చేయడానికి బారులు తీరుతారు. జై బజరంగభళి, పవనసుత హనుమాన్‌కీ జై, అంజనీపుత్ర కేసరీ నందన జై హనుమాన్ జై శ్రీరాం అంటూ కొండకు భక్తులు చేరుకుంటారు. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల ద్వారా కాలినడకన వాహనాల్లో వచ్చిన భక్తులకు ఉదయం 12 గంటల ప్రాంతంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరి క్యూలైన్ ద్వారా మాల విరమణ చేసుకొని స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ మూడు రోజులు శుక్ర, శని, ఆదివారాల్లో కొండంతా కాషాయమయంగా మారనుంది.

భక్తులకు దర్శనం ఇలా..

కొండకు వచ్చే భక్తులు దిగువ కొండ మార్గాన వచ్చేవారు ఘాట్‌రోడ్‌తో పాటు మెట్లదారి మార్గాన కాలినడకన గుట్టకు చేరుకుంటారు. జేఎన్‌టీయూ చెక్‌పోస్ట్ వద్ద నుంచి వచ్చే భక్తులు కొండగట్టు బొజ్జ పోతన్న సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో పార్కింగ్ చేసి కాలినడకన కొండ మీదకు చేరుకుంటారు. కొండకు చేరుకున్నాక ముందుగా పాత కోనేరు ఎదురుగా ఉన్న మెట్లదారి వెంట వెళ్లి అక్కడ ఉన్న కల్యాణకట్టలో క్యూలైన్ పద్ధతిలో మాల విరమణ చేసుకోవాలి. అనంతరం నూతన కోనేరు పక్కన ఉన్న చలువ పందిళ్ల దిగువ, శ్రీరామ కోటి స్తూపం వెనకాల షెడ్డులో తలనీలాలు సమర్పించి, నూతన కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించాలి. తర్వాత ఆలయ ఆవరణలోని నూతన రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారిని దర్శించుకోవాలి. అనంతరం ఆలయం వెనకాల నుంచి బయటకు వెళ్లాలి. ఇలా భక్తులకు ఎలాంటి లోటు పాట్లు ఇక్కట్లు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లపై కలెక్టర్ దృష్టి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చిన్న జయంతికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా కొండకు వచ్చే భక్తులకు జేఎన్‌టీయూ కళాశాల దాటాక, ఘాట్ రోడ్ వెంట తాగునీటికి చలివేంద్రాలు, మల విసర్జనకు తాత్కాలిక మరుగుదొడ్లు, జేఎన్‌టీయూ బొజ్జ పోతన్న సమీపంలో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం, ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తినట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఫైర్ ఇంజన్, చోరీలు జరగకుండా వందల నిఘానేత్రాలు, పోలీసులు, కొండ దిగువ నుంచి మీదకు ఉచిత బస్సు సౌకర్యం, దారి వెంట భక్తులకు ఆటో ద్వారా నీరు అందించడం లాంటి ఏర్పాట్లు చేశారు. భక్తులకు స్నానమాచరించే పరిసరాలలో నిత్యం శానిటేషన్ చేపట్టాలని ఆదేశించారు.

జయంతి రోజు కోరిన కోరికలు తీరుతాయి

జయంతి ఉత్సవాలకు భక్తులు ఏటా ఎక్కువ సంఖ్యలో తరలివస్తారు. ఎంతో నిష్టతో భక్తులు మాల వేసుకొని ఇక్కడ విరమణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. జయంతి రోజున ఇక్కడ విరమణ చేసిన భక్తులు వారు కోరుకున్న కోరికలు తీరుతాయని నమ్మకం.



కొండగట్టులో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రశ్నోత్తరాలు

అమృత్ భారత్ పథకం కింద నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లు

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద గుర్తించి, టెండర్లు కేటాయించి పనులు చేపట్టామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నల్లగొండ స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారమ్ షెల్టర్ల ఏర్పాటు, బుకింగ్ ఆఫీస్, ప్లాట్‌ఫారమ్ సర్ఫేసింగ్‌ల మెరుగుదల, కొత్త ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, స్టేషన్ బిల్డింగ్, వెయిటింగ్ హాల్, దివ్యాంగులకు సౌకర్యాల ఏర్పాటు, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర పనులు పూర్తి చేశామని కాంగ్రెస్ ఎంపీ రఘువీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బుధవారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. అంతేగాక మిర్యాలగూడ స్టేషన్‌లోనూ అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. తెలంగాణలోని 40 స్టేషన్లతో సహా ఇప్పటివరకు 1,337 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు గుర్తించామన్నారు.

కాజీపేటలో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్

కాజీపేటను కొత్త రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయాల్సిన అవసరం ప్రస్తుతం లేదని, సికింద్రాబాద్ డివిజన్‌పై ఎలాంటి అధిక పనిభారం లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అదే సమయంలో కాజీపేటలో రూ.521.36 కోట్ల వ్యయంతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను అభివృద్ధి చేయడానికి కేంద్ర రైల్వే శాఖ ప్రణాళిక అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. 2025 ఫిబ్రవరి వరకు, ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.282.1 కోట్లు ఖర్చు చేశామని కాంగ్రెస్ ఎంపీలు కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణలు అడిగిన వేరువేరు ప్రశ్నలకు కేంద్రమంత్రి బుధవారం లోక్‌సభలో బదులిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించలేదు..

హైదరాబాద్‌లో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఎంఎంటీఎస్) ప్రాజెక్టులో సబర్బన్ రైలు సేవల కోసం రూ.1,169 కోట్లు 1:2 నిష్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన మంజూరు చేసి 2024 మార్చిలో ప్రారంభించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాగా ఈ ప్రాజెక్టు కోసం రూ.279 కోట్ల వాటాను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. అంతేగాక ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కి.మీ. 3వ లైన్ నిర్మాణం కోసం రూ.412 కోట్లు ఎంఎంటీఎస్ కింద కాస్ట్ షేరింగ్ ప్రాతిపదికన 2016లో మంజూరు చేశామన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా నిధులను ఇంకా జమ చేయకపోవడంతో ప్రాజెక్టును చేపట్టలేకపోయామని కేంద్రమంత్రి స్పష్టత ఇచ్చారు.

వేలం పద్ధతిలోనే బొగ్గుబ్లాకులు..

బొగ్గు బ్లాకుల కేటాయింపునకు అనుసరించిన విధానం ప్రకారం, ఇప్పుడు అన్ని బొగ్గు బ్లాకులకు వేలం పద్ధతిలో కేటాయింపులు జరుగుతున్నాయని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో కోయగూడెం బ్లాక్-3ను ఆరో కోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కి వేలం ద్వారా ఇచ్చామన్నారు. అయితే ఆరో కోల్ ప్రైవేట్ లిమిటెడ్ షరతులను పాటించని కారణంగా 2023 మార్చి 13న టెర్మినేషన్ నోటీసు జారీ చేశామన్నారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్‌లు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బుధవారం లోక్‌సభలో బదులిచ్చారు. అంతేగాక సత్తుపల్లి బ్లాక్-3 దక్కించుకున్న శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ వెస్టింగ్ షరతులను పాటించలేదని, ఈ అంశం కూడా కోర్టు పరిధిలో ఉందని కేంద్రమంత్రి తెలిపారు.

బీసీ ఆజాదీ ఆమరణ దీక్షకు కాంగ్రెస్ మద్దతు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్త కులగణన చేయాలని, తెలంగాణ బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా ఢిల్లీలో జక్కని సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ నేత బత్తుల సిద్దేశ్వర పటేల్ చేస్తున్న దీక్షకు కాంగ్రెస్ మద్దతు తెలిపింది. బుధవారం తెలంగాణ భవన్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఐలయ్య, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీలు కోదండరాం, దాసోజు శ్రవణ్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటం ఫలించాలని ఆకాంక్షించారు.

బహుజన యోధుడు

సర్దార్ సర్వాయి పాపన్న

సీఎం రేవంత్ రెడ్డి • తెలంగాణ భవన్‌లో నివాళులర్పించిన పీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: నిరంకుశ రాచరికాన్ని వ్యతిరేకించిన బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వందల ఏళ్ల కిందటే రాజకీయ, సామాజిక సమానత్వానికి సబ్బండ వర్గాలను ఏకం చేసి పోరాడిన యోధుడు పాపన్న అని గుర్తుచేశారు. మరోవైపు తెలంగాణ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్యనేతలు సర్వాయి పాపన్నకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాల న్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న ఆనాడే తిరుగుబాటు చేసి గోల్కొండ ఖిలాను జయించి, సామాజిక న్యాయానికి సారథ్యం వహించారని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనలో అందరం ఒకే గొంతుకగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ కన్ను

బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ కన్నుపడిందని, ఇందిరమ్మ ఇచ్చిన భూమిని రూ.30 వేల కోట్లకు అమ్మాలని చూస్తోందని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విరుచుకుపడ్డారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు 400ఎకరాల భూమిని బిల్లీరావు అనే ప్రైవేటు వ్యక్తికి ఇచ్చారని, ఆ భూములను కాపాడేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చేసిన ప్రయత్నం లేదా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యమని అబద్ధం చెప్పి.. భూములను అమ్మి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. హెచ్‌సీయూ విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలు తారుమారు అయ్యాయని, విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భట్టి, శ్రీధర్‌బాబు సెంట్రల్ యూనివర్సిటీలో చదివారని, అలాంటి వర్సిటీపై వాళ్లకు ప్రేమ లేదా? అని శ్రీనివాస్ నిలదీశారు. తెలంగాణ, ఆంధ్రా ఉద్యమంలో ఇందిరాగాంధీ హెచ్‌సీయూ పెట్టారని, రాజ్యాంగ సవరణ ద్వారా 2,300 ఎకరాలు హెచ్‌సీయూకి కేంద్రం ఇచ్చిందని తెలిపారు.

కేంద్రంతో సుహృద్భావంతో ముందుకు సాగాలి

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సామాజిక న్యాయ సాధన రాజకీయ ప్రచారాలతో కాదని, చట్టపరమైన ధోరణి, కేంద్రంతో సుహృద్భావంతో ముందుకు సాగాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్ హితవుపలికారు. బిల్లులు గవర్నర్ ఆమోదం పొందకముందే ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేయడం వల్ల బీసీలకు న్యాయం జరగదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రామాణిక గణాంకాలు, న్యాయపరమైన నివేదికలు, విధివిధానాలు సిద్ధం చేయాలని, లేకపోతే బీసీలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిల్లులు తెచ్చినప్పటికీ, వాటి అమలుకు అవసరమైన ప్రక్రియలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బీజాపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ విభాగాలకు చెందిన బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు మావోయిస్టులు తారసపడటంతో ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఎస్టీఎఫ్ జవాన్ సంతన్‌కుమార్, బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన జవాన్ మహేష్ గట్టుపల్లికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని మొదట దంతెవాడకు తరలించి అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ తీసుకెళ్లారు.

ఇప్పటికైతే ఇంతే స్మార్ట్!

మార్చి 31తో ముగిసిన 'స్మార్ట్ సిటీ మిషన్'

- లక్ష్యాలకు దూరంగా పలు నగరాలు
- ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగింపు..మరోసారి పెంపుపై స్పష్టత లేదు..
- దేశంలో 100 నగరాలకు వెచ్చించిన సొమ్ము రూ.1.65 లక్షల కోట్లు
- ఖర్చయిన నిధులు రూ.1.50 లక్షల కోట్లు.. పురోగతిలో 558 ప్రాజెక్టులు
- నూరుశాతం పూర్తయినవి 25... 95 నుంచి 99 శాతంలో 37 నగరాలు
- 87.2 శాతంలో తెలంగాణ... వరంగల్ 84.9 శాతం పనులు పూర్తి

స్మార్ట్‌సిటీ కింద ఎంపికైన నగరాలు: 100	చేపట్టిన మొత్తం ప్రాజెక్టులు: 8,062
ప్రాజెక్టుల ఖర్చు అంచనా: రూ.1,64,545 కోట్లు	పూర్తయిన ప్రాజెక్టులు: 7,504 (93 శాతం)
పూర్తయిన ప్రాజెక్టుల ఖర్చు: రూ.1,50,306 కోట్లు	పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు: 558 (7 శాతం)
పురోగతి ప్రాజెక్టుల అంచనా: రూ.14,239 కోట్లు	



వరంగల్ నగరంలోని నర్సంపేట రోడ్డులో అసంపూర్తిగా ఉన్న స్వాగతద్వారం పనులు

సాక్షిప్రతినిధి, వరంగల్: స్మార్ట్ సిటీ మిషన్ (ఎస్‌సీఎం) గడువు మార్చి 31తో ముగిసింది. సుందర నగరాల లక్ష్యం నెరవేరకపోవడంతో గతంలో రెండుసార్లు గడువు పొడిగించిన కేంద్రం.. ఈసారి స్పష్టత ఇవ్వలేదు. దీంతో స్మార్ట్ సిటీ మిషన్ ముగిసినట్లేనన్న చర్చ జరుగుతోంది. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 100 నగరాలను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం.. 2015 ఆగస్టు 27న ప్రారంభించింది. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆర్థిక వృద్ధిని పెంచడం.. తద్వారా సుందరనగరాలుగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యం. నిధుల వెసులుబాటు లేక ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో రెండుసార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం.. ఈ ఏడాది మార్చి 31 వరకు మిషన్ పూర్తవుతుందని పేర్కొంది. అయినప్పటికీ 100 నగరాల్లో 25 మాత్రమే నూరుశాతం పూర్తి చేయగా, 37 నగరాల్లో 95 నుంచి 99 శాతంలో ఉన్నాయి. 38 నగరాల్లో ప్రాజెక్టులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. అయితే మరోసారి పొడిగింపుపై మంగళవారం వరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ఎస్‌సీఎం లక్ష్యం ఇదీ..

25 నగరాల్లోనే నూరుశాతం...

దేశంలోని వంద నగరాల్లో రూ.1,64,545 కోట్ల వ్యయంతో 8,062 ప్రాజెక్టులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. సుమారు తొమ్మిదేళ్లలో రూ.1,50,306 కోట్లు ఖర్చు కాగా, 7,504 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. కాగా, రూ.14,239 కోట్ల వ్యయం కాగల 558 పనులు పురోగతిలో ఉన్నాయి. స్మార్‌సిటీ మిషన్‌కు సంబంధించిన ఈ వివరాలను ఐదు రోజుల కిందట పార్లమెంట్‌లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి సుధాకర్‌సింగ్ వెల్లడించారు. ఈ గణాంకాల ప్రకారం 25 నగరాల్లో నూరుశాతం ఎస్‌సీఎం పూర్తయినట్లు తెలుస్తోంది. ఇందులో జార్ఖండ్‌లోని రాంచి, కర్ణాటకలో మంగళూరు, శివమొగ్గ, తుమకూరు, దావణగెరెలు, మధ్యప్రదేశ్‌లో భూపాల్, ఇండోర్, జబల్‌పూర్, మహారాష్ట్రలో అమరావతి, నాగ్‌పూర్, నాసిక్, పుణె, సోలాపూర్, థానేలు, ఒడిస్సాలో రూర్కేలా, రాజస్తాన్‌లో అజ్మీర్, ఉదయ్‌పూర్, తమిళనాడులో కోయంబత్తూర్, మదురై, సేలంలు, ఉత్తరప్రదేశ్‌లో అగ్రా, ఝాన్సీ, లక్నో, వారణాసిలు ఉన్నాయి. కాగా 94 నుంచి 99 శాతం వరకు పనులు పూర్తి చేసిన నగరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, బిహార్‌లో భగల్‌పూర్, పాట్నా, గుజరాత్‌లో దాహద్, రాజ్‌కోట్, వడోదరలు, కేరళలో కొచ్చి, తిరువనంతపురంలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని 37 ఉన్నాయి.

తెలంగాణలో 87.2 శాతం...

లక్షద్వీప్‌లో 24.6 శాతమే...

దేశంలోని 38 నగరాలను విశ్లేషిస్తే లక్షద్వీప్‌లోని కావరట్టి 24.6 శాతం, మిజోరాంలో 78.4, హరియాణాలోని ఫరీదాబాద్‌లో 84.1, కర్నల్‌లో 88.2 శాతంగా ఉన్నాయి. తెలంగాణ విషయానికి వస్తే వరంగల్, కరీంనగర్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఎస్‌సీఎం కింద రూ.2,918 కోట్ల వ్యయం కాగల 169 ప్రాజెక్టులు 87.2 శాతమే పూర్తయినట్లు పేర్కొన్నారు. ఇందులో వరంగల్ కార్పొరేషన్‌లో రూ.1,800 కోట్లతో చేపట్టిన 119 ప్రాజెక్టుల్లో 84.9 శాతం, కరీంనగర్‌లో రూ.1,117 కోట్లతో చేపట్టిన 50 ప్రాజెక్టులు 89 శాతం పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పెంచాలని తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శితో పాటు వెనుకబడిన ఇతర రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు కేంద్రానికి లేఖ రాసినట్లు సమాచారం. అయితే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గతంలో చేసిన విజ్ఞప్తి మేరకే 2025 మార్చి 31 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో ఈసారి ఆ అవకాశం లేదన్న చర్చ పురపాలకశాఖ వర్గాల్లో సాగుతోంది.



వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం తెచ్చి వృథాగా పెట్టిన సిమెంట్ గూనపైపులు



వరంగల్ నగరంలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు పనులు

జాతీయస్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2025 రెండో సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.ఈ పరీక్ష రాయడానికి విద్యార్థులు చాలాచోట్ల సమయానికంటే ముందుగానే సెంటర్లకు చేరుకున్నారు. దీంతో ఆయా సెంటర్ల వద్ద పండడి వాతావరణం నెలకొంది.


కర్నూలులో జేఈఈ మెయిన్ పరీక్ష సెంటర్ వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


కడపలోని కేఓఆర్ఎం కళాశాల వద్ద జేఈఈ మెయిన్ పరీక్ష కోసం తన కుమార్తె చెవుల కమ్మలను తీస్తున్న తండ్రి


పరీక్ష సమయం దగ్గరపడుతుండటంతో అనంతపురంలో పరుగున వస్తున్న విద్యార్థి

క్లుప్తంగా...

నేడు విశాఖ అగ్రపీఠాధిపతిగా ఉడుమల బాల బాధ్యతల స్వీకరణ



డాబాగార్డెన్స్: విశాఖపట్నం ఆర్సీఎం చర్చిల అగ్రపీఠాధిపతిగా వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాల గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆర్సీఎం పోప్ (విశ్వగురువు) ఫ్రాన్సిస్ ప్రతినిధి, భారత్-నేపాల్ దేశాల ఆర్సీఎం సంస్థల అంబాసిడర్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి సమక్షంలో కార్డినల్, హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి పూల ఆంథోనీ చేతుల మీదుగా బాధ్యతలు చేపట్టనున్నారు. దేశంలోని పలు చర్చిలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరుకానున్నారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్, మోస్ట్ రెవరెండ్ కార్డినల్ ఆంథోనీ పూలా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. ముంబాయి ఆర్చ్ బిషప్ ఎమిరిటస్ రెవరెండ్ డాక్టర్ ఓస్వాల్డ్ కార్డినల్ గ్రేసియస్ ప్రధాన ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ముందుగా వాల్తేర్ రైల్వేస్టేషన్ సమీపాన గల సెయింట్ జోసెఫ్స్ కళాశాల ఫర్ ఉమెన్ గ్రౌండ్స్‌లో గ్రూప్ ఫొటోగ్రాఫ్, అనంతరం సెయింట్ పీటర్స్ కేథడ్రల్ గ్రౌండ్స్‌కు ఊరేగింపుగా వెళ్లనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు దివ్యపూజ వేడుక ప్రారంభం కానుంది. సాయంత్రం 7 గంటలకు దేశంలో గల ప్రముఖ ఆర్చ్ బిషప్‌లు, బిషప్‌లు, ప్రావిన్షియల్ సుపీరియర్లు, ప్రీస్ట్స్, మతాధికారులు, ప్రజలు హాజరై అభినందనలు తెలపనున్నారు.

నేటి నుంచి ఓలా, ఉబర్ సర్వీసులు నిలిపివేత

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): పదేళ్లుగా గుంటూరు, విజయవాడ నగరాల్లో ఆన్‌లైన్ క్యాబ్స్ నడుపుతూ జీవనం సాగించే డ్రైవర్ల కష్టాన్ని 30 శాతం కమీషన్ల పేరుతో ఓలా, ఉబర్ కంపెనీలు దోచుకుని డ్రైవర్లకు మొండి చేయి చూపుతున్నాయని దీనికి నిరసనగా ఈ నెల 3వ తేదీ నుంచి ఓలా, ఉబర్ సర్వీస్‌లను నిలిపివేస్తున్నట్లు గుంటూరు ఓలా, ఉబర్ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బుధవారం గుంటూరు లాడ్జిసెంటర్ వద్ద తమకు జరుగుతున్న అన్యాయాన్ని బ్యానర్‌గా ప్రదర్శించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గుంటూరు, విజయవాడ నగరాల్లో 2,000 మంది క్యాబ్ కింద లింక్ అయి ఉన్నారని చెప్పారు. బ్రాడ్ కాస్ట్, మల్టీ కాస్ట్ ట్రిప్పులను తీసివేయడంతో పాటు పాత పద్ధతిలో ట్రిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓలా పాస్ తీసివేయాలని, ఓలాలో బేస్ రేటు కిలోమీటర్లు రేట్లతో పాటు టోల్ చార్జీలను పెంచాలన్నారు.

బబుల్ గమ్‌తో హుండీ చోరీ

సంతబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో ఇటీవల పునర్నిర్మాణం జరుపుకొన్న భూలోకమ్మ తల్లి ఆలయంలో బుధవారం హుండీ చోరీ జరిగింది. చిన్నపాటి కర్రపుల్లకు బబుల్ గమ్ అంటించి హుండీ రంధ్రంలో పెట్టి రూ.500, రూ.200, రూ.100, రూ.50 నోట్లు తీసివేసి మిగిలిన చిల్లర రూ.180 వదిలి వెళ్లిపోయారు. రూ.20 వేలు వరకు చోరీకి గురై ఉంవచ్చని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేడు కోకో రైతులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం

'సాక్షి' కథనంపై ప్రభుత్వం స్పందన

సాక్షి, అమరావతి: 'చాక్లెట్ పంట.. ధర లేక తంటా' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కోకో రైతులు, వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి రైతులు, ఉద్యాన శాఖ అధికారులు, కోకో ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు హాజరవ్వాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర కిలో రూ.770 పలుకుతున్నప్పటికీ.. ఏపీలో మాత్రం కంపెనీలు కిలో రూ.200-రూ.450 మధ్య ధర చెల్లిస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతుల వెతలను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది.

వరమివ్వని ఉద్యానం

'గ్రోత్ ఇంజిన్' పంటల సాగు రైతులకు ఈ ఏడాది భారీ నష్టాలు

- మిర్చి, టమాట పంటలకు గిట్టుబాటు ధరల్లేక కుదేలు
- అరటి ధరలు పడిపోయి ఆవేదన
- చీనీ రైతులకూ చేదే
- మామిడి మీద ఆశలున్నా.. ముందు ముందు ఎలా ఉంటుందోనని భయం

'గ్రోత్ ఇంజిన్లు'గా చెప్పకునే అరటి, చీనీ, టమాట, మిర్చి, మామిడి ఈ ఏడాది ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు కన్నీళ్లే మిగిల్చాయి. పంట పండితే ధరలు లేవు, ధరలుంటే పంటలు పండవు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గతంలో ఎన్నడూ లేనంతగా అరటి, మిర్చి, టమాట రైతులు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

ఇటీవల జరిగిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఇచ్చిన పంటల సాగు, దిగుబడి వివరాలు

పంట	సాగు (హెక్టార్లలో)	దిగుబడి (లక్షల మెట్రిక్ టన్నుల్లో)
అరటి	10,946	6.02
మిరప	14,177	0.71
టమాట	16,618	8.30
మామిడి	10,128	0.56
చీనీ	38,186	5.21


అనంతపురంలోని చీనీ మార్కెట్


ఇటీవల ఈదురుగాలులకు అనంతపురం జిల్లా జంగంరెడ్డిపేటలో దెబ్బతిన్న అరటి తోటలో దిగాలుగా రైతు మహేశ్వరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉద్యాన రైతులకు ఎక్కడా ఊరట లభించడం లేదు. అరటి రైతులైతే ఈ ఏడాది దారుణంగా దెబ్బతిన్నారు. పెట్టుబడులు పెరగడం, ధర తగ్గడంతో నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రూ. 25 వేలు పలికిన టన్ను అరటి.. నేడు రూ.11 వేలు కూడా లేదు. రైతులేమో ఎకరాకు రూ. లక్షన్నర వరకూ పెట్టుబడి పెట్టారు. చాలా చోట్ల దిగుబడి బాగా వచ్చినా ధరల్లేక నిరాశే మిగులుతోంది. వాస్తవానికి జిల్లాలో పండే 'గ్రాండ్ నైన్ అరటి'కి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభిస్తున్నా ఎగుమతి సౌకర్యం లేకపోతోంది.

మిరప, టమాట రైతుల కన్నీళ్లు

మిరప, టమాట రైతులను కదిలిస్తే కన్నీటి గాథ బయటికొస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం పచ్చి మిర్చి కేజీ రూ.20 లేదా రూ.30 కంటే ఎక్కువ లేదు. కేజీ కనీసం రూ.40 పలికితేనే రైతుకు గిట్టుబాటవుతుంది. రిటైల్ మార్కెట్‌లోనే రూ.20 ఉంటే రైతు పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక టమాట రైతులకు అప్పులే మిగులుతున్నాయి. గడిచిన నాలుగు నెలలుగా కిలో టమాట రూ.10 కంటే ఎక్కువ పలకడం లేదు. ఎరువులు, పురుగుమందు ఖర్చులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు.

చీనీ రైతులకూ చేదు గుళికలే..

రాష్ట్రంలోనే అత్యధికంగా చీనీ దిగుబడి జిల్లాలో ఉంటుంది. చీనీ టన్ను ఇటీవల కాలంలో రూ.20 వేలు మించి పలకడం లేదు. 2021 కరోనా అనంతరం టన్ను లక్ష రూపాయలు అమ్మిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటిది నేడు రూ.20 వేలు ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేయొచ్చు. మరోవైపు.. మామిడి ప్రస్తుతానికి పూత, పిందె వస్తున్నా.. వచ్చే రోజుల్లో నిలబడగలదా అన్న భయం రైతుల్లో నెలకొంది.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో టమాట పంటను సాగు చేశా. సుమారు రూ. లక్ష పెట్టుబడి పెట్టా. గిట్టుబాటు ధర లేకపోవటంతో పంటను తోటలోనే వదిలేశా. టమాట పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– బసవరాజు, దొడగట్ట, కళ్యాణదుర్గం

మార్కెటింగ్ సౌకర్యం లేదు



2 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ. లక్ష చొప్పున రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టా. పంట ఉత్పత్తుల ఎగుమతులకు సరైన సౌకర్యం లేకపోవడంతో గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– నాగరాజు, పెద్దజలాలపురం గ్రామం, శింగనమల, మండలం

స్వీయ సంరక్షణకే అధిక సమయం

ఏపీలో జాతీయ సగటుకు మించి ప్రాధాన్యత

- తరువాతి స్థానంలో అభ్యాసం
- మూడో స్థానంలో ఉపాధి కార్యకలాపాలు
- 2024 సమయ వినియోగ సర్వే వెల్లడి

సాక్షి, అమరావతి: జాతీయ సగటును మించి ఆంధ్రప్రదేశ్‌లో పురుషులు, మహిళలు స్వీయ సంరక్షణ, నిర్వహణకు రోజులో అధిక సమయం వినియోగిస్తున్నారు. ఆ తరువాత రాష్ట్రంలో రోజులో అత్యధిక సమయం అభ్యాసం, ఉపాధి కార్యకలాపాలకు ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. దేశంలోనూ రాష్ట్రంలోనూ కూడా రోజులో అత్యధిక సమయం మహిళలు, పురుషులు స్వీయ సంరక్షణకు వెచ్చిస్తుండడం గమనార్హం. స్వీయ సంరక్షణ అంటే వ్యక్తుల జీవన సంబంధమైన అవసరాలు కార్యకలాపాలు. నిద్ర, ఆహారం తీసుకోవడం, దాహార్తి తీర్చుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక సంరక్షణ మొదలైనవి ఈ కేటగిరీలోకి వస్తాయి. జాతీయ స్థాయిలో అలాగే వివిధ రాష్ట్రాల్లో, ఆరేళ్లు పైబడినవారు తమ రోజు వారీ కార్యకలాపాలకు వెచ్చిస్తున్న సమయంపై 2024 సమయ వినియోగ సర్వేను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసింది. ఎటువంటి చెల్లింపు లేకుండా గృహ సేవా కార్యక్రమాలకు అంటే వంట, పరిశుభ్రత, షాపింగ్ కార్యకలాపాలకు పురుషులు, మహిళలు వెచ్చిస్తున్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంది.

2024లో ఆరేళ్లకంటే ఎక్కువ వయసు కలిగినవారు రోజులో వివిధ కార్యకలాపాలలో గడిపిన సగటు సమయం (నిమిషాల్లో)

కార్యకలాపాలు	జాతీయ స్థాయి			రాష్ట్ర స్థాయి		
	పురుషులు	మహిళలు	సగటు	పురుషులు	మహిళలు	సగటు
స్వీయ సంరక్షణ, నిర్వహణ	710	706	708	718	716	717
అభ్యాసం	415	413	414	474	455	465
ఉపాధి కార్యకలాపాలు	73	341	440	493	398	462
కుటుంబ సభ్యులకు గృహ సేవలు	88	289	238	86	255	223
సాంస్కృతిక, మాస్ మీడియా, క్రీడా సేవలు	177	164	171	176	174	175
చెల్లింపుల రహిత స్వచ్ఛంద సేవ, శిక్షణ	139	108	122	139	140	139
సామాజిక, సమాచార, మతపరమైన సేవలు	138	139	138	132	121	126
గృహ సభ్యులకు సంరక్షణ సేవలు	75	137	116	70	140	118
సొంత వినియోగానికి వస్తువుల ఉత్పత్తి	137	104	116	70	56	61

ఆధారం: కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ

టీచర్లకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు

హామీలు పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవు

- చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో సంఘ నాయకులు ధర్నా
- కర్నూలులో మోకాళ్లపై ఉపాధ్యాయుల నిరసన


కలెక్టరేట్ ధర్నాలో బైఠాయించిన ఫ్యాప్టో సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్/కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి టీచర్ల హామీలను వెంటనే పరిష్కరించాలని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘ సమాఖ్య) చిత్తూరు జిల్లా చైర్మన్ మణిగండన్ విమర్శించారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు బుధవారం సాయంత్రం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పలు ప్రాంతాల నుంచి ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కర్నూలులో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసానికి నిరసనగా మోకాళ్లపై నిల్చొని ఆందోళన చేపట్టారు. ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీచర్లకు టీడీపీ కూటమి అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 117 అమలుకు ముందు ఉన్న తెలుగు మీడియం, మైనర్ మీడియంల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం అంగీకరించకపోవడం అన్యాయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో సైతం స్థానిక భాషలో బోధన చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుభాష ఆత్మాభిమానం పునాదిగా ఏర్పడిన ఈ ప్రభుత్వం తెలుగు మీడియం రద్దుకు కంకణం కట్టుకోవడం సబబుకాదని విమర్శించారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,981 మంది స్వామివారిని దర్శించుకోగా 21,120 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 5.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ స్పష్టం చేసింది.

ముగిసిన నూకాలమ్మ జాతర



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నూకాలమ్మ అమ్మవారి 61వ వార్షిక జాతర బుధవారంతో ముగిసింది. ఆలయంలో మహా పూర్ణాహుతి, మహాన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ యాగశాలలో హోమాలు, అమ్మవారి మూలమంత్ర హోమం, విశ్వశాంతి కోసం మహా పూర్ణాహుతిని ప్రధానార్చకులు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంభ నివేదన చేసి భక్తులకు మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

తలంబ్రాలతో కాలి నడకన భద్రాచలం

తాళ్లపూడి: రావూరుపాడు నుంచి శ్రీరామ నవమి సందర్భంగా గోటితో ఒలిచిన తలంబ్రాలను బుధవారం భద్రాచలం తీసుకెళ్లేందుకు పాదయాత్రగా భక్తులు బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన శ్రీరామ బాలభక్త భజన సమాజం ఆధ్వర్యంలో 150 మంది వరకు 15 రోజులుగా స్వామి వారి తలంబ్రాలకు కేటాయించిన ధాన్యాన్ని చేతితో ఒలిచి బియ్యం తీసి వాటికి పూజలు చేసి భద్రాచలం తీసుకుని వెళ్లారు. ఐదేళ్లుగా స్వామి వారికి తలంబ్రాలను కాలి నడకన తీసుకుని వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు వారు తెలిపారు.

విద్యా సమాచారం



పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తిరుపతి సిటీ: యువతను, ఔత్సాహికులను, రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే వెటర్నరీ వర్సిటీ లక్ష్యమని పరిశోధక, విస్తరణ సంచాలకులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ శోభామణి అన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో సీమ పందుల పెంపకంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా డాక్టర్ శ్రీలత, డాక్టర్ శోభామణి మాట్లాడారు. లాభసాటి పారిశ్రామిక రంగంలో పందుల పెంపకం ఒకటిగా చెప్పవచ్చన్నారు. పందుల పెంపకంతో ఎంతోమంది పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు.

రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి తుడా: తిరుపతిలోని స్విమ్స్ వర్సిటీ న్యూరాలజీ విభాగం నందు రీసెర్చ్ అసోసియేట్‌గా ఆరునెలల పాటు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఒకే పోస్టు కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 9వతేదీన స్విమ్స్ పాత డైరెక్టర్ కార్యాలయంలోని కమిటీ హాల్‌లో హాజరుకావాలని సూచించారు.

6న దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

తిరుపతి సిటీ: తిరుపతి మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 6న ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు 9985882559, 7780167625 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పీజీ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో నిర్వహించే ఏపీపీజీసెట్-2025 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఏపీపీజీసెట్-2025 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈ నెల 2 నుంచి మే నెల 5వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే అపరాధరుసుంతో మే నెల 5 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

కలియుగ వైకుంఠంగా, తెలంగాణ తిరుపతిగా, కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది మహబూబ్‌నగర్ జిల్లాలోని పేరెన్నికగన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం. ఆర్థిక స్తోమత లేని భక్తులు మన్యంకొండకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నా, తిరుపతికి వెళ్లిన ఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.





● పుణ్యతీర్థం

తవ్వని కోనేరు.. చెక్కని పాదాలు... ఉలి ముట్టని స్వామి

తిరుపతిలో మాదిరిగానే మన్యంకొండలో స్వామి వారు గుట్టపై కొలువుదీరగా దిగువకొండవద్ద అలమేలు మంగతాయారు కొలువుదీరి ఉన్నారు. దేవస్థానం సమీపంలో మునులు తపస్సు చేసినందువల్ల మునులకొండ అని పేరు వచ్చింది. అదే కాలక్రమేణా మన్యంకొండగా మారింది. మహబూబ్‌నగర్ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఎత్తైన గుట్టలపై మన్యంకొండ దేవస్థానం కొలువుదీరింది. 600 సంవత్సరాల చరిత్రగల ఈ దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల పాలిట కల్పతరువుగా భాసిల్లుతోంది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి... ఈ దేవస్థానం ప్రత్యేకం.

దేవస్థానం చరిత్ర...

పురాణ కథనం ప్రకారం... దాదాపు 600 సంవత్సరాల క్రితం తమిళనాడులోని శ్రీరంగం సమీపంలోగల అళహరి గ్రామ నివాసి అళహరి కేశవయ్య కలలో శ్రీనివాసుడు కనిపించి కృష్ణానది తీరప్రాంతంలోగల మన్యంకొండపై తాను వెలిసి ఉన్నానని, కావున నీవు వెంటనే అక్కడికి వెళ్లి నిత్య సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించి అంతర్ధానం అయ్యారట. దాంతో అళహరి కేశవయ్య తమ తండ్రి అనంతయ్యతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి మన్యంకొండ సమీపంలోగల కోటకదిరలో నివాసం ఏర్పరుచుకొని గుట్టపైకి వెళ్లి సేవ చేయడం ప్రారంభించారు. కేశవయ్య దక్షిణాదిగల అన్ని దివ్యక్షేత్రాలూ తిరిగి తరించడం ప్రారంభించారు. అందులో భాగంగానే ఒకరోజు కృష్ణానదిలో స్నానం చేసి సూర్యభగవానునికి నమస్కరించి దోసిలితో ఆర్ఘ్యం వదులుతుండగా శిలారూపంలోగల వెంకటేశ్వరస్వామి ప్రతిమ వచ్చి కేశవయ్య దోసిలిలో నిలిచింది. ఆ విగ్రహాన్ని తీసుకొచ్చి మన్యంకొండపై శేషషాయి రూపంలోగల గుహలో ప్రతిష్ఠించి నిత్య ధూప దీప నైవేద్యాలతో స్వామిని ఆరాధించడం ప్రారంభించారు. వీటితో పాటు దేవస్థానం మండపంలో ఆంజనేయస్వామి, గరుడాళ్వార్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఈ దేవస్థానం ఎదురుగా ఉన్న గుట్టపై అప్పట్లో మునులు తపస్సు చేసినట్లుగా చెప్పుకుంటున్న గుహ ఉంది.

కీర్తనలతో ఖ్యాతి...

అళహరి వంశానికి చెందిన హనుమద్దాసుల వారి కీర్తనలతో మన్యంకొండ ఖ్యాతి గడించింది. హనుమద్దాసుల వారు దాదాపు 300 కీర్తనలు రచించారు. ఈ కీర్తనలు దేవస్థానం చరిత్రను చాటిచెప్పాయి. హనుమద్దాసుల తర్వాత ఆయన వంశానికి చెందిన అళహరి రామయ్య దేవస్థానం వద్ద పూజలు ప్రారంభించారు. వంశపారంపర్య ధర్మకర్తగా ఉండడంతో పాటు దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

విశేషోత్సవాల రోజు స్వామివారికి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రతి శనివారం తిరుచ్చిసేవ, ప్రతి పౌర్ణమికి స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామికి ప్రీతిపాత్రమైన నైవేద్యం దాసంగం. భక్తులు స్వామివారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పిస్తారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం...

మన్యంకొండ దిగువ కొండవద్ద శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానం ఉంది. ప్రతి సంవత్సరం అమ్మవారి సన్నిధిలో కొన్ని వందల వివాహాలు జరుగుతాయి. సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి మంటపంలో పెళ్లిళ్లు చేసుకుంటారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను చేసి పునీతులవుతారు.

స్థలపురాణం...

ఆళహరి రామయ్యకు స్వామివారు కలలోకి వచ్చి అమ్మవారి దేవస్థానాన్ని తిరుపతి మాదిరిగా దిగువకొండ వద్ద నిర్మించాలని సూచించారు. దీంతో 1957–58 సంవత్సరంలో అలమేలు మంగతాయారు దేవస్థానాన్ని ఆయన సొంత నిధులతో అక్కడ నిర్మాణం చేశారు. తిరుమల తిరుపతి నుంచి అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆగమ శాస్త్రం ప్రకారం రోజూ దేవస్థానంలో పలు ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఫాల్గుణ ద్వాదశి రోజు అమ్మవారి ఉత్సవాలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు.

ఎలా వెళ్లాలి..?

● బస్సు మార్గం

హైదరాబాద్ నుంచి నేరుగా మన్యంకొండకు ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. కర్నూల్ నుంచి వచ్చే భక్తులు జడ్చర్లలో దిగి మహబూబ్‌నగర్ మీదుగా మన్యంకొండకు చేరుకోవచ్చు. లేకుంటే భూత్పూర్‌లో దిగి మహబూబ్‌నగర్ మీదుగా మన్యంకొండకు చేరుకోవచ్చు. రైలులో రావాలంటే అటు హైదరాబాద్ లేదా కర్నూల్ నుండి చేరుకోవచ్చు. మహబూబ్‌నగర్ – దేవరకద్ర మార్గ మధ్యలోని కోటకదిర రైల్వేస్టేషన్‌లో దిగితే అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది. కేవలం ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఇక్కడ ఆగుతాయి.

సీజన్‌లో పెళ్లిళ్ల హోరు....

అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తే కొలిచిన వారికి నిత్య సుమంగళిత్వం, సంతానం, సిరిసంపదలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. అందుకే పెళ్లి కావల్సిన వారు, సంతానం లేని వారు అమ్మ సన్నిధిలో ముడుపులు కట్టడం ఆచారం. మన్యంకొండ శ్రీ అలమేలు మంగతాయారు దేవస్థానం మంగళవాయిద్యాలతో హోరెత్తిపోతుంటుంది. ప్రతిరోజు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దేవస్థానం ఆవరణలో పెళ్లిళ్లు చేసుకుంటారు. ఒకేరోజు 12 నుంచి 25 పెళ్లిళ్ల దాకా ఇక్కడ జరుగుతాయి. అమ్మవారికి ఆలయంలో నిత్య కళ్యాణంతోపాటు కుంకుమార్చన, ఏడాదికి ఒకసారి అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

బస...

మన్యంకొండ శ్రీ అలమేలు మంగ తాయారు దేవస్థానం వద్ద భక్తులు ఉండటానికి ఎటువంటి సత్రాలు లేవు. కాకపోతే దేవస్థానానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టపైన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తులు ఉండటానికి సత్రాలు ఉన్నాయి. భక్తులు ఆ సత్రాల వద్ద ఉండవచ్చు. దీనికిగాను దేవస్థానానికి రోజుకు కొంత చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన వారు అక్కడ ఉండొచ్చు.



మన్యంకొండలో మునులు తపస్సు చేశారని భావిస్తున్న మునుల గుహ



బంగారు ఆభరణాల అలంకరణలో శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి



శ్రీదేవి, భూదేవిసమేత ముత్యాల అలంకరణలో మన్యకొండ వేంకటేశ్వరస్వామి

● నిర్మల వాణి

రాముని గుణగణాలను అలవరచుకుందాం



మానవాళి సంక్షేమం కోసం సహజయోగాన్ని ఆవిష్కరించిన పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి దేశ విదేశాలలో ఇచ్చిన అనేక ప్రవచనాలలో శ్రీ రాముని గుణ గణాలను, లక్షణాలను, ఆయన వ్యక్తిత్వం నుండి మనం నేర్చుకుని, వాటిని మనలో అంతర్గతంగా స్థిరపరచుకొని వ్యక్తీకరించుకోవలసిన అవశ్యకతను గురించి విశదీకరించారు.

శ్రీరాముడు పుడమిపై అవతరించినప్పుడు విశ్వ విరాట్‌లో కుడి పార్శ్వం అభివృద్ధి చెందడానికి దోహద పడింది. త్రేతాయుగంలో రాక్షసుల నుండి, దుష్ట శక్తుల బారి నుండి తన భక్తులను, ప్రజలను సంరక్షించడానికి శ్రీ విష్ణువు తీసుకున్న అవతారమే శ్రీ రాముడు. ఆ కాలంలోనే రాజుల రాజ్యాధిపత్యం మొదలయ్యి అన్నిటికన్నా మిన్నగా ప్రజాభీష్టానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభమయ్యింది. ప్రజల కొరకు, మానవాళి యొక్క అభివృద్ధి కొరకు రాజు మంచితనాన్ని, ప్రేమ తత్వాన్ని కలిగి వుండాలని నిర్ణయించబడింది. నాయకుడైన రాజు ఎంత త్యాగం చేయడానికైనా సిద్ధపడాలి. అది శ్రీరామునితోనే మొదలయ్యింది. నేటి సమస్త ప్రజానీకం కోరుకున్న ఋజు ప్రవర్తన, మంచితనం శ్రీ రామునిగా అవతరించాయి. ప్రభువు అనే వాడు శ్రీ రామునిగా వుండాలని కోరుకున్నారు. మంచితనం గురించి, రాజ ధర్మం గురించి కేవలం చెప్పడమే కాదు, దానిని ఆచరించి చూపించిన ఆదర్శవంతమైన రాజు. శ్రీ రాముడు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఒక ఆదర్శవంతమైన తండ్రిగా, ఆదర్శవంతమైన భర్తగా, ఆదర్శవంతమైన కొడుకుగా, ఆదర్శవంతమైన రాజుగా, మర్యాద పురుషోత్తముడుగా ఇతిహాసంలో చెప్పుకోబడుతున్నాడు.

అగస్త్య మహాముని రచించిన శ్రీ రామ రక్షా కవచంలో శ్రీ రాముని గుణగణాల గురించి ఇలా వర్ణించడం జరిగింది.

ఆయన ఆజానుబాహుడు. చేతులలో ధనుర్బాణాలు ధరించి, పీతాంబరధారుడై సింహాసనంపై ఆసీనుడై వుంటాడు. ఆయన పద్మ దళాయతాక్షుడు. తన ఎడమ పార్శ్వమున కూర్చున్నసీతాదేవిని చూస్తూమందస్మిత వదనారవిందుడై మనకు కనిపిస్తాడు. అతని యొక్క మేని రంగు లేత నీలిరంగు ఛాయతోనూ, నేత్రములు తామర పుష్ప రేకులవలే పెద్దవిగా వుండి, ఇతరులకు ఆనందమును చేకూరుస్తుంటాయి. ఒక చేతిలో ఖడ్గం, మరొక చేతిలో విల్లు, వీపున అంబుల పొదితో దుష్ట సంహారం కొరకు సదా సన్నద్ధుడై ఉంటాడు.

ఆయన జనన మరణాలకు అతీతుడు. అపార శక్తిమంతుడు. దుష్ట శక్తులన్నిటిని నాశనపరచి, మన కోరికలన్నిటినీ నెరవేర్చే సామర్థ్యం కలవాడు శ్రీ రాముడు. తానొక అవతార పురుషుడనని గానీ, అవతార మూర్తినని గానీ ఎక్కడా ప్రకటించుకోలేదు. శ్రీ రాముని సుగుణాలలో మరొకటి ఏమిటంటే తను ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం. ఆ లక్షణాన్ని మనలో కూడా స్థిరపరచు కోవాలి. ఇచ్చిన మాట తప్పించుకోవడానికి ఏవేవో కుంటిసాకులు వెతికి తప్పించుకోకూడదు. ఆయనకున్న మరో సుగుణం – అవతలివారి హృదయాన్ని నొప్పించే విధంగా మాట్లాడక పోవడం. దీనినే సంకోచమని అంటారు.

మానవ అంతర్గత సూక్ష్మ శరీరంలో అంగాంగమునందు, చక్రాలలోనూ, నాడులలోనూ దేవీదేవతలు కొలువై వున్నారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందినప్పుడు వారిని, వారి లక్షణాలను మనలో జాగృతి పరచుకోవచ్చును. అలా సీతా సమేతుడైన శ్రీరాముడు మన హృదయంలోని కుడి పార్శ్వం వైపు ఆసీనులై వుంటాడు. ఆత్మ సాక్షాత్కారం పొంది సహజ యోగ సాధన చేస్తున్న వారిలో మర్యాద పురుషోత్తమునిగా, ఆదర్శవంతమైన తండ్రిగా, శ్రీరాముని లక్షణాలు జాగృతి చెంది ప్రతిబింబిస్తూ వుంటాయి. ఆయన మనలోని ఊపిరి తిత్తులను పరిరక్షిస్తూ వుంటాడు.

మర్యాద పురుషోత్తముడైన శ్రీ రాముని శ్రీ రామ నవమి పర్వదినాన బాహ్య పరంగా పూజించుకోవడమే కాకుండా అతని గుణగణాలను, వ్యక్తిత్వాన్ని సహజ యోగ సాధన ద్వారా మనలో పొందుపరచుకుని అభివ్యక్తీకరించుకోవటం అవసరం.

– డా. పి. రాకేష్
(పరమపూజ్య మాతాజీ శ్రీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

ఎవరితో ఎప్పుడు, ఎలా సంభాషించాలో మనం ఆయన దగ్గరనుండి నేర్చుకోవాలి. తన పరిమితులు, హద్దులు, శ్రీ రామునికి బాగా తెలుసు. వాటిని ఆయన ఎప్పుడూ అతిక్రమించలేదు. దేశాన్ని పరిపాలించే పరిపాలకుడు ఎలా వుండాలనేది రామరాజ్యం నుండే నేర్చుకుంటారు.



పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి


● సువార్త

సొంత భక్తి వెర్సస్ లేఖనానుసార సద్భక్తి

‘క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించు వారందరు హింస పొందుదురు’. అయితే ఇట్టి ‘సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధనము’. కాబట్టి ‘దేవ భక్తి విషయంలో నీకు నీవే సాధకము చేసికొనుము’. ఇదంతా అపొస్తలుల బోధనా పటిమ భక్తి విధానము (1తిమో 4 : 7, 8, 6 : 6, 2తిమో 3:12).

దైవభక్తికి అనుగుణమైన బోధను అంగీకరించని వ్యక్తులు వల్లనే సొంతభక్తి రూపుదిద్దుకుంటుంది. వ్యక్తులు భక్తులమంటూ సృష్టించుకొన్న సొంత భక్తి గూర్చి ఒక్క మాటలో చెప్పాలంటే అది మోయలేని కాడి. గ్రంథాన్ని అనుసరించక ఇతరుల భక్తిని అనుసరిస్తూ సొంత భక్తి బాట పడితే మాత్రం వేషధారుల నటన అలవడి జీవం లేని పాత్రలకే ఇక పరిమితం. సొంత భక్తివాదులకు, సద్భక్తిపరులకు ఉండే తేడా ఒక్కటే. అదే ఆత్మ సంబంధ ఆశీర్వాదాలు. సద్భక్తిపరులకు ఎదురీదే గడ్డు పరిస్థితులే ఎప్పుడూ ఎదురు పడుతుంటాయి. వీరు సింహంవలె వాటిని దీటుగా ఎదుర్కొనేవారే అయినా మరి ముఖ్యంగా, తగ్గించుకొని క్రీస్తు అడుగు జాడలలో నడుచుటలో ఎప్పుడూ సంతోషపడుతుంటారు. నిజానికి, కృపకు మూలమైన ఆత్మను తిరస్కరించక నిత్యమూ దేవుని కృపను వేడుకొని దాన్ని ఎప్పుడూ ఆశ్రయిస్తూ, క్రీస్తును సంతోషపెడుతూ గొర్రెపిల్ల వంటి సాధు స్వభావం గలవారే సద్భక్తిలో రాణిస్తారు. దేవుని కృపను నిరర్థకం చేయలేని సత్స్వభావమే సద్భక్తి. వాక్యానుసారమైన నాణ్యమైన దేవభక్తి ఎవరికీ గిట్టనందున ఆ గిట్టనివారిలో నుండే ఆ క్రమంలో అది హింసను ప్రేరేపిస్తుంది. తప్పు భక్తిది కాదు, దాన్ని గుర్తించి ప్రోత్సహించే దైవిక వాతావరణం ఆ చుట్టూ లేనందునే ఈ హింస ప్రవృత్తి పెచ్చుమీరవచ్చును. ఒక్కోసారి సొంత ఇంటివారే, ఇరుగు పొరుగు వారే ఘోరంగా హింసించే పరిస్థితులు తలెత్తవచ్చు. మిత్రులే శత్రువులు కావచ్చు. లోకం నన్నే గుర్తించలేదు. దానికి మీరు ఏపాటి? మీరు ఈ లోక గుర్తింపు ఆశించవద్దు అన్నదే క్రీస్తు వారి ఉన్నత బోధ.

సొంత భక్తి, సద్భక్తి ఈ రెండూ ఎప్పుడూ కలిసి నడువలేవు. విశ్వాసానికి అవిశ్వాసానికి విజ్జోడు కుదరదు. దేవ స్వభావానికి దుష్ట స్వభావానికి ఎప్పుడూ వైరమే. లేఖనానుసార భక్తిని నాణ్యమైన సద్భక్తిని సాధకం చేస్తుంటే ఆత్మ శరీరానికి, శరీరం ఆత్మకు విరోధంగా ఎప్పుడూ పనిచేస్తునే ఉంటాయి. సద్భక్తి మోయదగిన క్రీస్తు కాడి. సొంత భక్తి మోయలేని కాడి. ఒకటి దేవుని ఆజ్ఞలలో నుండి పుట్టుకొస్తే మరొకటి వ్యక్తుల ఆలోచనలలో నుండి పుట్టుకొచ్చి దేవుని ఆజ్ఞల మాటున దాగి ఒదిగినట్టు భ్రమ పరుస్తూ ఎప్పుడూ బయటపడక నెట్టుకొస్తుంటుంది. దీన్ని సూక్ష్మంగా పసికట్టి పరీక్షించి కనిపెడుతూ దీనికి దూరంగా ఉండేవారు ఎప్పుడూ ధన్య జీవులే. సత్యం సత్యమే అన్నది సద్భక్తాసక్తి ప్రదర్శించినంతగా ఏది ప్రదర్శించలేదు. మోషేను, మోషే కంటె ఎంతో శ్రేష్ఠుడైన క్రీస్తును మించి లేదా సమానత్వం కోరి భక్తి చేయాలనుకోవడం మూర్ఖత్వం.తండ్రియైన దేవదేవుడు, ప్రభువైన క్రీస్తు తన భక్తులపై ఈ కాడులు మోపలేదు. అపొస్తలులు కూడా ఈ కాడులు ప్రతి సంవత్సరం మోసి మోసి ఆ అనుభవంతో మనలను కూడా మోయమని ఏనాడూ వారు బోధించనూ లేదు (అపొ.కా.15 :1-11).



సమస్త జనులను నాకు శిష్యులుగా చేయుడి అన్న క్రీస్తు ఆజ్ఞకు బహు విధేయులైన అపొస్తలులు అంతా కలిసికట్టుగా కష్టపడి పనిచేశారు. సంఘాలను స్థిరపరచుటలో ముందుకు వచ్చారు. ఆదిమ సంఘం ద్వారా ఏర్పడి శ్రమల ద్వారా విస్తరించి వృద్ధి పొందుతోన్న అన్ని సంఘాలకు విలువైన తమ సేవా పరిచర్యలను విరివిగా మెరుగ్గా అందించారు. నేటి ఇప్పటి అపొస్తలులు, అపొస్తలులు కాకయే అపొస్తలులమని చెప్పుకొనుచూ అమాయక భక్త జనులను తమకు శిష్యులుగా చేసుకుంటున్నారు. దేవుని వాక్య జ్ఞానం, దేవుని భయం ఏమాత్రం లేని వీరు శిరస్సైన క్రీస్తును ప్రక్కకు తోసేసి లోకపు తెలివితేటలతో నేర్పు కలిగి సంఘాలకు శిరస్సులుగా ఉంటున్నారు. ప్రభువు చెప్పినట్టుగా వాక్యానుసారమైన సద్భక్తి అనేది సుళువైన కాడి తేలికైన భారము అనవచ్చు (మత్త 11:28–30). సంఘ నాయకులు, పెద్దలు వివిధ రకాల సిద్ధాంత కాడులు అనెడి భారాలు అమాయక భక్తజనుల భుజాన మోపడం విచారించదగ్గ పరిణామం. వారి మాటలకు చేతలకు పొంతన ఏనాడూ ఉండదు. లేఖన ఆధారాలు ఏనాడూ చూపరు.

పరిచారకుడు, సేవకుడు, సువార్తికుడు, దేవుని జత పనివాడు వంటి వీటిని మించిన ఘనమైన హోదాలు ఇక ఏముంటాయి చెప్పండి? ఇట్టి పేర్లతో పిలువబడుతూ ఇలా తగ్గించుకొన్నవారు ఆత్మ సంబంధ ఆశీర్వాదాలతో హెచ్చించబడుటను మనం చూస్తున్నాము కూడా. బైబిలు చదువుకుంటూ నేర్చుకొంటూ భక్తి అలవరచుకోవడమే కాదు, ఎవరి సమక్షంలో సద్భక్తి సాధకం చేస్తున్నావు అనేది కూడా చాలా ప్రాముఖ్యమైన విషయం.

– జేతమ్

● ఇస్లాం వెలుగు

సమస్యలే సాఫల్యానికి సోపానాలు



ఒక ఊరిలో జలాలుద్దీన్ అని ఒక వ్యక్తి ఉండేవాడు. అతనికి కుటుంబం పెద్దది కావడంతో ఇల్లు ఏమాత్రం సరిపోయేది కాదు. చివరికి ఒకరోజు మసీదులో ఉన్న ధార్మిక గురువు దగ్గరికెళ్లి ఉపాయం చెప్పమని ప్రాధేయపడ్డాడు. సావధానంగా విన్న గురువు.. ‘నువ్వొక కోడిని తీసుకువెళ్ళి మీతోపాటే ఇంట్లో ఉంచుకో. నీ సమస్య తీరిపోతుంది.’ అన్నాడు.

ఆ వ్యక్తి కోడిని కొనుక్కొని వెళ్ళాడు. తమతో పాటే దాన్ని ఇంట్లో ఉంచాడు. అలా వారం గడిచింది. కాని పరిస్థితిలో మార్పు రాలేదు. పైగా సమస్య పెరిగిందే తప్ప తగ్గలేదు. ఆ వ్యక్తి మళ్ళీ గురువు దగ్గరికి వెళ్ళాడు. ‘‘అయ్యా.. మరికాస్త ఇబ్బంది ఎక్కువైంది’’ అని మొర పెట్టుకున్నాడు.

‘‘ఈసారి ఒక మేకను తీసుకువెళ్ళు. దాన్నీ మీతోపాటే ఇంట్లో ఉంచు. మళ్ళీ వారం తరువాత వచ్చి కలువు’ అన్నాడు గురువు.

ఆ వ్యక్తి మేకను కొనుక్కొని తీసుకువెళ్ళాడు. ఈసారి సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. గురువు దగ్గరికి వెళ్ళి గోడు వెళ్ళబోసుకున్నాడు.

అతను చెప్పినదంతా విని.. ‘ఇప్పుడు నువ్వు ఒక గాడిదను తీసుకువెళ్ళు.. దాన్నీ మీతోనే ఇంట్లోనే ఉంచు. నీకు శుభం కలుగుతుంది’ అన్నాడు. గురువు మాటమీద గాడిదను తెచ్చిన తరువాత ఇల్లు నరకం అయిపోయింది. ఇంట్లో వాళ్ళకే కాదు, ఆ వీధి వీధంతా అల్లకల్లోలం మొదలైంది. ఏడవరోజు గాడిదతో పడిన నరక బాధను చెప్పుకొని కన్నీరు మున్నీరయ్యాడు.

అప్పుడు గురువు ‘సరే.. నువ్వు ఇంటికెళ్ళి కోడిని కోసి వండుకొని తిను. వారం తరువాత వచ్చి కలువు.’ అని చెప్పాడు. ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళి ఆరోజు కోడి కూర వండాడు. వారం తరువాత వెళ్ళి గురువుని కలిశాడు.

‘అయ్యా.. సమస్య అయితే తీరలేదు కాని, కాస్తంత పరవాలేదు.’ అన్నాడు. ‘ఈసారి మేకను కోసి విందు చేసుకోండి. మీ వీధి వారిని కూడా విందుకు పిలవండి.’ అని పురమాయించాడు. ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళి గురువు చెప్పినట్టే చేసి వారం తర్వాత సంతోషంగా.. ‘‘ఇప్పుడు పరిస్థితి మెరుగు పడింది.’ అని చెప్పాడు. అప్పుడు గురువు, ‘‘నువ్వు గాడిద ను సంతలో అమ్మెయ్..’ అని సలహా ఇచ్చారు. ఆ వ్యక్తి గాడిదను సంతలో అమ్మేసి ఇంటికి వెళ్ళాడు. వారం ప్రశాంతంగా గడిచింది. గురువు చేసిన ఉపదేశాల్లోని మర్మం అర్థమైంది. ‘అంతా అల్లాహ్ అనుగ్రహం గురువు గారూ..ఇప్పుడు పరమ సంతోషంగా ఉంది. ఇల్లు విశాలమై పోయింది.’ చెప్పాడు పరమానందంగా..!

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● జెన్ పథం

విచక్షణ ప్రధానం

ఆయన ఓ జెన్ గురువు. ఆయన ఒకరోజు సాయంత్రం వాకిలి అరుగుమీద కూర్చుని రేడియోలో వస్తున్న పాటలు వింటూ పక్కనున్న శిష్యుడికి పాటలలోని భావాన్ని, గాన మాధుర్యాన్ని వివరిస్తున్నారు. ఆయనను చూడడానికి ఒక సాధువు వచ్చారు.

‘‘ఏమిటీ ఆయన పాటలు వింటున్నారా? ఆయన తాగుబోతటగా? చుక్క లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేడు. అంతెందుకు తాగందే పాడలేడు...’’ అని ఆ గాయకుడి గురించి తక్కువ చేసి మాట్లాడాడు సాధువు.

అప్పుడు గురువు ‘‘ఐతేనేం...? ఆయన గొంతు అద్భుతం. మనకు కావలసింది ఆయన గొంతు బాగుందా? లేదా? పాట బాగా పాడుతున్నాడా? లేదా అనేవే ముఖ్యం...ఏమంటారు?’’ అన్నారు. ‘‘మీరు ఎన్నయినా అనండి... నాకైతే ఆయన తీరు నచ్చదు’’ అంటూ వెళ్ళిపోయాడు సాధువు. కొంతసేపైంది. మరో సాధువు వచ్చాడు గురువుగారిని చూడటానికి.

రేడియోలో వినిపిస్తున్న పాట విని సాధువు కూర్చుంటూనే ఆ పాట పాడుతున్న గాయకుడి గురించి ఆహా ఓహో అని పొగిడాడు. అప్పుడు గురువు ‘‘మీరు చెప్పేదంతా పక్కనపెట్టండి...ఆ గాయకుడు ఎప్పుడు తాగుతూనే ఉంటాడటగా? చుక్క లేనిదే క్షణం ఉండలేడంటారు అందరూ...’’ అని గురువుగారు అన్నారు. దాంతో ఆ సాధువు కాస్తా చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు.

ఇద్దరు సాధువులతోనూ గురువుగారి మాట తీరును అక్కడే ఉండి గమనిస్తున్న శిష్యుడికి ఏమీ అర్థం కాలేదు. ఎవరూ లేని సమయం చూసుకుని ‘‘గురువుగారూ, ముందొచ్చిన సాధువు ఆ గాయకుడిని తాగుబోతు అని విమర్శిస్తే మీరు గాయకుడి సామర్థ్యాన్ని పొగిడారు. ఇక మరో సాధువు వచ్చి గాయకుడిని పొగిడితే మీరు ఆ గాయకుడు పచ్చి తాగుబోతటగా అని కించపరచి మాట్లాడారు. మిమ్మల్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు’’ అని గురువుగారి వంక అయోమయంగా చూశాడు.

అంతట గురువుగారు ఇలా అన్నారు –

‘‘ఎవరో ఏదో అంటున్నారని మనల్ని మనం సందిగ్ధంలోకి నెట్టేసుకోకూడదు. మనకు హాని లేనంత వరకు ఎవరు ఏం చెప్పినా నష్టం లేదు. విచక్షణ ముఖ్యం’’ అని.



– యామిజాల జగదీశ్

బిజినెస్ రీల్

ఐఎంఎస్‌పీఎల్ నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ బైటికి

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఐసీఐసీఐ మర్చంట్ సర్వీసెస్ (ఐఎంఎస్‌పీఎల్)లో మొత్తం 19 శాతం వాటాలను విక్రయించడం ద్వారా కంపెనీ నుంచి నిష్క్రమించనున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. దీనికి సంబంధించి ఫస్ట్ డేటా హోల్డింగ్ 1 (నెదర్లాండ్స్), ఫస్ట్ డేటా (ఇండియా)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. ఈ ప్రక్రియ జూన్ 30లోగా పూర్తి కావచ్చని అంచనా. ఐఎంఎస్‌పీఎల్‌లో వాటాల విక్రయానికి ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు 2024 డిసెంబర్‌లోనే ఆమోదముద్ర వేసింది.

'ఫార్ములా ఈ-స్టాట్స్ సెంటర్' ప్రారంభించిన ఇన్ఫీ

న్యూఢిల్లీ: ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌కి సంబంధించిన టీమ్‌లు, డ్రైవర్లు, ఇతరత్రా వివరాలన్నీ అభిమానులకు సమగ్రంగా అందించేలా 'ఫార్ములా ఈ-స్టాట్స్ సెంటర్'ను ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఆవిష్కరించింది. తొలి ఎలక్ట్రిక్ ఎఫ్ఐఏ ప్రపంచ కాంపిటీషన్ అయిన 'ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్'తో భాగస్వామ్యం ద్వారా కంపెనీ దీన్ని రూపొందించింది. సంక్లిష్టమైన డేటాను సరళతరంగా అందించేందుకు, అభిమానులు–చాంపియన్‌షిప్ మధ్య బంధాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఈ-స్టాట్స్ సెంటర్ ఉపయోగపడుతుందని ఇన్ఫీ తెలిపింది. కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత 'ఇన్ఫోసిస్ టొపాజ్' సొల్యూషన్స్‌తో దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించింది. దీనితో ఫ్యాన్స్.. వివిధ సీజన్లవ్యాప్తంగా తమ అభిమాన డ్రైవర్లు, టీమ్‌ల పనితీరును ట్రాక్ చేయొచ్చని ఫార్ములా ఈ సీఈవో జెఫ్ డాడ్స్ తెలిపారు.

యూఎస్‌లో హెచ్‌సీఎల్ టెక్ సబ్సిడరీ

న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ యూఎస్‌లో కొత్తగా ప్రత్యేక అనుబంధ సంస్థను ప్రారంభించింది. హెచ్‌సీఎల్ టెక్ పబ్లిక్ సెక్టార్ సొల్యూషన్స్(పీఎస్ఎస్) పేరుతో ఏర్పాటైన సంస్థ ద్వారా ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలుసహా ఫెడరల్, పౌర, రక్షణ ఏజెన్సీలకు సర్వీసులు అందించనుంది. చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అర్జున్ సేథి అధ్యక్షతన ఏర్పాటైన వ్యూహాత్మక విభాగాల బిజినెస్ కేటగిరీలో సంస్థ సేవలు అందించనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ పేర్కొంది. సేథి పీఎస్ఎస్‌కు ప్రెసిడెంట్‌గా మార్గదర్శకత్వం చేయనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ ఏజెన్సీలకు ఏఐ ఆధారిత టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మేషన్ సర్వీసులు సమకూర్చనున్నట్లు వివరించింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-4-2025

విశాఖ	440-00
చిత్తూరు	520-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,060.80	6.91
ZOMATO	211.7	4.8
TITAN	3,102.30	3.86
INDUSINDBK	703	2.97
TECHM	1,424.50	2.1

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	282.45	-3.27
NESTLEIND	2,206.70	-1.22
ULTRACEMCO	11,275.00	-0.91
BAJAJFINSV	1,921.35	-0.81
POWERGRID	287.05	-0.78

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,712
ఎన్ఎస్ఈ	79,816
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,43,517
ఎఫ్ఐఐ	- 1,539
డీఐఐ	+ 2,809

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72	$ 71.20
బ్రెంట్	75	$ 74.49

ఆకాశవీధిలో..

పెరుగుతున్న విమానయాన జోష్

- 2027 నాటికి 49 కోట్లకు ప్రయాణికులు
- ఏటా 9 శాతం వృద్ధి సాధ్యం
- రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ అంచనాలు

ముంబై: పౌర విమానయానం వృద్ధి వేగాన్ని అందుకుంది. విమాన ప్రయాణికుల సంఖ్య 2024 మార్చి నుంచి ఏటా 9 శాతం చొప్పున పెరుగుతూ.. 2027 మార్చి నాటికి వార్షికంగా 48.5 కోట్లకు చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ 'కేర్ ఎడ్జ్' ఒక నివేదిక రూపంలో వెల్లడించింది. 2025–26 నుంచి మరింత పెద్ద విమానాలు అందుబాటులోకి వస్తుండడంతో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రద్దీ మరింత వేగాన్ని అందుకుంటుందని పేర్కొంది. అదే సమయంలో దేశీ విమాన ప్రయాణికుల్లో స్థిరమైన వృద్ధి కనిపిస్తుందని తెలిపింది. కరోనా అనంతరం విమానయాన రంగం 'వి' ఆకారపు రికవరీని (పడిపోయినట్టుగానే పెరగడం) చూసిందని.. కరోనా ముందు నాటి ప్రయాణికులతో పోల్చితే 1.10 రెట్లకు రద్దీ చేరుకున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. విమాన ప్రయాణికుల రద్దీ 2025 మార్చి నాటికి 42.5 కోట్లకు చేరుకుంటుందని లోగడ వేసిన అంచనాలను కేర్‌ఎడ్జ్ సవరించింది. విమానాల డెలివరీలో జాప్యం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 4 శాతం వృద్ధితో 41 కోట్లకు చేరుతుందని పేర్కొంది. మహాకుంభ మేళా సమయంలో (2024-25 జనవరి–మార్చి) విమానయాన ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలో తక్కువ వృద్ధిని భర్తీ చేస్తుందని తెలిపింది.

విస్తరణపై భారీ పెట్టుబడులు

''ప్రయాణికుల రద్దీ ఏటా 9 శాతం వృద్ధికి.. విమాన ప్రయాణానికి బలమైన డిమాండ్ కుతోడు విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్ సంస్థలు సామర్థ్యాల విస్తరణ మద్దతుగా నిలవనుంది''అని కేర్‌ఎడ్జ్ డైరెక్టర్ మౌలేష్ దేశాయ్ వివరించారు. దేశీ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కలసి 2020 మార్చి తర్వాత నుంచి 2024 డిసెంబర్ మధ్య రూ.80,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడాన్ని కేర్‌ఎడ్జ్ తన నివేదికలో ప్రస్తావించింది. ఇందులో 42 శాతం పెట్టుబడులను నాలుగు ప్రాంతాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ల కోసం (కొత్తవి) వెచ్చించినట్టు తెలిపింది. 2025–26 నుంచి 2029–30 మధ్యకాలంలో ఈ రంగంలో మరో రూ.30,000 కోట్ల పెట్టుబడులను కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ప్రధానంగా బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ల (ప్రస్తుత ఎయిర్‌పోర్టులు) విస్తరణపై ఈ పెట్టుబడులను వెచ్చించొచ్చని అంచనా వేసింది. రూ.25,000 కోట్లతో నిర్మించే రెండు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌లు 2025–26లో కార్యకలాపాలు ప్రారంభించొచ్చని తెలిపింది. పెట్టుబడుల్లో 18 శాతాన్ని నాన్‌ఏరోనాటికల్ అభివృద్ధిపై (ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో వాణిజ్య రియల్ ఎస్టేట్) వెచ్చించొచ్చని అంచనా వేసింది. ఈ విషయంలో సింగపూర్ ఛాంగి విమానాశ్రయాన్ని ఉదహరణగా పేర్కొంది. నాన్ ఏరోనాటికల్ సదుపాయాలపై చేస్తున్న పెట్టుబడుల నుంచి వచ్చే ప్రతిఫలం వాటి రుణ పరపతిని నిర్ణయిస్తుందని తెలిపింది.




ఏరో, నాన్ ఏరో ఆదాయాల్లో వృద్ధి..

11 విమానాశ్రయాల ఏరో ఆదాయం (విమాన సర్వీసులు, వాటి అనుబంధ సేవలు) 2024 మార్చి నుంచి 2027 మార్చి మధ్య ఏటా 42 శాతం వృద్ధి చెందుతుందని కేర్‌ఎడ్జ్ నివేదిక అంచనా వేసింది. ఇదే కాలంలో నాన్‌ఏరో ఆదాయం ఏటా 12–14 శాతం చొప్పున పెరుగుతుందని పేర్కొంది. డ్యూటీ ఫ్రీ షాపులు, ఫుడ్, బెవరేజెస్ విక్రయాలు, లాంజ్ సేవల రూపంలో ఈ ఆదాయం ఉంటుందని వివరించింది. భారత ఎయిర్‌పోర్టుల్లో ఒక్కో ప్రయాణికుడి నుంచి వచ్చే నాన్ ఏరో ఆదాయం కంటే.. అంతర్జాతీయంగా విమానాశ్రయాలకు రెట్టింపు ఆదాయం వస్తున్నట్టు తెలిపింది. ఈ ప్రకారం చూస్తే భారత విమానాశ్రయాలకు నాన్ ఏరో ఆదాయం వృద్ధికి చక్కని అవకాశాలున్నట్టు పేర్కొంది. కొన్ని ఎయిర్‌పోర్ట్‌ల్లో చార్జీల పెంపు, ప్రయాణికుల సంఖ్య పెరుగుదల రూపంలో ఈ ఆదాయం 2024–25 నుంచి వృద్ధి వేగాన్ని అందుకుంటుందని వెల్లడించింది.

వర్ధమాన దేశాల్లోనే భారత్ బెటర్

- అత్యధిక వృద్ధి రేటు
- 2025–26లో 6.5 శాతం
- మూడీస్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిరేటును నమోదు చేస్తుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. బడ్జెట్‌లో ఆదాయపన్ను పరంగా భారీగా కల్పించిన పన్ను మినహాయింపు ప్రయోజనాలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపును ప్రస్తావించింది. ఈ చర్యలతో భారత్ మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా వేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.5% వృద్ధి రేటును సాధించొచ్చన్న అంచనాలను ప్రకటించింది. 2024–25 సంవత్సరానికి మూడీస్ వృద్ధి అంచనాలు 6.7% తో పోల్చితే తక్కువ కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం గత ఆర్థిక సంవత్సరంలో సగటున 4.9 శాతంగా ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంత్సరంలో (2025–26) 4.5 శాతానికి దిగొస్తుందని తెలిపింది.

భారత్ నిలబడుతుంది..

వర్ధమాన దేశాల్లోకి పెట్టుబడుల ప్రవాహం, సరఫరా వ్యవస్థలు, భౌగోళిక రాజకీయాలను యూఎస్ వాణిజ్య విధానాలు మార్చివేయనున్నట్టు మూడీస్ పేర్కొంది. అయితే, భారత్ మాదిరి పెద్ద స్థాయి వర్ధమాన దేశాలు ఈ అల్లకల్లోల పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన వనరులు కలిగి ఉన్నట్టు మూడీస్ నివేదిక తెలిపింది. ముఖ్యంగా అమెరికా విధానాలతో వర్ధమాన దేశాల నుంచి పెట్టుబడులు బయటకు తరలిపోయే రిస్క్‌ను ప్రస్తావించింది. భారత్, బ్రెజిల్ మాత్రం పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, వాటిని కాపాడుకునేందుకు మెరుగైన స్థితిలో ఉన్నట్టు తెలిపింది. ఈ రెండూ దేశీ వినియోగంపై ఆధారపడిన అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కావడం, బలమైన దేశీ క్యాపిటల్ మార్కెట్లకు తోడు స్థిరమైన విదేశీ మారకం నిల్వలు కలిగి ఉన్నాయని గుర్తు చేసింది. దేశీ కరెన్సీ ఆధారిత విదేశీ రుణ భారం ఎక్కువగా కలిగి ఉన్నందున.. విదేశీ మారకం రిస్కులను భారత్ బలంగా ఎదుర్కోగలదని అంచనా వేసింది. ఈ సానుకూలతలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని కలిగించగలవని పేర్కొంది. భారత్ వృద్ధి రేటు 2025–26లో నిదానించినప్పటికీ బలంగానే కొనసాగుతుందని, ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే అధిక వృద్ధి రేటును నమోదు చేస్తుందని వివరించింది.

హెచ్‌ఎండీ నుంచి 2 ఫీచర్ ఫోన్లు

ధర రూ. 1,899 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: హ్యూమన్ మొబైల్ డివైజెస్ (హెచ్‌ఎండీ) తాజాగా రెండు మ్యూజిక్ ఆధారిత ఫీచర్ ఫోన్లను (హెచ్‌ఎండీ 130 మ్యూజిక్, హెచ్‌ఎండీ 150 మ్యూజిక్) ప్రవేశపెట్టింది. వీటిలో 2500 ఎంఏహెచ్ బ్యాటరీ, బ్లూటూత్ 5.0, టైప్ సీ ఫాస్ట్ చార్జింగ్, యూపీఐ పేమెంట్స్ సామర్థ్యాలు మొదలైన ఫీచర్లు ఉన్నాయి. హెచ్‌ఎండీ 130 ధర రూ. 1,899గా, హెచ్‌ఎండీ 150 ధర రూ. 2,399గా ఉంటుంది. రిటైల్ స్టోర్స్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలతో పాటు తమ వెబ్‌సైట్లో ఇవి లభిస్తాయని సంస్థ గ్లోబల్ చైర్మన్ జీన్ ఫ్రాంకోయిస్ బారిల్ తెలిపారు. త్వరలోనే ఎంట్రీ స్థాయి 5జీ స్మార్ట్‌ఫోన్‌ను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. భారత్‌లో విక్రయిస్తున్న దాదాపు అన్ని ఉత్పత్తులు దేశీయంగా తయారైనవేనని హెచ్‌ఎండీ ఇండియా వీపీ రవి కున్వర్ పేర్కొన్నారు. తమ గ్లోబల్ పోర్ట్‌ఫోలియోలో ఆదాయం, వనరులపరంగా భారత్ కీలక మార్కెట్‌గా ఉంటోందని చెప్పారు. మరోవైపు, ఐపీఎల్ 2025కి సంబంధించి రాజస్థాన్ రాయల్స్‌తో తమ భాగస్వామ్యాన్ని పొడిగించుకున్నట్లు వివరించారు.

రుణ రేట్లను సవరించిన ఇండియన్ బ్యాంక్

రెపో ఆధారిత రుణాలపై 0.10 శాతం పెంపు



న్యూఢిల్లీ: రెపో ఆధారిత రుణాల రేట్లను 0.10 శాతం మేర పెంచుతున్నట్టు ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. రెపో రేటును ఆర్‌బీఐ ఇటీవలే పావు శాతం తగ్గించినప్పటికీ ప్రభుత్వరంగ ఇండియన్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), ట్రెజరీ బిల్లుల ఆధారిత రుణ రేటు (టీబీఎల్ఆర్), బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్), రెపో లింక్డ్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ (ఆర్‌బీఎల్ఆర్)పై బ్యాంక్ అస్సెట్ లయబులిటీ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలను ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. రెపో లింక్డ్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (రెపో ఆధారితం/ఆర్‌బీఎల్ఆర్)ను 0.10 శాతం పెంచడంతో 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరింది. 6 నెలల నుంచి మూడేళ్లలో కాలం తీరిపోయే రుణాలకు అమలు చేసే టీబీఎల్ఆర్ రేటును 0.05 శాతం తగ్గించడంతో 6.5 శాతానికి దిగొచ్చింది. బేస్ రేటును సైతం 0.05 శాతం తగ్గించగా, 9.80 శాతానికి చేరింది. సవరించిన రేట్లు ఏప్రిల్ 3 నుంచి అమల్లోకి వస్తాయని ఇండియన్ బ్యాంక్ వెల్లడించింది.

తగ్గిన కార్యాలయ ఉద్యోగ నియామకాలు

- రిటైల్, ఆయిల్ అండ్ గ్యాస్‌లో బలహీనత
- మార్చి నెల నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్



ముంబై: వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు (కార్యాలయం ఆధారిత/ఎగ్జిక్యూటివ్) మార్చి నెలలో క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే 1.4 శాతం తగ్గాయి. ముఖ్యంగా రిటైల్, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యా రంగాల్లో బలహీనత కనిపించింది. రిటైల్‌లో 13 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్‌లో 10 శాతం, విద్యా రంగంలో 14 శాతం చొప్పున నియామకాలు తగ్గాయి. ఐటీ రంగంలోనూ 3 శాతం క్షీణత కనిపించింది. కానీ, 2024 మార్చి నెలలో ఐటీలో నియామకాలు 16 శాతం తగ్గడంతో పోల్చితే పరిస్థితి మెరుగుపడింది. ఈ మేరకు మార్చి నెలకు సంబంధించి నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్ నివేదిక విడుదలైంది. ఐటీ రంగంలోనే క్రిప్టో, బ్లాక్‌చైన్ టెక్నాలజీ విభాగాల్లో నియామకాలు 36 శాతం పెరిగాయి. ఐటీ స్టార్టప్‌లలోనూ వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు 11 శాతం అధికంగా నమోదయ్యాయి. కొత్త జాబ్ లిస్టింగ్‌లు, రిక్రూటర్ల ఉద్యోగ ఆధారిత శోధన డేటా ఆధారంగా నౌకరీ ఈ గణాంకాలను విడుదల చేస్తుంటుంది.

హైదరాబాద్‌లో 17 శాతం అధికం

మార్చి నెలలో హైదరాబాద్‌లో వైట్‌కాలర్ ఉద్యోగ నియామకాలు 17 శాతం పెరిగాయి. చెన్నైలో అత్యధికంగా నియామకాలు 29 శాతం వృద్ధి చెందాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోనూ 23 శాతం అధిక నియామకాలు మార్చి నెలలో జరిగాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ యూనికార్న్‌లు దూకుడుగా 36 శాతం మేర అధిక నియామకాలు చేసుకున్నాయి.

తయారీ రంగం.. 8 నెలల గరిష్టం

- మార్చిలో 58.1కి తయారీ పీఎంఐ
- ఫిబ్రవరిలో ఇది 56.3



న్యూఢిల్లీ: తయారీ రంగం మార్చిలో బలంగా పుంజుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 14 నెలల కనిష్ట స్థాయికి పడిపోగా.. తిరిగి ఎనిమిది నెలల గరిష్టానికి పెరిగింది. ఫిబ్రవరిలో హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.3గా ఉంటే, మార్చి నెలలో 58.1కు చేరుకుంది. కొత్త ఆర్డర్లు ఈ స్థాయి రికవరీకి తోడ్పడినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తెలిపింది. పీఎంఐ సాధారణంగా 50కి పైన నమోదు అయితే తయారీ విస్తరణగాను, ఆలోపు వస్తే క్షీణతగాను పరిగణిస్తుంటారు. ''మార్చిలో అమ్మకాలు 2024 జూలై తర్వాత గణనీయంగా నమోదయ్యాయి. సానుకూల డిమాండ్ పరిస్థితులు, కస్టమర్ల ఆసక్తి, విజయవంతమైన మార్కెటింగ్ చర్యలు దోహదపడ్డాయి''అని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వే తెలిపింది. ముఖ్యంగా 2024–25 ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో కంపెనీలు తయారీని గణనీయంగా పెంచినట్టు పేర్కొంది. చారిత్రక సగటు కంటే తయారీ అధికంగా నమోదైనట్టు వివరించింది. ''అంతర్జాతీయ ఆర్డర్లు కాస్తంత నిదానించాయి. అయినప్పటికీ డిమాండ్ బలంగా ఉంది. కొత్త ఆర్డర్ల సూచీ ఎనిమిది నెలల గరిష్టం అయిన 61.5కు చేరుకుంది''అని హెచ్‌ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థిక వేత్త ప్రంజల్ భండారీ పేర్కొన్నారు. పెరిగిన డిమాండ్‌ను అందుకునేందుకు కంపెనీలు తమ నిల్వలను వినియోగించుకున్నాయని.. దీంతో ఫినిష్డ్ గూడ్స్ నిల్వలు 2022 జనవరి తర్వాత కనిష్టానికి చేరుకున్నాయని సర్వే నివేదిక వివరించింది. సుమారు 400 తయారీ కంపెనీల అభిప్రాయాల ఆధారంగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐ గణాంకాలను ప్రతి నెలా విడుదల చేస్తుంటుంది.

పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్మన్‌గా ఎస్ రామన్

న్యూఢిల్లీ: పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్‌ఆర్‌డీఏ) కొత్త చైర్మన్‌గా డిప్యూటీ కాగ్ ఎస్ రామన్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చైర్మన్ దీపక్ మహంతి పదవీ కాలం ఈ ఏడాది మే నెలతో ముగియనుండడంతో ఈ నియామకం చేపట్టింది. పీఎఫ్ఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా కాగ్ డిప్యూటీ కంట్రోలర్ శివసుబ్రమణియన్ రామన్ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఐదేళ్లు లేదా 65 ఏళ్లు ఈ రెండింటిలో ఏది ముందు అయితే అప్పటి వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. 1991 బ్యాచ్ ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్ అధికారి అయిన రామన్.. గతంలో సిడ్బీ చైర్మన్, ఎండీగా, నేషనల్ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఎండీ, సీఈవోగా సేవలు అందించారు.

టెస్లాకు మస్క్ రాజకీయాల సెగ

అమ్మకాలు 13 శాతం డౌన్



న్యూయార్క్: ఒకవైపు ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీ, మరోవైపు స్వయంగా సీఈవో ఎలాన్ మస్క్ బాహాటంగా రాజకీయాల్లో మునిగి తేలుతుండటం తదితర పరిణామాలు అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లాకు సమస్యాత్మకంగా మారుతున్నాయి. దీంతో కొనుగోలుదారులను ఆకట్టుకోవడంలో కంపెనీ విఫలమవుతోంది. ఫలితంగా ఈ ఏడాది తొలి మూడు నెలల్లో టెస్లా కార్ల విక్రయాలు రెండంకెల స్థాయిలో 13 శాతం పడిపోయాయి. గతేడాది మార్చి క్వార్టర్‌లో 3,87,000 వాహనాలు విక్రయించగా, ఈసారి మార్చి క్వార్టర్‌లో ఈ సంఖ్య 3,36,681 యూనిట్లకు పడిపోయింది. భారీగా డిస్కౌంట్లు, ఇతరత్రా ప్రోత్సాహకాలు ఇచ్చినప్పటికీ ఈ పరిస్థితి నెలకొంది. వాస్తవానికి విక్రయాల సంఖ్య 4,08,000 యూనిట్లుగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. అమెరికా, చైనాతో పాటు యూరప్‌లోనూ టెస్లా కార్లకు డిమాండ్ నెమ్మదించిందని, బ్రాండ్ ప్రతిష్ట మసకబారుతోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. జనవరి–మార్చి త్రైమాసిక ఆర్థిక గణాంకాలు ఊహించిన దానికంటే ఘోరంగా ఉండొచ్చని చెప్పారు.

భారత్‌కు స్టీల్ దిగుమతుల ముప్పు

- అంతర్జాతీయ వాణిజ్యంపై టారిఫ్‌ల ప్రభావం
- సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాశ్



న్యూఢిల్లీ: అమెరికా అధిక టారిఫ్‌లతో అంతర్జాతీయ వాణిజ్యం మార్పులకు లోను కానుందని సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాశ్ పేర్కొన్నారు. అంతేకాదు భారత్‌కు చౌక స్టీల్ దిగుమతుల ముప్పు ఎదురుకావొచ్చని చెప్పారు. అన్ని స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లను యూఎస్ ఇప్పటికే అమలు చేస్తుండగా, ఈ నెల 2 నుంచి అన్ని రకాల దిగుమతులపైనా ప్రతీకార సుంకాల విధింపు ఉంటుందని ప్రకటించడం గమనార్హం. దీనిపై ప్రకాశ్ స్పందించారు. ''సంప్రదాయంగా స్టీల్ ఆసియా దేశాల నుంచి యూఎస్, యూరప్‌కు ఎగుమతి అవుతుంటుంది. కొంత స్టీల్ యూరప్ నుంచి యూఎస్‌కు వెళుతుంటుంది. ప్రతీకార సుంకాలు అమల్లోకి వస్తే ఆయా ఎగుమతులు లాభసాటి కావు. దాంతో యూరప్‌కు చైనా, దక్షిణ కొరియా, జపాన్ ఎగుమతి చేసే స్టీల్ ప్రపంచ దేశాలను ముంచెత్తుతుంది. ఇది భారత్‌కు కూడా రావొచ్చు''అని సెయిల్ చైర్మన్ తన అంచనాను వ్యక్తీకరించారు. అమెరికాకు భారత్ స్టీల్ ఎగుమతులు పెద్దగా లేకపోవడంతో టారిఫ్‌ల ప్రభావం మనపై తక్కువే ఉంటుందన్నారు. ''అమెరికాలో కీలకమైన స్టీల్ ఉత్పత్తుల తయారీ రాత్రికి రాత్రి సాధ్యపడదు. దీంతో తాను ఉత్పత్తి చేయలేని వాటి దిగుమతులను అమెరికా కొనసాగిస్తుంది. అక్కడ తయారీ యూనిట్ల ఏర్పాటుకు కొంత సమయం తీసుకుంటుంది''అని వివరించారు. దేశీ స్టీల్ పరిశ్రమను చౌక దిగుమతుల నుంచి కాపాడేందుకు సుంకాల విధింపు అవసరమని అభిప్రాయపడ్డారు. స్టీల్ ఉత్పత్తుల దిగుమతులపై 12 శాతం సేఫ్‌గార్డ్ డ్యూటీని వాణిజ్య శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ గత నెలలో సిఫారసు చేయడం గమనార్హం. దీనిపై ఆర్థిక శాఖ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఎగుమతులకు టారిఫ్‌ల గండం

ఆందోళనలో చిన్న సంస్థలు

న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార టారిఫ్‌ల ప్రతిపాదనలతో చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ఎగుమతులకు ప్రతికూలంగా ఉంటుందని ఎగుమతిదారుల్లో ఆందోళన నెలకొంది. దీని వల్ల స్వల్పకాలికంగా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. 10 శాతం వరకు సుంకాలు ఫర్వాలేదని, అంతకు మించితే మాత్రం ఇబ్బందేనని ఆయన పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు డిమాండ్‌పై టారిఫ్‌ల ప్రభావం కచ్చితంగా ఉంటుందన్నారు. దిగుమతి సుంకాలపై అనిశ్చితి వల్ల ఇప్పటికే కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లివ్వకుండా తాత్కాలికంగా ఆపి ఉంచారని రాల్హన్ చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిస్థితిని సరిదిద్దాలని, టారిఫ్‌ల సమస్యను ఎదుర్కొనడంలో ఎగుమతిదార్లకు మద్దతుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.



దిగ్వేశ్‌కు జరిమానా

'లెటర్ రైటింగ్' తరహా సంబరంపై చర్యలు



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ సింగ్ రాఠిపై జరిమానా పడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా... వికెట్ తీసిన అనంతరం అతిగా సంబరాలు చేసుకున్నందుకు గానూ దిగ్వేశ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. దిగ్వేశ్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్ చివరి బంతికి పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య ఔటయ్యాడు. ఆ సమయంలో బ్యాటర్ దగ్గరకు వెళ్లిన దిగ్వేశ్... అతడి వికెట్ తన ఖాతాలో పడినట్లు పుస్తకంలో రాస్తున్నట్లు సంబరాలు చేసుకున్నాడు. అదే సమయంలో ఫీల్డ్ అంపైర్లు దిగ్వేశ్‌ను వారించగా... నిబంధనలను అతిక్రమించినందుకు రిఫరీ అతడిపై జరిమానా వేయడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. 'దిగ్వేశ్ లెవల్-1 తప్పిదానికి పాల్పడ్డాడు. నియమావళిలోని 2.5 ఆర్టికల్ ప్రకారం అతడికి జరిమానా విధించాం' అని ఐపీఎల్ పాలక మండలి ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో వెస్టిండీస్ పేసర్ కెస్రిక్ విలియమ్స్ ఈ తరహా సంబరాలతో 'ఫేమస్' అయ్యాడు. టీమిండియాతో ద్వైపాక్షిక సిరీస్ సందర్భంగా వికెట్ తీసిన అనంతరం 'నోట్‌బుక్'లో ఏదో రాస్తున్నట్లు సైగలు చేస్తూ సంబరాలు చేసుకోగా... దానికి భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తన దూకుడైన ఆటతో దీటుగా బదులిచ్చి అచ్చం అదే తరహాలో సంబరాలు చేసుకున్నాడు. కాగా... లక్నో, పంజాబ్ జట్ల మధ్య జరిగిన పోరులో పంజాబ్ కింగ్స్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.





గెలుపు బాటలోకి ఎవరో!

నేడు ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్

- విజయమే లక్ష్యంగా బరిలోకి రెండు జట్లు
- టాపార్డర్‌పైనే భారం
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో తిరిగి గెలుపు బాట పట్టేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్లు సిద్ధమవుతున్నాయి. తొలి పోరులో భారీ బాదుడుతో రికార్డులు తిరగరాసిన రైజర్స్... ఆ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో దాన్ని కొనసాగించలేకపోయింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనున్న పోరులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను సన్‌రైజర్స్ ఢీకొంటుంది. బ్యాటింగ్ లైనప్ హిట్టర్లతో దట్టంగా ఉన్నప్పటికీ... టాపార్డర్ నిలకడలేమి హైదరాబాద్ జట్టును ఇబ్బంది పెడుతోంది. రాజస్తాన్ రాయల్స్‌తో మొదటి మ్యాచ్‌లో గెలిచిన ఆరెంజ్ ఆర్మీ... ఆ తర్వాత వరుసగా లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓడింది. 3 మ్యాచ్‌లాడి 2 పాయింట్లతో ఉన్న రైజర్స్ ఎనిమిదో స్థానంలో ఉంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నా... వారంతా సమష్టిగా రాణించలేకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. మరోవైపు కోల్‌కతా జట్టు పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన ఆ జట్టు... స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో విఫలమవుతోంది. ఆడిన 3 మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లోనే గెలిచి, రెండింటిలో ఓడిన కేకేఆర్ 2 పాయింట్లతో పట్టిక అట్టడుగున ఉంది. గత సీజన్‌లో ఈ రెండు జట్ల మధ్యే జరిగిన ఫైనల్లో కోల్‌కతా గెలిచి మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకోగా... దానికి బదులు తీర్చుకోవాలని ఆరెంజ్ ఆర్మీ ప్రణాళికలు రచిస్తోంది.

కలిసికట్టుగా కదంతొక్కితేనే...

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్... ఇలా చెప్పుకుంటూ పోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్ భీకరంగా ఉంది. ఎలాంటి బౌలింగ్ దాడినైనా దంచికొట్టగల సామర్థ్యం రైజర్స్ బ్యాటర్ల సొంతం. రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇది నిరూపితమైంది. అయితే వీరంతా కలిసికట్టుగా రాణించాల్సిన అవసరముంది. రైజర్స్ తరఫున ఆడిన తొలి మ్యాచ్‌లోనే అజేయ సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్... తర్వాతి 2 మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా... ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి తొలి రెండు మ్యాచ్‌ల్లో ఫర్వాలేదనిపించాడు. అభిషేక్ శర్మ నుంచి మెరుపులు కరువు కాగా.. క్లాసెన్ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. అంచనాలు లేకుండా సీజన్ ఆరంభించిన అనికేత్ వర్మ ధాటిగా ఆడుతుండటం రైజర్స్‌కు కలిసి వస్తోంది. నైట్ రైడర్స్ ప్రధాన బలమైన స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటే మరోసారి భారీ స్కోర్లు ఖాయమే. ప్యాట్ కమిన్స్, షమీ, హర్షల్ పటేల్ బౌలింగ్ భారం మోయనున్నారు. బెంగాల్ తరఫున ఈ మైదానంలో లెక్కకు మిక్కిలి దేశవాళీ మ్యాచ్‌లు ఆడిన షమీ కీలకం కానున్నాడు.

స్పిన్నర్ల బలంతోనే...

గతేడాది వేలంలో కోల్‌కతా వదిలేసుకున్న ప్రధాన ఆటగాళ్లంతా వేర్వేరు ఫ్రాంచైజీల తరఫున రాణిస్తుంటే... కేకేఆర్ మాత్రం లయ అందిపుచ్చుకోలేక ఇబ్బంది పడుతోంది. సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే కెప్టెన్సీలో స్పిన్నే బలంగా నైట్‌రైడర్స్ బరిలోకి దిగుతోంది. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, మొయిన్ అలీలపై ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. డికాక్, రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్, రసెల్‌తో బ్యాటింగ్ లైనప్ బలంగా ఉన్నా... వీరంతా ఇప్పటి వరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన డికాక్... ముంబైతో పోరులో తేలిపోయాడు. ఇక భారీ ధర పెట్టి కొనుగోలు చేసుకున్న వెంకటేశ్ అయ్యర్ నుంచి ఆ జట్టు మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది. రింకూ సింగ్, రసెల్ ఫినిషర్లుగా విఫలమవుతుండటం మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. బౌలింగ్‌లో హర్షిత్ రాణా తప్ప చెప్పుకోదగ్గ పేసర్ లేకపోవడం కూడా కేకేఆర్‌కు ప్రతిబంధకమే కాగా... స్పిన్ యూనిట్ మాత్రం బలంగా ఉంది. మరి సొంతగడ్డపై కేకేఆర్ స్పిన్నర్లు చెలరేగుతారా లేక రైజర్స్ బ్యాటర్లు దుమ్మురేపుతారా చూడాలి!

28 ఐపీఎల్ చరిత్రలో కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు. 19 మ్యాచ్‌ల్లో నైట్‌రైడర్స్ గెలుపొందగా... 9 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ విజయం సాధించింది.

తుది జట్లు (అంచనా)

సన్‌రైజర్స్ హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, నితీశ్ రెడ్డి, క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, హర్షల్ పటేల్, షమీ, సిమర్‌జీత్ సింగ్, జంపా.

కోల్‌కతా నైట్‌రైడర్స్: రహానే (కెప్టెన్), డికాక్, నరైన్, రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్, రసెల్, రమణ్‌దీప్ సింగ్, స్పెన్సర్ జాన్సన్, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి.

హే 99 నాటౌట్

7 ఫోర్లు, 7 సిక్స్‌లతో మెరిసిన కివీస్ వికెట్ కీపర్

- రెండో వన్డేలోనూ ఓడిన పాకిస్తాన్
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ న్యూజిలాండ్ సొంతం



హామిల్టన్: సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే పాకిస్తాన్‌పై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ పర్యటనలో భాగంగా ఇప్పటికే టి20 సిరీస్ కోల్పోయిన పాకిస్తాన్ జట్టు.. ఇప్పుడు వన్డే సిరీస్‌లోనూ ఓటమి పాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో వన్డేలో 84 పరుగుల తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. తద్వారా 2-0తో సిరీస్ చేజిక్కించుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. వికెట్ కీపర్ మిచెల్ హే (78 బంతుల్లో 99 నాటౌట్; 7 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ శతకానికి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. పాక్ బౌలర్ వసీమ్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో హే 2,0,6,6,4,4తో 22 పరుగులు పిండుకున్నాడు. కివీస్ ఇతర బ్యాటర్లలో మొహమ్మద్ అబ్బాస్ (41; 3 ఫోర్లు), నిక్ కెల్లీ (31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ వసీమ్, సుఫియాన్ ముఖీమ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ పూర్తిగా తడబడింది. 41.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. ఫహీమ్ అష్రఫ్ (80 బంతుల్లో 73; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), నసీమ్ షా (44 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకాలతో పోరాడారు. వీరిద్దరికీ ఈ ఫార్మాట్‌లో ఇవే మొదటి హాఫ్ సెంచరీలు. కివీస్ బౌలర్ల ధాటికి పాకిస్తాన్ ఒకదశలో 32 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (5), బాబర్ ఆజమ్ (1), అబ్దుల్లా షఫీక్ (1), ఇమామ్ ఉల్ హక్ (3), సల్మాన్ ఆఘా (9) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. చివర్లో ఫహీమ్, నసీమ్ షా ధాటిగా ఆడటంతో పాకిస్తాన్ 200 పరుగుల మార్క్ దాటగలిగింది. న్యూజిలాండ్ బౌలర్లలో బెన్ సియర్స్ 5 వికెట్లు పడగొట్టగా... జాకబ్ డఫీ 3 వికెట్లు తీశాడు. మిచెల్ హేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన చివరి వన్డే శనివారం మౌంట్‌మాంగనీలో జరుగుతుంది.

16 వన్డే మ్యాచ్‌లో 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన 16వ క్రికెటర్‌గా మిచెల్ హే గుర్తింపు పొందాడు. బ్రూస్ ఎడ్గర్ (1981లో ఆక్లాండ్‌లో భారత్‌పై: 99 నాటౌట్) తర్వాత న్యూజిలాండ్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో క్రికెటర్‌గా హే నిలిచాడు. గతంలో డీన్ జోన్స్ (ఆస్ట్రేలియా), రిచీ రిచర్డ్సన్ (వెస్టిండీస్), ఆండీ ఫ్లవర్ (జింబాబ్వే), అలిస్టర్ క్యాంప్‌బెల్ (జింబాబ్వే), రాంనరేశ్ శర్వాణ్ (వెస్టిండీస్), బ్రాడ్ హాడ్జ్ (ఆస్ట్రేలియా), మొహమ్మద్ యూసుఫ్ (పాకిస్తాన్), మైకేల్ క్లార్క్ (ఆస్ట్రేలియా), వీరేంద్ర సెహ్వాగ్ (భారత్) మాల్కం వాలర్ (జింబాబ్వే), మెక్లాయిడ్ (స్కాట్లాండ్), స్వప్నిల్ పాటిల్ (యూఏఈ), జేసన్ హోల్డర్ (వెస్టిండీస్), ఇవిన్ లూయిస్ (వెస్టిండీస్) కూడా వన్డే మ్యాచ్‌లో 99 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు.



'టాప్' ర్యాంక్‌లోనే హార్దిక్ పాండ్యా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టి20 ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల విభాగంలో తన నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. హార్దిక్ 252 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బౌలింగ్ విభాగంలో భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన రెండో ర్యాంక్‌ను కోల్పోయాడు. వరుణ్ ఒక స్థానం పడిపోయి 706 పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. నాలుగు స్థానాలు ఎగబాకిన న్యూజిలాండ్ పేసర్ జేకబ్ డఫీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. క్రితంసారి వరకు నంబర్‌వన్ స్థానంలో ఉన్న అకీల్ హోసీన్ (వెస్టిండీస్) రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు అభిషేక్ శర్మ రెండో స్థానంలో, తిలక్ వర్మ నాలుగో స్థానంలో, సూర్యకుమార్ యాదవ్ ఐదో స్థానంలో ఉన్నారు.

రాజస్తాన్ రాయల్స్ సారథిగా సామ్సన్



బెంగళూరు: గాయం కారణంగా సారథిగా కాకుండా కేవలం ప్లేయర్‌గా మాత్రమే ఐపీఎల్ ఆడుతున్న సంజూ సామ్సన్‌కు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి అనుమతి లభించింది. వేలి గాయం పూర్తిగా మానడంతో కీపింగ్ చేయొచ్చని బీసీసీఐ వెల్లడించింది. తాజా సీజన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో సామ్సన్ 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగగా... అతడి స్థానంలో రియాన్ పరాగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ సందర్భంగా ఆర్చర్ బౌలింగ్‌లో సామ్సన్... కుడిచేయి బొటనవేలికి గాయం కాగా... శస్త్రచికిత్స చేయించుకున్నాడు.

65 నుంచి 40కు...

భారత మహిళల హాకీ కోర్ గ్రూప్ ప్రాబబుల్స్ కుదింపు



బెంగళూరు: గత రెండు వారాలుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సెంటర్‌లో భారత మహిళల హాకీ ప్రాబబుల్స్‌కు శిక్షణ శిబిరం జరిగింది. ఈ తొలి విడత శిబిరంలో మొత్తం 65 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వారు కనబరిచిన ప్రతిభ ఆధారంగా రెండో దశ శిబిరం కోసం జాబితాను 40 మందికి కుదించారు. 28 మంది సీనియర్ ప్లేయర్లు కోర్ గ్రూప్ ప్రాబబుల్స్‌లో తమ చోటును నిలబెట్టుకోగా... జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో రాణించిన 12 మంది కొత్త ప్లేయర్లను ఎంపిక చేశారు. 'కొత్తగా ఎంపికైన యువ క్రీడాకారిణులు రెండో దశ శిబిరంలో ఎలా రాణిస్తారో ఆసక్తితో ఉన్నాను. ఇందులో ఆకట్టుకుంటే వారు తమ కెరీర్‌లో మరో మెట్టు ఎక్కుతారు' అని భారత మహిళల హాకీ జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

భారత మహిళల హాకీ కోర్ గ్రూప్ ప్రాబబుల్స్: సవిత పూనియా, బిచ్చూ దేవి, బన్సారి సోలంకి, మాధురి కిండో, సమీక్ష సక్సేనా (గోల్‌కీపర్లు). మహిమా చౌధరీ, నిక్కీ ప్రధాన్, సుశీలా చాను, ఉదిత, ఇషికా చౌధరీ, జ్యోతి ఛత్రి, జ్యోతి, అక్షత ఢెఖాలే, అంజన డుంగ్‌డుంగ్, సుమన్ దేవి (డిఫెండర్స్). సుజాత కుజుర్, వైష్ణవి ఫాల్కే, నేహా, సలీమా టెటె, మనీషా చౌహాన్, అజ్మీనా కుజుర్, సునెలితా టొప్పో, లాల్‌రెమ్‌సియామి, షర్మిలా దేవి, బల్జీత్ కౌర్, మహిమా టెటె, అల్బెలా రాణి టొప్పో, పూజా యాదవ్ (మిడ్ ఫీల్డర్స్). దీపిమోనిక టొప్పో, హృతిక సింగ్, దీపిక సొరెంగ్, నవ్‌నీత్ కౌర్, సంగీత, దీపిక, రుతుజా, బ్యూటీ డుంగ్‌డుంగ్, ముంతాజ్ ఖాన్, అన్ను, చందన జగదీశ్, కాజల్ అట్పాడ్కర్ (ఫార్వర్డ్స్).

సాకేత్ జోడీ శుభారంభం

సాక్షి, హైదరాబాద్: మెనోర్కా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని శుభారంభం చేశాడు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సాకేత్ తమిళనాడుకు చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-1, 6-2తో పెడ్రో కాచిన్ (అర్జెంటీనా)-ఇజాన్ కొరెత్యా (స్పెయిన్) జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 48 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ నాలుగు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశారు. తమ సర్వీస్‌లను నిలబెట్టుకొని, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

అనిరుధ్‌కు నిరాశ

మరోవైపు ఇదే టోర్నీలో బరిలోకి దిగిన హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ మాత్రం తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. గతవారం డేవిడ్ వెగా హెర్నాండెజ్ (స్పెయిన్)తో కలిసి జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన అనిరుధ్ అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్ (భారత్)-హెర్నాండెజ్ ద్వయం 6-7 (4/7), 7-5, 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ డానియల్ కుకెర్మన్ (ఇజ్రాయెల్)-జోషువా పారిస్ (బ్రిటన్) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. రెండు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం అనిరుధ్ ద్వయం తడబడింది. భారత్‌కే చెందిన టాప్ సీడ్ జోడీ విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెదుంజెళియన్ జోడీ 2-6, 0-6తో మాటియో-ఆండ్రియా (ఇటలీ) జంట చేతిలో ఓటమి పాలైంది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో నిక్కీ పునాచా (భారత్)- గోర్నెస్ (స్పెయిన్) ద్వయం 6-3, 6-3తో వరోనా-టబెర్నర్ (స్పెయిన్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.





మనిక తొలి రౌండ్‌లోనే...



ఇంచియోన్ (దక్షిణ కొరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రాకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లోనే ఆమె పరాజయంతో వెనుదిరిగింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 29వ ర్యాంకర్ మనిక 2-11, 11-8, 3-11, 6-11తో ప్రపంచ 12వ ర్యాంకర్ కియాన్ టియాన్‌యి (చైనా) చేతిలో ఓడిపోయింది. 27 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనిక తన సర్వీస్‌లో 14 పాయింట్లు సాధించింది. ప్రత్యర్థి సర్వీస్‌లో 8 పాయింట్లు గెలిచింది. తొలి రౌండ్‌లో ఓడిన మనికకు 4,500 డాలర్ల (రూ. 3 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. నేడు జరిగే మహిళల సింగిల్స్ మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత రెండో ర్యాంకర్, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 32వ స్థానంలో ఉన్న ఆకుల శ్రీజ ప్రపంచ ఏడో ర్యాంకర్ కుయ్ మాన్ (చైనా)తో తలపడుతుంది.

గాజాలో ఆకలి కేకలు

పిండీ లేదు.. తిండీ లేదు

- బేకరీలన్నీ మూసివేత
- అంతర్జాతీయ సాయానికి ఇజ్రాయెల్ మోకాలడ్డు



మూసివేసిన బేకరీ ఎదుట దీనంగా చూస్తున్న బాలుడు

రంజాన్ పండుగతో పాటే ప్రపంచవ్యాప్తంగా ముస్లింల ఉపవాస దీక్షలు ముగిసినా గాజాలో మాత్రం పాలస్తీనియన్లకు నిత్య ఉపవాసాలే కొనసాగుతున్నాయి. తినడానికి ఏమీ లేక ఖాళీ జనం డొక్కలెండుతున్నాయి. గాజాకు మానవతా సాయాన్ని, ఆహార సరఫరాను ఇజ్రాయెల్ పూర్తిగా అడ్డుకోవడంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. ఐరాసతో పాటు అంతర్జాతీయ సమాజం భారీ పరిమాణంలో పంపిన ఆహార నిల్వలన్నీ సరిహద్దుల వద్దే కుళ్లిపోతున్నాయి. గాజా ఏమో నిస్సహాయ స్థితిలో ఆకలితో యుద్ధం చేస్తోంది. రంజాన్ పండుగ సందర్భంగా కూడా కనీసం రొట్టిముక్కయినా దొరకని కుటుంబాలెన్నో...! ఇది చాలదన్నట్టు పిండి నిల్వలు కూడా పూర్తిగా నిండుకోవడంతో తాజాగా గాజాలో బేకరీలన్నీ మూతబడ్డాయి!!

ఈద్. పవిత్ర రంజాన్ మాసానికి **ముగింపు.** సాధారణంగా అయితే గాజావాసులకూ **వేడుకే.** కుటుంబాలన్నీ కలిసి ఆనందంగా పండుగ **జరుపు**కొంటాయి. కానీ గతేడాది మాదిరిగానే **ఈసారి** కూడా అక్కడ ఈద్ పాలస్తీనావాసుల **ఆకలి** కేకలు, ఇజ్రాయెల్ బాంబు దాడుల నడు**మే** ముగిసింది. యుద్ధం దెబ్బకు గాజా ఆహారోత్పత్తి సామర్థ్యం పూర్తిగా పడకేసింది. దాంతో తిండికి కూడా అంతర్జాతీయ సాయంపైనే ఆధారపడుతోంది. ఇజ్రాయెల్ మాత్రం తమ బందీల విడుదల కోసం హమాస్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా మార్చి నుంచే గాజాకు ఆహారం, మానవతా సాయం సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. దాంతో సహా**యక** ట్రక్కులు గాజాలో అడుగు పెట్టి **మూడు** వారాలు దాటింది. 18 నెలల క్రితం **యుద్ధం** మొదలైనప్పటి నుంచీ గాజాకు ఇంతకా**లం పాటు** ఎలాంటి ఆహార సరఫరాలూ అందకపో**వడం ఇదే** తొలిసారి. దాంతో ఇంధనం తదితరాల **కొరత తార**స్థాయికి చేరింది. అంతేకాదు, కనీసం పిం**డి నిల్వలు** కూడా లేని పరిస్థితి! దాంతో బుధవారం గాజాలోని బేకరీలన్నీ మూతబడ్డాయి. స్థానిక బేకరీ యజమానుల సంఘం చీఫ్ అబ్దెల్ నాసర్ అల్–అజ్రామి ఈ మేరకు ప్రకటించారు. ''గిడ్డంగుల్లో పిండి పూర్తిగా అయిపోయినట్టు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) మాకు తెలిపింది. ఇజ్రాయెల్ రఫా క్రాసింగ్ తదితరాలను తెరిచి సహాయక సామగ్రి, మానవతా సాయాలను తిరిగి గాజాలోకి అనుమతించేదాకా బేకరీలు పనిచేయబోవు''అని వెల్లడించారు.

అబద్ధాలతో నిద్రపుచ్చుతూ...

పాలస్తీనియన్ల ఆకలిని తీరుస్తున్న ప్రధాన వనరు రొట్టె మాత్రమే. చికెన్, మాంసం, కూరగాయలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. అందుబాటులో ఉన్న ఇతర ఆహార పదార్థాలను రొట్టెను తింటూ రోజులు వెళ్లదీస్తున్నారు. ''పరిస్థితి వివరించలేనంత దారుణంగా ఉంది. నా కుటుంబ సభ్యులకు బ్రెడ్ కోసం ఉదయం 8 గంటల నుంచీ వెతుకుతున్నాను. డెయిర్ అల్–బలాహ్‌లోని అన్ని **బేకరీల చుట్టూ** తిరిగా. ఒక్కటి కూడా పనిచేయడం **లేదు. పిండి** లేదు. కట్టె లేదు. ఏమీ లేవు. కనీసం **తాగేందుకు** నీళ్లు కూడా లేవు. ఇంత దారుణం **చూస్తామని** ఎన్నడూ అనుకోలేదు''అని **ఇబ్రహీం** అల్ కుర్ద్ అనే స్థానికుడు వాపో**యాడు.** ''పిల్లలు రాత్రి భోజనం చేయకుం**డానే** పడుకుంటున్నారు. ఈ ఒక్క రాత్రికి **ఓపి**క పట్టండి, ఉదయాన్నే పిండి తెచ్చు**కుం**దామని వారికి అబద్ధాలు చెబుతూ నిద్రపుచ్చుతున్నాం''అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. రఫా తదితర క్రాసింగ్‌**ల**ను తిరిగి తెరిచేలా ఇజ్రాయెల్‌పై అం**తర్జా**తీయ సమాజం ఒత్తిడి తేవాలని **ఆయ**న వేడుకుంటున్నాడు.

చుక్కల్లో పిండి ధరలు...

రొట్టెతో పాటు గాజావాసులకు వంట కోసం **గ్యాస్‌ను కూడా** బేకరీలే అందించేవి. అవి మూతబ**డటంతో తిండి** వండుకోవడానికి కలపనే ఆశ్రయి**స్తున్నారు.** కానీ దానికీ తీవ్ర కొరతే ఉంది. కలపను **బ్లాక్ మార్కెట్లో** అడ్డగోలు ధరలకు అమ్ముతున్నారు. దాంతో అదీ జనానికి అందుబాటులో లేకుండా పోయింది. నూనె, ఈస్ట్ వంటి బేకింగ్ పదార్థాలు కూడా కొనలేని పరిస్థితి! బేకరీలు మూతబడటంతో పిండి ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. ఒక్క సంచీ ఏకంగా 400 షెకెల్స్ (115 డాలర్ల)కు అమ్ముతున్నారు. యుద్ధానికి ముందు 25 షెకెల్స్ ఉండేది. గత జనవరిలో స్వల్పకాలిక కాల్పుల విరమణ సందర్భంగా కూడా 35 షెకెల్స్‌కు దొరికేది. ''ప్రజలు ఇప్పుడు యుద్ధ భయాన్ని, బాంబు దాడులను, వలస కష్టాలను, అన్నింటినీ మర్చిపోయారు. వారి ఆలోచనలన్నీ ఏ పూటకు ఆ పూట పిండి ఎలా దొరుకుతుందా అన్నదాని మీదే ఉన్నాయి''అని ఉత్తర గాజాకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అహ్మద్ డ్రెమ్లీ ఆవేదన వెలిబుచ్చారు. ''యుద్ధం మొదలైనప్పుడు ప్రజలు ఆరోగ్యంగా, దేన్నయినా తట్టుకునే సామర్థ్యంతో ఉన్నారు. ఇప్పుడంతా మారిపోయింది. రొట్టెకు కూడా దిక్కు లేదు! దాంతో జనం ఏది దొరికినా తిని కడుపు నింపుకుంటున్నారు. కానీ కొద్ది రోజులుగా చాలామందికి తినేందుకు ఏమీ దొరకడం లేదు. బియ్యం కొనడానికి అప్పు చేస్తున్నారు. ఇంట్లో ఉన్నవన్నీ అమ్ముకుంటున్నారు. **చాలామంది పాలస్తీనియన్లు రద్దీగా ఉన్న గుడా**రాల్లో బతుకీడుస్తున్నారు. కొందరైతే వీధుల్లోనే నిద్రపోతున్నారు. తిండి వండుకునే పరిస్థితులు **కూడా లేవు''**అంటూ గాజాలోని దైన్యాన్ని ఆయన వివరించారు.

దారుణ సంక్షోభం: ఐరాస

''కాల్పుల విరమణ సమయంలో గాజాలోకి రోజుకు 500 నుంచి 600 ట్రక్కుల్లో సహాయక సామగ్రి వచ్చేది. ఇప్పుడన్నీ ఆగిపోయాయి. కాల్పుల విరమణ ముగిసి యుద్ధం తిరిగి మొదలైనప్పటినుంచీ ఘోరమైన మానవతా సంక్షోభం నెలకొంది. మార్చి 2 నుంచి గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా ఆపేసింది. ముఖ్యంగా బేకరీల మూతతో ఆహారం కోసం కేవలం వాటిపైనే ఆధారపడ్డ లక్షలాది మంది అల్లాడుతున్నారు. దిగ్బంధాన్ని తక్షణం ఎత్తేయకపోతే గాజాలో త్వరలోనే మరణమృదంగం తప్పదు''అని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీ (యూఎన్ఆర్డబ్ల్యూఏ) కమిషనర్ జనరల్ ఫిలిప్ లజారి హెచ్చరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్


గాజా సిటీలో ఆహార పదార్థాలు ఖాళీ కావడంతో మూతపడిన దుకాణం


ఖాళీగా దర్శనమిస్తున్న మరో దుకాణం


ఆహారం కోసం ఓ షాపులోకి ఆశగా చూస్తున్న బాలిక


ఓ బేకరీలో నిలిచిపోయిన రొట్టెల తయారీ

రష్యాలో మిస్టరీ వైరస్ కలకలం

బాధితుల్లో కరోనా తరహా లక్షణాలు

మాస్కో: రష్యాలో అంతుచిక్కని వైరస్ వ్యాప్తి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా ఈ మిస్టరీ వైరస్ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. బాధితుల్లో కోవిడ్–19 తరహా లక్షణాలు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. కండరాల నొప్పి, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం, దగ్గు వంటివి బాధితులను వేధిస్తున్నాయి. వీరికి పరీక్షలు చేయగా, కోవిడ్–19 లేదా ఇన్‌ఫ్లూయెంజ సోకినట్లు తేలడం లేదు. మరోవైపు మిస్టరీ వైరస్‌పై మీడియలో వస్తున్న వార్తలను రష్యా ఆరోగ్య శాఖ అధికారులు కొట్టిపారేశారు. అలాంటి వైరస్ ఏదీ లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించారు. వాతావరణం మారినప్పుడు శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరం వంటివి కనిపించడం సాధారణమేనని వెల్లడించారు. ఇప్పటికే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిలో ఇలాంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయని, తగిన చికిత్స తీసుకుంటే సరిపోతుందని సూచించారు. దేశంలో కొత్త వైరస్ పుట్టికొచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెప్పారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోండి

ప్రధానికి తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: వక్ఫ్(సవరణ) బిల్లు–2024ను కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ముస్లింల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాజ్యాంగం దేశ ప్రజలందరికీ మత స్వేచ్ఛను ఇచ్చిందని పేర్కొన్నారు. నచ్చిన మతం ఆచరించే హక్కు ప్రజలకు ఉందన్నారు. ఈ హక్కును కాపాల్సిన బాధ్యత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పారు. వక్ఫ్ బోర్డులను బలహీన పరుస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ (సవరణ) బిల్లు తీసుకొచ్చారని ఆరోపించారు. బిల్లుకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించామని గుర్తుచేశారు. ప్రధానమంత్రి ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని, బిల్లును ఉపసంహరించుకోవాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

భారత్‌లో ఐర్లండ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి

స్వాగతించిన సీజేఐ జస్టిస్ ఖన్నా

న్యూఢిల్లీ: ఐర్లండ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గెరార్డ్ హోగన్ బుధవారం సుప్రీంకోర్టును సందర్శించారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ కోర్టు గది సందర్శకుల గ్యాలరీ నుంచి విచారణ ప్రక్రియను జస్టిస్ హోగన్ వీక్షించారు. ఈ సందర్భంగా లాయర్లు, కక్షిదారులకు ఆయనను సీజేఐ పరిచయం చేశారు. ''జస్టిస్ హోగన్ గతంలో యూరోపియన్ కోర్ట్‌ఆఫ్ అపీల్స్ అడ్వకేట్ జనరల్‌గా చేశారు. జీవించే హక్కు తదితర కీలక అంశాలపై మైలురాయి వంటి తీర్పులెన్నో వెలువరించారు''అని వివరించారు.

25 గంటల పాటు... ఏకధాటి ప్రసంగం

రికార్డు సృష్టించిన డెమొక్రాట్ సెనేటర్ బుకర్



వాషింగ్టన్: న్యూజెర్సీ సెనేటర్ కోరీ బుకర్ అరుదైన రికార్డు సృష్టించారు. ఈ డెమొక్రాట్ల నేత సెనేట్‌లో ఏకంగా 25 గంటల 5 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించి రికార్డు నెలకొల్పారు. సోమవారం సాయంత్రం 6:59 గంటలకు ప్రారంభమైన ఆయన ప్రసంగం మంగళవారం రాత్రి 8.05 గంటలకు ముగిసింది! అలా ఏడు దశాబ్దాల రికార్డును బుకర్ బద్దలు కొట్టారు. పౌరహక్కుల చట్టాన్ని అడ్డుకునేందుకు 1957లో సెనేటర్ స్ట్రోమ్ థర్మండ్ 24 గంటల 18 నిమిషాల పాటు ప్రసంగించారు. ఆ రికార్డును బుకర్ తాజాగా అధిగమించారు. అఫర్డబుల్ కేర్ చట్టానికి వ్యతిరేకంగా 2013లో సెనేటర్ టెడ్ క్రూజ్ 21 గంటలపాటు ప్రసంగించారు. అంతకుముందు 2010లో సెనేటర్ బెర్నీ శాండర్స్ 8.5 గంటల ప్రసంగంతో దేశం దృష్టిని ఆకర్షించారు.

పలు అంశాల ప్రస్తావన...

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన పాలన తీరును బుకర్ తన సుదీర్ఘ ప్రసంగం పొడవునా తూర్పారబట్టారు. పలు అంశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ట్రంప్ విదేశాంగ విధానం, మెడికేడ్‌కు ప్రణాళికాబద్ధమైన కోతలు, సలహాదారు ఎలాన్‌మస్క్ ఆధ్వర్యంలో యంత్రాంగం అనుసరిస్తున్న విధానాలను ప్రస్తావించారు. అణగారిన వర్గాలపై ట్రంప్ ప్రభుత్వ విధానాల ప్రతికూల ప్రభావం గురించి చెప్పుకొచ్చారు. ఓటింగ్ హక్కులు, ఆర్థిక అసమానతలను ప్రస్తావించారు. గ్రీన్‌లాండ్, కెనడాలను విలీనం అంశాల నుంచి సామాజిక కార్యక్రమాలను తగ్గించడం, పన్నుల వరకు ప్రస్తావించారు.

ఆద్యంతం నిలబడే...

సెనేట్ నిబంధనల ప్రకారం ఒక సెనేటర్ సభపై నియంత్రణ కలిగి ఉండాలంటే నిలబడే మాట్లాడాలి. విరామం కోసం హాలును వదిలి వెళ్లకూడదు. ఈ నిబంధనలను బుకర్ తూచా తప్పకుండా పాటించారు. ప్రసంగానికి ముందు ఆయన రోజుల తరబడి ఉపవాసం ఉన్నారు. ముందు రోజు రాత్రి ద్రవాలు తాగడం మానేశారు. ప్రసంగించినంతసేపూ చాంబర్ వీడి వెళ్లలేదు. ఆయన మాట్లాడుతున్నంతసేపూ చైర్ పర్సన్, కొందరు గుమస్తాలు, భద్రతా సిబ్బంది మినహా సెనేట్ అంతస్తంతా రాత్రి పొడవునా ఖాళీగానే ఉండటం విశేషం! చాంబర్‌కు కేటాయించిన సెనేట్ ఫ్లోర్ సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు కూడా బుకర్ ప్రసంగించినంతసేపు డ్యూటీలోనే ఉండాల్సి వచ్చింది.

విశ్రాంతినిచ్చిన డెమొక్రాట్లు...

బుకర్ ప్రసంగిస్తున్నంత సేపూ సెనేట్, హౌస్‌లోని ఆయన సహచరులు మధ్యమధ్యలో ప్రశ్నలడుగుతూ ఆయన్ను ఉత్సాహపరిచారు. సెనేట్ మైనారిటీ నేత చక్ షూమర్, సెనేటర్లు క్రిస్ మర్ఫీ, అమీ క్లోబుచర్, మాజీ హిరోనో, డిక్ డర్బిన్ సహా డజన్ల కొద్దీ డెమొక్రటిక్ సహచరులు మధ్యలో ప్రశ్నలు, చర్చల ద్వారా బుకర్‌కు కాస్త విశ్రాంతి ఇచ్చారు. హౌస్ మైనారిటీ నేత హకీం జెఫ్రీస్, కాంగ్రెషనల్ బ్లాక్ కాకస్ సభ్యులతో సహా డెమొక్రాట్లు కూడా సెనేట్ చాంబర్‌కు వచ్చి ప్రసంగాన్ని వీక్షించారు. బుకర్ బంధువు, సోదరుడు, డెమొక్రటిక్ సహాయకులు కూడా గ్యాలరీ నుంచి వీక్షించారు. ప్రసంగం ముగిశాక డెమొక్రటిక్ సహచరులంతా బుకర్‌ను ప్రశంసించారు. దీన్ని సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. కొందరు రిపబ్లికన్ సెనేటర్లు మాత్రం దీన్ని పబ్లిసిటీ స్టంట్‌గా విమర్శించారు. బుకర్ ప్రసంగం నాటోలో అమెరికా రాయబారిగా మాథ్యూ విటేకర్ నియామకాన్ని ధ్రువీకరించేందుకు జరగాల్సిన ఓటింగ్‌ను, సెనేట్ కార్యకలాపాలను ఆలస్యం చేయడం విశేషం.

మరో 1.6 లక్షల మంది సైనికులు

భారీ రిక్రూట్‌మెంట్‌కు తెర తీసిన రష్యా

మాస్కో: రష్యా తన సైనిక బలాన్ని మరింత పెంచుకునే ప్రయత్నంలో పడింది. మరో 1,60,000 మంది సైనికుల నియామకానికి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా పిలుపునిచ్చారు. జూలై నాటికి ఈ రిక్రూట్‌మెంట్ పూర్తవనుంది. 18–30 ఏళ్ల మధ్య వయసున్న పురుషులను తీసుకోనున్నారు. 2011 నుంచి ఇప్పటిదాకా రష్యా నిర్బంధ సైనిక రిక్రూట్‌మెంట్లలో ఇదే అతి పెద్దది. వచ్చే మూడేళ్లలో ఇది 1.8 లక్షలకు పెరగనుంది. సైన్యం పరిమాణాన్ని 24 లక్షలకు, క్రియాశీల సైనికుల సంఖ్యను 15 లక్షలకు పెంచుకుంటామని పుతిన్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. కొత్త సైనికులను యుద్ధానికి పంపబోమని, ఈ నియామకాలకు ఉక్రెయిన్ యుద్ధంతో సంబంధం లేదని రక్షణ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్‌లో ప్రత్యేక సైనిక చర్యకు వారిని పంపబోమని వెల్లడించింది.

మళ్లీ క్షీణించిన లాలూ ప్రసాద్ ఆరోగ్యం

న్యూఢిల్లీ: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్(76) ఆరోగ్యం మళ్లీ క్షీణించింది. బుధవారం ఢిల్లీకి చేరుకోవడానికి పాట్నా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా మార్గంమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దాంతో వెంటనే ఆయనను పాట్నాలోని పారస్ ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో చేర్చి చికిత్స అందించిన తర్వాత స్వల్పంగా కోలుకున్నారని డాక్టర్లు చెప్పారు. లాలూ ఇప్పటికే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. రక్తపోటుతోపాటు రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగడంతో అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ప్రస్తుతం లాలూ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్జేడీ నేత వీరేంద్ర చెప్పారు. లాలూకు గత ఏడాది ముంబైలో యాంజియోప్లాస్టీ శస్త్రచికిత్స జరిగింది. గత ఏడాది జూలైలో ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందారు.

పాకిస్తాన్ అధ్యక్షుడు జర్దారీకి కరోనా పాజిటివ్

కరాచీ: పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ(69) అనారోగ్యం బారినపడ్డారు. పరీక్షల్లో ఆయనకు కోవిడ్–19 పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్యులు బుధవారం వెల్లడించారు. జర్దారీ సోమవారం నవాబ్‌షా పట్టణంలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. మంగళవారం నవాబ్‌షా నుంచి కరాచీకి చేరుకున్నారు. జ్వరంతోపాటు శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరారు. ఆయనకు పరీక్షలు చేయగా కోవిడ్–19 పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జర్దారీ వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ అసీమ్ హుస్సేన్ తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోందని చెప్పారు. అసిఫ్ అలీ జర్దారీ 2022 జూలైలోనూ కరోనా బారినపడ్డారు.

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్..

ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని మాండ్లా జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు కరడుగట్టిన మహిళా నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. వారిపై రూ.14 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ స్వయంగా వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను అభినందించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి నక్సలిజం నుంచి దేశం పూర్తిగా విముక్తి పొందుతుందని వ్యాఖ్యానించారు. బిచీయా పోలీసు స్టేషన్ పరిధిలో కాన్హా నేషనల్ పార్కు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో పలు ఆయుధాలు, వైర్‌లెస్ సెట్, నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నక్సలైట్ల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. మృతిచెందిన నక్సలైట్లను మమతా అలియాస్ రమాబాయి, ప్రమీల అలియాస్ మాండవిగా గుర్తించారు. మమతా మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాకు చెందినవారు కాగా, ప్రమీల ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జన్మించారు. మమత భర్త రాకేశ్ సైతం సీనియర్ నక్సలైట్ కావడం గమనార్హం. మధ్యప్రదేశ్‌లో గత నెలన్నర వ్యవధిలో రెండు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు నక్సలైట్లు మరణించారు.

జపాన్‌లో తీవ్ర భూకంపం

రిక్టర్‌స్కేల్‌పై 6.0గా నమోదు

టోక్యో: జపాన్‌లో తీవ్ర భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.0గా నమోదైంది. భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 7.34 గంటలకు జపాన్‌లోని క్యుషు ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ(ఎన్‌సీఎస్) ప్రకటించింది. భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి 30 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు వెల్లడించింది. అయితే, ఈ ఘటనలో ఆస్తి నష్టం, ప్రాణనష్టంపై వివరాలు ఇంకా తెలియరాలేదు.

భార్య కాపురానికి రాలేదని... కూతురిని కాల్చేశాడు

- కర్నాటకలో ఉన్మాది దారుణం
- అత్త, మరదలినీ కాల్చేసి ఆత్మహత్య

యశవంతపుర: కర్నాటకలో దారుణ సంఘటన జరిగింది. చిన్నారి కూతురుతోపాటు అత్తను, మరదలిని కాల్చిచంపాడో ఉన్మాది. తర్వాత తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. చిక్కమగళూరు జిల్లా ఖాండ్యా సమీపంలోని మాగలు గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘోరం జరిగింది. రత్నాకర్ గౌడ (40) అనే వ్యక్తి అత్తగారి ఇంట్లోకి చొరబడ్డాడు. అత్త జ్యోతి (50), మరదలు సింధు (26), కూతురు మౌల్య (7)ను సింగిల్ బ్యారెల్ నాటు తుపాకీతో కాల్చి చంపాడు. సింధు భర్త అవినాశ్‌పైనా కాల్పులు జరిపాడు. అతను తూటా గాయాలతో తప్పించుకున్నాడు. తర్వాత దుండగుడు నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి అదే తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. రత్నాకర్ బెంగళూరులో స్కూలు బస్సు డ్రైవర్. రెండేళ్ల కిందట పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదనే కోపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కాల్పుల సమయంలో భార్య ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ముడా భూకుంభకోణంలో నిందితులపై

దర్యాప్తు కొనసాగించవచ్చు

ఈడీకి కర్ణాటక హైకోర్టు అనుమతి

బెంగళూరు: మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూముల కుంభకోణం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఎదురు దెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులపై దర్యాప్తు కొనసాగించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు కర్ణాటక హైకోర్టు బుధవారం అనుమతి మంజూరు చేసింది. ముడా మాజీ కమిషనర్ డి.బి.నటేశ్‌కు మాత్రం దర్యాప్తు నుంచి మినహాయింపు ఇచ్చింది. నటేశ్ మినహా మిగిలిన నిందితులందరిపై దర్యాప్తు యథాతథంగా కొనసాగించవచ్చని సూచించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఎన్.వి.అంజారియా, జస్టిస్ కె.వి.అరవింద్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. నటేశ్‌కు ఇచ్చిన సమన్లను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈడీ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం ముడా కేసులో నటేశ్ మినహా మిగిలినవారిపై దర్యాప్తు జరపడానికి అనుమతి ఇచ్చింది. ముడా భూకుంభకోణంపై ఈడీతోపాటు కర్ణాటక లోకాయుక్త సైతం దర్యాప్తు జరుపుతోంది. మరోవైపు ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదంటూ లోకాయుక్త ఇచ్చిన 'బి రిపోర్టు'ను వ్యతిరేకిస్తూ ఈడీ తాజాగా కర్ణాటక ప్రజా ప్రతినిధుల కోర్టును ఆశ్రయించింది.

ఈ నెల 7 నుంచి రాష్ట్రపతి విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు.. మొత్తం నాలుగు రోజులపాటు పోర్చుగల్, స్లొవాకియా దేశాల్లో పర్యటించనున్నారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా రాష్ట్రపతి పర్యటన కొనసాగుతుందని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. పోర్చుగల్ అధ్యక్షుడు మార్సెలో రెబెలో డీ సౌసా ఆహ్వానం మేరకు రాష్ట్రపతి ముర్ము ఈ నెల 7, 8 తేదీల్లో పోర్చుగల్‌లో పర్యటించబోతున్నారు. భారత రాష్ట్రపతి పోర్చుగల్‌లో పర్యటిస్తుండడం 27 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 1998లో అప్పటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ పోర్చుగల్‌లో అడుగుపెట్టారు. ద్రౌపది ముర్ము ఈ నెల 9, 10 తేదీల్లో స్లొవాకియాలో పర్యటిస్తారు. 29 ఏళ్ల తర్వాత భారత రాష్ట్రపతి స్లొవాకియా వెళ్తుండడం ఇదే తొలిసారి.

యశ్వంత్ వర్మ ప్రమాణ స్వీకారాన్ని ఆపండి

అలహాబాద్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు

లక్నో: ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వచ్చిన జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ప్రజా ప్రయోజనం వ్యాజ్యం(పిల్) దాఖలైంది. వికాస్ చతుర్వేది ఈ వ్యాజ్యాన్ని బుధవారం అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌లో దాఖలు చేశారు. అలహాబాద్ హైకోర్టు న్యాయవాదిగా యశ్వంత్ వర్మ ప్రమాణ స్వీకారాన్ని నిలిపివేయాలని ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఈ వ్యాజ్యంపై ఈ నెల 4వ తేదీన విచారణ జరుగనుంది. ఢిల్లీలో యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు భారీగా నోట్ల కట్టలు దొరికినట్టు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పాటైన సంవత్సరం?

ఆధునిక భారతదేశ చరిత్ర – బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916-21)

ఇతడి కాలంలో 1916లో కాంగ్రెస్ లక్నో సమావేశంలో అతివాదులు,మితవాదులు,హిందూ - ముస్లింలు ఏకమయ్యారు. 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1918లో అహ్మదాబాద్‌లో నూలుమిల్లుల ఉద్యమం జరిగాయి. 1919లో మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ద్వంద్వ పరిపాలన (Diarchy) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు కల్పించారు. ఆర్థిక వ్యవహారాలు, శాంతిభద్రతలు గవర్నర్ ప్రత్యక్ష ఆధీనంలో (Reserved Subjects); విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవి శాసన సంబంధమైన అంశాలు(Transferred Subjects) గా ఉంటాయి. దీని ద్వారా ఎగువసభ, దిగువ సభలు ఏర్పడ్డాయి. చెమ్స్‌ఫర్డ్ కాలంలోనే 1919లో జలియన్ వాలాబాగ్ ఊచకోత జరిగింది. 1919లో ఢిల్లీలో అఖిల భారత ఖిలాఫత్ సమావేశం జరిగింది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించారు. గాంధీజీ తనకు ఇచ్చిన కైజర్-ఇ-హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చేశారు. 1920లో బాలగంగాధర్ తిలక్ మరణించారు. సి.ఎన్. బెనర్జీ ఇండియన్ లిబరల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. పుణేలో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

లార్డ్ రీడింగ్ (1921-26)

ఇతడి కాలంలో అలీగఢ్ జామియా మిలియా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ తదితర విద్యాసంస్థలను స్థాపించారు. 1921లో పంజాబ్‌లో సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను తొలగించడానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1922లో చౌరీచౌరాలో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఘటనలో 22 మంది పోలీసులు మృతి చెందారు. దీంతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు.

1922 డిసెంబర్‌లో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ కలిసి స్వరాజ్య పార్టీని స్థాపించారు. 1921లో ఎం.ఎన్.రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1926లో మతకలహాలు చెలరేగాయి. వీటిలో భాగంగా ప్రముఖ నాయకుడు, జాతీయవాది అయిన స్వామి శ్రద్ధానంద్‌ను మతఛాందసవాదులు హత్య చేశారు. కె.బి.హెగ్డేవార్, ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించారు.రౌలత్ చట్టాన్ని రద్దు చేశారు.


లార్డ్ ఇర్విన్ (1926-31)

ఇర్విన్ కాలంలో 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికీ సభ్యత్వం కల్పించలేదు. దీంతో ఈ కమిషన్‌కు దేశవ్యాప్తంగా నిరసన ఎదురైంది. 1928 డిసెంబర్‌లో తొలిసారిగా అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. 1928లో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది.

భగత్‌సింగ్, బి.కె. దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు. ప్రజారక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వీరు ఈ ఘటనకు పాల్పడ్డారు. 1930లో చిట్టగాంగ్‌లో ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి జరిగింది. సూర్యాసేన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో మహిళలు సైతం పాల్గొన్నారు. రాజకీయ ఖైదీలను ఉంచే జైళ్లలో దుర్భర పరిస్థితులు ఉండేవి. దీనికి నిరసనగా జతిన్‌దాస్ అనే యువకుడు 63 రోజుల పాటు ఉపవాస దీక్ష చేసి ప్రాణత్యాగం చేశాడు. 1931లో భగత్‌సింగ్, రాజ్‌గురును పోలీసు అధికారుల హత్యకేసుల్లో విచారించి ఉరితీశారు. 1929లో కాంగ్రెస్ పార్టీ లాహోర్‌లో సమావేశమైంది. 'సంపూర్ణ స్వరాజ్యం' కాంగ్రెస్ ఆశయమని ఈ సమావేశంలోనే ప్రకటించారు. అదే ఏడాది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ 1930 మార్చి 12న దండి సత్యాగ్రహం ప్రారంభించారు. ఇదే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది. 1930లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ నాయకులను ఆహ్వానించారు. కానీ, సైమన్ నివేదికపై చర్యకు నిరసనగా వీరు సమావేశాన్ని బహిష్కరించారు. తర్వాత గాంధీ-ఇర్విన్ సంధి జరిగింది. ఉద్యమాన్ని నిలిపివేశారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలో పఠాన్లు 'ఖుదాయ్ ఖిద్మత్ గార్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి భగవంతుడి సేవకులని అర్థం. వీరినే 'రెడ్ షర్ట్'లు అని కూడా పిలుస్తారు. మణిపూర్ వాసులు జాతీయోద్యమంలో సాహసోపేత పాత్ర పోషించారు. గాంధీజీ పిలుపు మేరకు నాగాలాండ్ వీరనారి 'రాణి గైడిన్‌లియూ' పదమూడేళ్ల వయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఆమె తిరుగుబాటు జరిపారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం రాణికి యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ వెళ్లారు. ఈ సమావేశంలో 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించారు. దీనికి నిరసనగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

నిమ్నజాతులకు కూడా ప్రత్యేక స్థానాలను ప్రకటించారు. గాంధీ-అంబేద్కర్ మధ్య పుణే ఒప్పందం జరిగింది. 1932లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఓటింగ్ అర్హత, ఉమ్మడి నిధులు, రాష్ట్రాల ఆర్థిక వనరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యుల సమాఖ్య, ఎగువసభ, ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైనవి ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం తర్వాత 1933లో కాంగ్రెస్ అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసింది. 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ ఏర్పాటైంది. రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారం లభించింది. 1935 చట్టంరాజ్యాధికారాలను మూడు రకాలుగా విభజించింది. అవి:

1. సమాఖ్య అధికారాలు
2. రాష్ట్ర అధికారాలు
3. ఉమ్మడి అధికారాలు

తమ అధికార పరిధిలో శాసనాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వాధికారం ఉంటుంది. ఉమ్మడి జాబితాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనం చేయవచ్చు. ఏ శాసన్నానైనా వీటో చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. బిల్లులను పునఃపరిశీలించమని సూచించే లేదా బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం ఎగువ సభలో 2/5వ వంతు, దిగువ సభలో 3/5వ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కేటాయించారు. భారత్ నుంచి బర్మాను వేరు చేశారు. జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. 1936లో ఆలిండియా కిసాన్ సభ ఏర్పాటైంది.

లార్డ్ లిన్‌లిత్ గో (1936-44)

భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం 1937 జూలై నాటికి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలను సాధించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1936లో తొలి అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. నాటి నుంచి రైతాంగం జాతీయోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో సోషలిజాన్ని ఆమోదించారు.

1938లో జాతీయ కాంగ్రెస్ గుజరాత్‌లోని హరిపూర్‌లో సమావేశమైంది. దీనికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 1939లో బోస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. గాంధీ,నెహ్రూ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ సుభాష్ చంద్రబోస్ గెలుపొందారు. వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయులు బోస్ పట్ల విముఖత చూపారు. దీంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కొందరు వామపక్ష వాదులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు. 1927 డిసెంబర్ నాటికే అఖిల భారత సంస్థాన ప్రజాసభ ప్రారంభమైంది. 1939లో నెహ్రూ ఈ సభకు అధ్యక్షుడయ్యాడు. 1939లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారతీయులను సంప్రదించకుండానే భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలోకి అడుగుపెట్టింది. ఈ విషయమై జాతీయ కాంగ్రెస్‌కు లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులకు మాట మాత్రంగా కూడా చెప్పలేదు. 1940లో ముస్లిం లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఏడాది బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ఆఫర్ జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీలకు అధిక స్థానాలను కేటాయిస్తారు. యుద్ధం ముగిశాక నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. 1941లో సుభాష్ చంద్రబోస్ నిర్బంధం నుంచి తప్పించుకొని బెర్లిన్ వెళ్లారు. 1942లో ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్)ని స్థాపించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశాల నుంచే బోస్ పోరాడారు. ఆయన 'జైహింద్' అనే నినాదమిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం కోసం బ్రిటన్ ప్రయత్నించింది. ఇందు కోసం 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో ఒక రాయబార బృందాన్ని భారత్‌కు పంపింది. క్రిప్స్ బ్రిటిష్ మంత్రివర్గ సభ్యుడు, లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. వీలైనంత త్వరగా స్వపరిపాలన ప్రతిపాదించడమే తమ లక్ష్యమని క్రిప్స్ తెలిపారు. కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ, గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత ప్రజాపోరాటాన్ని కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేసింది.

లార్డ్ వేవెల్ (1944-47)

1944లో అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1945లో కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీలు లార్డ్ వేవెల్ సమక్షంలో సిమ్లాలో సమావేశమయ్యాయి. రాజ్యాంగ, మత అడ్డంకులను తొలగించేందుకు ఆ పార్టీలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 1946లో అఖిల భారత తంతి-తపాలా కార్మికులు సమ్మె చేశారు. కౌలు రేట్ల తగ్గింపు కోసం రైతాంగ పోరాటాలు అధికమయ్యాయి. సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో కేబినెట్ మిషన్‌ను పంపింది. అధికార బదిలీ గురించి భారత జాతీయ నాయకులతో ఈ మిషన్ సంప్రదింపులు జరిపింది. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చే దాకా తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటిష్ రాయబార వర్గం సూచించింది. 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. ముస్లింలీగ్ మంత్రి వర్గంలో చేరింది. కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్ 1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటించింది. నేవీ తిరుగుబాటు చేసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించింది.

లార్డ్ మౌంట్ బాటన్ (1947)

మౌంట్ బాటన్ 1947లో భారత వైస్రాయ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కాంగ్రెస్, ముస్లిం లీగ్ నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలైంది. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్ నూతన దేశంగా ఆవిర్భవించింది. అదే రోజు అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరి 30న గాడ్సే గాంధీజీని కాల్చి చంపాడు.

ముఖ్యాంశాలు

- 1929: లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం. 'సంపూర్ణ స్వరాజ్యమే' తమ ఆశయమని ప్రకటన.
- 1930 మార్చి 12: దండి సత్యాగ్రహాన్ని ప్రారంభించిన మహాత్మా గాంధీ.
- 1942 మార్చి: సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో భారత్‌కు రాయబార వర్గం రాక.
- 1942 ఆగస్టు 8: బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం, క్విట్ ఇండియా తీర్మానానికి ఆమోదం.
- 1946 మార్చి: కేబినెట్ మిషన్ భారత్ రాక.
- 1946 ఆగస్టు 16: కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్, ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటన.
- 1947 జూన్ 3: భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయనే ప్రకటన విడుదల.

నార్కో అనాలసిస్‌లో వాడే రసాయనాలు?

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.

మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంది.

మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ఫ్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300-400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350-1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు) తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్‌మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సిజన్‌లో 20 శాతం, గ్లూకోజ్‌లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సిజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్‌సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్‌లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

నోట్: ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.

మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.


ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్థం ఉంటుంది. ఇది రాంబాయిడల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్‌గా విభజితమవుతుంది.

హైపోథలామస్ విధులు

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

బయాలజీ

- హైపోథలామస్.. పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది. మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లబింకలు అంటారు.

మస్తిష్కం విధులు

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్‌కు, పాన్స్‌వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..
1) అనుమస్తిష్కం 2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

విధులు
1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

నోట్: మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యాన్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

విధులు
1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్‌గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

విధులు

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

ఉదాహరణలు:
- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కనురెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్లు మూసుకోవడం..

గతంలో అడిగిన ప్రశ్నలు


1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేట
   4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది?
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అధో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా॥ 2) 1400 గ్రా॥
   3) 1500 గ్రా॥ 4) 1350 గ్రా॥
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్‌సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది?
   1) గుండె 2) చర్మం
   3) మెదడు 4) కాలేయం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1; 6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

ఉస్మానియా యూనివర్సిటీ ఎప్పుడు ఏర్పాటైంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర



తెలంగాణ పోరాటానికి శతాబ్దాల చారిత్రక నేపథ్యం ఉంది. తెలంగాణ పోరాటానికి గల కారణాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే.. 1323లో కాకతీయ రాజుల పాలన అనంతరం జరిగిన వలస రాజ్య స్థాపనల గురించి తెలుసుకోవాలి. 1324 నుంచి 1948 వరకు తెలంగాణ ప్రాంతాన్ని, అయిదు ముస్లిం రాజ్య వంశాలు పాలించాయి. వీరి 624 ఏళ్ల పాలనలో తెలంగాణ ప్రజలు దుర్భర పరిస్థితుల్లో జీవించారు. మరో రకంగా చెప్పాలంటే.. మన పూర్వీకులు తమ సొంత ప్రాంతంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా బతుకులు వెళ్లదీశారు.

కాకతీయుల స్వర్ణయుగం

క్రీ.శ. 1324లో కాకతీయ రాజు రెండో ప్రతాప రుద్రుడిని ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్ ఓడించడంతో తెలంగాణా ప్రాంతంలో వలస పాలన మొదలైంది. ప్రతాపరుద్రుడి ఓటమితో 300 ఏళ్లకు పైగా సాగిన కాకతీయుల సువర్ణ పాలన అంతమైంది. కాకతీయులు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పుట్టి, పెరిగి.. సాధారణ తెలంగాణ ప్రజల స్థాయి నుంచి రాజులుగా ఎదిగారు. కాకతీయ రాజులు సాగు కోసం చెరువులు, కాలువలు, బావులను తవ్వించారు. తెలంగాణ ప్రాంతంలో అనేక దేవాలయాలు నిర్మించారు. వీరి పాలనలో తెలంగాణ శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లింది.

వలస పాలనలో రికార్డు

తెలంగాణలో కాకతీయుల పాలన అనంతరం క్రీ.శ. 1324 నుంచి క్రీ.శ. 1347 వరకు మహ్మద్ బిన్ తుగ్లక్ పాలన కొనసాగింది. క్రీ.శ. 1347లో అతని సుబేదారు అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. బహమనీ సామ్రాజ్యం పేరుతో దక్కన్‌లో తన స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. దక్షిణ భారత దేశంలో ఇది తొలి ముస్లిం రాజ్యం. ఈ పరిణామం తదనంతర కాలంలో దక్షిణ భారతదేశంపై ముస్లిం రాజుల దాడులకు మార్గం వేసింది. బహమనీ రాజ్యంలోని 5 ప్రావిన్సుల్లో గోల్కొండ ఒకటి. తెలంగాణ ఇందులో భాగంగా ఉండేది. బహమనీ సుల్తానులు క్రీ.శ. 1347 నుంచి క్రీ.శ. 1512 వరకూ.. 165ఏళ్ల పరిపాలన సాగించారు. 165 ఏళ్ల బహమనీయుల పాలన చివర్లో ఆయా ప్రావిన్సుల పాలకులు తిరుగుబాటు చేయడంతో క్రీ.శ. 1512లో బహమనీ సామ్రాజ్యం 5 రాజ్యాలుగా విడిపోయింది. వీటిల్లో గోల్కొండ రాజ్యాన్ని సుల్తాన్ కులీ కుతుబ్ షా 1512లో ఏర్పాటు చేశాడు. ఈ గోల్కొండ రాజ్యంలో తెలంగాణ అంతర్భాగం. కుతుబ్‌షాహీ పాలకులు గోల్కొండ రాజ్యాన్ని 1687 వరకూ పాలించారు. కుతుబ్‌షాహీ అయిదో రాజు మహ్మద్ కులీ కుతుబ్ షా క్రీ.శ. 1592లో హైదరాబాద్‌ను, చార్మినార్‌ను నిర్మించాడు. ఆయనను హైదరాబాద్ నగర నిర్మాతగా పేర్కొంటారు. క్రీ.శ. 1687లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండను జయించి తన సామ్రాజ్యంలో కలిపేసుకున్నాడు. మొఘలుల పాలన క్రీ.శ 1723 వరకూ కొనసాగింది. 1724లో మొదటి నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జా తెలంగాణను జయించి హైదరాబాద్ రాజ్యంలో విలీనం చేశాడు. అసఫ్ జాహీలు క్రీ.శ.1724 నుంచి క్రీ.శ 1948 వరకూ సుదీర్ఘంగా 224 ఏళ్లపాటు పాలించారు. ఇలా తెలంగాణలో పరాయి పాలన 624 ఏళ్ల పాటు నిరాటంకంగా కొనసాగింది. ఇదో రకంగా ప్రపంచ రికార్డు. ఎందుకంటే.. ప్రపంచ చరిత్రలో మరెక్కడా కూడా ఒక ప్రాంతంలో ఇంత సుదీర్ఘ కాలం వలస పాలన సాగిన దాఖలాలు లేవు.

పరాయి పాలనలో వివక్షలెన్నో

ముస్లిం పాలకులు తెలుగు భాష స్థానంలో పర్షియన్ భాషను ప్రజలపై బలవంతంగా రుద్దారు. కాకతీయ పాలకులు ప్రోత్సహించిన స్థానిక సంస్కృతి స్థానంలో పర్షియన్ సాహిత్యం, కళలు, సంస్కృతిని ప్రవేశపెట్టారు. సమాజంలోని ఉన్నత వర్గాల వస్త్రాలంకరణ, ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వచ్చాయి. వలస పాలకులు స్కూళ్లలో స్థానిక భాష కాకుండా.. పర్షియన్ మాధ్యమంలోనే బోధన విధానాన్ని ప్రవేశ పెట్టారు. అది కూడా ముస్లిం జనాభా అధికంగా ఉండే పట్టణాల్లోనే జరిగేది. పరాయి పాలకులు హిందువులు ఎక్కువగా నివసించే తెలంగాణ గ్రామాలను పూర్తిగా విస్మరించారు. ఈ నిర్లక్ష్యం, పక్షపాత ధోరణి వల్ల ప్రజలు నిరక్షరాస్యులుగా మిగిలిపోయి జీవనోపాధి కోసం వ్యవసాయ పనులకు మాత్రమే పరిమితం అయ్యారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో, సైన్యంలో స్థానిక ప్రజలకు స్థానం లేకుండా పోయింది.

అసఫ్ జాహీల కాలంలో 1885 వరకు పర్షియనే అధికార భాషగా కొనసాగింది. 1885లో అప్పటి ప్రధాని రెండో సాలార్‌జంగ్ పర్షియన్ స్థానంలో ఉర్దూను అధికార భాషగా మార్చాడు. స్థానిక భాష తెలుగుకు బదులు బోధన మాధ్యమంగా ఉర్దూను తప్పనిసరి చేశారు.

అప్పటి నుంచి 1948లో అసఫ్ జాహీల పాలన ముగిసే వరకూ.. ఉర్దూ మాధ్యమంలోనే బోధన కొనసాగింది. అంతేకాకుండా ధరించే దుస్తుల విషయంలోనూ పట్టణాల్లోని ముస్లిమేతర ఉన్నత వర్గాలకు షేర్వాణి, పైజామా అనేది హోదాకు గుర్తుగా మారింది. ఇవన్నీ ఇలా ఉంటే.. 1918 లో ఉస్మానియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ.. పీజీ వరకూ అన్ని స్థాయిల్లో ఉర్దూ మాధ్యమం తప్పనిసరి చేశారు. ఉర్దూ మీడియంలో చదవడం వల్ల తదనంతర కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు వెనుకబడిపోయారు. మరోవైపు 1887లో హైదరాబాద్‌లోని జాగీర్దార్లు ఇంగ్లిష్ మీడియం బోధనతో నిజాం కాలేజీని ఏర్పాటుచేసుకున్నారు. తద్వారా తమ పిల్లలకు ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యను అందించాలనేది వీరి ఆలోచన. సమాజంలోని ఉన్నత వర్గాలకే ఇంగ్లిష్ మీడియం చదువు అందిందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

నిజాం కాలేజీ 1948వరకూ మద్రాస్ యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగింది. ఆరో నిజాం రాజు కాలంలో హైదరాబాద్ స్టేట్‌లోని పట్టణాల, జిల్లాల పేర్లను సైతం మార్చారు. ఎలగందల్‌ను కరీంనగర్‌గా.. ఇందురును నిజామాబాద్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా.. మెతుకును మెదక్‌గా.. మానుకోట పేరు మహబూబాబాద్‌గా.. భువనగిరి పేరను భోంగిర్‌గా; ఎద్దులాపురం పేరును ఆదిలాబాద్‌గా.. పొంచెర్లను హుజూర్‌నగర్‌గా మార్చేశారు. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో వలసపాలకులు మార్చిన పేర్ల స్థానంలో అసలు పేర్లను తిరిగి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఏడో నిజాం వలస వాద, మతతత్వ విధానాలు

ఏడో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసహన, పక్షపాత మతతత్వ ధోరణులకు మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. 1939లో వందేమాతరం గీతంపై నిషేధం విధించడం అనేది నిజాం అసహనం, అణిచివేత విధానాలకు నిదర్శనం. హిందూ విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో వందేమాతరం గీతం పాడకుండా నిషేధించారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా వందేమాతరం పాడితే వారిని యూనివర్సిటీ నుంచి బహిష్కరించారు. ఇలా బహిష్కరణకు గురైన విద్యార్థులు తమ చదువులు కొనసాగించేందుకు నాగ్‌పూర్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇలా నాడు బహిష్కరణకు గురైన వారిలో పీవీ నరసింహారావు ఒకరు. అంతేకాకుండా రోజూ ఉదయం తరగతుల ప్రారంభానికి ముందు ఏడో నిజాం రాజును స్తుతిస్తూ ఉర్దూలో ప్రార్థన చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఏడో నిజాం రాజు ముస్లిం జనాభా పెంచుతూ, హిందూ జనాభాను తగ్గించే యోచనతో మతతత్వ జనాభా విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విషయం 1931 జనాభా లెక్కలను చూస్తే అర్థమవుతుంది. 1931లో హిందూ జనాభా 84 శాతం ఉండగా, ముస్లిం జనాభా 10 శాతం ఉండేది. కానీ 1941లో ముస్లిం జనాభా గణనీయంగా 12.8 శాతానికి చేరగా, హిందూ జనాభా 81.4 శాతానికి తగ్గింది. అదే విధంగా 1941లోనే హిందూ జనాభాను తగ్గించే యోచనతో దళితులను విడిగా నమోదు చేశారు. ఫలితంగా హిందూ జనాభాను 63.5 శాతంగా చూపించారు. అంతేకాకుండా ఉత్తర భారతదేశానికి చెందిన ముస్లింలు హైదరాబాద్ రాజ్యానికి వచ్చేలా ఉద్దేశపూర్వకంగా, పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. ఉత్తరాది నుంచి వచ్చే ముస్లింలకు ఇక్కడ ప్రత్యేక వేతనాలు, సదుపాయాలు, రాయితీలు అందించి ఉద్యోగాల్లో చేరేలా ప్రోత్సహించారు. దాంతో వర్తక వాణిజ్యాల్లో, విద్యాసంస్థల్లో, రక్షణ, పోలీసు బలగాల్లో వారికి ప్రాధాన్యత లభించింది. ఇలా 60వేల మంది ఉత్తరాది ముస్లింలు హైదరాబాద్ రాష్ట్రానికి వచ్చారు. వీరిలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వచ్చిన వారున్నారు. ఈ విధానం ద్వారా రాజ్యంలో ముస్లింలను ఉన్నత వర్గంగా ఏర్పరచాలని ఏడో నిజాం భావించాడు. అయితే ఇలాంటి చర్యల ద్వారా 1919 లో నిజాం చేసిన ముల్కీ నిబంధనల చట్టాన్ని స్వయంగా తనే ఉల్లంఘించినట్లయింది. 1947 దేశ విభజన సమయంలో ఉత్తర భారతదేశం నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు రాష్ట్రానికి వలస వచ్చారు. వారు ఇక్కడ పునరావాసం ఏర్పరచుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు కల్పించింది. హైదరాబాద్ రాజ్యంలో ముస్లిం జనాభా పెంచడానికి తీసుకున్న మరో చర్య ఇది. ఇలాంటి మతతత్వ విధానాల వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థలు, వర్తక వాణిజ్యాల్లో హిందువులు అవకాశాలు అందుకోలేకపోయారు. 1931 జనాభా లెక్కల ప్రకారం రక్షణ, పోలీసు, ఇతర సర్వీసుల్లో హిందూ, ముస్లింల గణాంకాలను పరిశీలిస్తే... ముస్లింలు 1,07,737 మంది ఉంటే.. హిందువుల సంఖ్య కేవలం 23,368 మంది. పైన పేర్కొన్న సర్వీసుల్లో ముస్లింల సంఖ్య 1931 నుంచి 1947 మధ్య కాలంలో మరింతగా పెరిగింది. దీన్ని బట్టి ప్రభుత్వ సర్వీసుల్లో ముస్లింలకు అధిక ఆదరణ లభించిందని స్పష్టమవుతోంది. ఇలాంటి వివక్ష ఇతర రంగాల్లోనూ కొనసాగింది. అక్షరాస్యత పరంగానూ హిందూ, ముస్లింల మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు, అసమానతలు ఉండేవి. 1921లో ప్రతి వెయ్యిమంది హిందువుల్లో 23 మంది అక్షరాస్యులు ఉంటే.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 59 మంది అక్షరాస్యులు ఉండేవారు. ఇది 1931లో ప్రతి వెయ్యి మంది హిందువుల్లో 33.3గా.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 103.5గా ఉంది.

కాంగ్రెస్ పార్టీపై నిషేధం

రాజకీయ పార్టీల విషయంలోనూ నిజాం పక్షపాత వైఖరి స్పష్టంగా ఉండేది. 1927లో బహదూర్ యార్‌జంగ్ స్థాపించిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్' అనే ముస్లిం సంస్థకు ప్రభుత్వం అనుమతించింది. ఇది ముస్లింల రాజకీయ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పడింది. అయినప్పటికీ ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందించింది. 1937లో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీని మతతత్వ సంస్థ అనే కారణంతో నిజాం ప్రభుత్వం నిషేధించింది. బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన రాజకీయ పార్టీ. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం స్వాతంత్ర్య పోరాటం చేసింది. అలాంటి పార్టీని నాటి నిజాం ప్రభుత్వం మతతత్వ పార్టీగా ముద్ర వేసింది. అదే సమయంలో మతతత్వ పార్టీ అయిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్'ను మాత్రం సమ్మతించింది. ప్రభుత్వ మతతత్వ విధానాలు ముస్లింలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాయనడానికి ఇది మరో ఉదాహరణ.

రాజకీయ నాయకుల నిర్బంధం

హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర ఆందోళనలను నియంత్రించేందుకు 1947 ఆగస్టు 25 తర్వాత ఎంతో మంది రాజకీయ నాయకులను, దాశరథి, కాళోజీ నారాయణరావు తదితర కవులను, ప్రముఖులను నిజాం ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించింది. 1947 ఆగస్టులో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కూడా 13 నెలలపాటు వీరు జైలు జీవితం గడిపారు. 1948 సెప్టెంబర్‌లో పోలీసు చర్య తర్వాతే వీరు విడుదలయ్యారు. ఏడో నిజాం పాలనలో హైదరాబాద్‌లో పౌరహక్కుల ఉల్లంఘన, అణచివేత చర్యలు ఏ విధంగా ఉండేవో చెప్పడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

హైదరాబాద్‌లో దుష్పరిపాలన


ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన సాయుధ విభాగం 'రజాకార్లు' హిందువులపై తీవ్ర అకృత్యాలకు పాల్పడ్డారు. దీంతో వేల మంది ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ దుష్పరిపాలన తమ దృష్టికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం 1948 జూలైలో హైదరాబాద్‌పై ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. ఈ క్రమంలో దుష్పరిపాలనకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. అవి.. 'హైదరాబాద్‌లో దుష్పరిపాలన, అకృత్యాలకు నిస్సహాయ వీక్షకులుగా చూస్తూ ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించట్లేదు. ఇప్పటికే క్షీణించే పరిస్థితుల్లో ఉన్న శాంతి భద్రతలు మరింత క్షీణించి శాంతి, సహనాలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే భారత ప్రభుత్వం తప్పనిసరిగా సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకుంటుంది' అని పేర్కొంది. మరోవైపు రజాకార్ల దుష్పరిపాలన, అకృత్యాలకు నిరసనగా అప్పటి హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జి. రామాచారి 1948 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామాలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని ఈ విధంగా వర్ణించారు. ''రాజ్యంలో విధ్వంసక శక్తులు, గూండాయిజం విశృంఖలమయ్యాయి.

A computer-intensive problem runs on..

BANK EXAMS
Computer Awareness



CLASSIFICATION OF COMPUTERS



DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

(i) CLASSIFICATION BASED ON PURPOSE:

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:

EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer, cooking, industrial, automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**

A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

Mini Computer

It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.

Super Computer

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

ANALOG COMPUTER

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved

Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
   1) 1011001 2) 1010100
   3) 1100011 4) 100110
   5) None of these
2. MS -DOS is usually supplied on a
   1) Hard disk
   2) floppy disk or diskettes
   3) CD ROM 4) Cartridge tape
   5) None of these
3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
   1) EBCDIC 2) ASCII
   3) ANSI 4) ISO
   5) None of these
4. A thing present in real world in physical form is called ____
   1) DBMS 2) Keywords
   3) Modulation 4) Entity
   5) None of these
5. Programming language built into user programs such as Word and Excel are known as____?
   1) 4GLs
   2) Visual programming languages
   3) Object-oriented languages
   4) Macro languages
   5) None of these
6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
   1) form 2) repository
   3) back end 4) front end
   5) None of these
7. Antivirus software is an example of____
   1) a security utility
   2) an operating system
   3) business software
   4) an office suite
   5) None of these
8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
   1) application 2) processing
   3) utility 4) management
   5) None of these
9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
   1) packet 2) token
   3) access method 4) data
   5) None of these
10. A computer-intensive problem runs on a ____.
    1) supercomputer
    2) mainframe 3) server
    4) super PC 5) None of these
11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
    1) peripheral device
    2) system add-one 3) disk pack
    4) digital device 5) None of these
12. A collection of interrelated files in a computer is a _____.
    1) file manager 2) field
    3) database 4) record
    5) None of these
13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
    1) programming software
    2) applications software
    3) applications hardware
    4) system hardware
    5) None of these
14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
    1) Multitasking 2) Streamlining
    3) Multiuser 4) Simulation
    5) None of these
15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
    1) FORTRAN 2) COBOL
    3) LISP 4) PROLOG
    5) APPLE
16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
    1) Virtual private network
    2) Internet 3) Intranet
    4) Extranet 5) None of these
17. For large network which topology is used?
    1) Star 2) Ring 3) Bus
    4) Mesh 5) None of these
18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    1) Satellite/ Air connection service lines
    2) Cable modems
    3) Digital subscriber lines
    4) T1, T2, T3 and T4 lines
    5) None of the above
19. A language that refers to the way people think mathematically is called as ____
    1) Functional language
    2) Cross-platform language
    3) Event driven programming language
    4) Object oriented language
    5) None of these
20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
    1) line 2) sentence
    3) paragraph 4) word 5) file
21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to rearrange them.
    1) Slide Show 2) Slide Display
    3) Slide Design
    4) Slide Layout 5) Slide Sorter
22. In a pull down menu if you see that a command appears faded, it means that _____
    1) the command is not applicable to this document
    2) the command is not accessible at the moment
    3) there are no keystrokes equivalent to those commands.
    4) None of these
    5) All of these
23. If you want to find the Paste Special option, you would use the Clipboard group on the tab of PowerPoint _____
    1) Home 2) Slideshow
    3) Page Layout 4) Design
    5) Insert

KEY

1) 3	2) 2	3) 3	4) 4	5) 2
6) 4	7) 1	8) 1	9) 2	10) 1
11) 1	12) 3	13) 2	14) 1	15) 1
16) 3	17) 4	18) 4	19) 1	20) 3
21) 5	22) 2	23) 1		